www.andhrajyothy.com వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 285

మంగళవారం | 30-1-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చవితి ఉ. 8.55 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తర రా. 10.07 తదుపరి హస్త; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 9.07-9.52, రా. 10.17-11.07; అమృతఘడియలు: మ. 1.58-3.46; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.06

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బాబు బెయిల్ రద్దుకు సుప్రీం నో

ఐఆర్ఆర్ కేసులో జగన్ సర్కారుకు ఎదురుదెబ్బ

- ఇతర నిందితుల బెయిల్ రద్దు కోరుతూ గతంలోనూ ప్రభుత్వం ఎస్ఎల్‌పీ దాఖలు
- దానిని సుప్రీం 2022 నవంబరులో కొట్టేసింది
- మళ్లీ అలాంటి పిటిషన్‌ను అనుమతించలేం
- ధర్మాసనం స్పష్టీకరణ
- ఎస్ఎల్‌పీ కొట్టివేత



న్యూఢిల్లీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) ఎలైన్‌మెంట్ వ్యవహారంలో జగన్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత

మిగతా 12వ పేజీలో...



భారతీరెడ్డితో చెప్పిస్తారా?

వదినమ్మా.. చెప్పవమ్మా..

అన్నకు షర్మిల సవాల్

- నన్ను సీఎం చేయాలని సోనియాను నా భర్త అడిగారా?
- జగన్‌ను జైల్లో పెట్టండని చెప్పారా?
- ప్రణబ్ చెప్పారని ఏదో కథ చెప్పారు
- వదినమ్మ భారతితో కలిసే సోనియా వద్దకు అనిల్ వెళ్లారు
- ఆమె ముందే అడిగారా? వెనుకడిగారా?
- ఆడపిల్ల అన్న ఇంగితం లేకుండా ఇష్టమొచ్చినట్టు మాట్లాడిస్తారా?
- సాక్షిలో సగం నాదే.. ఇది వైఎస్ నిర్ణయం
- ఎవరు కాదన్నా.. నేను వైఎస్ షర్మిలారెడ్డినే
- సీఎం అయ్యాక జగన్ మారిపోయాడు
- ఈ జగనన్న నాకు తెలీదు.. వైసీపీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్టే.. షర్మిల ఫైర్


కడపలో శంఖం పూరిస్తున్న షర్మిల

కడప, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల అన్న ఇంగితం కూడా లేకుండా జోకర్లతో ఇష్టం వచ్చినట్టు తన గురించి మాట్లాడిస్తున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి ఆయన సోదరి, పీసీసీ చీఫ్ షర్మిల నిప్పులు చెరిగారు. తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని, జగన్‌ను జైల్లో పెట్టించాలని అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీని తన భర్త అనిల్ కోరారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన వదిన భారతీరెడ్డితో కలిసే సోనియా వద్దకు తన భర్త వెళ్లారని, వారు చెప్పేది నిజమే అయితే భారతీరెడ్డితో ఈ విషయం చెప్పిస్తారా అని సవాల్ విసిరారు. సోమవారం కడపలో జరిగిన ఉమ్మడి కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం పదవి ఇవ్వలేదనే అక్కసుతో కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి, సొంత పార్టీ పెట్టుకున్న జగన్.. ఆ తర్వాత జైలు నుంచి బెయిలుపై బయటికి వచ్చేందుకు సోనియా శరణు కోరినట్లు షర్మిల పరోక్షంగా

మిగతా 2వ పేజీలో...




హెల్ప్.. ప్లీజ్!

అమిత్‌షాను కోరేందుకు రేపు ఢిల్లీకి సీఎం!?

ఆ వెంటనే లేదా ఎల్లుండి హోంమంత్రితో భేటీ

- ఫక్తు రాజకీయ అజెండాతోనే ఢిల్లీ యాత్ర
- ఎన్నికల్లో సహకరించాలని కోరే అవకాశం
- బదులుగా షా సూచించిన వారికి రాజ్యసభ సీటు?
- కేంద్రంతో పొలిటికల్ 'క్విడ్ ప్రో కో'

11



"జగన్ రూ. 10 ఇచ్చి రూ.100 దోచేస్తున్నాడు. నేను రూ.15 ఇచ్చి వెయ్యి ఎలా సంపాదించాలో చూపిస్తాను"

"మనం గెలుస్తున్నాం. వైసీపీ గేమ్ ఓవర్. టీడీపీదే గెలుపు. వైసీపీలో తిరుగుబాటు మొదలైంది. ఎన్నికలకు ముందే జగన్ పార్టీ ఓడిపోయింది"

"పామాయిల్ తెచ్చింది ఎన్టీఆర్. వాణిజ్య పంటలు తెచ్చింది ఎన్టీఆర్. రాయలసీమలో పండ్ల తోటలను ప్రోత్సహించింది టీడీపీయే. ఈ దుర్మార్గుడు మొత్తం ముంచేశాడు. వరి ధాన్యం కొనేనాథుడే లేడు. వర్షాలు పడుతుంటే గోతాలు ఇవ్వరు. సబ్సిడీలు లేవు. గిట్టుబాటు ధర లేదు. - చంద్రబాబు

పొన్నూరు సభకు హాజరైన జనం. ప్రసంగిస్తున్న చంద్రబాబు

నాది విజన్.. జగన్‌ది పాయిజన్

నం.1 నమ్మక ద్రోహి ఈ సీఎం

- ఎన్నికల వేళ మారీచుడి అవతారం
- ఓట్ల దొంగలను పంపిస్తున్నాడు
- అభ్యర్థులను మార్చి ప్రజలను ఏమార్చి గెలవాలన్నదే లక్ష్యం
- ఏమరుపాటుగా ఉంటే మిమ్మల్ని బానిసల్ని చేస్తాడు
- 72 రోజుల తర్వాత అమరావతికి పూర్వవైభవం
- కలియుగ భస్మాసురుడిని అంతం చేయాలి
- సైకోతోపాటు పిల్ల సైకోలందరికీ షాక్ ట్రీట్‌మెంట్ తప్పదు
- పొన్నూరు, రాజమహేంద్రవరం 'రా... కదలి రా' సభల్లో చంద్రబాబు

గుంటూరు, రాజమహేంద్రవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నమ్మక ద్రోహం చేయడంలో ఈ దేశంలోనే నంబర్ వన్ సీఎం వైఎస్ జగన్ అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. తన అవసరం ఉన్నంత వరకూ వాడుకోవడం, ఆ తర్వాత చెత్తలో విసిరిపారేయడం ఆయన నైజమని చెప్పారు. ఈ విషయంలో ఆయనకు నోబెల్ బహుమతి ఇవ్వవచ్చన్నారు. ఇందుకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, గుంటూరు పశ్చిమ శాసనసభ్యుడు మద్దాళి గిరిధర్‌లకు పట్టించిన గతే నిదర్శనమన్నారు. "తన సొంత మనిషి అని చెప్పి రామకృష్ణారెడ్డిని నమ్మించి టీడీపీపై జగన్ అనేక కేసులు వేయించాడు. అవసరం తీరాక ఒక్క తన్ను తన్ని బయటకు పంపేశాడు" అని విమర్శించారు. వైసీపీ గేమ్ ఓవర్..టీడీపీదే గెలుపు అని వ్యాఖ్యానించారు. సోమవారం గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని వడ్లమూడి క్వారీ వద్ద; తూర్పుగోదావరి జిల్లా రూరల్ రాజమహేంద్రవరంలోని కాతేరులో టీడీపీ నిర్వహించిన 'రా... కదలి రా..'భారీ బహిరంగ సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. టీడీపీ, జనసేన కూటవి ఐక్యత వర్ధిల్లాలని పిలుపునిచ్చారు. ఆయన ఏమన్నారంటే.. "ఎన్నికలు సమీపించడంతో అభ్యర్థులను మార్చి

మిగతా 12వ పేజీలో...



పెద్దల సభ పోరు 27న

రాజ్యసభ ఎన్నికలకు 8న నోటిఫికేషన్

15 రాష్ట్రాల్లోని 56 సీట్ల భర్తీకి ఎన్నికలు

న్యూఢిల్లీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో ఖాళీ అయ్యే స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 15 రాష్ట్రాలకు చెందిన 56 మంది సభ్యుల ఎంపిక కోసం ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించేందుకు సోమవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. వచ్చే నెల 8న నోటిఫికేషన్ విడుదల చేసి 15 వరకు నామినేషన్లను స్వీకరించనుంది. 16న నామినేషన్లను పరిశీలించనుంది. నామినేషన్ల ఉపసంహరణకు 20వ తేదీ

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రంలో 'రాజ్యసభ' వేడి

3 స్థానాలకు వచ్చే నెల 27న పోలింగ్

- అన్నీ గెలుచుకోగల బలం ఉన్నా వైసీపీ పెద్దల్లో భయం
- పలువురు ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించడమే కారణం
- వారు పార్టీ అభ్యర్థులకు ఓటేయరేమోనని ఆందోళన
- సానుకూలంగా మలచుకునేందుకు టీడీపీ పావులు
- వైసీపీ అసంతృప్తులతో మంతనాలు.. ఇది తెలిసి 'అనర్హత' అస్త్రంతో టీడీపీ బలం తగ్గించేందుకు వైసీపీ యత్నాలు

11


మీడియాతో మాట్లాడుతున్న మేకపాటి, కోటం రెడ్డి, శ్రీదేవి, ఆనం



కూలోడి మాటలు విని మాపై వేటా?

- దుస్సంప్రదాయానికి తెరతీసినట్లే.. స్పీకర్‌కు ఆనం స్పష్టీకరణ
- మీడియా క్లిప్పింగులు సాక్ష్యాలు కావని సుప్రీంకోర్టే చెప్పింది
- గంటాకు మూడేళ్లు టైమిచ్చారు.. మాకు 3 నెలలైనా ఇవ్వరా?
- తమ్మినేనికి మాజీ మంత్రి ప్రశ్నలు.. సీటు ఖాయమైందా అని ఆరా
- ఇరువురి నడుమ స్పీకర్ చాంబర్లో ఆసక్తికర చర్చ

11

సహజ న్యాయానికి పాతర!

జగన్ ఆదేశాలతో మాపై వేటుకు ముందే నిర్ణయం: కోటంరెడ్డి

- సంజాయిషీ నోటీసులు ఓ డ్రామా.. స్పీకర్ తీరు చట్టప్రకారం లేదు
- మేమిచ్చిన సంజాయిషీకి స్పీకర్ రశీదూ ఇవ్వనన్నారు
- విచారణ సమయంలో.. సాక్ష్యాలు పరిశీలించనక్కర్లేదట!
- ఇక మా ముందున్నవి కోర్టు, ప్రజాకోర్టే: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

అమరావతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ తమ్మినేని సీతారాం.. సీఎం జగన్ ఆదేశాల మేరకే సంజాయిషీ నోటీసు వ్యవహారాన్ని ఒక తంతులా నడుపుతున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. ఆయన


మిగతా 11వ పేజీలో...

హైకోర్టుకు వైసీపీ రెబల్స్

- కౌంటర్‌కు స్పీకర్ సమయం ఇవ్వలేదు
- తదుపరి చర్యల నిలుపుదలకు వినతి
- ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న ధర్మాసనం

మోదీ మళ్లీ గెలిస్తే..

ఇవే చివరి ఎన్నికలు



- నియంతృత్వంవైపే ఆయన మొగ్గు
- పుతిన్‌లా పాలించాలన్నదే బీజేపీ లక్ష్యం
- ఆరెస్సెస్ భావజాలం విషపూరితం
- ప్రజలే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి: ఖర్గే

భువనేశ్వర్, జనవరి 29: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ప్రధాని మోదీ గెలిస్తే దేశానికి ఇవే చివరి ఎన్నికలు అవుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభిప్రాయపడ్డారు. బీజేపీ మరోసారి విజయం సాధిస్తే మోదీ నియంతృత్వంవైపే మొగ్గుచూపే అవకాశం ఉందన్నారు. రష్యాలో పుతిన్ పాలించినట్టుగా ఇక్కడ శాశ్వతంగా మోదీ ప్రభుత్వం ఉండాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు. అందువల్ల ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి

మిగతా 2వ పేజీలో...

ప్రయోగశాలలో చేప మాంసం తయారీ!



- అదే రంగు, రుచి, పోషక విలువలు
- సీఎంఎఫ్ఆర్ఐ సంకల్పం
- ప్రైవేటు సంస్థతో ఒప్పందం
- ఈ రంగంలో ముందంజ వేసిన దేశాలతో పోటీ పడే యత్నం

2

జ్ఞానవాపి శిలాశాసనంపై తెలుగువారి పేర్లు

- మల్లన్న భట్టు, నారాయణ భట్టుగా గుర్తించిన ఏఎస్ఐ డైరెక్టర్
- నారాయణ భట్టు పర్యవేక్షణలోనే కాశీ మందిర పునర్నిర్మాణం


ఆరని అక్రమాగ్ని

ఇదేం చౌక బేరమయ్యా శ్రీనివాసా!

ఎకరం 2 కోట్లు పలికే భూమికి 4.76 లక్షలే...

44 ఎకరాలు కొట్టేసిన ఉమ్మడి చిత్తూరు ఎమ్మెల్యే

- అవినీతి సొమ్ములంటే ఆయనకు 'ఆరని' దాహం
- సామాజికవర్గం అంటే ఎమ్మెల్యేకు తగని పిచ్చి
- అనుచరులు, కాంట్రాక్టర్లు, అధికారులూ వారే..
- రెండుసార్లు ఓడిపోయి తొలిసారి అసెంబ్లీకి..
- అవినీతిలోనూ 'జిల్లా'లో తొలివరుసలోనే..
- నియోజకవర్గంలో పెద్దపనులన్నీ తన కంపెనీకే
- 'డివిజన్' అభివృద్ధి నిధులూ దారిమళ్లింపు
- 'కేవీ'కి ఇవ్వడానికి ఐదు ఎకరాలు లేవట!
- సొంత కంపెనీకి మాత్రం 100 ఎకరాలు ధారాదత్తం
- చిన్నాపెద్ద తేడా లేకుండా ప్రతి పనికీ మామూళ్లు
- భవన నిర్మాణాల వసూళ్లకు ప్రత్యేక బృందాలు



టికెట్ రాకున్నా ప్రమోషన్?

ఎమ్మెల్యేపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత రావడంతో మళ్లీ సీటు దక్కలేదు. అయితే పెద్దల సభకు ప్రమోషన్ కల్పిస్తామని సదరు ఎమ్మెల్యేకు పార్టీ పెద్దలు హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

తన నియోజకవర్గంలో ఓ స్థాయి అధికారులంతా సొంత సామాజికవర్గానికి చెందినవారే ఉండేలా చూసుకోవడం ఆయన ప్రత్యేకత. ఎమ్మెల్యే చెప్పినట్లు విని ఇక్కడ పనిచేసిన ఓ తహసీల్దార్ జైలు పాలయ్యారు. పెద్ద పనులను తన కంపెనీకి దక్కేలా చేసుకునే ఈ నేత.. చిన్నాచితక కాంట్రాక్టులు కూడా సొంత సామాజిక వర్గానికే చెందేలా చూసుకుంటున్నారు.

(చిత్తూరు- ఆంధ్రజ్యోతి)

శ్రీనివాసుడు కొలువుతీరిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆయన పేరు వినగానే సరదాగా రెండు ముచ్చట్లు చెబుతారు. ఆయన తొలి విడత ఎమ్మెల్యే. అవినీతి, అక్రమాల్లోనూ అక్కడ అందరి నేతలకంటే తొలి వరుసలోనే ఉంటారు. ఆయన నియోజకవర్గం ఆ జిల్లాలో రాజకీయంగా కీలకమైన స్థానంలో ఉంది. అక్కడ 2019 ఎన్నికల్లో తొలిసారి గెలిచి చట్టసభలోకి అడుగుపెట్టారు. అంతకుముందు కూడా రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయారు. 'సామాజికవర్గం' అంటే తగని పిచ్చి. అవినీతి సొమ్ములంటే

మిగతా 12వ పేజీలో...



ప్రజాకర్షకమేనా!?

ఆదాయ పన్ను పరిమితి పెరిగేనా?

- పార్లమెంటులో ఎల్లుండి తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్
- ఎన్డీయే-2 హయాంలో చివరి బడ్జెట్ ఇదే
- ఎన్నికల ఏడాదిలో ప్రజాకర్షక నిర్ణయాలపై ఆశలు
- సెక్షన్ 80సి కింద ఇచ్చే మినహాయింపుల్ని లక్షన్నర నుంచి 2.5 లక్షలకు పెంచాలని వినతి
- ఈవీలకు ఊతమిచ్చే ఫేమ్-3 ప్రకటించే అవకాశం
- రైతులకు 'పీఎం కిసాన్' మొత్తాన్ని పెంచే చాన్స్

హైదరాబాద్, జనవరి 29: ప్రస్తుత ప్రభుత్వ చివరి బడ్జెట్ పెట్టడానికి మరో రెండు రోజుల సమయమే మిగిలుంది. అయితే ఇది ఎన్నికల ఏడాది కావడంతో.. ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను కాకుండా తాత్కాలిక బడ్జెట్‌ను మాత్రమే ప్రవేశపెట్టబోతోంది. లెక్క ప్రకారమైతే తాత్కాలిక బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలకు తావుండకూడదు. కానీ..

మిగతా 2వ పేజీలో...

అనుకూల ఐపీ..'ఎస్'లు!

- కీలక జిల్లాలకు వీర విధేయులు.. చిత్తూరు ఎస్పీగా నమ్మిన బంటు జాషువా 12
- విపక్ష నేత జిల్లాలో సహకరించిన రిశాంత్‌ను బదిలీ చేస్తూ.. మరిన్ని బాధ్యతలు
- అండగా ఉన్న విజయారావుకు కర్నూలు.. కడపలోనూ ఓ 'రేంజ్' పెత్తనం ఆయనదే
- ఆక్టోపస్ సహా శాంతి భద్రతలకు సెంథిల్.. విశ్వజిత్ రైల్వేకు.. అతుల్ ఏపీఎస్పీకి
- విశాఖ డీఐజీగా విశాల్ గున్నీ.. దళిత ఐపీఎస్ అధికారుల్ని పావులుగా మార్చిన వైసీపీ

ఎన్నికలకు ముందు 30 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ

శ్రీవారి భక్తులకు మంగళసూత్రాలు

లక్ష్మీకాసులు కూడా అమ్మకం.. టీటీడీ నిర్ణయం 3

ప్రయోగశాలలో చేప మాంసం తయారీ!



కోచి, జనవరి 29 : సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఎఫ్ఆర్ఐ) ప్రయోగశాలలో చేప మాంసం తయారీ దిశగా అడుగులు వేస్తోంది. దేశంలో ఇటువంటి ప్రయత్నం ఇదే తొలిసారి. దేశంలో సముద్ర ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టు చేపట్టారు. తద్వారా సముద్ర ఉత్పత్తులపై ఆధారపడడం తగ్గుతుందని, అలాగే దేశం కల్చర్డ్ మెరైన్ ఫిష్ మీట్(సముద్ర చేపల మాంసం) తయారీ రంగంలో ముందడుగు వేస్తుందని సోమవారం విడుదల చేసిన సీఎంఎఫ్ఆర్ఐ అధికారిక ప్రకటన వెల్లడించింది. చేపల్లోని ప్రత్యేక కణాలను సేకరించి వాటిని ప్రయోగశాలలో పెంచడం ద్వారా ఈ మాంసాన్ని ఉత్పత్తి చేస్తారు. ఇలా ఉత్పత్తి చేసిన మాంసం అసలు చేప మాంసం రంగు, రుచి, పోషక విలువలే కలిగి ఉంటుంది. తొలిదశలో ఖరీదైన కింగ్ ఫిష్, పాంఫ్రెట్, సీర్ ఫిష్ వంటి చేపల మాంసం తయారుచేయాలని నిర్ణయించారు. ఈమేరకు నీట్ మీట్ బయోటెక్ స్టార్టప్ సంస్థతో సీఎంఎఫ్ఆర్ఐ భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. సీఎంఎఫ్ఆర్ఐ డైరెక్టర్ ఎ. గోపాలకృష్ణన్, నీట్ మీట్ బయోటెక్ సీఈవో సందీప్ శర్మ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం ఖరీదైన సముద్ర చేపల కణజాలం అభివృద్ధిపై సీఎంఎఫ్ఆర్ఐ దృష్టి సారిస్తుంది. ఈ కణజాలం నుంచి చేప మాంసం తయారీకి కావాల్సిన సాంకేతికతతో నీట్ మీట్ తదుపరి ప్రక్రియలను చేపట్టి సదరు చేప మాంసం తయారుచేస్తుంది. ఈ రంగంలో ఇప్పటికే ముందున్న సింగపూర్, ఇజ్రాయెల్, యూఎస్ వంటి దేశాలతో పోటీ పడేందుకు ఈ ఒప్పందం కీలకమైందని గోపాలకృష్ణన్ అన్నారు.

బడికి వెళ్లకపోవడం రోజుకు 10 సిగరెట్లు తాగినంత ప్రమాదం

» బడికెళ్లే ప్రతీ ఏడాది ఆయుర్దాయంలో పెరుగుదల: లాన్సెట్

న్యూఢిల్లీ, జనవరి 29: "నిరక్షరాస్యులతో పోలిస్తే బడికి వెళ్లి చదువుకొని ప్రైమరీ స్కూల్ పాస్ అయిన వాళ్లలో మరణాల రేటు 13 శాతం తక్కువ. సెకండరీ స్కూల్ పాస్ అయితే మరణాల రేటు 25 శాతం తక్కువ. అదే, బడికి వెళ్లకపోతే అది మనిషి ఆరోగ్యంపై రోజుకు 5-6 పెగ్గుల మద్యం తాగినంత (లేదా) రోజుకు 10 సిగరెట్లను పదేళ్లపాటు తాగినంత ప్రభావం చూపిస్తుంది. విద్య కేవలం జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే కాదు. మనిషి ఆయుర్దాయాన్ని కూడా పెంచుతుంది" అని ఓ అధ్యయనంలో తేలింది. నార్వేయన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తల బృందం 59 దేశాలకు చెందిన సమాచారం ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. రోజూ బడికి/కాలేజీకి వెళ్లి చదువుకోవడం, చిన్నతనంలోనే బడి మానేయడం/మొత్తానికే వెళ్లకపోవడం.. ఈ రెండు సందర్భాల్లో మనిషి మానసిక, శారీరక ఆరోగ్యంపై ఎలా ప్రభావం పడుతుందో విశ్లేషించారు. ఒక వ్యక్తి స్కూల్/కాలేజీకి వెళ్లే ప్రతీ ఏడాది అతని ఆయుర్దాయం రెండేళ్లు పెరుగుతుందని తేల్చారు. అంటే 18ఏళ్ల పాటు ఓ వ్యక్తి విద్యా సంస్థకు వెళ్లి చదువుకుంటే అతని ఆయుర్దాయం నిరక్షరాస్యులతో పోలిస్తే 34శాతం ఎక్కువని పేర్కొన్నారు. ఈ అధ్యయనాన్ని లాన్సెట్ పబ్లిక్ హెల్త్ జర్నల్‌లో ప్రచురించారు.

లోకం తీరు



మాల్దీవుల అధ్యక్షుడిపై అభిశంసన!



మాలె, జనవరి 29: మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు పార్లమెంటులో మెజారిటీ ఉన్న ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎండీపీ(మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ) సిద్ధమైంది. కేబినెట్‌లోకి కొత్తగా నలుగురు సభ్యులను తీసుకోడానికి ఆమోదం తెలిపే విషయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పార్లమెంటులో ఘర్షణ జరిగిన తర్వాతి రోజే చైనా అనుకూల దేశాధ్యక్షుడిపై అభిశంసనకు ప్రధాన ప్రతిపక్షం సిద్ధమవడం గమనార్హం. అభిశంసన తీర్మానానికి అవసరమైనన్ని సంతకాలను డెమొక్రాట్ల భాగస్వామ్యంతో ఎండీపీ సేకరించింది. పార్లమెంటులో మొత్తం 87 మంది సభ్యులుండగా, ప్రతిపక్ష ఎండీపీ, డెమొక్రాట్లకు సంయుక్తంగా 56 మంది సభ్యుల బలముంది. పార్లమెంటులో 56 ఓట్లతో దేశాధ్యక్షుడిని అభిశంసించవచ్చని రాజ్యాంగంతోపాటు, పార్లమెంటు స్టాండింగ్ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సోమవారం ఎండీపీ పార్లమెంటరీ గ్రూప్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. కాగా, కొత్తగా కేబినెట్‌లోకి తీసుకోవాలనుకున్న నలుగురిలో ఒకరి నియామకానికి పార్లమెంటు సోమవారం ఆమోదం తెలిపింది. ఆర్థిక మంత్రి అలీ హైదర్ అహ్మద్ నియామకాన్ని 37-32 ఆధిక్యంతో పార్లమెంటు ఆమోదించిందని స్థానిక మీడియా తెలిపింది. గతేడాది జరిగిన దేశాధ్యక్ష ఎన్నికల్లో భారత అనుకూల ఇబ్రహీం మొహమ్మద్ సోలిహ్ ఓటమి పాలయ్యారు. అనంతరం అధ్యక్ష పగ్గాలు చేపట్టిన చైనా అనుకూల ముయిజ్జు మార్చి 15 నాటికి తమ దేశం నుంచి సైనిక దళాలను ఉపసంహరించుకోవాలని భారత్‌ను కోరారు.

రాజ్యసభ ఎన్నికలు 27న

(మొదటి పేజీ తరువాయి)

చివరి గడువు. 27వ తేదీన ఉదయం తొమ్మిది గంటలనుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్‌ను నిర్వహించి అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించనుంది. తెలంగాణ, ఏపీ నుంచి చెరో మూడు రాజ్యసభ స్థానాలు ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ కానున్నాయి. తెలంగాణ నుంచి బీఆర్ఎస్‌కు చెందిన బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, జోగినపల్లి సంతోష్‌కుమార్ రాజ్యసభ పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. అలాగే ఏపీ నుంచి టీడీపీకి చెందిన కనకమేడల రవీంద్రకుమార్, బీజేపీకి చెందిన సీఎం రమేష్, వైసీపీకి చెందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల రాజ్యసభ సభ్యత్వం ఏప్రిల్ 2తో ముగుస్తుంది. మొత్తంగా తెలుగు రాష్ట్రాలలో ఖాళీ అయ్యే 6 సీట్లను ఈసీ భర్తీ చేయనుంది. మిగిలిన సీట్లలో ఉత్తరప్రదేశ్ నుంచి 10, బిహార్‌నుంచి 6, మహారాష్ట్రనుంచి 6, మధ్యప్రదేశ్‌నుంచి 5, పశ్చిమ బెంగాల్‌నుంచి 5, గుజరాత్, కర్ణాటకల నుంచి చెరో 4, ఒడిశా, రాజస్థాన్‌లలో మూడు సీట్ల చొప్పున రాజ్యసభ స్థానాలు భర్తీ కానున్నాయి. ఛత్తీస్‌గఢ్, హరియాణా, హిమచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌నుంచి ఒక్కో స్థానానికి పోలింగ్ జరగనుంది.

జ్ఞానవాపిలో లభించిన శిలాశాసనంపై తెలుగువారి పేర్లు

మల్లన్న భట్టు, నారాయణ భట్టుగా గుర్తించిన ఏఎస్ఐ డైరెక్టర్



న్యూఢిల్లీ, జనవరి 29: ఉత్తరప్రదేశ్‌లోని వారాణసీ జిల్లాలో ఉన్న కాశీవిశ్వనాథుని ఆలయం సమీపంలోని జ్ఞానవాపి మసీదు ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో హిందూ దేవతల విగ్రహాలు బయల్పడిన విషయం తెలిసిందే. వీటితోపాటు తెలుగు లిపితో ఉన్న ఒక శిలా శాసనాన్ని కూడా భారత పురాతత్వ శాస్త్రవేత్తలు వెలికి తీశారు. తిరుపతికి చెందిన ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి ఆ శాసనంపై ఉన్న తెలుగు లిపిని డీకోడ్ చేశారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. శిలాశాసనంపై 'మల్లన్న భట్టు, నారాయణ భట్టు' పేర్లు ఉన్నాయి. నారాయణ భట్టు కుమారుడే మల్లన్న భట్టు. వీరు తెలుగు బ్రాహ్మణులు. 1585లో పునర్నిర్మించిన కాశీవిశ్వనాథుని ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. 15వ శతాబ్దంలో జౌన్‌పూర్ సుల్తాన్ హుస్సేన్ షార్కి(1458-1505) కాశీవిశ్వనాథుని మందిరాన్ని కూల్చేశారు. తర్వాత కాలంలో రాజ్యం చేపట్టిన రాజా తోడరమల్లు ఈ ఆలయాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించారు. దక్షిణ భారత దేశానికి చెందిన నిపుణులైన నారాయణ భట్టును సంప్రదించి ఈ బాధ్యతలను ఆయనకు అప్పగించారని చరిత్ర చెబుతోంది. నారాయణ భట్టు పర్యవేక్షణలోనే కాశీ విశ్వనాథుని మందిరం పునర్నిర్మితమైంది. తాజాగా లభించిన శిలా శాసనం ఈ విషయాన్ని నిర్ధారిస్తోందని మునిరత్నం రెడ్డి పేర్కొన్నారు.

ప్రజాకర్షకమేనా..!?

(మొదటి పేజీ తరువాయి)



ఎన్నికల సమయంలో ఓట్ల లెక్కలను దృష్టిలో పెట్టుకుని రూపొందించే లెక్క (బడ్జెట్) కాబట్టి ప్రభుత్వాలు తాత్కాలిక బడ్జెట్లలోనూ తాయిలాలు గుప్పించడం ఆనవాయితీగా మారి చాలాకాలమే అయింది. ఈ నేపథ్యంలోనే.. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న ఇంటెరిమ్ బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రజలను మరీ ముఖ్యంగా ఓటర్లను ఆకట్టుకునే నిర్ణయాలను ప్రకటించే అవకాశం ఉందన్న ఆశ సగటు మధ్యతరగతి జీవుల్లో, పేదల్లో ఉంది.

సాధారణంగా బడ్జెట్ అనగానే చాలా మందికి గుర్తొచ్చేది.. ఆదాయ పన్ను శ్లాబులే! ఈసారైనా కేంద్రం దయతలచి పన్ను పరిమితిని పెంచితే బాగుండని కోరుకోవడం.. తీరా బడ్జెట్ చూశాక ఉసూరంటూ నిరాశకు గురి కావడం ఎప్పుడూ జరిగేదే. అయినా మళ్లీ కొత్త బడ్జెట్ ప్రకటిస్తున్నారనగానే ఆశలు చిగురించడమూ అంతే సహజం. ఈ క్రమంలోనే ఈసారి కూడా ఆదాయ పన్ను పరిమితి పెంపు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆదాయపన్నుకు సంబంధించి ప్రస్తుతం పాత, కొత్త విధానాలు అమల్లో ఉన్నాయి. వీటిలో ఒక్కోదానికీ కనీస మినహాయింపు పరిమితి ఒక్కో విధంగా ఉంది. పాత పన్ను విధానంలో ఈ పరిమితి రూ.2.5 లక్షలుగా ఉండగా.. కొత్త పన్ను విధానంలో రూ.3 లక్షలుగా ఉంది. ఈ రెండు పరిమితులనూ పెంచాలని వేతన జీవులు కోరుకుంటున్నారు. ప్రభుత్వం పెంచుతుందని ఆశపడుతున్నారు.

ప్రామాణిక తగ్గింపు పరిమితి (స్టాండర్డ్ డిడక్షన్ లిమిట్)ని ప్రస్తుతం ఉన్న 50 వేల నుంచి రూ.లక్షకు పెంచే అవకాశం ఉందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు.. హెచ్ఆర్ఏ మినహాయింపు, ఆరోగ్య బీమా ప్రీమియం తగ్గింపు పరిమితిని కూడా కేంద్రం పెంచుతుందని ఆశిస్తున్నారు.

జాతీయ పింఛను పథకం పరిమితిని కూడా పాత, కొత్త పన్ను విధానాలు రెండింటిలోనూ రూ.లక్షకు పెంచే అవకాశం ఉందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. చాలా మంది ఇప్పటికీ పాత పన్ను విధానంలోనే ఉన్నారని.. రెండింటిలోనూ ఈ పరిమితిని పెంచితే చాలా మంది కొత్త పన్ను విధానం వైపు మారే అవకాశం ఉందని టాటా పెన్షన్ మేనేజ్‌మెంట్ సీఈవో కురియన్ జోస్ అభిప్రాయపడ్డారు.

గృహరుణ కిస్తీల కింద నెలనెలా వేలాది రూపాయలు చెల్లించే వేతన జీవులు చాలామంది కొత్త పన్ను విధానం వైపు మొగ్గుచూపకపోవడానికి కారణం గృహ రుణ వడ్డీల మినహాయింపులే. ఈ నేపథ్యంలో.. ఆ మినహాయింపును కొత్త పన్ను విధానానికీ వర్తింపజేసే అవకాశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యానికి అడ్డుకట్ట వేసే క్రమంలో.. విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఫేమ్)' పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫేమ్-1, ఫేమ్-2 పేరిట రెండు దఫాలుగా ఈ పథకం కింద ఈవీల కొనుగోళ్లపై ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ఫేమ్-2 కాలపరిమితి ఈ ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో బడ్జెట్‌లో ఫేమ్-3ని ప్రకటించనున్నట్టు కేంద్ర భారీ పరిశ్రమలశాఖ ఇటీవలే వెల్లడించింది.

జీవితబీమా ప్రీమియంలపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గిస్తే బీమా తీసుకునేవారి సంఖ్య పెరుగుతుందని ఆ రంగానికి చెందిన నిపుణులు కొంతకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఆ దిశగా ఒక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్టు అంచనా.

..ఇవే కాదు, మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఉత్పత్తి రంగాలకు సంబంధించి కూడా ప్రజలను ఆకట్టుకునే విధంగా పలు కీలక నిర్ణయాలను ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

- పన్ను మినహాయింపుల్లో చాలా మంది కోరేది.. సెక్షన్ 80సీ కింద ఇస్తున్న మినహాయింపు పరిమితి పెంపు. రూ.లక్షగా ఉన్న ఈ పరిమితిని.. 2014-15 బడ్జెట్‌లో రూ.1.5 లక్షలకు పెంచారు. అప్పట్నుంచీ ఈ పరిమితిలో ఎలాంటి మార్పూ లేదు. కనీసం ఈసారైనా ఈ పరిమితిని రూ.2 లక్షలకు ప్రభుత్వం పెంచుతుందన్న ఆశాభావం వేతనజీవుల్లో వ్యక్తమవుతోంది. తొమ్మిదేళ్లుగా పెరిగిన ధరలను, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుంటే.. ఈ పరిమితిని రూ.2.5 లక్షలకు పెంచాలని ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ట్యాక్స్ పార్ట్‌నర్ సురభి మార్వా అభిప్రాయపడ్డారు.
- వేతన జీవులే కాదు.. ఎన్నికల ఏడాది బడ్జెట్‌లో రైతన్నలకూ పెద్ద పీట వేయడం ప్రభుత్వాలకు అలవాటే. ఈ క్రమంలోనే, 2019లో ఎన్నికలకు ముందు ఆర్థికమంత్రిగా తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన పీయూష్ గోయల్.. రైతుల కోసం 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. అదే కోవలో ఈసారి కూడా దేశవ్యాప్తంగా ఉన్న రైతులను ఆకట్టుకునేలా ఈ పథకం కింద ఇస్తున్న మొత్తాన్ని పెంచుతూ ప్రకటన చేసే అవకాశం ఉందన్న అంచనాలున్నాయి.

వైసీపీని గద్దె దింపండి : షర్మిల

కర్నూలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం వల్ల ప్రాణాలు పోతున్నాయని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మద్యం మరణాలు మన రాష్ట్రంలో 20 శాతం అధికమని, ఆ పాపం సీఎం జగనన్నదే అని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. సోమవారం కర్నూలులో జరిగిన ఉమ్మడి కర్నూలు జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మట్లాడారు. అంతకుముందు కర్నూలు నగరంలో రోడ్‌షో నిర్వహించారు. 'అసలు ఈ ప్రభుత్వం మనకు అవసరమా? 73 రోజుల సమయం ఉంది. ఇంటింటికి వెళ్లండి. ప్రజల్లో చైతన్యం తీసుకురండి. బీజేపీ తొత్తులుగా మారిన వైసీపీని గద్దె దింపేందుకు సైనికుల్లా పని చేయండి..' అంటూ షర్మిల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైసీపీకి ఓటు వేస్తే.. బీజేపీకి ఓటు వేసినట్లేనని అన్నారు. ప్రత్యేక హోదా కోసం ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ దీక్షలు చేశారని, ఎంపీలు మూకుమ్మడిగా రాజీనామా చేస్తే హోదా ఎందుకు రాదని ఆనాడు చంద్రబాబును ప్రశ్నించిన జగన్ ఇప్పుడు హోదాపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. జగనన్న మూడు రాజధానులు అని చెప్పి రాష్ట్రాన్ని నిలువునా ముంచారని విమర్శించారు. కర్నూలును న్యాయ రాజధాని చేస్తానని చెప్పి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. నాటి రాజశేఖరరెడ్డి పాలనకు.. నేడు జగనన్న పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. జగనన్న ఒక్క ఉద్యోగమైనా భర్తీ చేశాడా? అని ప్రశ్నించారు. సీమలో జగన్ ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదన్నారు. రాజశేఖరరెడ్డి రూ.4,500 కోట్లు ఖర్చు పెట్టి హంద్రీనీవా పనులు చేపడితే, జగనన్న పది శాతం పనులు కూడా చేయలేదన్నారు. ఇదేనా రాజన్న రాజ్యం అంటే ప్రశ్నించారు. పనులేమీ చేయకపోయినా రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి పెట్టాడని విమర్శించారు.

వారంలో సీఏఏ అమలు

» కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ వెల్లడి

కోల్‌కతా, జనవరి 29: వారం రోజుల్లో దేశవ్యాప్తంగా సీఏఏ(పౌరసత్వ సవరణ చట్టం)ను అమలు చేస్తామని కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ ప్రకటించారు. సోమవారం కోల్‌కతాలో ఆయన మాట్లాడుతూ ఏడు రోజుల్లో సీఏఏ అమలు చేస్తామనేది తన గ్యారెంటీ అని నొక్కి చెప్పారు. ఆదివారం కూడా పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా కాక్‌ద్వీప్‌లో నిర్వహించిన బహిరంగ సభలో శంతను ఠాకూర్ మాట్లాడుతూ 'మీకు ఓటరు, ఆధార్‌కార్డులు ఉన్నట్లైతే మీరు ఈ దేశ పౌరులే అని, మీరు ఓటు వేయొచ్చని ఈ రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. అదే నిజమైతే ఇక్కడ వేలమంది ఎందుకు ఓటుహక్కు కోల్పోయారో ముఖ్యమంత్రి(మమత) సమాధానం చెప్పాలి? భవిష్యత్తు తరాల భద్రత కోసం సీఏఏను అమలు చేస్తున్నాం' అన్నారు. అయితే, ఇది ఎన్నికల నేపథ్యంలో చేసిన ప్రకటన అని, పశ్చిమబెంగాల్‌లో సీఏఏ అమలును అడ్డుకుంటామని తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించింది. 'లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున సీఏఏపై బీజేపీ చేసింది ఎన్నికల దృష్ట్యా చేసిన ప్రకటనే' అని ఆ పార్టీ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ కొట్టిపారేశారు. 'ఎప్పటిలాగే బీజేపీ సీఏఏ ద్వారా పాత ఎత్తుగడలనే ఉపయోగిస్తోంది. రాష్ట్రంలో సీఏఏను అమలు చేయబోమని మా పార్టీ అధినేత్రి మమత చెప్పారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ సీఏఏ అంశాన్ని లేవనెత్తుతోందని కూచ్‌బెహార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మమత నిందించారు.

మోదీ మళ్లీ గెలిస్తే ఇవే చివరి ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

దేశ ప్రజలకు ఉన్న చివరి అవకాశం రానున్న ఎన్నికలేనని హెచ్చరించారు. సోమవారం ఇక్కడ జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ప్రసంగించిన ఆయన ఆర్ఎస్ఎస్-బీజేపీలపై ఘాటు విమర్శలు చేశారు. వాటి సిద్ధాంతాలు విషపూరితమని, అందువల్ల వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రతిపక్షాలను బెదిరించడం ద్వారా మోదీ పాలనను కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈడీ, ఆదాయపు పన్ను విభాగాలు బీజేపీ చేతిలో ఆయుధాలుగా మారాయని విమర్శించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను వ్యతిరేకించే రాజకీయ నాయకులను వారి సొంత పార్టీలను వీడేలా బెదిరిస్తోందని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను వ్యతిరేకిస్తున్నందుకు రాహుల్ గాంధీకి కూడా బెదిరింపులు వస్తున్నాయని ఖర్గే చెప్పారు. అయితే రాహుల్ వాటిని లెక్కచేయడం లేదని, దేశాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని చెప్పారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఇండియా కూటమిని విడిచిపెట్టడంపై స్పందిస్తూ ఒక్కరు వెళ్లిపోయినంత మాత్రాన ఎన్నికలపై ప్రభావం పడదని అన్నారు. 70 ఏళ్లలో దేశానికి కాంగ్రెస్ ఏమీ చేయలేదంటూ ప్రధాని మోదీ చేస్తున్న విమర్శలపైనా ఖర్గే ఘాటుగా స్పందించారు. "మీరు గుజరాత్ ముఖ్యమంత్రి, ప్రధాని కాగలిగారంటే కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడడం వల్లనే సాధ్యమయింది. మరి మీరేమో ప్రజాస్వామ్య రాజ్యాంగ మూల సూత్రాలనే నాశనం చేస్తున్నారు" అని విమర్శించారు. మోదీని అబద్ధాలకోరు అని అభివర్ణించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో 30 లక్షల ఖాళీలు ఉన్నా భర్తీ చేయడం లేదని విమర్శించారు.

ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌పైనా విమర్శలు చేశారు. ఒడిశాలో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు, కర్మాగారాల జాబితాను వివరిస్తూ రాష్ట్రానికి నవీన్ ఏమి చేశారని ప్రశ్నించారు. జవహర్‌లాల్ నెహ్రూకు, బిజూ పట్నాయక్‌కు మంచి స్నేహం ఉండేదని, కానీ నవీన్ పట్నాయక్ ఇప్పుడు బీజేపీ సిద్ధాంతాలను నమ్ముతున్నారని అన్నారు. ఒడిశాలో బీజేపీది, బిజూ జనతాదళ్‌ది ప్రేమ వివాహం అని వ్యాఖ్యానించారు.

సంఘ్, బీజేపీ సిద్ధాంతాలతో హింస, విద్వేషాల వ్యాప్తి

కిషన్‌గంజ్ (బిహార్), జనవరి 29: ఆర్ఎస్ఎస్, బీజేపీల సిద్ధాంతాలు దేశంలో హింస, విద్వేషాలను వ్యాప్తి చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఎన్‌డీఏ పాలనలో వివిధ మతాలు, కులాలకు చెందిన ప్రజలు కొట్టుకుంటున్నారని ఆరోపించారు. 'ఇండియా కూటమి' ఆవిర్భావంలో కీలక భూమిక పోషించిన జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్.. ప్రతిపక్షాలతో తెగతెంపులు చేసుకుని ఎన్‌డీఏలో చేరి ఆదివారం మళ్లీ సీఎం పగ్గాలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాహుల్ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' బెంగాల్ నుంచి సోమవారం బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో ప్రవేశించింది. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాగా, ఇటీవల వైరల్ అయిన ఓ వీడియోలో రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ బెంగాల్ బీజేపీ ఎమ్మెల్యే సువేందు అధికారిపై కాంగ్రెస్ నేతలు సిలిగురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భారతీరెడ్డితో చెప్పిస్తారా?



కర్నూలులో బాణం ఎక్కుపెట్టిన పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. 'సిగ్గూ ఎగ్గూ ఉచ్చం, నీచం లేకుండా రోజుకో జోకర్ ముందుకొచ్చి రోజుకో కొత్త మాట చెబుతున్నారు. నిన్న ఒకరు వచ్చి.. 'ప్రణబ్ ముఖర్జీ చెప్పారు' అంటూ ఏదో కథ చెప్పాడు. నా భర్త అనిల్ సోనియా వద్దకు వెళ్లి, "షర్మిలకు సీఎం పదవి ఇస్తే కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం, జగన్‌ను జైల్లో పెట్టండి" అని అడిగినట్లు చెప్పారు. నా భర్త ఎప్పుడు సోనియా వద్దకు వెళ్లినా... మా వదిన భారతీరెడ్డితో కలిసే వెళ్లారు. మరి... 'షర్మిలను సీఎం చేయండి' అని నా భర్త భారతీరెడ్డి ముందే సోనియాకు చెప్పారా? లేక వెనుక చెప్పారా? దీనికి భారతీరెడ్డి సాక్ష్యం చెబుతారా? అసలు ఈ విషయాన్ని ప్రణబ్ ముఖర్జీ ఎప్పుడైనా, ఎక్కడైనా బహిరంగంగా చెప్పారా? ఆయన చనిపోయారు. ఇప్పుడు లేరు. కనీసం... ఆయన కుమారుడితోనైనా చెప్పిస్తారా? ఆ దమ్ముందా? ఒక్క మాట కూడా మీరు రుజువు చేయలేరు. ప్రణబ్ ఇప్పుడు జీవించి లేరు కాబట్టి.. ఆ పెద్ద మనిషి పేరును కూడా వాడుకుంటున్నారు. ఇక మీ కుట్రలకు అడ్డూ అదుపూ ఉండదా? ఆడపిల్ల అనే ఇంగితం లేదా? వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తారా?' అని షర్మిల మండిపడ్డారు.

పాత జగనన్న కాదు

'జగనన్న సీఎం అయ్యాక మనిషి మారిపోయాడు. ఆయన పాత జగనన్న కాదు. ఇప్పుడున్న జగనన్న నాకు తెలియదు. వైసీపీ కోసం, ఆ పార్టీని నిలబెట్టేందుకు, జగనన్న కోసం నిస్వార్థంగా 3200 కిలోమీటర్లు పాదయాత్ర చేశాను. పార్టీ ఉనికి కోల్పోతుందని భయపడుతుంటే... దానిని నిలబెట్టే బాధ్యత నా భుజాన వేసుకున్నాను. కుటుంబాన్ని వదిలిపెట్టి... ఎండనకా, వాననకా తిరిగాను. నాకు పదవీ కాంక్ష ఉంటే నాకోసం పాదయాత్ర చేస్తాను. వాళ్లకోసం ఎందుకు చేస్తాను? ఇంత త్యాగం ఏ చెల్లెలూ చేయలేదని జనమే అన్నారు. ఇప్పుడు వైసీపీకి అవేవీ గుర్తులేవు. నేను మహిళనని, త్యాగాలు చేశానని, వైఎస్ బిడ్డనని మరిచిపోయి మూకుమ్మడిగా దాడి చేస్తున్నారు' అని షర్మిల విమర్శించారు.

సాక్షిలో నాపై దూషణలా?

'సాక్షి అట.. తెలంగాణలో నాతో కలిసి పనిచేసిన వారికి ఫోన్లు చేసి షర్మిలమ్మకు వ్యతిరేకంగా మాట్లాడితే కవరేజీ ఇస్తామని చెబుతున్నారు. వాళ్లు నాకు ఫోన్లు చేసి అమ్మ ఇలా అంటున్నారని చెబుతున్నారు. ఇంతలా దిగజారాలా మీరు? ఏ సాక్షిలో అయితే నా గురించి ఇంత దూషణలు చేస్తున్నారో ఇదే సాక్షిలో నాకు భాగం ఉంది. సాక్షిలో జగన్‌కు ఎంత భాగం ఉందో నాకు కూడా అంతే భాగం ఉండాలని రాజశేఖరరెడ్డి నిర్ణయించారు. నాకు సమానభాగం ఉన్న సాక్షిలో నామీద వ్యతిరేకంగా ఇంత ఘోరంగా వ్యవహరిస్తారా? నేను ఇష్యూల మీద మాట్లాడుతున్నాను. స్పెషల్ స్టేటస్, పోలవరం కోసం ఎందుకు కొట్లాడలేదని అడుగుతున్నా. బీజేపీతో మీకు దోస్తీ ఉంది. బానిసలుగా ఉన్నారు. కనీసం క్రాప్ ఇన్సూరెన్స్ కూడా ఎందుకు ఇప్పించలేరని నేను ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పకుండా రోజుకొక జోకర్‌ను తెస్తారు. తెలుగు ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అని షర్మిల హెచ్చరించారు.

ఎవరు కాదన్నా నేను వైఎస్ షర్మిలారెడ్డినే

'నేను రాజశేఖరరెడ్డి బిడ్డను. పులి కడుపున పులి పుడుతుంది. నా ఉనికి ఇదే. ఎవరు కాదన్నా, ఎవరు అవునన్నా, ఎవరు గీపెట్టినా, నేను వైఎస్ షర్మిలారెడ్డి. ఆంధ్రరాష్ట్ర ప్రజలకు మేలు చేయడానికే ఇక్కడకు వచ్చా. నా గుండెలో నిజాయితీ ఉంది. ప్రత్యేక హోదా వచ్చేంత వరకు రాజశేఖరరెడ్డి బిడ్డ ఇక్కడ నుంచి కదలదు. ఆంధ్రరాష్ట్రంలో అడుగుపెట్టింది. నిలబడుతుంది.. కొట్లాడుతుంది. రాష్ట్రం అభివృద్ధి చెందాలి. అంతవరకు పుట్టింటి నుంచి కదలను. మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి. ఏం పీక్కుంటారో పీక్కోండి. ఇక్కడ భయపడే వారు ఎవరూ లేరు. ఇక్కడున్నది రాజశేఖరరెడ్డి బిడ్డ.. ఖబడ్దార్. మళ్లీ చెబుతున్నా.. ఇది నా పుట్టిల్లు. జమ్మలమడుగులో రాజశేఖరరెడ్డి, జగనన్న ఏ ఆసుపత్రిలో అయితే పుట్టారో.. అదే ఆసుపత్రిలో నేనూ పుట్టా' అని షర్మిల అన్నారు.

వైఎస్ కలను జగనన్న నెరవేర్చలేదు

'వైఎస్ హయాంలో పార్టీలకతీతంగా పథకాలు ప్రతి ఒక్కరూ పొందారు..అది రాజశేఖరరెడ్డి మార్క్. పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించడం, పక్కా ఇళ్లు కట్టించడం, రైతును రాజును చేయడం, వ్యవసాయాన్ని పండుగ చేయడం, 108 వైఎస్ మార్క్. మాట తప్పడం మడమ తిప్పడం చేత కాని వ్యక్తి. ఆయన బతికిఉంటే కడప స్టీల్ వచ్చేది. ఆయన హయాంలో రూ.20 వేల కోట్లతో ప్రారంభోత్సవం కూడా చేశారు. ఇపుడు కడప స్టీల్ ఫ్యాక్టరీ ఒక కల లాగా మిగిలిపోయింది. కడప స్టీల్ ఫ్యాక్టరీ కోసం ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు జగనన్న దీక్షలు చేశారు. ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పుడైనా కడప స్టీల్ ఫ్యాక్టరీ వచ్చిందా అంటే అది కూడా రాలేదు. శంకుస్థాపనకు మాత్రమే పరిమితమయ్యారు. ఎన్నిసార్లు శంకుస్థాపనలు చేస్తారు? బీజేపీతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారు కదా.. చంద్రబాబు అయినా, జగనన్న అయినా కనీసం కడప జిల్లాకు ఇదైనా తెచ్చుకోవడం చేతగాలేదు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కడప నుంచి బెంగళూరు వరకు రైల్వే లైన్ పడాలని కలలు కన్నారు. ఆయన కలను నెరవేర్చేందుకు కూడా ఈ ప్రభుత్వానికి చేతకాలేదు. మాకు ఈ ప్రాజెక్టు అవసరం లేదని లేఖ రాశారు. జగనన్నా.. బీజేపీతో మీకున్న అనుబంధంతో రైల్వేలైన్ ఎందుకు తెప్పించుకోలేదో కడప ప్రజలకు సమాధానం చెప్పాలి. స్టీల్ ఫ్యాక్టరీ, రైల్వే లైను ఏదీ రాలేదు. ఒక్కరకంగా కూడా మేలుచేయలేదు. అన్నమయ్య ప్రాజెక్టులో మెయింటెనెన్స్ చేయలేకపోవడంతో వరదలకు గేట్లు కొట్టుకుపోయి 450 కుటుంబాలు ఇళ్లు కోల్పోయాయి. 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆస్తినష్టం వేల కోట్లు జరిగింది. సర్కారు చేసిన తప్పునకు ప్రజలు బలైపోయారు. ఇప్పటికీ ఇళ్లు లేకుండా బతుకుతున్నారు. వారిని ఆదుకున్న పాపాన పోలేదు. కడప జిల్లా పట్ల జగనన్నకు ప్రేమ ఉందని ఎలా నమ్మాలి' అని షర్మిల అన్నారు.

బీజేపీకి బానిసలు

'బీజేపీ మతతత్వ పార్టీ కాబట్టి రాజశేఖరరెడ్డి మద్దతు ఇవ్వలేదు. ముస్లింలకు ఆయన 4 శాతం రిజర్వేషన్ ఇస్తే.. అదే బీజేపీ గోద్రాలో ముస్లింలను చంపింది. మణిపూర్‌లో క్రైస్తవులను చంపింది. అందుకే రాజశేఖరరెడ్డి బీజేపీని ఎప్పుడూ వ్యతిరేకించారు. మరి అలాంటి బీజేపీకి జగనన్న బేషరతుగా మద్దతు ఇస్తున్నారు అంటే.. మీరు రాజశేఖరరెడ్డి ఆశయాలు నిలబెట్టిన వారు ఎలా అవుతారో కడప ప్రజలకు సమాధానం చెప్పాలి' అని షర్మిల ప్రశ్నించారు.

డీఎల్‌తో షర్మిల భేటీ

కడప పర్యటన ముగించుకుని కర్నూలు వెళుతున్న షర్మిల మార్గమధ్యంలో ఖాజీపేటలో మాజీమంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి స్వగృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. "డీఎల్ డీఎన్ఏలోనే కాంగ్రెస్ ఉంది. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని కోరడానికి వచ్చాం." అని షర్మిల పేర్కొన్నారు. కాగా, డీఎల్ రవీంద్రారెడ్డికి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధి నుంచి కబురు అందినట్లు సమాచారం. షర్మిల కాంగ్రెస్ పదవి చేపట్టిన తరువాత రాష్ట్రంలో పూర్వవైభవం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే డీఎల్‌ను సోనియా ఢిల్లీకి వచ్చి కలవాలని కబురు పంపించారని అంటున్నారు.

షర్మిలతో సునీత భేటీ



ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న షర్మిల, సునీత

మాజీ మంత్రి వైఎస్ వివేకా కూతురు డాక్టర్ సునీతా రెడ్డి ఇడుపులపాయలో షర్మిలతో భేటీ అయ్యారు. రెండు గంటల పాటు అక్కడే ఉన్నారు. షర్మిల పీసీసీ చీఫ్ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఆమెను సునీత ఇడుపులపాయలో కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య రాజకీయాలు, పలు అంశాలు చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. కడప పార్లమెంటు లేదా పులివెందుల అసెంబ్లీ నుంచి తన తల్లి సౌభాగ్యమ్మను పోటీ చేయించాలనే యోచనలో సునీత ఉన్నట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని షర్మిల వద్ద సునీత ప్రస్తావించినట్లు సమాచారం. వివేకా హత్య తరువాత వైఎస్ కుటుంబం రెండుగా చీలింది. సునీతకు షర్మిల అండగా ఉంటూ వస్తున్నారు. అలాగే వివేకా హత్య కేసులో సీబీఐ విచారణ, కోర్టులో కేసులు, ఇతర కుటుంబ, షర్మిల కొడుకు రాజారెడ్డి పెళ్లి విషయాలు, సీఎం జగన్ షర్మిలను ఇబ్బందులకు గురి చేయడం తదితర విషయాలపై కూలంకుషంగా చర్చించినట్లు చెబుతున్నారు. అనంతరం వైఎస్ సమాధి వద్ద ఇరువురు కలిసి నివాళులర్పించారు.

పోలవరం ముంపుపై రీసర్వే

- పీపీఏ సమావేశంలో తెలంగాణ డిమాండ్
- సాధ్యం కాదని తేల్చిచెప్పిన ఆంధ్రప్రదేశ్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంవల్ల తెలంగాణ ప్రాంతంలోని 34 వాగుల్లోకి వచ్చే బ్యాక్‌వాటర్‌తో భద్రాచలం ముంపునకు గురవుతుందని.. దీనిని నివారించేందుకు రీసర్వే చేపట్టాలని తెలంగాణ డిమాండ్ చేసింది. అది సాధ్యం కాదని ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో సోమవారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివ్ నందన్ కుమార్ అధ్యక్షతన జరిగిన పీపీఏ సమావేశంలో ఈ వాదనలు కొనసాగాయి. ఈ సమావేశానికి ఏపీ జల వనరుల శాఖ, తెలంగాణ నీటిపారుదల శాఖల ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు సి.నారాయణరెడ్డి, మురళీధర్‌రావు తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా తెలంగాణలోని కిన్నెరసాని, ముద్దివాడు వంటి 34 వాగుల్లోకి పోలవరం బ్యాక్ వాటర్ తన్నుకువచ్చే ప్రమాదం ఉన్నదని తెలంగాణ వాదించింది. అందువల్ల తక్షణమే రీసర్వే చేపట్టి, భూసేకరణ, పునరావాస కార్యక్రమాలను అమలుచేయాలని కోరింది. ఇప్పటికే ఈ అంశంపై తాము స్పందించినందున, రీసర్వే అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ తేల్చి చెప్పింది.

పోలవరం నిర్మాణ తీరుపై అసంతృప్తి

పోలవరంలో పనుల ప్రగతిపై పీపీఏ సంతృప్తి వ్యక్తం చేయలేదు. పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయినందున, వాటిని పునఃప్రారంభించాలని పీపీఏ కోరింది. పోలవరం పనులపైనా .. డిజైన్లపైనా కేంద్ర జలశక్తిశాఖ నేరుగా నిపుణులను నియమించుకుంటుందని ఏపీకి పీపీఏ తేల్చి చెప్పింది. వీరంతా తన ఆధీనంలోనే పనిచేస్తారని కూడా వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్వహణ కోసం రూ.48 కోట్లను తక్షణమే మంజూరు చేయాలని కేంద్రం నిర్ణయించిందని తెలిపారు. ఈ ఏడాది జూన్‌తో స్టాప్ వర్క్ ఆర్డర్ గడువు పూర్తవుతున్నందున.. నిషేధాన్ని ఎత్తివేయాలని పీపీఏను ఏపీ కోరింది. ఇదే సమయంలో, కేంద్రం పోలవరం ప్రాజెక్టు అంచనాలను సవరించకపోవడం.. పనుల వారీ అంచనాలను నిర్ధేశించకపోవడంపైనా చర్చ జరిగింది.

మార్పు కోరుకుంటున్న ఏపీ ప్రజలు

- 'విగ్రహ ప్రతిష్ఠ' వారి మనసుల్ని తాకింది: పురందేశ్వరి

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకొంటున్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధమయ్యారు' అని బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలో సోమవారం పార్టీ సంయోజక్‌లు(సమన్వయ కర్త), ఇన్‌చార్జిలు, విస్తారక్‌ల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'సంక్షేమం పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోన్న వైసీపీ తీరుతో రాష్ట్ర భవిష్యత్తు రివర్స్ అయింది. దేశంలో పదేళ్లుగా అవినీతిలేని, అభివృద్ధి పాలన అందిస్తోన్న మోదీ ప్రభుత్వం మూడోసారి విజయ ఢంకా మోగించబోతోంది. దేశ ప్రగతి, బాల రాముని విగ్రహ ప్రతిష్ఠతో ప్రజల మనసుల్ని తాకడమే దానికి ప్రధాన కారణం. రాష్ట్రమంతటా ఎన్నికల వాతావరణం నెలకొంది.ఈ ఫిబ్రవరి 1న 25 పార్లమెంటు నియోజకవర్గ కేంద్రాల్లో బీజేపీ కార్యాలయాలు స్థాపించి ఎన్నికల బరిలోకి దూకాలి. మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని ఆశీర్వదించమని కోరాలి. రాష్ట్రంలో పొత్తుల విషయం అధిష్ఠానం చూసుకొంటుంది. ఫిబ్రవరి 9 నుంచి పల్లెకు వెళ్లి ప్రచారం కార్యక్రమం ద్వారా ఓటర్ల ఆశీర్వాదం కోరడమే మనందరి ధ్యేయంగా కావాలి' అని పురందేశ్వరి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో దోచుకుందాం చీరాలలో పంచుదాం!

- పార్టీనే వాడుకుంటున్న వైసీపీ నేత
- పర్చూరులో పార్టీ విజయానికి ఇన్‌చార్జిగా నియామకం
- కానీ అక్రమార్జనపైనే నేత దృష్టి
- ఏడాదిలో 50 కోట్లు దోపిడీ
- అల్లకల్లోలం చేసి పలాయనం
- చీరాలలో పోటీ చేస్తానంటూ ఝలక్
- ద్వితీయ శ్రేణి నేతలు లబోదిబో

(బాపట్ల-ఆంధ్రజ్యోతి)

వైసీపీ తమను వాడుకుని వదిలేసిందని పలువురు నేతలు బయటకు వస్తున్నారు. కానీ ఓ నేత మాత్రం అక్రమార్జనకు వైసీపీనే వాడుకుంటున్నారు. వైసీపీ అధిష్ఠానం ఏరికోరి మరీ ఆ మాజీ ఎమ్మెల్యేను ఆ మధ్య పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పంపింది. వచ్చే ఎన్నికల్లో అక్కడ విజయం సాధించాలని ప్లాన్ వేసింది. కానీ ఆ నేత స్టయిలే వేరు. అక్కడ పార్టీని బలోపేతం చేయడంపై కాకుండా అక్రమార్జనపై దృష్టిపెట్టారు. నియోజకవర్గంలో ఉన్న వనరులను ఎలా వాడుకోవాలో చూపించడంలో సదరు నేత రికార్డు నెలకొల్పారు. దోపిడీలు, దందాలతో ఏడాదిలోనే రూ.50 కోట్లకు పైగా దండుకున్నారు. అంతేగాక నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ఠను మసకబార్చడంతో పాటు తన అవినీతి సంపాదనకు అడ్డొచ్చిన సొంత పార్టీ నేతలను వేధించారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడటంతో పర్చూరును వదిలేసి చీరాలలో పోటీ చేస్తానని చెబుతున్నారు. అంటే.. పర్చూరులో దోచుకుని చీరాలలో పంచేందుకు సిద్ధమవుతున్నట్టుగా ఉన్నారు. ఆ నేత చేస్తున్న రాజకీయం చూసి సొంత పార్టీ నేతలే నివ్వెరపోతున్నారు.

వైసీపీ ఇచ్చిన పదవితో దోపిడీ

పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాగానే సదరు నేత దోచుకోవడంపై కన్నేశారు. రేషన్, ఇసుక, గ్రానైట్ ఇలా ఆదాయం వచ్చే ఏ ఒక్క మార్గాన్ని వదలలేదు. నెలవారీ వసూళ్లలో టార్గెట్లు ఫిక్స్ చేశారు. ప్రైవేటు సైన్యాన్ని పెట్టుకుని చేసే అక్రమ దందాలను వ్యవస్థీకృతం చేసిన ఘనతా ఆయన సొంతమే. ఆయన దోచుకున్న సొమ్ములో వైసీపీ రాష్ట్ర నాయకత్వానికి కూడా వాటాలు వెళ్లడంతో కిమ్మనకుండా ఉన్నారని సమాచారం. ఆయన దందాలకు అడ్డురావడంతో సొంత పార్టీ నేతలపైనే కక్ష కట్టి వేధింపులకు గురి చేశారు. ఇలా ఆ నేత ఈ ఏడాది కాలంలోనే పర్చూరు నియోజకవర్గంలో చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. కోట్లాది రూపాయలు వెనకేసుకోగా, బాధితులు వందల సంఖ్యలో ఉన్నారు. వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన పదవితో కేవలం దండుకోవడానికే ఆ నియోజకవర్గాన్ని వాడుకున్నారు తప్పితే పోటీ చేయడానికి కాదు. తాజాగా తాను అక్కడ నుంచి పోటీ చేయడం లేదని చీరాల నుంచే పోటీకి దిగుతానని అంతరంగికుల సమావేశంలో తేల్చేశారు.

దోపిడీ ఒక ఎత్తయితే పర్చూరు నియోజకవర్గంలో ఓట్ల అక్రమాలకు సంబంధించి ఆయన సారథ్యంలో వెలుగు చూసిన బాగోతాలకు ఈసీయే నివ్వెరపోయింది. సదరు నేత సేవలో తరించిన పాపానికి కొంతమంది ఉద్యోగులు సస్పెండ్ కాగా.. మరి కొంత మంది గుండెపోటు తెచ్చుకుని చావు అంచుల దాకా వెళ్లి వచ్చారు.

ఓట్ల నమోదులో అక్రమాలు

పర్చూరు నియోజకవర్గంలో దొంగ ఓట్ల వ్యవహారం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశమైంది. పోలీసు పహారాలో ఫామ్-7లకు సంబంధించి విచారణ ఎదుర్కోవాల్సిన అగత్యాన్ని ప్రజలకు కల్పించిన ఘనత కూడా ఆయనదే. ఓట్ల అక్రమాల ఆరోపణల నేపథ్యంలో నలుగురు పోలీస్ అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. పలువురు రెవెన్యూ ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఆయన అక్రమార్జనకు అండగా ఉన్న ఉద్యోగులను నమ్మించి నట్టేట ముంచేశారు. సదరు నేత అండ చూసుకునే ఓట్ల జాబితా సవరణ ప్రక్రియలో పోలీసులు తలదూర్చారు. వారిపై వేటు పడే సమయంలో మాత్రం తనకు పట్టనట్లు వ్యవహరించడంలో సదరు అధికారులకు తత్వం బోధపడింది. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో మౌనంగా రోదించడం వారి వంతయింది.

అధిష్ఠానం దృష్టికి వెళ్లినా..

నియోజకవర్గంలో ఆ నేత చేస్తున్న అక్రమాలపై పలుసార్లు పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లినా ఆయనకే వత్తాసు పలికారు. చీరాలలోనే పోటీ చేస్తానని ఇప్పుడు ఆయన లీకులివ్వడంతో ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ అధినాయకత్వంపై మండిపడుతున్నారు. కేవలం దోచుకోవడానికే ఆయనకు పార్టీ పదవి ఇచ్చినట్లయిందని, తాము తొలి నుంచి చెబుతున్నా పార్టీ పెద్దలు ఖాతరు చేయలేదని అంటున్నారు. ఆ నేత వల్ల పర్చూరులో వైసీపీ పతనావస్థకు చేరిందని లబోదిబోమంటున్నారు. ప్రశాంతంగా ఉండే పర్చూరు నియోజకవర్గంలో ఆయన చేసిన చర్యల వల్ల పార్టీ అప్రతిష్ఠ మూటగట్టుకుందని, ఈ దశలో ఇక్కడ వైసీపీకి కాయకల్ప చికిత్స చేయడం అసాధ్యమనే అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతోంది.

ప్రత్యామ్నాయంపై దృష్టి

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా వైసీపీ అధిష్ఠానం ఇప్పుడు పర్చూరులో ప్రత్యామ్నాయ నేతపై దృష్టి పెట్టి అభిప్రాయ సేకరణ జరుపుతోంది. పార్టీ నేతలు, మద్దతుదారుల నుంచి కరకుగా స్వరాలు వినపడుతుండడంతో బిత్తరపోవడం పార్టీ పెద్దల వంతవుతోంది. అడ్డగోలుగా దోపిడీ చేసి ఇప్పుడు పక్క నియోజకవర్గానికి పలాయనం చిత్తగిస్తున్న నేత బాగానే ఉంటారు కానీ అన్నివిధాలా తామే నష్టపోయామని ద్వితీయశ్రేణి నేతలు వారి ముందు వాపోతున్నారు. సదరు నేత చేసిన అడ్డగోలు పనుల కారణంగా గ్రామాల్లో తిరగలేని పరిస్థితి నెలకొందని, తమ దారి తాము చూసుకుంటామని నేతలు తెగేసి చెబుతున్నారు.

జగన్ కోర్టుకు హాజరయ్యేవరకూ.. ప్రజల్లోకి కోడికత్తి శ్రీను తల్లి

- పెద్ద కుమారుడితో కలిసి మరో పోరాటం
- వచ్చేనెల 2 నుంచి రాష్ట్రవ్యాప్త పర్యటన

విజయవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు మరో పోరాటానికి సిద్ధమవుతున్నారు. వచ్చే నెల రెండు నుంచి రాష్ట్రవ్యాప్త యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. ఈ విషయాన్ని వారు విజయవాడలోని న్యాయవాది అబ్దుల్ సలీం ఇంటి వద్ద సోమవారం వెల్లడించారు. జైలు నుంచి శ్రీనివాసరావు విడుదలయ్యే వరకు పోరాటం చేస్తామని సావిత్రమ్మ, సుబ్బరాజు వెల్లడించారు. వచ్చే నెల రెండో తేదీన కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక గ్రామం నుంచి ఈ యాత్రను ప్రారంభిస్తామని ప్రకటించారు. "నా కుమారుడి కోసం 75 ఏళ్ల వయస్సులో ఆమరణ నిరాహార దీక్ష చేస్తే పోలీసులు భగ్నం చేశారు. నా కొడుకు మాత్రం విడుదల కాలేదు. శ్రీనివాసరావు విడుదలయ్యే వరకు పోరాటం చేస్తూనే ఉంటాను. ప్రతి గడపకూ వెళ్లి మాకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తాం. న్యాయమడుగుతాం. నేను చేస్తున్న పోరాటానికి ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధుల నుంచి మద్దతు లభిస్తోంది. ఈ వయస్సులో నన్ను చూసేవారు లేరు. నా కొడుకు శ్రీనివాసరావే దిక్కు. ఇప్పటికైనా సీఎం జగన్ కోర్టుకు హాజరై విశాఖ విమానాశ్రయంలో తనపై జరిగిన దాడి కేసులో సాక్ష్యం చెప్పాలి" అని సావిత్రమ్మ కోరారు.

బీసీలను భయపెడుతున్న వైసీపీ పాలన: కొల్లు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో బీసీలు భయపడుతున్నారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వేల మంది బీసీలపై జగన్ అక్రమ కేసులు పెట్టించారు. ఎంతో మంది బీసీలపై దాడులు, దౌర్జన్యాలు చేసినా ఆయనకు ఇంకా దాహం తీరలేదు. తాజాగా పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలో బంగారుపెంట గ్రామానికి చెందిన బీసీ మత్స్యకారుడు చెవిటి పల్లి దుర్గారావును పోలీసులు బెదిరించడంతోనే అతను ఆత్మహత్య చేసుకున్నాడు. బీసీ కార్పొరేషన్ నుంచి ఒక్క పైసా సాయం చేయలేదు. బీసీలకు హక్కుగా రావాల్సిన పథకాలన్నీ రద్దు చేశారు. పేద మత్స్యకారుడి మృతికి కారణమైన ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు' అని కొల్లు హెచ్చరించారు.

భీమిలి వైసీపీ సభకు పంపిన బస్సులెన్నో చెప్పండి: వర్ల

ఈ నెల 27న భీమునిపట్నం వైసీపీ సభకు సరఫరా చేసిన బస్సుల వివరాలివ్వాలంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ఏపీఎస్‌ఆర్‌టీసీ ఎండీకి లేఖ రాశారు. 'చెల్లింపులు చేయించుకుని అన్ని రాజకీయ పార్టీలకూ బస్సులను సరఫరా చేయడం అనేది గతంలో ఏపీఎస్‌ఆర్‌టీసీకి ఆనవాయితీగా ఉంది. అయితే ఇటీవల ఆర్‌టీసీ కేవలం వైసీపీకి మాత్రమే బస్సులు సరఫరా చేసి టీడీపీకి నిరాకరిస్తోంది. ఈ నెల 27న భీమిలీలో వైసీపీ నిర్వహించిన రాజకీయ సభకు భారీ సంఖ్యలో బస్సులు సరఫరా చేశారు. ఎన్ని బస్సులు సరఫరా చేశారు? అందుకోసం ఆ పార్టీ ఎంత చెల్లించింది? ఆ పార్టీకి చెందిన ఎవరు ఈ చెల్లింపులు చేశారు? వైసీపీకి సరఫరా చేసిన విధంగా టీడీపీకి ఎందుకు బస్సులు సరఫరా చేయలేదు? వివరాలు చెప్పండి' అని లేఖలో కోరారు.

పోలీసుల వేధింపులను ఆపండి

'డీజీపీ గారూ... మీ నాయకత్వంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయింది. పల్నాడు జిల్లా వెల్దుర్తిలో వైసీపీలో చేరమని పోలీసులు టీడీపీకి చెందిన మత్స్యకారుడ్ని కొడితే అతను ఆత్మహత్య చేసుకున్నాడు. మీరొస్తుంటే గంటలకొద్దీ ట్రాఫిక్ ఆపడం కాదు... పోలీసుల వేధింపులు ఆపండి, అమాయకులను కాపాడండి' అని వర్ల ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు.

వైసీపీకి కౌంట్‌డౌన్: ఆనంద్‌బాబు

మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు సోమవారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'వైసీపీకి కౌంట్‌డౌన్... సిద్ధం అంటూ జగన్ ప్రకటనలు ఓ వైపు, మేం సిద్ధంగా లేం అంటూ టికెట్లు తిరస్కరించి ఎంపీలు, ఎమ్మెల్యేల పరార్ మరో వైపు. దీన్నే ఓటమికి సిద్ధం అంటాడు వైఎస్ జగన్' అని వ్యాఖ్యానించారు.

బాబుకు పట్టిన గ్రహణాలు వీడిపోతున్నాయి: ఎమ్మెల్సీ అశోక్‌బాబు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చంద్రుడికి గ్రహణం వీడినట్లే బాబుకు కూడా గ్రహణాలు వీడిపోతున్నాయి అని ఎమ్మెల్సీ అశోక్‌బాబు అన్నారు. సోమవారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ' చంద్రబాబు మీద జగన్ పెట్టిన కేసులన్నీ గ్రహణాల మాదిరిగానే ఒక్కోటి వీడిపోతున్నాయి. హైకోర్టులో చీవాట్లు తినడం, సుప్రీం కోర్టుకు వెళ్లడం జగన్‌కు ఆనవాయితీగా మారింది. ప్రతి చిన్న కేసులో సుప్రీం కోర్టుకు వెళ్లే జగన్ తన కేసుల్లో ఎందుకు 3,000 వాయిదాలు తీసుకున్నారు? కోడికత్తి కేసులో ఐదేళ్లవుతున్నా నిందితుడికి బెయిల్ రాకపోవడానికి కారణం జగన్ కోర్టుకు వెళ్లి సాక్ష్యం చెప్పకపోవడమే' అని అశోక్‌బాబు అన్నారు.

మోదీ, జగన్‌లవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు: రామకృష్ణ

అమరావతి(ఆంధ్రజ్యోతి), ఒంగోలు, జనవరి 29: 'ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులపై జగన్, మోదీ ప్రభుత్వాలు బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నాయి. వాటిని తిప్పికొట్టడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'సీబీఐ, ఈడీ, సీఐడీ వంటి వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని స్వలాభాలకు వాడుకుంటూ వాటిని భ్రష్టు పట్టిస్తున్నాయి. తాను కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉంటానని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ చేసిన ప్రకటన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బ్లాక్ మెయిల్ రాజకీయాలకు అద్దం పడుతోంది. మాజీ సీఎం చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు జైల్లో నిర్బంధించడం వెనుక కూడా ఈ రెండు పార్టీల కుట్ర ఉంది. ఏపీకి ప్రత్యేక హోదా గురించి పార్లమెంటులో గట్టిగా నిలదీసినందుకే ఎంపీ జయదేవ్ వ్యాపార సంస్థలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడులు చేయించింది. మరోవైపు రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమర్‌రాజా బ్యాటరీస్ రాష్ట్రం నుంచి వెళ్లేవరకూ వేధించింది' అని రామకృష్ణ ఆరోపించారు.

ప్రత్యేక హోదాపై గళం విప్పినందుకే గల్లాపై ఈడీ దాడులు: సీపీఎం

పార్లమెంట్‌లో ప్రత్యేక హోదా కోసం గళం విప్పినందుకే గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్‌పై బీజేపీ కక్షపూరితంగా ఈడీని ప్రయోగించిందని సీపీఎం ఒక ప్రకటనలో మండిపడింది. 'బీజేపీ వత్తిడితోనే సీఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో జయదేవ్ కుటుంబానికి చెందిన పరిశ్రమలను బయటకు తరిమేసిందనే విషయం స్పష్టమవుతుంది. ఇప్పటికైనా టీడీపీతో పాటు ఇతర పార్టీలు ఈ వాస్తవాన్ని గుర్తించాలి' అని సీపీఎం ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

జేకే భారవికి వేటూరి కవితా పురస్కారం ప్రదానం



జేకే భారవిని వేటూరి పురస్కారంతో సత్కరించిన దృశ్యం

తుని రూరల్, జనవరి 29: వేటూరి సాహితీపీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా తునిలోని చిట్టూరి మెట్రోలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వేటూరి కవితా పురస్కారాన్ని సినీ రచయిత జేకే భారవికి ప్రదానం చేశారు. భారవి మాట్లాడుతూ వేటూరివారి పురస్కారాన్ని అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మ, ప్రధాన కార్యదర్శి విజయ్‌ప్రకాష్‌ల కృషి అభినందనీయమని వక్తలు కొనియాడారు.



టీటీడీ బడ్జెట్ వివరాలను వెల్లడిస్తున్న చైర్మన్ కరుణాకర రెడ్డి

శ్రీవారి భక్తులకు బంగారు మంగళసూత్రాలు

- 5, 10 గ్రాముల బరువుతో విక్రయించాలని టీటీడీ నిర్ణయం
- లక్ష్మీకాసులు కూడా....
- మతమార్పిళ్లకు అడ్డుకట్ట వేసేందుకే అని చైర్మన్ వెల్లడి
- రూ.5,141.74 కోట్ల అంచనాలతో టీటీడీ వార్షిక బడ్జెట్

తిరుమల, జనవరి29 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు బంగారు మంగళసూత్రాలు విక్రయించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. దర్మప్రచారంలో భాగంగా బంగారు మంగళసూత్రాలను తయారు చేసి, శ్రీవారిపాదాల వద్ద ఉంచి భక్తులకు విక్రయించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుమలలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో ధర్మారెడ్డి, కొంతమంది సభ్యులతో కలిసి కరుణాకర రెడ్డి మీడియాతో మాట్లాడారు. 5, 10 గ్రాముల బరువుతో దాదాపు నాలుగైదు డిజైన్లలో బంగారు మంగళసూత్రాల విక్రయాలు జరుగుతాయని, వీటితో పాటు లక్ష్మీకాసులను కూడా తయారు చేసి లాభాపేక్ష లేకుండా భక్తులకు విక్రయిస్తామన్నారు. గతంలో 32 వేల మందికి సామూహిక వివాహాలు జరిపినప్పుడు మంగళసూత్రాలను అందిస్తే ఏ ఒక్కరూ మతం మారలేదన్నారు. మత మార్పిళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి టీటీడీ వార్షిక బడ్జెట్ రూ.5,141.74 కోట్ల అంచనాలతో ఆమోదించినట్టు చైర్మన్ కరుణాకర రెడ్డి వెల్లడించారు. బడ్జెట్ ఆదాయాల్లో ప్రధానంగా హుండీ ద్వారా రూ.1,611 కోట్లు, పెట్టుబడుల ద్వారా వడ్డీ రూ.1,167 కోట్లు, ప్రసాదాల ద్వారా రూ.600 కోట్లు, దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.338 కోట్లు, తలనీలాల విక్రయం ద్వారా రూ.151.50 కోట్లు, ఆర్జితసేవల ద్వారా రూ.150 కోట్లు, అద్దెగదులు, కల్యాణమండపాల ద్వారా రూ.147 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసినట్టు తెలిపారు. అలాగే ఖర్చుల్లో ప్రధానంగా ఇంజనీరింగ్ పనులకు రూ.350 కోట్లు, మెటీరియల్ కొనుగోళ్లకు రూ.751 కోట్లు, కార్పస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు రూ.750 కోట్లతో అంచనా వేశామని వివరించారు.

మరికొన్ని నిర్ణయాలు

- టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 26 స్థానికాలయాలు, విలీనం చేసుకున్న 34 ఆలయాల్లో నూతన పోస్టులకోసం ప్రభుత్వ ఆమోదానికి పంపేందుకు నిర్ణయం. అనుబంధ ఆలయాల్లో 227 వేదపారాయణదారులు, అధ్యాపక, మేళం సిబ్బంది పోస్టులు, టీటీడీ విలీన ఆలయాల్లో 288 అర్చక, పరిచారిక, పోటు వర్కర్, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్, వేదపారాయణదారు, మేళం సిబ్బంది పోస్టులున్నాయి.
- తిరుమలలోని ఆకాశగంగ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా మార్చేందుకు రూ.30.71 కోట్లతో టెండరు ఆమోదం
- తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శ్రీపద్మావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్‌గా పేరు మార్పు
- నారాయణవనంలో అతి ప్రాచీనమైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి రాజగోపురం, రాతిప్రాకారం నిర్మాణానికి రూ.6.90 కోట్ల మంజూరు

ఓపీఎస్‌ను పార్టీలు మేనిఫెస్టోల్లో పెట్టాలి: ఎస్‌టీయూ

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామనే హామీని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోల్లో పొందుపరచాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కోరింది. అన్ని పార్టీలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న తెలిపారు.

టార్గెట్ 'ఏలూరి'!



- కొనసాగుతున్న వైసీపీ కక్ష సాధింపుల పర్వం
- టీడీపీ ఎమ్మెల్యే సాంబశివరావు లక్ష్యంగా పావులు
- ఓట్ల అక్రమాలపై పోరాడినందుకు కంటగింపు
- డైరీ ఆధారంగా ఎలాగైనా ఇరికించే ప్రయత్నాలు
- కేసు నమోదులో బాపట్ల పోలీసుల స్వామి భక్తి
- యథేచ్ఛగా కొనసాగుతున్న వ్యవస్థల దుర్వినియోగం

బాపట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలన్న దురాలోచనతో అధికార వైసీపీ ఆడుతున్న ఓట్ల ఆటపై టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అలుపెరగని పోరాటం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పర్చూరు నియోజకవర్గంలో ఫాం7ల విషయంలో జరిగిన అకవతవకలను ఎండగట్టారు. పలుమార్లు ఎన్నికల కమిషన్‌ను కలిసి పాలకపార్టీ కుట్రలను ఆధారాలతో సహా వివరించడమే ఆయన చేసిన మహాపరాధమైంది. అధికార వైసీపీ సర్కారు వేధింపుల పర్వానికి తెరలేపింది. వ్యవస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తూ ఎమ్మెల్యేతోపాటు ఆయన సంస్థలే లక్ష్యంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది.

అప్పుడే పోలీసులపై ఒత్తిళ్లు..

ఈ కేసులో ఎలాగైనా ఎమ్మెల్యే ఏలూరి పరపతి దెబ్బతీసే విధంగా చార్జ్‌షీట్ విచారణ సాగాలని వైసీపీ పెద్దలు కోరుకుంటున్నారు. ఇప్పటికే పోలీసులకు ఈ దిశగా కొన్ని సూచనలు కూడా వచ్చినట్లు తెలుస్తోంది. కేసు నమోదుకు లైన్ క్లియర్ అయినందువల్ల తదుపరి విచారణ మొత్తం అధికార పార్టీ కనుసన్నల్లోనే జరిగేలా పోలీసులపై ఒత్తిళ్లు మొదలయ్యాయని సమాచారం. కేసు నమోదులో భాగంగా వారికి నోటీసులిచ్చి వివరణ తీసుకునే ప్రక్రియను కూడా ప్రారంభం కానుంది. ఇంత వేగంగా పావులు కదపడం వెనక పాలకపార్టీ ఉద్దేశపూర్వక కుట్రలే ప్రధానంగా పనిచేశాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికార వైసీపీ గతంలో కూడా తమ నేత ఏలూరిని అనేక రకాలుగా ఇబ్బంది పెట్టిందని, లొంగకపోవడంతో అంతిమంగా కొండను తవ్వి ఎలుకను పట్టిన చందాన మెరిట్ లేని కేసును పట్టుకుందని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. కేసు నమోదుకు కోర్టు అనుమతివ్వడంతో తమ నేతను అరెస్టు చేస్తారనే భావిస్తున్నారు. నోటీసులు జారీచేయడం, వివరణ కోరడం ప్రక్రియలో భాగంగా జరగాలి. ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేని పక్షంలో మాత్రమే తదుపరి చర్యలకు ఉపక్రమించాలి. కానీ అధికార పెద్దల ఒత్తిళ్లు ఎక్కువగా ఉన్నందున ఇదంతా ఫాలో అవుతారా లేక వారి మెప్పు కోసం అరెస్టు నిర్ణయం తీసుకుంటారా అని టీడీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

తాజాగా గుంటూరు కార్యాలయంలో తనిఖీలు..

డీఆర్‌ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలెజెన్స్) విభాగం గుంటూరులోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కంపెనీ కార్యాలయాల్లో ఇటీవల జీఎస్‌టీకి సంబంధించి తనిఖీలు నిర్వహించింది. ఆ సోదాల్లో ఓ డైరీని అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అందులో ఎమ్మెల్యే కంపెనీ ప్రతినిధులు 2019 ఎన్నికలకు ముందు పర్చూరు నియోజకవర్గంలో ఓటర్లకు ఎలా డబ్బు పంపిణీ చేశారో వివరంగా ఉందనేది వారి అభియోగం. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాటి వివరాలతో డీఆర్‌ఐ విభాగం తదుపరి విచారణ కోసం బాపట్ల ఎస్పీ కార్యాలయానికి నివేదిక పంపింది. డైరీలోని వివరాలు ఇంకొల్లు సర్కిల్ పరిధిలోకి రానుండడంతో అక్కడి పోలీసులతో కేసు నమోదు కోసం పర్చూరు కోర్టులో పిటిషన్ వేయించారు. డీఆర్‌ఐ నుంచి నివేదిక వచ్చిందే తడవుగా బాపట్ల జిల్లా పోలీసులు స్వామిభక్తి చూపడం మొదలుపెట్టారు. వాస్తవానికి డీఆర్‌ఐ నివేదికలోని నిజానిజాలను విచారించాకే చార్జ్‌షీట్ అంకానికి వెళ్లాలి. అయినా ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయడానికి కోర్టు అనుమతి కోసం ఈ నెల 27న పర్చూరు కోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు సోమవారం సాయంత్రమే కేసు నమోదుకు అనుమతి ఇచ్చింది. దీంతో ఎమ్మెల్యే ఏలూరితో పాటు ఆయన సంస్థలో గతంలో పనిచేసిన మరో నలుగురిపైనా పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టనున్నారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర సదస్సులో నేతలు

తాడేపల్లి టౌన్, జనవరి 29 : వైసీపీ ప్రభుత్వం రజకులను తీవ్రంగా మోసం చేసిందని రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో సోమవారం రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ విధి విధానాలు రూపొందించకుండా, నిధులు బదిలీ చేయకుండా ప్రభుత్వం మిన్నకుండిపోయిందన్నారు. కార్పొరేషన్ వలన రజకులు ఏ ఒక్కరికి కూడా ప్రయోజనం చేకూరలేదన్నారు. బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు కేటాయించిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్‌కు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. సభకు రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభ అనంతరం గొల్లపూడిలోని కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించి, కార్పొరేషన్ ఎండీకి వినతిపత్రం అందించారు.

పంట ఉత్పత్తులు ఢమాల్

- నిరుడు కంటే సాగు తగ్గుదల
- మిర్చి మినహా వరి, అపరాలు, వాణిజ్య పంటలదీ అదే దారి

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది పంటల సాగు గణనీయంగా తగ్గి, ఉత్పత్తులు దారుణంగా పడిపోతున్నాయి. అర్థ గణాంక శాఖ తాజాగా విడుదల చేసిన రెండో ముందస్తు అంచనాల ప్రకారం 2022-23 కంటే 2023-24లో ఆహార ధాన్యాల ఉత్పత్తి బాగా తగ్గనుంది. ఖరీఫ్, రబీ కలిపి నిరుడు వరి సాగు 22.50 లక్షల హెక్టార్లలో జరగ్గా, ఈ ఏడాది 19.70లక్షల హెక్టార్లకే పరిమితమవుతోంది. దీంతో గతేడాది కోటీ33లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఈ ఏడాది రెండు సీజన్లు కలిపి కోటీ 18లక్షల టన్నులే ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. దీంతో 15లక్షల టన్నులపైగా ఉత్పత్తి తగ్గనుంది. తృణ, చిరుధాన్యాల పంటలు నిరుడు 27.60లక్షల హెక్టార్లలో సాగయి, కోటీ 57లక్షల టన్నుల ఉత్పత్తి కాగా, ఈ ఏడాది 24.42లక్షల హెక్టార్ల సాగుతో కోటీ 44లక్షల టన్నులే వస్తుందని అంచనా. అపరాలు నిరుడు 11.99లక్షల హెక్టార్ల సాగుతో 1148లక్షల టన్నుల ఉత్పత్తి రాగా, ఈ ఏడాది 9.63లక్షల హెక్టార్ల సాగుతో కోటి టన్నులే వస్తుందని అంచనా. వేరుశనగ సహా నూనెగింజల సాగు నిరుడు 7.86లక్షల హెక్టార్లతో 24.56లక్షల టన్నులు రాగా, ఈ ఏడాది 5.10లక్షల హెక్టార్లతో 27.46లక్షల టన్నులే వస్తుందని అంచనా. కానీ ఈ ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం, సీజన్ చివరిలో తుపాన్‌తో పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు నూనె గింజల సాగు తగ్గినా ఉత్పత్తి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. గతేడాది పత్తి 6.95లక్షల హెక్టార్లతో 18.84 లక్షల టన్నులు రాగా, ఈ ఏడాది 4.27లక్షల హెక్టార్లతో 11.58లక్షల టన్నులకే పరిమితం కానుంది. చెరకు నిరుడు 39వేల హెక్టార్లతో 30.43లక్షల టన్నుల ఉత్పత్తి రాగా, ఈ ఏడాది 27వేల హెక్టార్లతో 20.61లక్షల టన్నులు వస్తుందని అంచనా. మిర్చి నిరుడు 2.48లక్షల హెక్టార్లలో 9.45లక్షల టన్నులు రాగా, ఈ ఏడాది 2.65లక్షల హెక్టార్లలో 11.45 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేసింది.

కీచక హెచ్‌ఎం అరెస్టు...సస్పెన్షన్

అత్తిలి, జనవరి 29 : అభం, శుభం తెలియని చిన్నారులపై ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం బల్లిపాడులో సోమవారం వెలుగులోకి వచ్చింది. బల్లిపాడు నంబర్-2 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మోపిదేవి శ్రీనివాస్ నెహ్రూ కొంత కాలంగా 4, 5 తరగతులు చదువుతున్న 9 మంది విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. నాల్గో తరగతి విద్యార్థిని సోమవారం కుటుంబీకులకు విషయం తెలపడంతో స్థానికులు పాఠశాలను ముట్టడించారు. ఎంఈవో రమేష్ విచారణ చేపట్టడంతో పలువురు విద్యార్థినులు తమపై కూడా అసభ్యంగా ప్రవర్తించాడని తెలపగా... ఆయన నివేదికను డీఈవోకు పంపారు. కాగా, నిందితుడిని కఠినంగా శిక్షించాలని స్థానికులు అత్తిలి పోలీస్ స్టేషన్ ఎదుట రాస్తారోకో చేశారు. డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్ సంఘటనా స్థలికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. నిందితుడిపై పోక్సో, అట్రాసిటీ తదితర కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో వెంకటరమణ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో రమేష్ తెలిపారు.

చిన్నారిపై లైంగిక దాడి కేసులో నిందితునికి 20 ఏళ్లు జైలు

విశాఖపట్నం (లీగల్) జనవరి 29: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారిణి జి.ఆనందిని సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు అదనంగా జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ కథనం ప్రకారం.... 2020 నవంబరు 20వ తేదీన పాతగాజువాకకు చెందిన దిమిలి సతీష్..అదే ప్రాంతానికి చెందిన బాలిక (7)ను మాయమాటలతో మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలిసి బాలిక తల్లి అదేరోజు సాయంత్రం గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. బాధిత బాలికకు నాలుగు లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని న్యాయాధికారిణి ప్రభుత్వాన్ని ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పల్టీపుత్రుడు

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ని గిట్టనివారంతా 'పాటలీపుత్రం పల్టీపుత్రుడు' అంటారు గానీ, ఆయన దగ్గర ఏదో సమ్మోహన శక్తి ఉంది. ఆయన ఫిరాయించినప్పుడల్లా కూటములు ప్రేమగా కౌగలించుకుంటాయి, అప్పటివరకూ శత్రువుగా చూసిన పార్టీలు జతచేరతాయి. ఆయన అసలు రంగు ఏమిటోగానీ, ఎప్పటిలాగానే ఆయన మళ్ళీ రంగు మార్చాడు. బీజేపీతో చేయికలిపి, ఎన్డీయే తీర్థం తీసుకొని తొమ్మిదోసారి బిహార్ ముఖ్యమంత్రి అయ్యారు. పదేళ్ళలో ఐదోసారి గోడదూకిన ఆయనను ఊసరవెల్లితో పోల్చుతున్నారు కొందరు. కానీ, నితీశ్‌కు తలుపులు మూసేశామని, ఎప్పటికీ అవి తెరుచుకోవని స్వయంగా అమిత్‌షాయే అప్పట్లో ప్రకటించారు. ఎవరికీ ఎప్పటికీ శాశ్వతంగా తలుపులు మూతబడి ఉండవని బిహార్ బీజేపీ నాయకులు రెండురోజుల క్రితమే ఆ వ్యాఖ్యను సరిదిద్దారు.

చావనైనా చస్తాను కానీ, మళ్ళీ బీజేపీతో చేయికలపను అని నితీశ్‌కుమార్ రెండునెలలక్రితం చేసిన వ్యాఖ్య కూడా ఇప్పుడు చాలామందికి గుర్తుకొస్తోంది. ఇప్పుడు బీజేపీతో చేయికలపడం ద్వారా రాజకీయంగా ఆయనకు జరిగేది కూడా ఇదేనని కొందరి వాదన. మహాగఠ్బంధనంలో ఉండగా బీజేపీమీద ఆయన చేయని వ్యాఖ్యలేదు, యుద్ధం లేదు. విపక్షనాయకుల్లో అంతకఠినంగా కమలాన్ని చిత్రవధచేసిన నాయకుడు కూడా ఎవరూ ఉండకపోవచ్చు. ఆ మాటలన్నీ ఏట్లోపారేసి ఆయన వచ్చాడు సరే, బీజేపీ మళ్ళీ ఎందుకు ఆలింగనం చేసుకుంది? అన్నది ప్రశ్న. 'ఇండియా' కూటమిలో ఆయనకు సముచితస్థానం దక్కలేదని, కూటమి పెద్దగా ఆయన పేరు రాకుండా కాంగ్రెస్ కుట్రపన్నిందని నితీశ్ మద్దతుదారులు అంటున్నారు. అవినీతికి మారుపేరైన ఆర్జేడీతో అధికారం పంచుకోవడం వల్ల తమ సుశాసన్‌బాబుకు చెడ్డపేరు వస్తున్నదని, లాలూ కుమారులు ఇద్దరూ చక్రం తిప్పుతున్నారని, ముఖ్యమంత్రికి తెలియకుండా నిర్ణయాలు జరిగిపోతున్నాయని, ఇది నితీశ్‌కు అవమానకరంగా ఉన్నదని వారివాదన. ఇప్పుడు బీజేపీతో చేయికలిపి నితీశ్ మరింత స్వేచ్ఛగా ఉండగలరా? చిరాగ్ పాశ్వాన్‌తో కలిసి తన ఓట్లకు బీజేపీ చిల్లుబెడుతోందని గతంలో విమర్శించిన నితీశ్ ఇప్పుడు ఆయనతోనే కలిసి పనిచేయబోతున్నారు. తనకు వెన్నుపోటు పొడిచిన జితిన్‌రామ్ మాంఝీ కూడా మరోపక్కన ఉన్నాడు. లోక్‌సభ ఎన్నికల్లో తగినన్ని స్థానాలు సాధించడానికి బిహార్ బీజేపీకి అవసరం. నలభైస్థానాలున్న బిహార్‌లోనే కాదు, ఎనభైస్థానాలున్న యూపీలోనూ ఓబీసీలు, దళితుల్లోని నిమ్నవర్గాల ఓట్లను దృష్టిలో పెట్టుకొని నితీశ్‌ను ఆలింగనం చేసుకుంది. గోడ గెంతడానికి ఇండియా కూటమినో, ఆర్జేడీనో నితీశ్ తిట్టిపోయవచ్చు గానీ, ఇప్పుడు ఆయన పదవి పూర్తిగా బీజేపీ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడివుంది. తెప్పతగలేయడంలోనూ, షిండేలను సృష్టించడంలోనూ ఆ పార్టీ నాలుగాకులు ఎక్కువే చదివింది. లోక్‌సభ ఎన్నికల్లో తన అవసరం తీరిపోయాక నితీశ్‌ను ముఖ్యమంత్రిగా కొనసాగించవలసిన అవసరం దానికి లేదు. 2025 బిహార్ ఎన్నికలవరకూ తనపార్టీ ముఖ్యమంత్రికోసం ఎదురుచూడాల్సిన గతి దానికి పట్టలేదు.

నూటయాభైస్థానాలనుంచి క్రమంగా యాభైస్థానాలకు పడిపోయి, గత అసెంబ్లీ ఎన్నికల తరువాత రాష్ట్రంలో మూడవ రాజకీయశక్తిగా మిగిలిపోయిన నితీశ్ పార్టీ ఈ గోడదూకుడు తరువాత మెరుగుపడుతుందా? ఎన్డీయే లాభపడుతుందేమో కానీ, నితీశ్ పార్టీ మరింత శుష్కించవచ్చునని కొందరి జోస్యం. ఆయన నిష్క్రమణతో ఇండియా కూటమి పరువుపోయింది. పర్యటనలతో సమావేశాలతో విపక్షాలను గుదిగుచ్చి కూటమికి కాస్తంత ఊపునిచ్చిన ఆయన దానికి దూరంకావడం బీజేపీకి ముఖ్యం. ఇండియా కూటమి సైద్ధాంతికంగా ఎంత బలహీనమైనదో, ఆయా ప్రాంతీయపార్టీల నాయకులు ఎంతటి స్వార్థపరులో, తమ రాజకీయ మనుగడకోసం వెన్నుపోట్లకు సైతం ఎలా సిద్ధపడతారో నితీశ్ ఉదాహరణగా నిరూపించవచ్చు. నాలుగుసార్లు భేటీ అయి, నితీశ్‌తో వేదిక పంచుకున్నప్పటికీ కాంగ్రెస్ ఆయనను పూర్తిగా నమ్మలేదని ఇటీవలి దాని చర్యలు చెబుతున్నాయి. అయినా, కూటమికి తగిలిన ఈ పెద్ద ఎదురుదెబ్బనీ, ఆ పాపాన్ని భరించకతప్పదు. లాలూపార్టీ నితీశ్‌ను ఎందుకు, ఏ పరిస్థితుల్లో నమ్మిందో, నమ్మినట్టు నటించిందో తెలియదు కానీ, ఇప్పుడు దానికి నితీశ్ భారం తొలగిపోయింది. మిగతా సగం కాలమైనా నేరుగా ఏలాలన్న దాని ఆశ నెరవేరలేదు కానీ, గత ఎన్నికల్లో అత్యధికస్థానాలు గెలుచుకున్న ఆ పార్టీ తన మిత్రులతో కలిసి బలంగా పోరాడవచ్చు. ప్రజలు పాపపుణ్యాలను నిర్ణయిస్తారు, గుణపాఠాలూ నేర్పుతారు.

కర్పూరీ బాటలో మోదీ

నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ప్రతి ఏడాదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తున్న 'పద్మ' పురస్కారాలకు వన్నె లభిస్తోంది. సమాజానికి అనితరమైన సేవలు చేస్తున్న, నిత్యం ప్రజల మధ్య గడుపుతున్న అణగారిన వర్గాలకు చెందిన వారైనప్పటికీ తలెత్తుకుని జీవిస్తున్న ఎందరో గుర్తింపు పొందని మహానుభావులకు 'పద్మ' పురస్కారాలు లభిస్తున్నాయి. వీరితో ఏదీ ఆశించకుండా నిస్వార్థంగా ప్రజలకు తమ వంతు సేవలు చేస్తున్న వివిధ రంగాల ప్రముఖులనూ ప్రభుత్వం గుర్తిస్తోంది. పురుషస్వామ్య సమాజంలో అన్ని ఆటుపోట్లను తట్టుకుని మహిళా సాధికారికతకు నిజమైన సంకేతంగా నిలుస్తున్న స్త్రీమూర్తులను కూడా మోదీ ప్రభుత్వం గౌరవిస్తోంది. మహిళ అయినప్పటికీ మావటి వృత్తిని చేపట్టి మహా గజేంద్రాన్ని లొంగదీసుకోగల అస్సాంకు చెందిన పర్బతి బారువా, మావోయిస్టుల దురాగతాలను పట్టించుకోకుండా ఛత్తీస్‌గఢ్‌లో అణగారిన బిర్హోర్, పహాడీ కోర్వా ఆదివాసీల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన జాగేశ్వర్ యాదవ్, హర్యానాలో




■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

నిరాశ్రయులు, అనాథలు, మహిళలు, దివ్యాంగుల జీవితాలను మెరుగుపరిచేందుకు తోడ్పడుతున్న గుర్విందర్ సింగ్, దుఖు మాజీ, దక్షిణ అండమాన్‌లో సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసిన కె. చెల్లమ్మ, అరుణాచల్‌ప్రదేశ్‌లో మూలికా వైద్యంలో నైపుణ్యం సంపాదించి పదివేల మందికి వైద్య చికిత్సనందించిన యానుంగ్ జామో లెగో, కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా జెను కురుబా ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న సోమన్న, మహారాష్ట్రలో అంతర్జాతీయ మల్లకంభం క్రీడను పునరుద్ధరించి శిక్షణను అందిస్తున్న ఉదయ్ విశ్వనాథ దేశ పాండే, బిహార్‌లో సామాజిక అస్పృశ్యతను అధిగమించి, గోండా చిత్రకళకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చి అనేక దేశాల్లో ప్రదర్శనలు జరిపిన దుసద్ జాతికి చెందిన భార్యాభర్తలు శాంతిదేవి పశ్వాన్, శివన్ పశ్వాన్‌తో పాటు అనేకమంది కళాకారులు, విద్వాంసులు ఈ ఏడాది భారత ప్రభుత్వ ఉన్నత పురస్కారాలకు ఎంపికయ్యారు. నిత్యం ప్రజల మధ్య గడిపే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పద్మవిభూషణ్ లభించడం ఆయన కీర్తికిరీటంలో మరో కలికితురాయి.

కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో 'పద్మ' పురస్కారాలంటే పైరవీకార్లు, అస్మదీయులను అందలమెక్కించడమనే ప్రచారం ఉండేది. దానివల్ల 'పద్మ' పురస్కారాల విలువ తగ్గింది. కాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పురస్కారాల విలువను పెంచారు. ఈ ఏడాది బిహార్‌కు చెందిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం కూడా ఇలాంటిదే. ఠాకూర్–నాయీ వంటి అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన కర్పూరీ ఠాకూర్ మరణించి 36 సంవత్సరాలైనప్పటికీ ఈ దేశంలో సామాజిక న్యాయానికి నాంది పలికిన నేత అన్న విషయాన్ని ప్రధానమంత్రి మరిచిపోలేదు. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ గురించి తొలుత ఆలోచించింది కర్పూరీ ఠాకూరే. తాను నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన విషయం అడుగడుగునా గుర్తించి, బలహీనవర్గాల పరిస్థితి ఎంతో దుర్భరంగా ఉన్న సమయంలో వారి గురించి ఆలోచించి సాహసోపేత చర్యలను చేపట్టిన కర్పూరీ ఠాకూర్ భారత రాజకీయాలకు చేసినంత సేవ మరే నాయకుడూ చేపట్టలేదు. ఆయన ఆదర్శాల ఆధారంగానే తాను తన ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నట్లు మోదీ బహిరంగంగా ప్రకటించారు. ఇవాళ వెనుకబడిన వర్గాలకు తాము పరిరక్షకులమని, కుల జనగణన చేపట్టి వారిని ఉద్ధరిస్తామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు తమ ఆరు దశాబ్దాల పాలనలో కర్పూరీ ఠాకూర్‌ను ఎందుకు మరిచిపోయారు? కర్పూరీ ఠాకూర్ వల్ల రాజకీయాల్లో పైకి ఎదిగి, తాము వారి శిష్యులమని చెప్పుకుని కీలక పదవులు చేపట్టి, చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకుంటున్న నేతలు ఆయనను ఎందుకు గౌరవించలేదు?



వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ గురించి తొలుత ఆలోచించింది కర్పూరీ ఠాకూరే. ఆయన ఆదర్శాల ఆధారంగానే తాను ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నట్లు మోదీ బహిరంగంగా ప్రకటించారు. ఇవాళ వెనుకబడిన వర్గాలకు తాము పరిరక్షకులమని, కుల జనగణన చేపట్టి వారిని ఉద్ధరిస్తామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు తమ ఆరు దశాబ్దాల పాలనలో కర్పూరీ ఠాకూర్‌ను ఎందుకు మరిచిపోయారు?

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సమాజంలో తీవ్రంగా వెనుకబడిన వర్గాల గురించి యోచిస్తోంది. బిహార్, యూపీ లాంటి రాష్ట్రాల్లో ఆ వర్గాల్లో రాజ్యాధికారం లభించని వెనుకబడిన వర్గాల నేతలను బీజేపీ అక్కున చేర్చుకుంది. బిహార్‌లో కుల జనగణన జరిపి 36 శాతం అత్యంత వెనుకబడిన వర్గాల వారే ఉన్నారని తేల్చారు. కాని ఆ రాష్ట్రంలో గత కొన్ని దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాల్లో కొందరు మాత్రమే అధికంగా ప్రయోజనం పొందారు. రిజర్వేషన్ వ్యవస్థ సామాజిక న్యాయం కొంతవరకు మాత్రమే చేయగలదు. కాని వారికి రిజర్వేషన్ మాత్రమే కాకుండా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉన్నదని మోదీ మాత్రమే గుర్తించారు. ఎందుకంటే ఆయన కూడా కర్పూరీ ఠాకూర్ లాగా అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకుడు. వెనుకబడిన వర్గాలు చదువుకోవడం ద్వారానే వారు జీవితంలో పైకి ఎదగగలరని కర్పూరీ ఠాకూర్ భావించారు. మాతృభాషలోనే వారు చదువుకునేందుకు ప్రోత్సాహం కల్పించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కూడా పరోక్షంగా ఆయన రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. వెనుకబడిన వర్గాలకే కాక, షెడ్యూల్డు కులాలు, ఆదివాసీలకు కూడా ఆయన చేయూతనిచ్చారు. మహిళలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కూడా తొలుత రిజర్వేషన్ కల్పించింది ఆయనే. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ దిశగా అనేక చర్యలు చేపట్టారు. అనేకమంది ఓబీసీ నేతలను ముఖ్యమంత్రి పదవుల్లో నియమించారు.

అంతేకాదు కర్పూరీ ఠాకూర్ ఈ దేశ రాజకీయాల్లో బలహీనవర్గాలకు కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాన్ని గుర్తించి తిరుగుబాటు చేసిన తొలి తరం నాయకుల్లో ఒకరు. తొలుత సోషలిస్టు పార్టీ నుంచి, తర్వాత జనతా పార్టీ నుంచి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. రెండుసార్లూ ఆయనను ముఖ్యమంత్రి చేసిన సంయుక్త విధాయక్ దళ్‌కూ, జనతా పార్టీకి బీజేపీ పూర్వరూపమైన జనసంఘ్ మద్దతునిచ్చింది. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించిన తర్వాత, ఆయన అండదండలతో నాయకులైన వారు నిర్విణ్ణులయ్యారు. కర్పూరీ ఠాకూర్ నా రాజకీయ సైద్ధాంతిక గురువు. ఆయనకు భారతరత్న ఎప్పుడో రావాల్సి ఉంది.. అని అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన ఆర్‌జేడీ నేత లాలూప్రసాద్ యాదవ్ అన్నారు. సామాజిక న్యాయానికి కాగడా చూపిన జననాయకుడు కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, బీజేపీకి కృతజ్ఞతలు చెబుతున్నాను. ఆయనకు కాంగ్రెస్ హయాంలో భారతరత్న రాలేదు.. అని జేడీ(యు) నేత ప్రస్తుత ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ అన్నారు. మరి లాలూప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్.. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఎందుకు ఇప్పించలేకపోయారు? తాను యూపీఏ హయాంలో నాలుగుసార్లు కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వాలని లేఖ రాశానని ప్రకటించిన నితీష్‌కుమార్ ఇప్పుడు కాంగ్రెస్, ఆర్జేడీలతో చేతులు కలిపినందుకు పశ్చాత్తాపపడి ఆ పార్టీల దుష్ట కౌగిలి నుంచి తప్పించుకొని మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. దేశంలో ఇలా చాలామంది నేతలకు జ్ఞానోదయం కలుగుతోంది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

ప్రజాస్వామ్య దేవుడు కాదు, రాముడే సర్వోన్నతుడు!

అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ. భారతావని అంతా రామమయం. కాషాయ జెండాలు రెపలాడుతూ కనిపించాయి, రాముడు, నరేంద్రమోదీ, స్థానిక బీజేపీ నాయకుల చిత్రాలతో పోస్టర్లు ఎల్లెడలా వెలిశాయి. జై శ్రీరామ్ నినాదాలు మిన్నంటాయి. భారతదేశ చరిత్రలో ఇదొక విలక్షణ సందర్భం. దానితో పూర్తిగా మమేకమైనవారు లేదా విభేదించే వారి సంగతి అలా ఉంచి, ఒక భిన్న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురించి ప్రస్తావిస్తాను. జీవితం, సంప్రదాయం, మనుగడ గురించి నాకు విలువైన విషయాలు నేర్పిన ఆ ప్రాణప్రతిష్ఠ 49 ఏళ్లక్రితం ఆంధ్రప్రదేశ్‌లోని ఒక కుగ్రామంలో జరిగింది.

జూలై 1975 మా అమ్మ సినీనటి జమున, మా నాన్న విజయవాడ సమీపంలోని దుగ్గిరాల గ్రామానికి తమ ఆర్థిక సహకారంతో నిర్మించిన నవగ్రహ ఆలయం ప్రాణప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొనేందుకు అక్కడకు వెళ్లారు. నన్నూ తీసుకువెళ్లారు. పిల్లవాడిని కావడంతో అది నాకు జ్ఞాపకం కూడా లేదు. కానీ, కొద్ది రోజుల క్రితం నేను మళ్లీ దుగ్గిరాలకు నా కుటుంబంతో వెళ్లాను. దివంగతురాలైన మా అమ్మ బాల్య స్నేహితురాలని పలుకరించి, ఆమెకు నా కుటుంబాన్ని చూపించడానికి. అమ్మ చదువుకున్న స్కూలు, ఉన్న ఇల్లుతో పాటు ఆ నవగ్రహ ఆలయాన్ని కూడా మేం సందర్శించాం. ఆలయ కుడ్యం పక్కన శిలాఫలకంపై మా తల్లిదండ్రుల పేర్లు ఇప్పటికీ ఉన్నాయి. ఇతర దాతలు తమ వంతు విరాళాలు ఇవ్వకపోతే ఆ సొమ్మును మా తల్లిదండ్రులే ఇచ్చి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయించారని మా అమ్మ బాల్య స్నేహితురాలు చెప్పారు. మా అమ్మానాన్న అభ్యుదయ ఆలోచనాపరులా కాదా అన్నది నాకు ఇదమిత్థంగా తెలియదు. బహుశా కాకపోవచ్చు. అయితే దుగ్గిరాల పట్ల తమ అభిమానాన్ని చాటుకునేందుకు ఆ గ్రామ జీవితంలో అంతర్భాగమైన ఒక కార్యాన్ని వారు నిర్వర్తించారు. మరి, ఆస్పత్రులు, పాఠశాలలు, పరికరాల మాటేమిటి? అటువంటి లౌకికసేవల్లో కూడా అమ్మ ఎంతోకొంత చేయివేసింది. ఆమె బాల్య స్నేహితురాలు అవన్నీ చేసి, ప్రస్తుతం ఒక ధాన్యకేంద్రాన్ని కూడా నిర్మిస్తున్నారు.



పీడకులు, పేచీకోరు పాలకులు, మూర్ఖులు, నియంతలు, ఉన్మాదులు వస్తారు పోతారు. అయితే మాతృమూర్తులు తమ బిడ్డల శ్రేయస్సుకోసం నవగ్రహ పూజలు ఎప్పటికీ నిర్వహిస్తూనే ఉంటారు. తండ్రి ఇరుముడితో శబరిమల మెట్లు ఎక్కుతూనే ఉంటాడు. మీ రాజ్యాంగం, మీ ప్రజాస్వామ్యం, మీ పవిత్ర గంథం–ఇవేవీ మా రాముడిని మించి సమున్నతమైనవి కావు.

వ్యక్తుల ఉదారత, వితరణ శీలత, మానవత దృక్పథాన్ని నేను గౌరవిస్తాను, అభిమానిస్తాను. అయితే మన ఆధునిక సంవేదనలు, 'శాస్త్రీయ దృష్టి' ఎందుకు మనలను ఆలయాలు నిర్మించేవారిని, ఆరాధనలకు, ప్రాణప్రతిష్ఠలకు నిధులు సమకూర్చేవారిని తిరోగామిశక్తులుగా, అవన్నీ నిరుపయోగమైన పనులుగా ఎందుకు చూస్తున్నాయి? దుగ్గిరాల ఆలయాన్ని, నా తల్లిదండ్రులు అందించిన సహాయాన్ని ఆచరణాత్మక దృక్కోణం నుంచి చూస్తే, ఆ కోవెల వేలాది ప్రజల జీవితాలకు కేంద్రంగా ఉంది. నిరుద్యోగులు తమకు ఉద్యోగం వచ్చేలా చూడాలని ఒక గ్రహాన్ని పూజిస్తారు. దీర్ఘకాలిక రుజాగ్రస్తులు ఉపశమనం కోసం మరో గ్రహానికి నైవేద్యం సమర్పిస్తారు; యువ దంపతులు మంచి బిడ్డలకోసం ప్రార్థిస్తారు. దైవాలు, గ్రహాలు (విజ్ఞాన శాస్త్రం కూడా) తమ కోరికలు నెరవేరేందుకు తోడ్పడతాయన్నది వారి నమ్మకం. మా అమ్మా నాన్నా 1975లో కేవలం ప్రాణ ప్రతిష్ఠ కోసమే అంతదూరం వెళ్లారు. మా అమ్మ స్నేహితురాలు అదే విషయాన్ని నొక్కి చెప్పారు. నా తల్లిదండ్రులు ఇప్పుడు లేకపోవచ్చు కానీ, క్రతువులు, విగ్రహాల రూపంలో వారి దృఢ విశ్వాసం ఒక కొండలా నిలిచిపోయింది. ఒక దైవ సంకల్పపు దృఢత్వాన్నీ సంతరించుకున్నది. మన ముందుతరాల్లో జీవించిన వ్యక్తుల జీవితాలూ, వారు నిర్వర్తించిన కార్యాలూ తరం తరం మనకు సంక్రమిస్తూ వస్తాయి. అందుకే మన కుటుంబ పూర్వీకులను, మనలను కన్న ఊరిలో ఎన్నో నిండు జీవితం జీవించి వెళ్లిపోయిన వారిని గుర్తు చేసుకుంటాం. మన బతుకుపోరులో వారినుంచి స్ఫూర్తి పొందుతాం. వ్యక్తులలానే సమాజాలూ, దేశాలూ, జాతులూ, నాగరికతలూనూ.

చెప్పవచ్చిన దేమిటంటే, మన జాతి, నాగరికత ఇప్పుడు అదే విధమైన భావోద్వేగంలో ఉన్నది. ఒక విలక్షణ స్ఫూర్తిని ఆవాహన చేసుకొంటూ, వర్తమాన సమస్యలను అధిగమించేందుకు అయోధ్యలో నిర్మించిన భవ్య రామమందిరంతో శక్తిని పొందుతోంది. పరిపూర్ణ ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తును ఆవాహన చేసుకొంటోంది. వ్యక్తుల జీవితాలతో పోల్చినప్పుడు ఒక జాతి జీవనం సువిశాలమైనది. అనంత విషయాలు అందులో మిళితమై ఉంటాయి. ఈ దృష్ట్యా ఇప్పుడు మనలను ఒక కొత్త శక్తి చైతన్యీకరిస్తున్నది.

ఇక, రామమందిర నిర్మాణంతో కొందరికి రాజకీయప్రయోజనాలు దక్కలేదా? అనే ధర్మ సందేహం మీ మనసులను తొలిచివేస్తుందా? ఈ రోజుల్లో రాజకీయ ప్రయోజనాల కోసం బహిరంగ ప్రదేశాలలో విగ్రహ ప్రతిష్ఠలు జరపనిదెవరు? మిమ్ములను విభ్రాంతపరిచే స్థాయిలో స్మారకాలను నిర్మించనిదెవరు?

గత కొద్ది రోజులుగా తెలుగు భూమిలోని పలు ప్రఖ్యాత దేవాలయాలను నేను సందర్శించాను. తెలుగు ప్రజల్లో దైవ భక్తికి కొదవలేదు. నేను వెళ్లిన ప్రతీ చోటా అశేష భక్త జనసందోహాన్ని చూశాను. వారిలో 'కులీన' వ్యక్తులు తక్కువ. అందరూ ముక్తకంఠంతో దైవస్తుతి చేశారు, గీతాలు ఆలపించారు, ఆనంద పారవశ్యంలో ఓలలాడుతూ సెల్ఫీలూ తీసుకున్నారు. విజయవాడకు సమీపంలో ఉన్న ప్రాచీన ఉండవల్లి గుహల ముందు ఒక యువకుడు కాషాయ జెండాను ఆ చివర నుంచి ఈ చివరకు ఊపుతూ 'జైశ్రీరామ్' అని నినదిస్తున్నాడు. నేను ఆ జెండా తీసుకొని అటూ ఇటూ తిప్పుతూంటే ఆ కుర్రాడు వీడియో తీశాడు. 'ఊహాత్మక జనసమూహాలు'? 'గుంపుల భ్రాంతి?' కావచ్చు కానీ సామాజిక శాస్త్రాల భావనలు, సిద్ధాంతాలు వస్తాయి, పోతాయి. వాటికి ఆవల, వాటన్నిటికీ అతీతంగా వేల్పులు నిశ్చలంగా నిలబడి వుంటారు. వారి ఉనికి సుస్థిరమైనది, స్ఫూర్తిమంతమైనది.

పుణ్యక్షేత్రాలు, పవిత్ర స్థలాలు తరతరాల జ్ఞాపకాలు. ప్రకృతికి సంబంధించిన గౌరవనీయమైన స్థలాలు. ఇటీవల ఓ అమెరికన్ ట్విట్టర్‌లో పాశ్చాత్య యువత 'ప్రకృతి'ని అధ్యయనం చేయడం లేదని, 'పర్యావరణం' గురించే మాట్లాడుతున్నారని ఓ వ్యాఖ్యచేశారు. ప్రకృతి అనే పదానికి ఉన్న సున్నితమైన అర్థాలు, అంతరార్థాలను విస్మరించి, దానిని ఒక నిరింద్రియ, 'యంత్రం'లాంటి వ్యవస్థగా మాత్రమే చూస్తున్నారు.

ఒకదేశపు ప్రత్యేకతను, సహజ కాల పవిత్రతను దేశీయ లేదా మూలవాసీ సంస్కృతులు మరిచిపోవు. శాస్త్రీయ దృష్టిని అలవరచుకోవాలని తొందరపెట్టే వారు ముహూర్తం, వాస్తును పరిహసించడం పరిపాటి. అయితే క్రూర ఏకేశ్వరోపాసన సంప్రదాయాలు విస్తరించకముందు యావత్ప్రపంచమూ అనుసరించిన పద్ధతులు అవి. ఇప్పుడు మనలను ఆవహించిన రామభక్తి అంతకంతకూ అంతరించిపోతున్న ఆ పురాతన జ్ఞాపకాన్ని మళ్లీ మన మనస్సుల్లో నింపుకోవాలనే ఆరాటమే. ఎందుకు ఆ తమకం? ఎందుకంటే మనం ఇప్పుడు ఒక విద్వారమైన, అనాగరికమైన- సాంస్కృతికంగా పర్యావరణ పరంగా ఒక విషపూరిత ఆధునికీకరణ దశలో ఉన్నాం. మనం లేదా కనీసం మన కులీనవర్గాలు వేల్పుల విగ్రహ భంజనం, మానవుల ఆరాధనా కార్యకలాపాలతో ఉన్నారు.

ఆసేతు శీతాచలం దైవ ఉన్మాదం ఆవహించి ఉన్న సమయంలో నేను ఈ విషయాన్ని ఎందుకు చెబుతున్నాను? గత కొద్దిరోజులుగా నేను వెళ్లిన ప్రతి గ్రామంలోను మిక్కిలిగా కనిపించిన విగ్రహాలు సంప్రదాయ వేల్పులవి కావు, అవి నేటి లేదా నిన్న మొన్నటి రాజకీయ నాయకులవే. నా తల్లిదండ్రులు ప్రతిష్ఠించిన నవగ్రహ ఆలయం ప్రహరీ గోడ ఆవల నుంచి గాంధీ విగ్రహం కనిపిస్తోంది. పక్కన మరో నాయకుని విగ్రహమున్నది. ఆ ప్రాంతంలోని ప్రతిపల్లెలోను రాజశేఖరరెడ్డి, ఎన్‌టి రామారావు విగ్రహాలున్నాయి. అంబేడ్కర్ విగ్రహాలూ పెద్దసంఖ్యలో కనిపించాయి. గుజరాత్‌లో ప్రతిష్ఠించిన సర్దార్ పటేల్ విగ్రహాన్ని నేను ఇంకా చూడలేదు కానీ, హైదరాబాద్‌లోని నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని చూశాను. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్నీ చూశాను. ఆ విగ్రహ ప్రతిష్ఠాపన రోజున ఆ చరిత్రాత్మక సంఘటన ప్రత్యక్షవీక్షణానికి వీలుగా గుంటూరు -విజయవాడ హైవేపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అటువంటి సందర్భాలో వివిఐపీల రాకపోకలకు ఎకరాలకు ఎకరాలలో చెట్లను కొట్టివేయడం కూడా జరుగుతోంది. మనం ప్రజాస్వామ్య దేవుడిని ఆరాధిస్తున్నాం, ఆయన ప్రతినిధులు తామే భగవంతుడిలాగా ప్రవర్తిస్తుంటే, అంగీకరిస్తున్నాం. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కొత్త వైభవోపేత సచివాలయాన్ని కొద్దికాలం క్రితం చూసినప్పుడు కొద్దిమంది సామాన్యులు గేట్ల వద్ద నిలబడి కనిపించారు. అదే ఒక దేవాలయమై ఉన్నట్టయితే ఆ గుడి పూజారులు వారిని బయటకు నెట్టివేసి ఉంటారని కొందరికైనా అనిపించేది. అయితే అది ప్రజాస్వామ్య దేవుడిది కావడంతో ఎవరూ ఆ రీతిలో ఆలోచించరు కూడా. ఇక, ఆ గేట్ల వెనుక ఒక విశాల, బహిరంగ ఖాళీ ప్రదేశం ఉంది. భవనం దాకా వాహనాలు నేరుగా వెళ్లేందుకు ఒక అధునాతన మార్గం ఉంది. ప్రజాస్వామ్య దేవుళ్లు తాము సౌఖ్యంగా పొయ్యేందుకు ఎకరాల వైశాల్యంలోని వందలాది చెట్లను ఇట్టే కూల్చివేయగలరు. ఇదొక ఉన్మాద పరిస్థితి. అయినా దీన్ని మార్చేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను మీ గ్రామంలోనే సమావేశపరిచి, ఓటు వేయించుకోవడానికి నాయకుడు మందగా తీసుకువెళ్లడానికి మనం నిశ్చయంగా అనుమతిస్తాం.

పీడకులు, పేచీకోరు పాలకులు, మూర్ఖులు, నియంతలు, ఉన్మాదులు వస్తారు పోతారు. అయితే మాతృమూర్తులు తమ బిడ్డల శ్రేయస్సుకోసం నవగ్రహ పూజలు ఎప్పటికీ నిర్వహిస్తూనే ఉంటారు. తండ్రి ఇరుముడితో శబరిమల మెట్లు ఎక్కుతూనే ఉంటాడు. రాముడు, కృష్ణుడు, గణేశ్, హనుమాన్, లక్ష్మీ, సరస్వతి, ఇంకా ఎంతోమంది సుప్రసిద్ధ, అప్రసిద్ధ దేవతలు, వేల్పులు మన సమస్త అస్తిత్వాన్ని నిర్ణయిస్తున్నారు. ఈ ఆధునిక ప్రపంచంలో దేవుళ్ళకు స్థానం లేదని, ఒకే ఒక్క నిజమైన దేవుడు—మత లేదా లౌకిక దేవుడు మాత్రమే ఉండాలని శతాబ్దాలుగా కొందరు కత్తులు ఝుళిపిస్తున్నారు. ఈ వాదనను మన బహు దేవతారాధన భూమి నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. మీ రాజ్యాంగం, మీ ప్రజాస్వామ్యం, మీ పవిత్ర గంథం—ఇవేవీ మా రాముడిని మించి సమున్నతమైనవి కావు. వ్యవహరించాల్సి వస్తే దాని ఆధారంగా వ్యవహరించండి.

● -వంశీ జూలూరి
మీడియా స్టడీస్ ప్రొఫెసర్, శాన్‌ఫ్రాన్సిస్కో యూనివర్సిటీ

ఉత్తరాంధ్రలో ఒక్క ప్రాజెక్టయినా పూర్తి చేశారా?

ఉత్తరాంధ్ర వెనుకబడి ఉన్నదని, విశాఖలో పరిపాలన రాజధాని నెలకొల్పి ఉద్ధరిస్తాననే భావోద్వేగాలతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దాదాపు అయిదేళ్ల పదవీకాలం గడిపారు. ఉత్తరాంధ్ర మూడు ఉమ్మడి జిల్లాల్లో అత్యధికులు ఈ రోజుకూ వ్యవసాయాధారంగా బతుకుతున్నారు. జగన్ హయాంలో అక్కడ ఒక్క సాగునీటి ప్రాజెక్టయినా పూర్తి కాలేదు. ఒక్క ఎకరాకయినా అదనంగా సాగునీటి వసతి కల్పించలేదు. మరి ఏ ధైర్యంతో తిరిగి తనకు పట్టం కట్టమని ఆయన ఉత్తరాంధ్ర రైతులను, అడుగుతున్నారు? సాగునీటి రంగంలో వ్యయం చేసిన గణాంకాలు పరిశీలిస్తే జగన్ ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్యతలు అవగతమౌతాయి. ఇటీవల రాష్ట్ర ఇంజనీర్–ఇన్–చీఫ్ ఉత్తరాంధ్రలో తక్కువ నిధులు వ్యయం చేసినట్లు ప్రకటించడం గమనార్హం.

ఉత్తరాంధ్రలో వర్షపాతం ఎక్కువ. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే ఉత్తరాంధ్ర ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. దురదృష్టమేమంటే పడిన వర్షపు నీరంతా సముద్రం పాలౌతోంది. వంశధార, నాగావళి వంటి నదులే కాకుండా చిన్నా చితక నదులు

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో ఉత్తరాంధ్రలో ఒక్క సాగునీటి ప్రాజెక్టయినా పూర్తి చేయలేదు. ఒక్క ఎకరాకయినా అదనంగా సాగునీటి వసతి కల్పించలేదు. విశాఖను పరిపాలన రాజధాని చేస్తానంటున్న జగన్, కనీసం విశాఖ శాశ్వత తాగునీటి సరఫరాకు చేసిన కృషి శూన్యం. జగన్ ప్రభుత్వం సాగునీటి రంగంపై చూపిన నిర్లక్ష్యం ఫలితంగా రేపటి ఎన్నికల్లో ప్రభుత్వం మారినా రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని గాడిన పెట్టడం తలకు మించిన పని కాబోతోంది.

చాలా ఎక్కువగా ఉన్నాయి. వెనుకబడిన రాయలసీమతో పోల్చుకొన్నా మధ్య తరహా ప్రాజెక్టులు ఉత్తరాంధ్రలో ఎక్కువ. ఈ అయిదేళ్ల కాలంలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం అటుంచి, గతంలో నిర్మితమైన ప్రాజెక్టుల కాలువల ఆధునీకరణ, మరమ్మతులకు నిధులు విదల్చనందున అవన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ ప్రాజెక్టుల కాలువలు కొంతమేర పూడి పోగా, ఎక్కువ భాగం పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్కలతో నిండిపోయాయి. కొన్ని పథకాల కింద భూసేకరణ ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లుంది.

జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాక తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం పొందే ప్రాజెక్టుల లిస్ట్ రూపొందించారు. అందులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వంశధార, నాగావళి నదుల అనుసంధానం ఒకటి. దీనిని పూర్తి చేస్తే ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 50 వేల ఎకరాలకు సాగునీరు అదనంగా అందించవచ్చు. తెలుగుదేశం హయాంలో ఈ అనుసంధానం పనులు దాదాపు 60 శాతానికి పైగా పూర్తి అయ్యాయి. 19 టియంసిల సామర్థ్యంతో హిరమండలం జలాశయం దాదాపు పూర్తయింది. ఈ జలాశయం నుంచి నాగావళి నదిపై నిర్మితమైన నారాయణపురం ఆనకట్ట వరకు 33 కిలోమీటర్ల కాలువ తవ్వవలసి ఉంది. గ్రావిటీతో జేషుగ్గా నీళ్లు వెళతాయి. దురదృష్టమేమంటే తుదకు నారాయణపురం ఆనకట్ట గేట్లు కూడా దెబ్బతిన్నాయి, ఆనకట్ట దిగువ భాగంలో చప్టా ధ్వంసమైంది.

వంశధారపై నేరడి బ్యారేజీతో పాటు సైడ్‌వేర్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్‌కు ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. నేరడి బ్యారేజీ నిర్మాణం వల్ల ఒడిషా రాష్ట్రంలో 106 ఎకరాల భూమి ముంపునకు గురౌతుందని, దానిని ఒడిషా సేకరించి ఇవ్వాలని వంశధార ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. ఇది జరిగితే అనుసంధానం గట్టెక్కినట్లే. ఒడిషా ప్రభుత్వంతో పలుమార్లు సంప్రదింపులు జరిపి ఒప్పించేందుకు ముఖ్యమంత్రికి తీరిక లేకపోయింది. అంతిమంగా ఇటీవల గొట్టా బ్యారేజీ నుంచి ఎత్తిపోతల ద్వారా హిరమండలం జలాశయానికి వంశధార నీళ్లు తరలిస్తామని ప్రకటనలు చేసి చేతులు దులుపుకొన్నారు. వాస్తవంలో గొట్టా బ్యారేజీ వద్ద 115 టియంసిలు నీళ్లు లభ్యమౌతాయని వంశధార ట్రిబ్యునల్‌తో పాటు కేంద్ర జలసంఘం నిర్ధారించింది. 1962లో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు గొట్టా బ్యారేజీ నిర్మితమై ఫిఫ్టీ ఫిఫ్టీ పద్ధతిలో ఆంధ్రప్రదేశ్–ఒడిషా రాష్ట్రాలు నీటిని వినియోగించుకొంటున్నాయి. ఇన్నేళ్లయినా వంశధార నుంచి 30 టియంసిలు నీళ్లు కూడా ఆంధ్రప్రదేశ్ వాడుకోవడం లేదు. ఒడిషా కూడా చుక్క నీరు ఉపయోగించుకోవడం లేదు. కానీ పై భాగంలో వంశధార నుండి రుషికుల్యం నదికి వరద నీళ్లు తరలిస్తోంది. పైగా ఆంధ్రప్రదేశ్ అనుమతి లేకుండా హరిభంగి డ్యాం నిర్మించింది. అయినా వంశధార నుంచి 82 టియంసిలు నీళ్లు ఏటా సముద్రం



పాలౌతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

కొత్త ప్రాజెక్టులు సంగతి దేవుడెరుగు. ఎప్పుడో నిర్మితమైన వంశధార ప్రాజెక్టు కాలువల ఆధునీకరణ కూడా అటకెక్కింది. విషాదమేమంటే ఉత్తరాంధ్రలో పలు ప్రాజెక్టులకు అత్యల్పంగా నిధులు వ్యయం చేసి, అదే సమయంలో కొన్ని పథకాల అంచనాలు మాత్రం భారీగా పెంచేశారు. పోనీ పనులు జరిగాయా అంటే అదీ లేదు. పెండింగ్ ప్రాజెక్టులు గాని, నిర్మాణం జరిగిన పథకాల మరమ్మతులు గాని ఎప్పటికప్పుడు పూర్తి చేస్తే తప్ప, ప్రతి ఏటా పెరిగే షెడ్యూల్ రేట్లు తడిసి మోపెడవుతాయి. ఈ అయిదేళ్ల కాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సాగునీటి రంగంపై చూపిన నిర్లక్ష్యం ఫలితంగా రేపటి ఎన్నికల్లో ప్రభుత్వం మారినా రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని గాడిన పెట్టడం తలకు మించిన పని కాబోతోంది. ఉత్తరాంధ్ర ప్రజల్ని మభ్యపెట్టేందుకు కొన్ని పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చి, టెండర్లు పిలిచి, పనులు చేపట్టినా, చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వాళ్ళు ఎక్కడ పనులు అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోతున్నారు.

విజయనగరం జిల్లాలో నాగావళి నదిపై తోటపల్లి బ్యారేజీ 2003లో చంద్రబాబునాయుడి హయాంలో నిర్మాణం మొదలై, 2015లోనే మళ్లీ ఆయన హయాంలోనే ప్రారంభోత్సవానికి నోచుకొన్నది. 2.51 టియంసిలు సామర్థ్యంతో నిర్మించిన ఈ బ్యారేజీ ద్వారా లక్ష ఇరవై వేల ఎకరాలకు సాగునీరు అందవలసి వుంది. 1908లో నిర్మితమైన పాత బ్యారేజీ కింద 56 వేల ఎకరాల ఆయకట్టు వుంది. వెరసి మొత్తం ఆయకట్టు లక్షా 76 వేల ఎకరాలకు సాగునీరు అందించవలసి ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. అదనపు ఆయకట్టుకు సాగు నీరు ఇవ్వడం అటకెక్కింది. తాజాగా పాత ఆయకట్టుకు నీళ్ల కోసం రైతులు రోడ్డెక్కారు. నాగావళి ఉప నదిపై జంఝావతి ఆధారంగా భారతదేశంలోనే అరుదైన పద్ధతిలో రబ్బరు డ్యాము నిర్మాణం జరిగింది. నాలుగు టీఎంసీల నీళ్లు ఉపయోగించుకొనే విధంగా నిర్మాణం జరిగితే, భూసేకరణ, కాలువలు మరమ్మతులకు నోచుకోనందున పూర్తి ఫలితాలు లభ్యం కాలేదు. వీటన్నింటికి మించి మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ జలాశయ నిర్మాణం ఉత్తరాంధ్ర ఇతర ప్రాజెక్టులలాగే అనిశ్చితిలో ఉంది. ఆ మధ్య సవరించిన అంచనాలతో పరిపాలన అనుమతి ఇచ్చారు. అయినా ఏం ప్రయోజనం? పుణ్యకాలం గడిచిపోయింది.


తెలుగుదేశం, కాంగ్రెస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల టెండర్లు జరుగుతుంటే పెద్ద హడావుడి జరిగేది. శాంతిభద్రతల సమస్య తలెత్తి కాంట్రాక్టర్లను అదుపు చేసేందుకు పోలీసులు రంగప్రవేశం చేసేవారు. వైసీపీ హయాంలో సీన్ రివర్స్ అయింది. టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. అరకొర టెండర్లు వేసినా పనులు చేయడం లేదు. పలువురు కాంట్రాక్టర్లు బిల్లుల కోసం హైకోర్టు కెక్కిన నేపథ్యంలో మొత్తంగా సాగునీటి రంగం స్తంభించిపోయింది.

విశాఖను పరిపాలన రాజధాని చేస్తానంటున్న జగన్మోహన్ రెడ్డి, కనీసం విశాఖ శాశ్వత తాగునీటి సరఫరాకు చేసిన కృషి శూన్యం. పోలవరం నుంచి విశాఖ తాగునీటి కోసం 23.99 టియంసిల నీటి కేటాయింపులు ఉన్నాయి. కానీ పోలవరం ప్రాజెక్టే పురోగతికి నోచుకోలేదు. వాస్తవానికి ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిని జగన్ దృష్టిలో పెట్టుకొని వుంటే పోలవరానికి ఈ దుర్గతి పట్టేది కాదు. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణం పూర్తయితే తప్ప ఉత్తరాంధ్ర సుజల స్రవంతి (పోలవరం నుంచి 63.20 టియంసిలు కేటాయింపులున్నాయి) గాని, విశాఖకు సమృద్ధిగా తాగునీరు ఇచ్చే అవకాశం లేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాలో 3.21 లక్షల ఎకరాలకు, ఉమ్మడి విజయనగరం జిల్లాలో 3.94 లక్షల ఎకరాలకు సాగు నీటితో పాటు, మూడు ఉమ్మడి జిల్లాల్లో 30 లక్షల మందికి తాగునీరు అందుతుంది.

గత అయిదేళ్లుగా జగన్మోహన్ రెడ్డి ఉద్ధరిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లాలో పది లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే 4.9 లక్షల ఎకరాలకే సాగునీటి వసతి ఉంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తొలి అంచనా వ్యయం దాదాపు ఏడు వేల కోట్ల రూపాయలైతే, ప్రస్తుతం 18 వేల కోట్ల రూపాయలకు పైగా నిర్మాణ వ్యయం పెరిగింది. అది కూడా ప్రస్తుతం ముఖ్యమంత్రి చెబుతున్నట్లు పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణం జరిగినా సాధ్యం కాదు. తొలి దశ అంటే 41.15 మీటర్ల ఎత్తులో నిర్మాణం జరుగుతుంది. పోలవరం ఎడమ కాలువ సిల్ లెవెల్ 40.54 మీటర్లయినందున గ్రావెటీతో నీళ్లు తరలించడం అసాధ్యం. ఈ తొలి దశకూ నిధులు గాలిలో దీపంగా మారాయి. జగన్ పదవీకాలం మూడు నెలలు కూడా లేదు. ఇక ఉత్తరాంధ్ర అభివృద్ధికి మిగిలిందల్లా హళ్లికి హళ్లి... సున్నాకు సున్నా మాత్రమే!


■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

గాంధీ నడయాడిన నేల ఇదేనా?



గాంధీజీని ఎవరు, ఎప్పుడు ఏ కోణంలో చూసినా ఒక ఉత్తమ వ్యక్తిత్వ లక్షణాలు పుణికి పుచ్చుకొన్న సంపూర్ణ రూపం ఆవిష్కరణతో నూతన ఉత్తేజాన్నిస్తుంది. నేటితరంతో పాటు భవిష్యత్ తరాలకూ ఆయన మార్గదర్శకుడు... మోడరన్ మేనేజ్‌మెంట్ గురు. ఆయన శ్వాస.. సత్యం అహింస. ఆయన ధ్యాస.. పేదరికం, అంటరానితనం, నిరక్షరాస్యత నిర్మూలన... దురలవాట్లకు దూరంగా ఉండే సభ్య సమాజం... వీటన్నింటి సమాహారమైన గ్రామీణ భారతావని. ఆయన కలలుగన్న గ్రామస్వరాజ్య సంపూర్ణ స్వరూపమిదే. మనసా, వాచా, కర్మణా ఆచరించటం ఆయన నైజం. నీతి నిజాయితీ, కృషి, పట్టుదల, దృఢసంకల్పం, ఆధ్యాత్మికత, నిశిత పరిశీలన, నిరంతర కృషి, నిర్భయం, నిగ్రహం, నైతికత, ఆత్మవిశ్వాసం, మనోధైర్యం, సరళ స్వభావం, సేవాదృక్పథం.. వంటి సద్గుణాలు గల విశిష్ట వ్యక్తిత్వం ఆయనకే సొంతం. కర్తవ్యం పట్ల అపురూపమైన ప్రేమ. సమాజంలో అన్యాయాన్ని ఎదుర్కొనవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ. ముఖ్యంగా యువత పోరాట పటిమ, సామాజిక స్పృహ కల్గి ఉండాలన్నది ఆయన దృఢ విశ్వాసం. వీటన్నిటికంటే మరీ ముఖ్యమైనది మాతృభూమిపై మమకారం ఉండాలన్న ఆయన స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు. నాడు అంతగా సమాచార వ్యవస్థ, ప్రచార సాధనాలు లేకున్నా, ఏకత్వభావాలు గల భిన్న సమూహాల సమన్వయం, ఆయన ఆశయసిద్ధికి సంఘీభావం తెలిపాయి. మార్పు కోరుకుంటే అది నీ నుండే ప్రారంభం కావాలన్న ఆయన పిలుపునకు, ఆశయాలకు, విలువలకు ప్రేరేపితులై భోగభాగ్యాలు, సిరిసంపదలు త్యజించి ఆయన బాటన నడిచారు. ఆ తరం దాదాపు అంతరించి పోయింది. ప్రస్తుత సమాజంలో విపరీత పోకడలు చూస్తూ గాంధీజీ నడయాడిన నేల ఇదేనా.. అంటూ మధనపడవలసి వస్తోంది. ఒక సమిష్టి లక్ష్యం సాధించాలంటే గాంధీజీ సిద్ధాంతాలు తెలుసుకోవాలి, అర్థం చేసుకుని ఆచరించాలి.

– హేమసుందర్ అట్టాడ





కృష్ణానదిలోని పాయల్లో మృతిచెందిన ఓ బాలుడి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న దృశ్యం (ఫైల్)

జలగండం

కృష్ణానదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు

- సరదాగా దిగి సమాధి అవుతున్న యువకులు
- యనమలకుదురు ప్రాంతంలో అనధికార తవ్వకాలు

ఏడాదిలో 11 మంది జలసమాధి

2023, డిసెంబరు 16న దర్శిపేటకు చెందిన ఐదుగురు చిన్నారులు, 2023, మార్చి 3న ముగ్గురు స్నేహితులు.. ఈ ఆదివారం.. పటమటలోని హైస్కూల్ ప్రాంతానికి చెందిన ముగ్గురు విద్యార్థులు.. ఏడాది కాలంలో మొత్తం 11 మందిని కృష్ణానదిలో ఉన్న గోతులు మింగేశాయి. నిండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. భవిష్యత్తు దీపాలను ఆర్పేశాయి. పెనమలూరు మండలం యనమలకుదురు నుంచి చోడవరంలో ఉన్న ఇసుక క్వారీ వరకు ఉన్న ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. సరదాగా ఈతకు దిగితే ప్రాణం బలి ఇచ్చుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అధికారులు మాత్రం రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాదాలను అరికట్టే మార్గాలను అన్వేషించడం లేదు.

- 6లో..

ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఉమ్మడి జిల్లాలో మిల్లర్లు రైతులను నిలువునా ముంచేస్తున్నారు. మద్దతు ధర చెల్లింపులో మాయ చూపిస్తున్నారు. అధికారిక ఆన్‌లైన్ గణాంకాల ప్రకారం మద్దతు ధర చెల్లించినట్టుగా కనిపిస్తున్నా.. లోలోపల జరిగే వ్యవహారం మాత్రం వేరుగా ఉంటోంది. ఓవైపు కమీషన్ వ్యాపారుల పంట పండించడానికి మిల్లర్లు ప్రయత్నిస్తుంటే, మరోవైపు మిల్లర్లకు లాభాలు తెచ్చిపెట్టేందుకు కమీషన్ వ్యాపారులు కుట్రలు చేస్తుంటే, అంతిమంగా రైతులే నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

మిల్లర్ల మాయాజాలం



రెండు జిల్లాల్లోని రైతులకు చుక్కలు

- ధాన్యం బస్తా కొనాల్సింది రూ.1,630కు..
- కొంటున్నది మాత్రం రూ.1,300కే..
- రైతుల నుంచి రూ.330 అనధికారిక వసూలు
- లేదంటే ధాన్యం దిగుమతి చేసుకోరు
- కమీషన్ వ్యాపారులను ప్రోత్సహించేందుకే..
- దిక్కుతోచక కమీషన్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో ధాన్యం కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు సంబంధించి చూస్తే నిర్దేశిత కస్టమ్ మిల్లులకు అనుసంధానం చేసి ధాన్యం తరలించటానికి అనుమతులు ఇస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. ఒక్కసారి రైతులు ధాన్యం లోడును మిల్లులకు తీసుకెళ్లాక మరో రకంగా ఉంటోంది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు మిల్లర్లు కొనడానికి ససేమిరా అంటున్నారు. దీనికోసం మిల్లర్ల సిండికేట్ కొత్త పద్ధతి అవలంబిస్తోంది. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవట్లేదు. దీంతో లారీలు, ట్రాక్టర్లపై ధాన్యం లోడు ఉండిపోతోంది. మిల్లర్లు ఇలా ఉద్దేశపూర్వకంగా చేయటం ద్వారా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఆర్బీకేలను నిర్వీర్యం చేసే ఎత్తుగడలో భాగమే మిల్లర్లు ఇలా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరిగి కమీషన్ వ్యాపారుల చేతుల్లోకి తీసుకొచ్చేందుకు కుట్ర చేస్తున్నారని తెలుస్తోంది.

మిల్లర్ల ప్లాన్ ఇదీ..

రైతులు తెచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవటానికి సిండికేట్ అయిన మిల్లర్లు కొత్త షరతు విధిస్తున్నారు. బస్తాకు రూ.1,300 మించి చెల్లించలేమని చెబుతున్నారు. రూ.1,630 లెక్కన రైతులకు చెల్లించాల్సి ఉంటుంది కాబట్టి, బస్తాకు రూ.330 ఎదురు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అలా చెల్లిస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటామంటున్నారు. లేదంటే జాప్యం చేస్తున్నారు. దీనివల్ల రైతులు రవాణా చార్జీల రూపేణా నష్టపోవాల్సి వస్తోంది. పది చక్రాల లారీలో 100 బస్తాల ధాన్యం తీసుకెళ్లేందుకు రైతుకు రూ.10 వేల చొప్పున కిరాయి అవుతోంది. మరో రోజు గడిస్తే లారీ కిరాయి రేటు పెరిగిపోతోంది. ప్రభుత్వం టన్నుకు రూ.250 మాత్రమే రవాణా చార్జీలు ఇస్తోంది. వెయిటింగ్‌తో సంబంధం లేదు. దీంతో రైతులకు రవాణా చార్జీలు పెరిగిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మిల్లుల దగ్గర లోడు దిగుమతి కాకుండా రోజుల తరబడి ఉండిపోతోంది. దీంతో రైతులు మిల్లర్లకు ఎదురు చెల్లించి ధాన్యాన్ని దించాల్సి వస్తోంది. ఫలితంగా ఆర్బీకేల కంటే కమీషన్ వ్యాపారులకు అమ్ముకోవటమే మేలన్న భావనను మిల్లర్లు తెస్తున్నారు.

కమీషన్ వ్యాపారుల కాసుల కక్కుర్తి

కమీషన్ వ్యాపారులు బస్తా ధాన్యాన్ని రూ.1,300, రూ.1,400కు అనధికారికంగా రైతుల నుంచి కొంటున్నారు. మిల్లర్లకు పంపుతున్నారు. రైతుకు 11 రోజుల సమయం చెప్పి, ఆలోపు డబ్బు చెల్లిస్తున్నారు. కస్టమ్ మిల్లుల వ్యవహారంతో రైతులు కమీషన్ వ్యాపారులకు తెగనమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల కమీషన్ వ్యాపారులు మళ్లీ జూలు విదిలిస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో కమీషన్ వ్యాపారులు ఆర్బీకే కేంద్రాల్లోకి సైతం ప్రవేశించారు. ఉద్యోగులతో చేతులు కలుపుతున్నారు. ఆర్బీకేల నుంచి నేరుగా అనధికారికంగా రైతుల నుంచి ధాన్యం కొంటున్న ఉదంతాలు కూడా ఉంటున్నాయి. కమీషన్ వ్యాపారులు ప్రవేశిస్తేనే మిల్లర్లకు లాభాలు పండుతున్నాయి.

డీసీపీగా ఆనంద్‌రెడ్డి

- రూరల్ డీసీపీగా కొల్లి శ్రీనివాసరావు
- కృష్ణాజిల్లా ఎస్పీగా నయీం అస్మీ



ఆనంద్‌రెడ్డి

విజయవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సిటీ డీసీపీగా విశాఖపట్నం శాంతిభద్రతల డీసీపీగా ఉన్న ఆనంద్‌రెడ్డి నియమితులయ్యారు. రూరల్ డీసీపీగా గుంటూరు జిల్లా నాన్ క్యాడర్ ఎస్పీ కొల్లి శ్రీనివాసరావు రాబోతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చింది. సిటీ డీసీపీగా ఉన్న విశాల్‌గున్నీకి కొద్దిరోజుల క్రితమే డీఐజీగా పదోన్నతి వచ్చింది. ఆయన స్థానంలో ఆనంద్‌రెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. విశాల్‌గున్నీకి విశాఖపట్నం రేంజ్ డీఐజీగా పోస్టింగ్ ఇచ్చింది. రూరల్ డీసీపీగా ఉన్న డాక్టర్ అజిత వేజెండ్లను పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా నియమించింది. ఆమె స్థానంలో గుంటూరు జిల్లా నాన్ క్యాడర్ ఎస్పీ కొల్లి శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇచ్చింది. కమిషనరేట్‌లో అడ్మిన్ డీసీపీగా ఉన్న మోకా సత్తిబాబును విశాఖపట్నం శాంతిభద్రతల విభాగం 2కు డీసీపీగా బదిలీ చేశారు. పోలీసు కమిషనరేట్ నుంచి ముగ్గురు ఐపీఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం వారి స్థానంలో ఇద్దరిని మాత్రం కేటాయించింది. కృష్ణాజిల్లా ఎస్పీగా ఉన్న పి.జాషువాను చిత్తూరు జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఏసీబీలో ఎస్పీగా ఉన్న అదాన్ నయీం అస్మీని నియమించారు.

4న జనసేనలోకి ఎంపీ బాలశౌరి

భారీ ఏర్పాట్లు చేస్తున్న అభిమానులు

- పవన్ సమక్షంలో సభ్యత్వం తీసుకోనున్న ఎంపీ
- ఈసారీ మచిలీపట్నం ఎంపీగానే బరిలోకి..



(విజయవాడ- ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 4న మచిలీపట్నం ఎంపీ బాలశౌరి జనసేనలో చేరేందుకు అంతా సిద్ధమైంది. ఈ మేరకు ఆయన అభిమానులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 4 సాయంత్రం 4.30 గంటలకు మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో ఆయన జనసేన ప్రాథమిక సభ్యత్వం తీసుకుని పార్టీలో చేరనున్నారు. జనవరి 13న బాలశౌరి వైసీపీకి రాజీనామా చేసిన విషయం విదితమే. వైసీపీ అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన బాలశౌరి పార్టీని వీడటం వైసీపీ శ్రేణులను షాక్‌కు గురి చేసింది. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నానీతో విభేదాల కారణంగానే బాలశౌరి వైసీపీకి దూరమయ్యారు. ఎంపీ అన్న గౌరవం కూడా లేకుండా ఐదేళ్లపాటు నాని వ్యవహరించిన తీరుతో బాలశౌరి విసిగిపోయారు. ఈ విషయాన్ని పలుమార్లు వైసీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో బాలశౌరి మనస్తాపానికి గురై పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన బాలశౌరి 2004లో తెనాలి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2009లో నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2013, అక్టోబరులో వైసీపీలో చేరారు. 2014లో గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2019లో మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఈసారి ఆయన మచిలీపట్నం పార్లమెంట్ స్థానం నుంచి జనసేన తరఫున పోటీ చేస్తారని సమాచారం. ఐదేళ్ల కాలంలో మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో ఎన్ని అవరోధాలు ఎదురైనా అధిగమించి అభివృద్ధి చూపించానని, ముఖ్యంగా మత్స్యకారులకు ఉపయోగపడేలా కేంద్రం నుంచి సుమారు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఘనత తనదని బాలశౌరి వ్యాఖ్యానించారు.

ఆరంభశూరత్వం

హడావుడిగా వీఎంసీ కార్యాలయంలోని ఓ బ్లాక్ ప్రారంభం




ఇంకా పూర్తికాని కొత్త భవనం (ఇన్‌సెట్‌లో) హడావుడి ప్రారంభం

- జీ ప్లస్ త్రీ భవనం.. పూర్తయింది ఒక అంతస్థే..
- ఎన్నికల ముందు వెలంపల్లి ఎత్తులు
- కార్పొరేటర్లను పిలవకుండా సొంతంగా ప్రారంభోత్సవం

చిట్టినగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు అధికార పార్టీ నేతలు తెగ హడావుడి పడిపోతున్నారు. ఐదేళ్లపాటు ఎలాంటి అభివృద్ధి చేయకుండా మాటలతో పబ్బం గడిపిన ప్రజాప్రతినిధులు ఎన్నికలు దగ్గర్లో ఉండటంతో అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. ఇందుకు ఉదాహరణే నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవనం. వీఎంసీకి కొత్తగా కార్పొరేట్ హంగులతో ఒక భవనాన్ని నిర్మించాలని గత పాలకవర్గం హయాంలో పునాదిరాయి వేశారు. రూ.338 కోట్లతో నాలుగు అంతస్థుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవనంలో మూడు అంతస్థుల పనులు పూర్తికావచ్చాయి. ఒకటో అంతస్థులోనూ ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడో అంతస్తులోనూ పనులు సాగుతున్నాయి. రెండో అంతస్తును మాత్రమే కార్పొరేట్ హంగులతో తయారు చేశారు. దీన్ని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం హడావుడిగా ప్రారంభించారు. కౌన్సిల్‌లో మొత్తం 64 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వారిలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ, స్థానిక కార్పొరేటర్ చటర్జీని మాత్రమే ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మిగిలిన అధికార పార్టీ కార్పొరేటర్లకు గానీ, విపక్ష కార్పొరేటర్లకు గానీ ఆహ్వానం లేదు. పరిమిత సంఖ్యలోనే ఆహ్వానాలు పంపారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. వీఎంసీలో ప్రస్తుతం ఉన్న కొన్ని విభాగాలను కొత్త భవనంలోకి మారుస్తామని వెలంపల్లి ప్రకటించారు. కార్పొరేట్ స్థాయిలో ఈ భవనాన్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. హడావుడిగా, రహస్యంగా ఈ భవనాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఏముందని కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. మేయర్, డిప్యూటీ మేయర్లను ఆహ్వానించిన వారికి మిగిలిన కార్పొరేటర్లు కనిపించడం లేదా.. అని నిలదీస్తున్నారు. దీనిపై మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో రచ్చ జరిగే అవకాశాలు ఉన్నాయి.

ఎన్నాళ్లకు..

18 నుంచి మల్లేశ్వరస్వామి దర్శనం



విజయవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న మల్లేశ్వరస్వామి దర్శనభాగ్యం ఫిబ్రవరి 18 నుంచి కల్పించనున్నారు. దీనికి సంబంధించి సోమవారం నగరంలోని జమ్మిదొడ్డిలో ఉన్న సమావేశ మందిరంలో నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు ఈ వివరాలను వెల్లడించారు. మల్లేశ్వరస్వామి ఆలయాన్ని సీఎం జగన్ గత డిసెంబరు 7న ప్రారంభించారు. పనులు పూర్తికాకపోయినా ఆలయాన్ని ప్రారంభించిన అధికారులు దర్శనాలు మాత్రం కల్పించలేదు. ఫిబ్రవరి 18 నుంచి శివాలయంలో భక్తులకు దర్శనాలు కల్పిస్తామని వారు స్పష్టం చేశారు.



కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

సీఆర్‌జెడ్ భూముల్లో మట్టి దోచేస్తున్నారు!

» కొల్లు రవీంద్ర ధ్వజం .. చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

మచిలీపట్నం టౌన్, జనవరి 29 : ఎమ్మెల్యే పేర్ని నాని ప్రోద్బలంతో మచిలీపట్నంలో సముద్రం వెంట ఉన్న ఇసుక తవ్వి అక్రమంగా అమ్ముకుంటున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రవీంద్ర మీడియాతో మాట్లాడారు. సీఆర్‌జెడ్ పరిధిలో మంగినపూడి పంచాయతీ పరిధిలోని విలువైన మట్టిని పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు తవ్వుకు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తవ్వకాల కారణంగా సముద్రం ఆటుపోటులకు తీర ప్రాంతాల్లోని భూములు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. టిటానియం లాంటి ఖనిజ పదార్థాలున్న ఈ ఇసుకను పెద్ద మొత్తంలో అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మడుగుపోరంబోకు కుమ్మరిగూడెంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఎలా ఇస్తారన్నారు. కోర్టులో ఉన్న ఈ భూములకు పట్టాలు ఎలా ఇస్తున్నారన్నారని రవీంద్ర ప్రశ్నించారు. ఉల్లింగిపాలెంలో గుమ్మటాలమ్మ చెరువును పూడ్చి ఇళ్ల స్థలాలకింద వైసీపీ నాయకులు అమ్ముకుంటున్నారని, ఈ అక్రమాలపై ఫిర్యాదు చేస్తే ఆర్డీవో వచ్చి ఆక్రమిత షెడ్లు కొన్నింటిని తొలగించారని, మిగిలినవి అలాగే ఉన్నాయన్నారు. కలెక్టరు అక్కడ బోర్డు పెట్టమని అధికారులకు చెప్పినా రాజకీయ ఒత్తిడితో అమలు కాలేదన్నారు. పెద్ద ఎత్తున తీర ప్రాంతాల్లోని మట్టిని అమ్ముకుంటున్నారని, దీనిపై విచారణ జరిపించాలని రవీంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ముసుగులో పేర్ని నాని అవినీతిని వదిలిపెట్టేది లేదన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మండల, నగర పార్టీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో ఆటలా : దేవినేని ఉమా



ఫిల్టర్ బెడ్ వద్ద నిల్వ ఉన్న బూడిద నీళ్లను చూపుతున్న మాజీమంత్రి ఉమా

ఇబ్రహీంపట్నం : వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజారోగ్యంతో ఆటలాడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. కొండపల్లి మున్సిపాలిటీలో ఇబ్రహీంపట్నం వాటర్ హెడ్ వర్క్స్ వద్ద బూడిద కలిసే ప్రాంతాన్ని టీడీపీ కౌన్సిలర్స్, పార్టీ నాయకులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఎంపీ కేశినేని నాని, మంత్రి జోగి, ఎమ్మెల్యే వసంతపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బూడిద రవాణాతో వైసీపీ దొంగలు యథేచ్ఛగా కోట్లు దోచేస్తున్నారన్నారు. పది రోజులుగా ఎన్టీటీపీఎస్ సీఈకి వినతిపత్రాలు ఇచ్చినా, తాగునీరు కలుషితంపై ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఎన్టీటీపీఎస్ యాజమాన్యం వైసీపీ నాయకులకు దాసోహమయ్యారని ఆరోపించారు. కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండల గ్రామాల్లో పరిశుభ్రమైన నీరు వచ్చేవరకు ఆందోళన చేస్తామన్నారు. బూడిద డీపీడీ ఆగే వరకు ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్రమంలో రామినేని రాజశేఖర్ (రాజ), చుట్టుకుదురు శ్రీనివాసరావు, చనమోలు నారాయణరావు, షైల సైదులు, కరమికొండ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కేశినేని నానిది అతి విశ్వాసం!

» సౌమ్యను టార్గెట్ చేయడంపై నందిగామ ప్రజలు గరం.. గరం

నందిగామ : మితిమీరిన ఆత్మస్తుతి, అతి ఆత్మవిశ్వాసం, స్వీయ ప్రకటిత జాతీయ స్థాయి నాయకుడు అంటూ ఎంపీ కేశినేని నానిపై నియోజకవర్గ ప్రజలు సెటైర్లు వేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ జెండా నీడలో రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా గెలిచిన కేశినేని ఇటీవల వైసీపీలో చేరిన విషయం విదితమే. ఈక్రమంలో నందిగామలో తొలిసారిగా వైసీపీ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేశినేని ప్రసంగం కేడర్‌ను ఆకట్టుకోలేక పోయింది. నాని వెంట ఒక్క టీడీపీ కార్యకర్త అనుసరించకపోయినా టీడీపీని ఖాళీ చేస్తానంటూ చెప్పడం.. మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను టార్గెట్ చేసి మాట్లాడటం చర్చనీయాంశమైంది. గత ఎన్నికల సమయంలో పలు సభల్లో నిబద్ధత, వినయం, అభివృద్ధికి సౌమ్య చిరునామా అని ఆకాశానికెత్తి ఇపుడు ఇలా మాట్లాడటమేంటని ప్రశ్నిస్తున్నారు. దేవినేని ఉమామహేశ్వరరావు నందిగామకు ఏమీ చేయలేదంటూ ఎంపీ చేసిన వ్యాఖ్యలపైనా వైసీపీ నేతలు పెదవి విరుస్తున్నారు. ఉమా హయాంలో నియోజకవర్గంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు రాష్ట్రంలో ఎక్కడా లేదన్నది సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. రెండు పర్యాయాలు ఎంపీగా గెలిపించిన చంద్రబాబుకు విధేయత చూపలేని కేశినేని కేశినేనికి సౌమ్యను విమర్శించే హక్కు లేదని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. అందరినీ నిందిస్తూ తానొక్కడే నిజాయితీ పరుడినని ఎంపీ కేశినేని ఆత్మస్తుతితో ముందుకు సాగడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు.

అన్ని విషయాలపై త్వరలో స్పందిస్తా.. : వసంత

జి.కొండూరు : త్వరలోనే అన్ని విషయాలపై మీడియా సమావేశంలో సమాధానం చెబుతానని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. గడ్డమణుగు గ్రామంలో సచివాలయ భవనం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఉండాలి.. కానీ కేవలం సంక్షేమం అనే కన్ను మాత్రమే పని చేస్తున్నదని.. అందువల్ల ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అంతగా అభివృద్ధి చేయలేకపోయానన్నారు. సంక్షేమంతో ప్రజలు పూర్తిగా సంతృప్తి చెందడం లేదని.. సమస్యలపై ప్రజలు గడపగడపకు వెళ్లినప్పుడు ప్రశ్నించారన్నారు. క్యాడర్‌కు సీఎం జగన్ స్పష్టత ఇస్తారన్నారు. టీడీపీ తరపున పోటీ చేస్తున్నారా అన్న ప్రశ్నకు అలాంటిదేం లేదన్నారు. ఇప్పటి వరకు పార్టీ మార్పుపైన గానీ, ఇతర పార్టీలతో సంప్రదింపులు గానీ చేయలేదన్నారు. అన్ని విషయాలపై ఫిబ్రవరి మొదటి వారంలో మీడియా సమక్షంలో మాట్లాడతానని చెప్పారు.



నందివాడ పర్యటనలో రాము, రావి, పిన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు

నానీ.. ఈ రోడ్ల వైపు కన్నెత్తి చూశావా?

» ఎమ్మెల్యే కొడాలిపై వెనిగండ్ల ఎద్దేవా

నందివాడ, జనవరి 29 : మండలంలో ఎప్పుడైనా ఈ రోడ్లను చూశారా? మన ఎమ్మెల్యే కొడాలి నాని.. అని వెనిగండ్ల రాము ఎద్దేవా చేశారు. నాలుగున్నరేళ్లలో మంత్రిగానీ, ఎమ్మెల్యేగా కానీ ఒక్కసారైనా రోడ్లవైపు కన్నెత్తి చూశారా.. అంటూ సోమవారం నందివాడ గ్రామంలో 'భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ, నందివాడలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, మన ఎమ్మెల్యే నాని మండలాన్ని ఒక్కసారి కూడా చూడలేదని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉండి కూడా ప్రజల సమస్యలు పట్టించుకోవటం లేదన్నారు. టీడీపీ ఇంచార్జ్‌గా సాధ్యమైనంత వరకు గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో గ్రామాల్లోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాబోయేది తెలుగుదేశం పార్టీయేనని, ప్రజలంతా ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, తెలుగు మహిళలు, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కానరాని సామాజిక సాధికారత!

» ఆసరా సభలో ప్రొటోకాల్ పాటించని అధికారులు

కోడూరు : కోడూరు టీటీడీ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వైసీపీ సామాజిక సాధికారత పూర్తిగా కరువైంది. స్థానిక అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవటంతో ప్రజలచే ఎన్నుకోబడిన గ్రామ ప్రథమ పౌరుడు స్టేజి కిందే ఉండిపోగా, పార్టీ పదవులు ఉన్న వారిని మాత్రం స్టేజి పైకి ఆహ్వానించటంతో అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. డ్వాక్రా మహిళలను బలవంతంగా రప్పించి మహిళా సమాఖ్య సిబ్బంది వారిని బయటకు వెళ్లకుండా చుట్టూ కాపలాగా నిలిచారు.

గాంధీపై ఆధిపత్యానికి తెర!

» ఆరు దశాబ్దాలుగా కుటుంబపాలనలో బ్యాంకు
» చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన ఏడుగురు డైరెక్టర్లు
» అవిశ్వాసం నెగ్గాలంటే ఎనిమిది మంది ఓటేయాలి
» తొమ్మిది మంది మద్దతు ఉంది : చైర్మన్ వ్యతిరేక కూటమి
» ఫిబ్రవరి 12న అవిశ్వాసం లాంఛనమేనా!



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకుపై ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న కుటుంబ పాలనకు తెర దించేందుకు జోరుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. బ్యాంకులో అక్రమాలపై దృష్టి సారించిన డైరెక్టర్లు, బ్యాంకు మనుగడ కోసం చైర్మన్‌ను గద్దె దించాలని నిర్ణయించారు. ఈమేరకు సుదీర్ఘకాలంపాటు బ్యాంకు డైరెక్టర్లుగా కొనసాగుతున్న ఏకే అన్సారీ, సగ్గుర్తి నాగేశ్వరరావు తదితరులు చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించారు. ఈమేరకు కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయడం, ఆయన ఫిబ్రవరి 12న సమావేశం ఏర్పాటు చేసి అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించనున్నారు.

విజయవాడలోని గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు 1928లో ఏర్పడింది. ఈ బ్యాంకు క్రమేణా అభివృద్ధి చెందుతూ జిల్లాతోపాటు పొరుగు జిల్లాలోనూ ప్రస్తుతం కార్యకలాపాలను నిర్వహిస్తోంది. వైసీపీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ బ్యాంకు ప్రతిష్ట క్రమేణా మసకబారుతూ వస్తోంది. పాలన గాడి తప్పడంతో బ్యాంకు నష్టాల బాట పట్టింది. బ్యాంకు చైర్మన్‌గా వేమూరి బసవకుటుంబరావు అలియాస్ చిట్టియ్య ఉన్నంత వరకు బ్యాంకు ఓ వెలుగు వెలిగింది. ఆ తర్వాత ఆయన వారసుడిగా బాధ్యతలు చేపట్టిన వేమూరి వెంకట్రావు అలియాస్ చిన్ని సారథ్యంలో బ్యాంకు ప్రతిష్ట క్రమేణా తగ్గుతూ వచ్చింది.

చిచ్చుపెట్టిన కొత్త శాఖ ఏర్పాటు

గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకుకు ప్రస్తుతం 12 శాఖలున్నాయి. విశాఖపట్నం గాజువాకలో కొత్త శాఖ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ప్రస్తుతం బ్యాంకులో అలజడికి కారణమైంది. కొత్త శాఖ ఏర్పాటుకు డైరెక్టర్ల ఆమోదం లేకుండానే చైర్మన్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని సుమారు రూ.40 లక్షల వరకు ఖర్చు పెట్టడం డైరెక్టర్ల అసంతృప్తికి కారణమైంది. కొత్త శాఖ ఏర్పాటు ప్రక్రియలో చైర్మన్ నిబంధనలను తుంగలో తొక్కారని డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. 2023 నవంబరులో చెల్లింపులు జరిపేసి 2024 జనవరి 4న తాపీగా బ్యాంకు శాఖ ఏర్పాటు చేయాల్సిన ఇంటి యజమానితో ఒప్పందం చేసుకోవడంపై డైరెక్టర్లు అనుమానాలు వ్యక్తం చేశారు. మరోవైపు హనుమాన్‌జంక్షన్‌లో బ్యాంకు సొంత భవన నిర్మాణం కోసమంటూ 400 గజాలు కొనుగోలు చేయడంలోనూ చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరించడం డైరెక్టర్లలో అసంతృప్తికి దారితీసింది. నూజివీడులో మరో స్థలాన్ని కూడా ఇదే తరహాలో కొనుగోలు చేశారు. ఈ స్థలాల కొనుగోలులో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. తక్కువ ధరకు స్థలాలు కొనుగోలు చేసి ఎక్కువ ధర చూపించి బ్యాంకు సొమ్మును కాజేశారని డైరెక్టర్లు సహకార శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరగకుండా చైర్మన్ తన అధికారబలాన్ని ఉపయోగిస్తున్నారని డైరెక్టర్లు పేర్కొంటున్నారు.

మా వైపు 9 మంది డైరెక్టర్లు ఉన్నారు

గాంధీ బ్యాంకు చైర్మన్ ఏకపక్ష పోకడల కారణంగా ఖాతాదారులు బ్యాంకుపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని బ్యాంకు ప్రతిష్ట మసకబారకుండా ఉండటానికే తాము చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టామని అవిశ్వాసం ప్రతిపాదించిన ఏడుగురు డైరెక్టర్లు తెలిపారు. చైర్మన్‌తో కలిసి మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉన్నారని, వారిలో ఎనిమిది మంది ఓటేస్తే అవిశ్వాసం నెగ్గుతుందని, తమకు 9 మంది డైరెక్టర్ల మద్దతు ఉందని వారు పేర్కొన్నారు. ఫిబ్రవరి 12న అవిశ్వాసం లాంఛనమేనని, త్వరలో బ్యాంకుకు కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటామన్నారు.

జలగండం!



» కృష్ణా నదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు
» సరదాగా దిగి సమాధి అవుతున్న యువత
» యనమలకుదురు ప్రాంతంలో అనధికార తవ్వకాలు
» ఏడాది కాలంలో 11 మంది జలసమాధి

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఒకరు, ఇద్దరు కాదు.. మొత్తం 11 మందిని కృష్ణా నదిలో ఉన్న గోతులు మింగేశాయి. వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. భవిష్యత్తు దీపాలను ఆర్పేశాయి. ప్రతి ఏడాది కృష్ణా నదిలో ఈతకు దిగిన వారిలో పలువురు జలసమాధి అయిపోతున్నారు. కన్నవారికి పుట్టెడు శోకాన్ని మిగుల్చుతున్నారు. పెనమలూరు మండలం యనమలకుదురు నుంచి చోడవరంలో ఉన్న ఇసుక క్వారీ వరకు ఉన్న ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. సరదాగా ఈతకు దిగితే ప్రాణం బలి ఇచ్చుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి ఏడాది ఈ నదీ ప్రాంతంలోకి వచ్చిన యువకులు, విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ప్రమాదాలను అరికట్టే మార్గాలను అన్వేషించడం లేదు.

● ఇష్టానుసారంగా తవ్వకాలు

కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీకి దిగువన ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పెనమలూరు మండలం చోడవరం వద్ద ఇసుక క్వారీ ఉంది. ఇక్కడి నుంచి నిత్యం టన్నుల కొద్దీ ఇసుకను తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇది కాకుండా యనమలకుదురు శివాలయానికి ఎదురుగా ఉన్న నదీ ప్రాంతంలో అనధికారికంగా తవ్వకాలు సాగుతున్నాయి. అర్ధరాత్రి రెండు గంటల నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు నదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వుతున్నారు. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో ఇసుకను డంపింగ్ ప్రదేశాలకు తరలిస్తున్నారు. రాజకీయ నేతల వద్ద ఉండే ద్వితీయ శ్రేణి అనుచరుల కనుసన్నల్లో ఈ తవ్వకాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నారు. శివాలయం ఎదురుగా ఉన్న పెట్రోలుబంకు పక్క నుంచి నదిలో మార్గం ఉంది. ఈ మార్గం గుండా నది మధ్యకు ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు వెళ్తున్నాయి. సరిగ్గా నది మధ్యలో ఇసుకను తవ్వేస్తున్నారు. గోతుల నుంచి నీరు ఊరినప్పుడు మరోచోట తవ్వకాలు చేస్తున్నారు. ఇలా నది స్వరూపాన్ని మొత్తం చిత్తుచిత్తుగా మార్చేస్తున్నారు. గోతులమయంగా తయారు చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి దిగువన తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ వెనుక వైపున ఉన్న ప్రాంతంలో కొన్ని పాయల్లో నీరు ఉంటుంది. ఇక్కడికి తాడేపల్లి, కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాలకు చెందిన వారు వాకింగ్‌కు వెళ్తారు. కొంతమంది ఇక్కడే ఉన్న పాయల్లో ఈత కొడతారు. పటమట, దర్శిపేట, పెనమలూరు మండలం సనత్‌నగర్, యనమలకుదురు ప్రాంతాలకు చెందిన యువకులు మాత్రం ఈత కొట్టడానికి యనమలకుదురు, చోడవరం ప్రాంతాలకు వెళ్తారు. ఇక్కడ నదీ గర్భం నుంచి నీరు ఎప్పటికప్పుడు ఊరుతూ స్వచ్ఛంగా ఉంటుంది. ఈ ప్రాంతాన్ని దాటుకుని గుంటూరు జిల్లా వైపున ఉన్న నదీ పరీవాహక ప్రాంతంలో నీరు ఎక్కువగా ఉంటుంది. ప్రాంతమంతా విశాలంగా ఉంటుంది. ఇక్కడ వాతావరణం ప్రశాంతంగా ఉండటంతో యువకులు ఈ ప్రాంతానికి వెళ్తున్నారు. ఇక్కడ కొంతమంది మత్స్యకారులు చేపల వేట సాగిస్తుంటారు. ఈత కొట్టడానికి వచ్చే యువకులు నీటి లోతును అంచనా వేయడం లేదు. గోతుల్లో మునిగి విగతజీవులుగా పైకి తేలుతున్నారు.

● నీటి మరణాలు ఆపడం ఎలా?

నది మొత్తం జలవనరుల శాఖ పరిధిలో ఉంటుంది. అందులో జరిగే ఇసుక తవ్వకాలు మాత్రం భూగర్భ గనుల శాఖ పరిధిలో ఉంటాయి. తవ్వకాలకు కాంట్రాక్టర్లకు అనుమతులు ఇస్తున్న భూగర్భ గనుల శాఖ జరుగుతున్న ప్రమాదాల గురించి ఆలోచించిన దాఖలాలు కనిపించడం లేదు. జలవనరుల శాఖదీ ఇదే తీరు. చోడవరం వద్ద అధికారికంగా నిర్వహిస్తున్న క్వారీ వద్ద సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ ఒక టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసుకుని నదిలోకి ఎవరూ ఈతకు వెళ్లకుండా చేయడం వల్ల కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. ఇక యనమలకుదురు శివాలయం ఎదురుగా ఉన్న నదిలోకి ఉన్న మార్గాన్ని రిటైనింగ్ వాల్ నిర్మించి మూసివేస్తే లోపలకు యువకులకు బ్రేక్ వేయవచ్చు. నదిలోనే యనమలకుదురు పంచాయతీ అధికారులు చెత్తను డంపింగ్ చేయిస్తున్నారు. పంచాయతీ అధికారులు అయినా ఈ మార్గంలో ఒక ప్రైవేటు సెక్యూరిటీ నియమించి నదిలోకి ఎవరినీ అనుమతించకుండా చేస్తే జలసమాధులకు అవకాశం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముందుగా పంచాయతీ, జలవనరులు, భూగర్భ గనుల శాఖలు సమన్వయంతో ప్రణాళికలను రూపొందించడానికి పూనుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 29 : స్పందన అర్జీలు వ్యక్తిగత సమస్యలుగా భావించి తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై వుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో 151 అర్జీలను స్వీకరించడం జరిగిందని, అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకొంటున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలకు సంబంధించి అర్జీలకు ఆయా శాఖల అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ఎం.రజిని కుమారి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యాసాగర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..

కృష్ణలంక : ముందుగా గుర్తించి వైద్యం అందించడం ద్వారా కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేయి చేయి కలుపుదామని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. 'స్పర్శ' కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ, కుష్టు నివారణకు ప్రభుత్వం అవసరమైన అన్నిచర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యాధి లక్షణాలు వున్న రోగులను గుర్తించి సకాలంలో వైద్యం అందించగలిగితే వ్యాధిని త్వరితగతిన నివారించవచ్చన్నారు. వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించేందుకు జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారిణి జె.ఉషారాణి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ఎం.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఆర్థిక భరోసా లక్ష్యం

కృష్ణలంక : మత్స్య సంపదకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో పాటు వినియోగదారులకు తాజా ఉత్పత్తులను అందించి మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా జిల్లా మత్స్యశాఖ అధ్వర్యంలో సింగ్‌నగర్‌కు చెందిన యు.కమలేష్‌కు రూ.27 లక్షల విలువైన వాహనం, ఇబ్రహీంపట్నంకు చెందిన ఎస్.మాధవవర్మకు రూ.13.50 లక్షల విలువైన ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహనాలను కలెక్టర్ ఢిల్లీరావు లబ్ధిదారులకు అందజేశారు. సబ్సిడీపై ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహనాలను మంజూరు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.పెద్దిబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ చక్రాణి, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి పి.అఖిల వున్నారు.

పదిలోపాస్తే బండి డంపింగ్‌యార్డుకే

ఫుడ్‌కోర్టు సమయాలపై వీఎంసీ కీలక నిర్ణయం

- పది గంటలకు ముందే ఫుడ్‌కోర్టులోకి వస్తున్న బండ్లు
- అడ్డుకున్న వీఎంసీ సిబ్బందిపై భౌతికదాడులు
- మహిళల నోటి నుంచి బూతుపురాణం
- కేటాయించిన పరిధి దాటి వ్యాపారాలు
- రాజకీయనేతల అండదండలతో రెచ్చిపోతున్న వ్యాపారులు

(ఆంధ్రజ్యోతి - చిట్టినగర్): నగరంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద, బీఆర్టీఎస్ రోడ్డులో రెండు ఫుడ్‌కోర్టులున్నాయి. ఇందులో ఐజీఎంఎస్ ఫుడ్‌కోర్టుకు వీఎంసీ అధికారికంగా అనుమతి ఇచ్చింది ఇక్కడ రాత్రి 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు బండ్లను పెట్టుకుని వ్యాపారం చేసుకోవడానికి వీఎంసీ అధికారులు అనుమతించారు. వ్యాపారులు ఈ సమయానికే అక్కడ బండ్లను పెట్టుకోవాలి. కాని రాజకీయ నేతల అండదండలు ఉండడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సమయం కంటే ముందుగానే బండ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. ఐజీఎంఎస్ కాంప్లెక్స్‌లో షాపుల యజమానులను ఇబ్బందులు పెడుతున్నారు. ప్రశ్నించిన వీఎంసీ అధికారులపై భౌతికదాడులకు దిగుతున్నారు. ఐజీఎంఎస్ కాంప్లెక్ వ్యాపారులను ఇష్టానుసారంగా బూతులు తిడుతున్నారు. దీనితో వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాత్రి పది గంటల కంటే ముందుగా ఫుడ్‌కోర్టులోకి వచ్చిన బండ్లను డంపింగ్ యార్డుకు తరలించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. వీఎంసీ అధికారులు రాత్రి పదిన్నర నుంచి బండ్లు పెట్టుకుని వ్యాపారం చేసుకోవడానికి అనుమతి ఇస్తే, వ్యాపారులు రాత్రి తొమ్మిది గంటలకే బండ్లు పెడుతున్నారు. కొంతమంది రాత్రి ఏడు గంటలకే బండ్లు తెరిచి వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడ వ్యాపారం చేసే వారికి వీఎంసీ అధికారులు గుర్తింపు కార్డులిచ్చి ప్రదేశాలను కేటాయించారు. కొంతమంది కార్డులు లేకపోయినా మరొక వ్యాపారి కార్డులు తెచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. అటు రెడ్ సర్కిల్ వైపు, ఇటు ఎంజీ రోడ్డు వైపు వీఎంసీ సిబ్బంది గుర్తింపు కార్డులు పరిశీలించాకే లోపలకు పంపుతున్నారు. ఇక్కడ కార్డులు ఒకరిపేరుపై ఉంటే వ్యాపారాలు మరొకరు చేస్తున్నారు. ఇలా కార్డులు ఇచ్చినందుకు అసలు వ్యక్తులు వ్యాపారం చేసుకునే వారినుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు.

దాడులు.. దౌర్జన్యాలు

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ వైపున ఒక వ్యాపారి బిర్యానీ బండిని రాత్రి ఏడు గంటలకు పెట్టాడు. అక్కడే ఉన్న వీఎంసీ ఎస్టేట్ సిబ్బంది ఆ వ్యాపారిని సమయం కాకుండా ఎందుకు బండి పెట్టావని అడిగారు. దీనితో ఆ వ్యాపారి తాను అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరుడినని చెప్పి ఎస్టేట్ సిబ్బందితో వివాదానికి దిగాడు. మరో ఇద్దరితో కలిసి సిబ్బందిపై భౌతికంగా దాడి చేశాడు. దీనిపై సిబ్బంది సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత రెండు రోజులపాటు బండి పెట్టకుండా ఆ వ్యాపారి ఆగిపోయాడు. ఆ తర్వాత పేరు మార్చి మళ్లీ బండి పెట్టాడు. వ్యాపారులు తిరగబడుతుండడంతో తాము ఇక్కడ విధులు నిర్వర్తించలేమని అధికారుల వద్ద సిబ్బంది వాపోయారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉన్న షాపుల్లో కొంతమందికి ఫుడ్ లైసెన్స్ ఉంది. వారు ఇక్కడ ఆహార పదార్థాలను విక్రయించుకోవచ్చు. ఈ షాపులు ముందు ఉన్న బండ్లు రాత్రి ఏడు గంటలకే వచ్చేస్తున్నాయి. రాత్రి పదిన్నర తర్వాత బండ్లు పెట్టుకోవాలని షాపు యజమానులు చెప్తే వారిపై యుద్ధానికి దిగుతున్నారు. మహిళలతో వారిని బూతులు తిట్టిస్తున్నారు. మహిళా వ్యాపారులు వీఎంసీ ఎస్టేట్ సిబ్బందిపైనా తిరగబడుతున్నారు. షాపుల్లో ఉన్న వ్యాపారులు షాపు పరిధి దాటి వచ్చి వ్యాపారం చేస్తున్నారు కాబట్టి తామూ పెట్టుకుంటున్నామని ఫుడ్‌కోర్టు వ్యాపారులు చెబుతున్నారు. రాజకీయనేతల అండదండలతో ఫుడ్‌కోర్టు వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ఈ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతుండడంతో ఐజీఎంఎస్ కాంప్లెక్స్‌లోని కొంతమంది వ్యాపారులు వీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీనిపై కమిషనర్ స్పందించారు. ఫుడ్‌కోర్టుకు అదనంగా 30 మంది సిబ్బందిని కేటాయించారు. నిర్దేశిత సమయానికి కంటే ముందుగా వచ్చిన బండ్లను డంపింగ్‌యార్డుకు తరలించాలని ఆదేశాలిచ్చారు. ఇక్కడ వీఎంసీ సిబ్బందికి ఒక ఫొటోగ్రాఫర్‌ను కేటాయించారు. సమ యం కంటే ముందుగా వచ్చిన బండ్ల ఫొటోలను తీసి జీపీఎస్ ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పంపుతారు. పదేపదే సమయాన్ని ఉల్లంఘించి ఫుడ్ కోర్టులో బండ్లు పెట్టిన వ్యాపారులపై చర్యలు తీసుకోవడానికి వీఎంసీ రంగం సిద్ధం చేసింది. రాత్రిపూట నిర్వహించే ఈ ఫుడ్‌కోర్టు వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడమే కాకుండా, ఆరోగ్యం దెబ్బతింటుందని నగరానికి చెందిన కొంతమంది హైకోర్టులో పిల్ దాఖలు చేయడం గమనార్హం.



అనుమతుల్లేకుండా ఏర్పాటు చేస్తున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం

నిబంధనలకు విరుద్ధంగా వైఎస్ విగ్రహ ఏర్పాటు

» స్పందనలో టీడీపీ నేత ఫిర్యాదు

నందిగామ రూరల్, జనవరి 29 : కొండూరు గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఎన్టీఆర్, రాజీవ్ గాంధీ విగ్రహాల మధ్యన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు సోమవారం స్పందనలో వినతిపత్రం అందజేశారు. గతంలో ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ విగ్రహాలు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేశారని, రాష్ట్ర ప్రభుత్వం 2013లో ఆర్ అండ్ బీ శాఖ జీవో ననుసరించి కలెక్టర్ అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుపై ఎంపీడీవో, రెవెన్యూ శాఖాధికారులకు వినతిపత్రం అందజేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇటువంటి ఘటనల వల్ల శాంతిభద్రతలకు ఆటంకం కలిగే అవకాశం ఉందని, విగ్రహం ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అయోధ్యలో నాట్య ప్రదర్శన

» రామలింగ శాస్త్రికి ఆహ్వానం

కూచిపూడి, జనవరి 29 : అయోధ్య శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్రంలో ఫిబ్రవరి 1వ తేదీన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి తన బృందంతో నాట్య ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం అందినట్టు తెలిపారు. శ్రీరామ్ రాగసేవ కార్యక్రమంలో భాగంగా 1వ తేదీన రామాయణం నృత్య నాటకం, ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలకు సంబంధించి వెన్న నృత్యాంశాలు ప్రదర్శించనున్నట్టు రామలింగశాస్త్రి తెలిపారు.

ఎన్నికల విధుల నుంచి జయచంద్రను తప్పించండి

» ఈసీకి శ్రీరాం తాతయ్య ఫిర్యాదు

జగ్గయ్యపేట : జిల్లా పంచాయతీ అధికారి జయచంద్రను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని మాజీ ఎమ్మెల్యే జాతీయ తెలుగుదేశం కోశాధికారి శ్రీరాం తాతయ్య ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన గత 14సం.లుగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎంపీడీవోగా పనిచేశారని, అధికార పార్టీకి అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో ప్రసంగాలు, పోస్టింగులు పెట్టారని, జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులో ఓటరుగా నమోదై ఉన్నాడని పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారిగా ఆయనున్న నియమించటం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. జగ్గయ్యపేట సోషల్ మీడియా గ్రూపుల్లో ఆయన పెట్టిన పలు పోస్టింగులు, చర్చల్లో పెట్టిన సందేశాల ప్రతులను ఎన్నికల కమిషన్‌కు అందజేశారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు
అమరావతి (కి.లో)

బ్రాయిలర్ బర్డ్	121, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

స్పందనలో 19 అర్జీలు

చిట్టినగర్, జనవరి 29: స్పందనలో వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా మేయర్, కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 19 అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్లు కె. శకుంతల, కె.వి. సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. పి.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ వెంకట లక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ రోహిణి, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేనకు మద్దతుగా బీసీలు నిలబడాలి

జయహో బీసీ కార్యక్రమంలో బొండా ఉమా పిలుపు

మధురానగర్, జనవరి 29: బీసీలకు అండగా ఉండే పార్టీ రాష్ట్రంలో టీడీపీ ఒక్కటే అని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు చెప్పారు. జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా సోమవారం 29వ డివిజన్ మధురానగర్ పప్పుల మిల్లు వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ నుంచి నేటి లోకేష్ వరకు బీసీలను అక్కున చేర్చుకుని ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించారని గుర్తు చేశారు. నిధులు లేని కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి పదవులను ఇవ్వడం తప్పితే బీసీలకు జగన్ చేసిందేమీ లేదన్నారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ- జనసేనకు మద్దతుగా బీసీలు నిలబడాలని పిలుపు ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, రాష్ట్ర నాగవంశ కన్వీనర్ ఎరుబోతు రమణారావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఇప్పిలి రామ్మోహన్, వీరిపు సోమేశ్వరరావు, ఎన్ని బానుసింగ్, సింగం వెంకన్న, దివి ఉమామహేశ్వరరావు, మరక శ్రీనివాస్, వీరేశ్, సూర్యనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొండా ఉమా

పటమట: 6వ డివిజన్ విశాలాంధ్ర ఎదురు టీడీపీ జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు పదల గంగాధర్ అధ్యక్షత వహించారు. జ్యోతిరావ్ పూలే, ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బీసీ సాధికార రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, కె. నాగుల్ మీరాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున బీసీ సదస్సులు జరుగుతున్నాయని, ఆ సభల ద్వారా టీడీపీకి బీసీలకు ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ, బీసీలకు పార్టీ చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తున్నామని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి నాగుల్ మీరా మాట్లాడుతూ బీసీ ద్రోహి జగన్ అని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ భారతదేశంలో బీసీలకు ప్రాధాన్యత కల్పించింది ఎన్టీఆర్, టీడీపీనే అన్నారు. రాష్ట్రంలో రాజధాని లేకుండా చేశారని అన్నారు. బీసీ సదస్సుల కో-ఆర్డినేటర్ చెల్లుబోయిన రవికిరణ్, బొడ్డు చిట్టిబాబు, గొన్నే నారాయణ ప్రసాద్, కొక్కిర తిరుపతయ్య, చేరెపి ఈశ్వర్, వల్లూరు మధుసూదనరావు, గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష్ చంద్ర, తూర్పు నియోజకవర్గంలోని బీసీ నాయకులు, బీసీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరంకి గురుమూర్తి

100 మంది టీడీపీలో చేరిక

పాయకాపురం: ముస్లిం సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలోని 100 మంది ముస్లిం మైనార్టీ యువత సోమవారం టీడీపీలో చేరారు. మొగల్రాజపురంలోని నివాసం లో వారికి కండువా కప్పిన బొండా ఉమా పార్టీలోకి ఆహ్వానించారు. మంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

పాయకాపురం: పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి బర్మాకాలనీ, వికాలంధ్రకాలనీ, రాధానగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ. సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.



పోటీ పరీక్షల పుస్తకాలు అందజేత

గవర్నర్‌పేట, జనవరి 29: పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న విద్యార్థుల కోసం బ్రహ్మన్ అకాడమీ తయారు చేసిన రూ. 10వేల విలువ చేసే రీజనింగ్, అర్థమెటిక్, ఇంగ్లీష్, జనరల్ స్టడీస్ పుస్తకాలను, ప్రత్యేక యాప్‌లను అకాడమీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి సోమవారం ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎండీవీ నగేష్‌కు అందజేశారు. రాఘర్ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ, గ్రంథాలయ డికరిణి కె. రమాదేవి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

మేరీమాత ఊరేగింపు



మొగల్రాజపురం, జనవరి 29: గుణదల మేరీమాత దేవాలయానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో వందేళ్ల పూర్తవుతున్న సందర్భంగా బిషప్ తెలగతోటి జోసప్ రాజారావు విజయవాడ మేత్రాసనం పరిధిలో ఉన్న కతోలిక విచారణలకు మేరీమాత స్వరూపాన్ని తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మొగల్రాజపురం ఆర్సీఎం చర్చి ఫాతిమా మాత దేవాలయానికి సోమవారం మేరీమాత స్వరూపాన్ని ఊరేగింపుగా తీసు కొచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదర్‌ప్రకాష్, సిస్టర్ టెక్లా, ఉపదేశులు ప్రాన్సిస్, రాజకుమార్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీపీటీవో

బస్టేషన్, జనవరి 29: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్ఆర్టీసీ జిల్లాలో మంగళవారం డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాశాఖాధికారి ఎంవై దానం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనలను మంగళవారం సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్యలో 9959225446 నెంబర్ ద్వారా తెలియజేయాలని కోరారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పాయకాపురం, జనవరి 29: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను నున్న రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం రాజీవ్‌నగర్ ఎడ్లైన్ కాలనీలో పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 32 వేలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా రంగంలో ఉపాధి మెండు

మొగల్రాజపురం, జనవరి 29: ఫార్మా రంగంలో, మన దేశంలో పాటు విదేశాలలో ఉపాధి అవకాశాలు పెరిగాయని అందుకు తగ్గట్టుగా విద్యార్థులు విద్యతోపాటు మంచి పట్టు సాధించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని డార్విన్ ఫార్మా కంపెనీ అధినేత డాక్టర్ డి. లక్ష్మణరెడ్డి చెప్పారు. మొగల్రాజపురం కేబీఎన్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో నూతనంగా జాయిన్ అయిన విద్యార్థులు నియో ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట సునీత అధ్యక్షత వహించారు. మొదటి, రెండు సంవత్సర విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రేతపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 29: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ వడ్డెర కాలనీ ప్రాంతానికి చెందిన టి. వెంకన్న సోమవారం ఉదయం దాబా కొట్టు సెంటర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. అదే ప్రాంతంలో రోజు వారీ తనిఖీలు చేస్తున్న సిబ్బంది అతనిని సోదా చేయగా మద్యం బాటిళ్లు ఉండటాన్ని గుర్తించారు. అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విజేతకు అభినందనలు

మొగల్రాజపురం,జనవరి 29: చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ఎన్. గోపీమనోజ్ అభినందన కార్యక్రమం సోమవారం జరిగింది. చిత్ర కళాతపస్వి వేములపల్లి కామేశ్వరరావు శత వసంతాల సందర్భంగా పోరంకిలోని ఆర్టిస్ట్ అడ్డా అధ్వర్యంలో ఎంపీఎస్ భవన్‌లో రోడ్డు సేఫ్టీ కలిసిపోని జాగ్రత్తలు అనే అంశంపై నిర్వహించిన పోటీలో శాతకళాశాల జూనియర్ ఎంపీసీ విద్యార్థి ఎన్. గోపీమనోజ్ మొదటి బహుమతి పొందాడని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు చెప్పారు.

ప్రయాణికుడికి బ్యాగ్ అప్పగింత

వన్‌టౌన్, జనవరి 29: గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం ఆటోలో ప్రయాణికుడు పోగొట్టుకున్న బ్యాగ్‌ను పోలీసులు గుర్తించి తిరిగి ప్రయాణికుడికి అప్పగించారు. తెలంగాణకు చెందిన పార్ల వెంకట కిషోర్ గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని వి గ్రాండ్ వద్ద ఆటో ఎక్కి తాడిగడపలో దిగాడు. అయితే బ్యాగ్ కనిపించలేదు. వెంటనే గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేసి ఆటోను గుర్తించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు. బ్యాగ్‌లో విలువైన డాక్యుమెంట్లు తదితరాలు ఉన్నాయని బాధితుడు చెప్పాడు. పోలీసులను అభినందించారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



విజయవాడ క్రైమ్, జనవరి 29: విధి నిర్వహణలో ఉండగా అనారోగ్యంతో మరణించిన హోంగార్డు దొమ్మ వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా రూ.5లక్షల ఆర్థికసాయం అందజేశారు. సీపీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమం జరిగింది. హోంగార్డు ఆర్‌ఐ కృష్ణ పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చారని ఫిర్యాదు

పాయకాపురం, జనవరి 29: కూల్‌డ్రింక్‌లో విషం పదార్థం కలిపి ఇచ్చారని ఓ వ్యక్తి సోమవారం నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం గొల్లపూడికి చెందిన ఉప్పలుల అమ్మతేజ్, విశాలాంధ్ర కాలనీ ప్రాంతానికి చెందిన కిరణ్‌కుమార్‌కు పరిచయం ఉంది. వీరిద్దరి మధ్య కొంత నగదు వివాదం ఉంది. అయితే ఆదివారం అమ్మతేజ్ కిరణ్‌కుమార్ ఇంటికి వచ్చాడు. అమ్మతేజ్ కిరణ్‌కుమార్ కూల్‌డ్రింక్ ఇచ్చాడు. ఇద్దరు మాట్లాడుకున్న అనంతరం అమ్మతేజ్ గొల్లపూడిలోని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో అమ్మతేజ్‌కు వాంతులు అవడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళ్లాడు. తాను తాగిన కూల్‌డ్రింక్‌లో కిరణ్‌కుమార్ ఏదో ఒక విషపదార్థం కలిపి ఇవ్వడం వల్లే అస్వస్థతకు గురయ్యానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న తమిళనాడువాసి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

రైల్వేస్టేషన్, జనవరి 29: పూరి- తిరుపతి రైలులో సోమవారం గంజాయి తరలిస్తున్న తమిళనాడుకు చెందిన అయ్యిస్వామి అనే వ్యక్తిని (21)ను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ నాగారాజారెడ్డి, జీఆర్పీ సీఐ వి. శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ బి.చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ భాదర్ హుస్సేన్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మహ్మతాలోనాయక్‌లు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-4లో పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలలో తనిఖీ చేస్తున్న సమయంలో కండక్కడు అనుమానాస్పదంగా ఉండడం గుర్తించారు. అతనిని తనిఖీ చేయగా సీటు కింద దాచిన ఆరు కేజీల గంజాయి బ్యాగులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

సత్యనారాయణపురం, జనవరి 29: పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ హెచ్చరించారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో సోమవారం నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణ పట్ల అంకోశన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ రోజు మురుగు కాల్వలు శుభ్రం చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మలేరియా విభాగం సిబ్బంది పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దోమల నివారణ చర్యల వివరాల రికార్డులు పరిశీలించారు. కార్పొరేటర్ జానారెడ్డి మాట్లాడుతూ ఏలూరు కాల్వలో, బుడమేరులో దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ గుర్నాథం, సీఎంహెచ్ఓ డా. రత్నావళి, మలేరియా, పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ముఖ్యం

వక్తలు

మొగల్రాజపురం, జనవరి 29: సాఫ్ట్‌వేర్ రంగంలో నూతన ఆవిష్కరణలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఇస్రో మాజీ అసోసియేటెడ్ డైరెక్టర్ డాక్టర్ వి. శేషగిరిరావు, ఎన్‌ట్రెనర్స్ అధినేత దాసరి రామకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. పీబీ సిద్ధార్థ కళాశాల డిపార్ట్‌మెంట్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 3 రోజుల పాటు నిపుణులు, రీసెర్చర్స్ తదితరులతో సోమవారం అంతర్జాతీయ సదస్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జేపీఎస్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజస్, అల్గారిథమ్స్ వంటి వాటి వల్ల ఉపాధి అవకాశాలకు రక్షణ ఉంటుందని భావిస్తున్నారని అన్నారు. కాని నూతన ఆవిష్కరణలకు ఏఐ చాలా ముఖ్యమైనదిగా మారిపోయిందన్నారు. ఇతర దేశాలకు చెందిన పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల నిర్వాహకులు, యూనివర్సిటీ ప్రతినిధులు, నిపుణులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రవికిరణ్, జె. స్మారాక్ట్ కృష్ణ కె. ఉదయశ్రీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై నామమాత్రపు చర్యలు సిగ్గుచేటు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

పాయకాపురం, జనవరి 29: గత 17 రోజులుగా శివారు ప్రాంత వాసులు మంచినీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మంచినీటి ఎద్దడిపై అధికార యంత్రాంగం నామమాత్రపు చర్యలు తీసుకోవడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. శివారు ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నేతలు 62వ డివిజన్ ఎల్‌బీఎస్‌నగర్, రాజానగర్ అపార్ట్‌మెంట్ల వద్ద సోమవారం నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నీటి మీటర్ల ఏర్పాటుపై వైసీపీ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ నీటి సరఫరా విషయంలో లేదని విమర్శించారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు మొద్దునిద్ర వీడి మంచినీటి సరఫరా జరిగే స్థాయిలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాధానగర్ అపార్ట్‌మెంట్స్ వద్ద డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. కె.దుర్గారావు, బి. రమణారావు, నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

విద్యాధరపురం, జనవరి 29: చేపల వేటకు వెళ్లిన భర్త కృష్ణానదిలో పడి మృతి చెందాడని గుంటూరు జిల్లా వల్లభాపురానికి చెందిన కెనాగలక్ష్మి సోమవారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐదు నెలల క్రితం భార్యాభర్తలు గొడవపడి సైదులు(44) విజయవాడ పున్నమిఘాట్ వద్ద ఉంటున్న పట్టలి అనే వ్యక్తి వద్దకు వచ్చాడు. చేపలు పట్టుకుని జీవనం చేస్తున్న ఆయన ఈ నెల 27న సాయంత్రం పడవమీద చేపలవేటకు వెళ్లాడు. మరుసాడు ఉదయం 10 గంటలు అయినా రాకపోవడంతో నాగలక్ష్మి సమీప బంధువైన సాంబశివరావు సైదులు కోసం వెతుకుతుండగా వైస్రాయ్ హోటల్ వద్ద సైదులు వేసుకుని వెళ్లిన పడవ కనబడింది. దీంతో సమీప బంధువుల నివాసాలలో, తెలిసిన వారి ఇళ్లల్లో, పడవ ఓనర్ పట్టాలిని విచారించాడు. ఇంతలో గొల్లపూడి హెట్ దగ్గరలోని శ్మశానం వైపు కృష్ణానదిలో సైదులు మృతదేహం తేలి ఉన్నట్లుగా సమాచారం రావడంతో నాగలక్ష్మి సంఘటన ప్రదేశానికి వెళ్లి భర్తను గుర్తించి కృష్ణానదిలో పడి భర్త చనిపోయినట్టు తెలుసుకుంది. ఈ మేరకు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్య ప్రజోపయోగ సేవతో కీర్తి

విద్యాధరపురం, జనవరి 29: నిత్యప్రజోపయోగ సేవతోనే కీర్తి పొందుతారని సామాజిక వేత్త, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేమూల హజరత్తయ్య గుప్త అన్నారు. విద్యాధరపురం గుప్తాసెంటర్‌లోని కన్యకాపరమేశ్వరి కళ్యాణమండపంలో సోమవారం జరిగిన విజయవాడ విద్యాధరపురం వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొత్త కార్యవర్గం ఆయనను సత్కరించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై, అందరి హృదయాలలో చోటు సంపాదించు కోవాలని, ప్రజలకు ఉపయోగపడే సేవలతోనే కీర్తి ప్రతిష్ఠలు కలుగుతాయని తెలిపారు. కందేపు ప్రవీణకుమార్ అధ్యక్షుడిగా, సీహెచ్ సాంబమూర్తి కార్యదర్శిగా, నాగరమేష్ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇమ్మడిశెట్టి సురేష్ బాబు, శ్రీధర్, పొట్టి శివకుమార్, చెన్నకేశవులు, శివప్రసాద్, విజయకుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు, అలంబన పేరిట వృద్ధాప్య పింఛన్లు, నిత్యావసరాలు అందించారు.

త్యాగరాజ స్వామి ఆరాధన సంగీతోత్సవాలు ప్రారంభం

విజయవాడ కల్చరల్, జనవరి 29: సంగీతం సాహిత్యంతో భక్తిని మేళవించి సామాజిక హితాన్ని బోధించిన గొప్ప వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి అని ప్రముఖ సంగీత విద్వాంసులు ఎనిమండ్ర శ్రీనివాసరావు అన్నారు. సంగీత సన్నిధి ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధనా సంగీత ఉత్సవాలు సోమవారం సాయంత్రం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రారంభించారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో తొలిరోజు సుంకర టి.ప్రకాష్, టి.బాలమురళీకృష్ణ బృందంతో నాదస్వరం ఆలపించి సంగీత కచేరీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో మనిషి పాటించవలసిన నియమాలు, సదాచారాలు, సత్యాచారాలు నిక్కచ్చిగా పాటించి ఆదర్శప్రాయుడైన భక్త సంగీత సామ్రాజ్య చక్రవర్తి త్యాగరాజ స్వామి అన్నారు. ఆటువంటి మహోన్నతుడు తెలుగు నాట జన్మించడం తెలుగు వారందరికీ వరం అన్నారు. మంగపాల ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విమ్మ‌ట్టి కృష్ణవేణి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు మోదుమూడి సుధాకర్, జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, సుజాత కాపూరు, పారుపల్లి నల్లూరాజ సత్యనారాయణ, ఎం.ఎస్.జోగారావు, పల్లావి, కేశవరెడ్డి, గంధూరి రమ, ఎం.మంజునాథ్, అంజనా సుధాకర్, వేమూరి వెంకట విశ్వనాథ్, గంధూరి శ్రీనివాసమూర్తి, పెద్దాడ శ్యామల, కందుల అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు. నాదస్వరంతో పాటు తొలిరోజు మరో నాలుగు బృందాలు పాల్గొని కచేరీలు నిర్వహించారు.







ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 30 జనవరి 2024
cinema@andhrajyothy.com



మా నమ్మకం నిజమైంది

'సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా మీరు ఎప్పుడూ ప్రేమని పంచుతూనే ఉన్నారు. నేను కనిపించగానే ఆనందంతో నవ్వుతూ ఉంటారు. మీ చిరునవ్వే నాకు ధైర్యం' అభిమానులను ఉద్దేశించి 'నా సామిరంగ' విజయోత్సవంలో నాగార్జున అన్న మాటలివి. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నిని దర్శకుడిగా పరిచయం చేస్తూ శ్రీనివాస చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా ఆదివారం జరిగిన విజయోత్సవంలో యూనిట్ సభ్యులకు నాగార్జున షీల్డ్స్ అందించారు. ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా మొదలు పెట్టిన తర్వాత సంక్రాంతికి వస్తుందనే నమ్మకం బయట ఎవరిలోనూ లేదు. కానీ మా టీమ్ అందరిలో ఆ నమ్మకం ఉంది. అది నిజమైంది. అనుకున్న సమయానికి చిత్రం పూర్తి కావడానికి సంగీత దర్శకుడు కీరవాణి ప్రధాన కారణం' అన్నారు. 'ఫాస్టెస్ట్ ప్రాజెక్ట్ చేసి విజయం సాధించిన దర్శకుడు విజయ్‌కి అభినందనలు. కొత్త ప్రతిభను నమ్ముతూ ఇంత ఫ్రీడమ్ ఇచ్చిన నాగార్జునకు ధన్యవాదాలు. మా మ్యూజిక్ టీమ్ కూడా చాలా కష్టపడింది' అని తెలిపారు కీరవాణి. ఒక ఫ్యాన్ బాయ్ నుంచి కో స్టార్ స్టేజ్ వరకూ నాగార్జునతో షేర్ చేసుకోవడం ఆనందంగా ఉందని నరేశ్ చెప్పారు. దర్శకుడు విజయ్ తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అందరూ తనని 'వరాలు' అని పిలవడం ఆనందంగా ఉందని హీరోయిన్ ఆషికా రంగనాథ్ చెప్పారు.

మరో 200 రోజుల్లో...



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప ది రైజ్' చిత్రం సంచలన విజయం సాధించిన విషయం విదితమే. 2021లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది ఆ చిత్రం. అల్లు అర్జున్ కెరీర్‌లోనే ఇది అతి పెద్ద విజయం కాగా, ఈ సినిమాతోనే ఆయన జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగా అవార్డ్ పొందారు. దీనికి సీక్వెల్‌గా 'పుష్ప 2 ది రూల్' రూపొందుతోంది. ఈ సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రేక్షకులలో చిత్ర యూనిట్ ఇటీవల విడుదల తేదీ ప్రకటించి జోష్ పెంచింది. తాజాగా సోమవారం మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను నిర్మాతలు ఇచ్చారు. మరో రెండు వందల రోజుల్లో 'పుష్ప 2' వస్తుందంటూ ప్రత్యేక పోస్టర్ విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ తదితరులు నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు.



సమస్యలు చెప్పాం... పరిష్కారాలూ చెప్పమన్నారు

దిల్‌రాజు

'పరిశ్రమలోని సమస్యల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారితో గంట పదిహేను నిమిషాల పాటు నిర్మాతలందరం కలిసి చర్చించడం జరిగింది. సమస్యలేకాదు, పరిష్కారాలు కూడా మీరే చెప్పండి.. ప్రభుత్వం నుంచి ఏం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.' అని దిల్ రాజు చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిల్‌రాజు మాట్లాడారు. 'పరిశ్రమలోని సమస్యలపై ఎల్లుండి ఈసీ మీటింగ్ పెడుతున్నాం. సమస్యల పరిష్కారాలతో త్వరలోనే మళ్లీ సీఎంని కలుస్తాం. ఎల్లుండి నిర్వహించే ఈసీ మీటింగ్‌లో తీసుకోబోయే నిర్ణయాలు రాబోవు తరాలకు వారధిలా ఉంటాయి.' అని దిల్‌రాజు తెలిపారు. ఇంకా చెబుతూ 'ఛాంబర్ నిర్ణయాన్ని గౌరవిస్తూ సంక్రాంతి బరి నుంచి తొలగిన 'ఈగల్' చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కానుంది. పీపుల్ మీడియా టి.జి.విశ్వప్రసాద్, వివేక్, హీరో రవితేజగార్లకు ఈ సందర్భంగా కృతజ్ఞత తెలియజేస్తున్నాం. అదే రోజున 'ఊరుపేరు భైరవకోన' సినిమా డేట్‌ను కూడా ఎనౌన్స్ చేశారన్న విషయం ఛాంబర్ దృష్టికి రాగానే, నిర్మాతలు అనిల్ సుంకర, రాజేష్‌గార్లతో మాట్లాడటం జరిగింది. ఛాంబర్ వినతిని మన్నించి వాళ్లు కూడా తమ సినిమా డేట్‌ని ఫిబ్రవరి 16కు మార్చుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఫిబ్రవరి 9న విడుదల కానున్న 'ఈగల్' సినిమాకు ఎక్కువ థియేటర్లు వచ్చేలా చూస్తాం' అని దిల్‌రాజు తెలిపారు. 'అదే డేట్‌లో 'యాత్ర 2' రిలీజ్‌ను కూడా ఫిక్స్ చేశారు. అయితే, రాజకీయ కారణాల దృష్ట్యా ముందే డేట్ ఫిక్స్ చేసుకోవడం చేత, వాళ్లు విడుదల తేదీ మార్చుకు అంగీకరించలేదు. అలాగే, రజనీకాంత్ ప్రత్యేక పాత్ర పోషించిన 'లాల్ సలామ్' కూడా అదే డేట్‌లో విడుదల కానుంది. ఈ విషయంపై పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ వాళ్లతో చర్చిస్తే, ఆ రెండు సినిమాలవల్ల తమకు ఇబ్బంది లేదని వాళ్లు చెప్పారు' అని దిల్‌రాజు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ వి.దామోదరప్రసాద్, సెక్రటరీ టి.ప్రసన్నకుమార్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రతినిధి వివేక్ కూచిభొట్ల తదితరులు మాట్లాడారు.

మహా శివరాత్రికి 'భీమా'



గోపీచంద్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా' విడుదల తేదీని ప్రకటించారు. మహా శివరాత్రి సందర్భంగా మార్చి 8న థియేటర్లకు రానుంది. ఈ సందర్భంగా సరికొత్త పోస్టర్ విడుదల చేశారు. పోలీసు ఆఫీసర్ గెటప్‌లో ఫెరోషియస్‌గా గోపీచంద్ కనిపించారు. కన్నడ దర్శకుడు ఎ.హర్ష ఈ సినిమాతో తెలుగులోకి పరిచయమవుతున్నారు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ప్రియా భవానీశంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: అజ్జు మహంకాళి, సంగీతం: రవి బస్రూర్, సినిమాటోగ్రఫీ: స్వామి జె గౌడ, ఎడిటింగ్: తమ్మిరాజు, ఆన్‌లైన్ ఎడిటర్: కిరణ్.

టీనేజ్ డ్రామాతో 'మ్యాజిక్'



ప్రతిభను ప్రోత్సహించడంతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఎప్పుడూ ముందుంటుంది. లాస్టియర్ కొత్తవారితో ఆ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' చిత్రం హిట్ అయింది. ఇప్పుడు మరోసారి అటువంటి మ్యాజిక్ చేయడానికి ఆ సంస్థ సిద్ధమవుతోంది. 'జెర్సీ' చిత్రం తర్వాత దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కొత్తవారితో 'మ్యాజిక్' పేరుతో సెన్సిబుల్ టీనేజ్ డ్రామా రూపొందిస్తున్నారు. తమ కాలేజీలో జరిగే ఫెస్ట్ కోసం నలుగురు టీనేజర్లు ఒక పాటను కంపోజ్ చేయడానికి చేసే ప్రయత్నాలు కథగా ఈ చిత్రం ఉంటుంది.. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే అంశాలు ఎన్నో సినిమాలో ఉన్నాయంటున్నారు.ఈ మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. గిరీశ్ గంగాధరన్ ఫొటోగ్రఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా, కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా నీరజ కోన పని చేస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వేసవిలో తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నారు. సమర్పణ శ్రీకర్ స్టూడియోస్.

వినోదం.. విజ్ఞానం.. వెరసి 'హ్యాపీ ఎండింగ్'

'మిగతా పరిశ్రమల్లా సినిమాని ఒక పరిశ్రమగా బయట ఇన్వెస్టర్లు ఎవరూ గుర్తించడంలేదు. ఇక్కడ ఏటా 600 సినిమాలు రిజిస్టర్ అయితే, ప్రపంచానికి తెలిసేది 150 సినిమాలే. తక్కిన 450 సినిమాలు ఏమయ్యాయి? అనేది సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది. మేకింగ్‌పై అవగాహన లేకుండా థర్డ్ పర్సన్‌ను నమ్మి సినిమాలను నిర్మిస్తున్నారు. ఒక కొత్త హీరోతో కోటి రూపాయలతో తీయాల్సిన సినిమాకు మూడు కోట్లు ఖర్చుపెడుతున్నారు. ఈ అవగాహనలేమి వల్ల కాస్ట్ ఫెయిల్యూర్ సినిమాలు ఎక్కువైపోయాయి. ఏటా 400 నుంచి 500కోట్ల వరకూ కొత్త నిర్మాతలు ఈ పరిశ్రమలో నష్టపోతున్నారు. అందుకే సినిమా తీయాలనుకునే కొత్త నిర్మాతలకు ప్రొడక్షన్ నుంచి రిలీజ్ వరకూ ఒక బ్రిడ్జ్‌లా ఉండేలా మా సంస్థ పనిచేస్తుంది.' అన్నారు నిర్మాత అనిల్ పల్లాల. యోగేశ్ కుమార్, సంజయ్‌రెడ్డిలతో కలసి ఆయన నిర్మించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. యష్ పూరి, అపూర్వరావ్ జంటగా నటించారు. కౌశిక్ భీమిడి దర్శకుడు. ఫిబ్రవరి 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మేకింగ్, డిస్ట్రిబ్యూటింగ్, బిజినెస్.. అంశాలపై పూర్తి అవగాహనతో ఈ రంగంలోకి వచ్చాం. మా వింతగాథ వినుమ, జార్జిరెడ్డి చిత్రాల తర్వాత మేం నిర్మించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. అనుకున్న బడ్జెట్‌లో సినిమాను పూర్తిచేశాం. కొత్త హీరో కాబట్టి ప్రీరిలీజ్ బిజినెస్ గురించి ఆశించలేదు. విడుదల తర్వాత స్పందనను బట్టి బిజినెస్ చేయాలనుకున్నాం' అని తెలిపారు అనిల్ పల్లాల. కథను నమ్మి ఈ సినిమా చేశామని, వర్త్ ఉన్న సినిమా చేశామని అనుకుంటున్నామని, వికీ డోనర్, ఓమైగాడ్ 2 చిత్రంలో ఉన్నటువంటి లేయర్లు, ఎలిమెంట్స్ 'హ్యాపీ ఎండింగ్'లోనూ ఉన్నా ఇబ్బంది లేకుండా ఉంటాయని, వినోదంతోపాటు విజ్ఞానం కూడా అందించే సినిమా ఇదని నిర్మాత పేర్కొన్నారు.





ఓ భావోద్వేగ ప్రయాణం

మణికందన్, శ్రీగౌరిప్రియ కన్న రవి ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకుడు. నజేరత్ పసీలియన్, మగేశ్‌రాజ్ పసీలియన్, యువరాజ్ గణేషన్ నిర్మాతలు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 9న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని సోమవారం విడుదల చేశారు. ప్రేమికుల మోడ్రన్ డే రిలేషన్స్ నేపథ్యంలో సాగే సినిమా ఇదని, ప్రేమికులరోజు వీక్‌లో చూసేందుకు ఈ సినిమా మంచి ఆప్షన్ అని, జీవితంలోనే చూసిన అనేక సంఘటనలు ఈ కథకు స్ఫూర్తి అని, మంచి ఎమోషనల్ డ్రైవ్‌గా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ట్రూలవర్ ఒక హానెస్ట్ అండ్ ట్రూ ఫిల్మ్ అని, మోడరన్ డే రిలేషన్స్‌లో ఎత్తుపల్లాల గురించి అద్భుతంగా చెప్పిన కథ ఇదని, వాస్తవానికి దగ్గరగా సినిమా ఉంటుందని, తమిళ ప్రేక్షకులకు కూడా ఈ సినిమా ద్వారా పరిచయమవ్వడం ఆనందంగా ఉందని కథానాయిక శ్రీగౌరిప్రియ అన్నారు. ప్రతి ఒక్కరూ ఓన్ చేసుకొని ఎంజాయ్ చేసేలా 'ట్రూలవర్' ఉంటుదని హీరో మణికందన్ చెప్పారు. అతిథులుగా విచ్చేసిన దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్.కె.ఎన్ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు.

కొరటాలకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

కథల కాపీరైట్స్ అంశంపై చిత్రపరిశ్రమలో వివాదాలు తలెత్తడం పరిపాటే. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన 'గోరింటాకు'(1979) చిత్ర కథ విషయంలోనూ గతంలో ఇటువంటి వివాదమే చోటుచేసుకుంది. కథ నాదేనంటూ రచయిత్రి రంగనాయకమ్మ, 'గోరింటాకు' చిత్ర కథారచయిత్రి రామలక్ష్మిపై కోర్టుకు వెళ్లారు. చివరకు ఆ కేసులో రంగనాయకమ్మ విజయం సాధించారు. దాదాపు అలాంటి వివాదమే మహేశ్‌బాబు 'శ్రీమంతుడు'(2015) సినిమా విషయంలో కూడా ఎనిమిదేళ్లుగా జరుగుతోంది. 'శ్రీమంతుడు' కథ తనదేనని, స్వాతి పత్రికలో ప్రచురితమైన తన కథను కాపీ చేసి 'శ్రీమంతుడు' సినిమా తీశారని శరత్‌చంద్ర అనే రచయిత అప్పట్లో సినీ రచయితల సంఘానికి ఫిర్యాదు చేశారు. పరిశ్రమ పెద్దల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు.



న్యాయం జరిగేలా లేదని మీడియా ముందు కూడా తన గోడును వెళ్లబోసుకున్నారు. చివరకు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. పిటీషన్‌పై విచారణ జరిపిన కోర్టు కొరటాలపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించింది. దాంతో కొరటాల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. శరత్‌చంద్ర చూపిన ఆధారాలను నిర్ధారిస్తూ రచయితల సంఘం ఇచ్చిన నివేదనకు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, నాంపల్లి కోర్ట్ ఉత్తర్వులను సమర్థించడంతో కొరటాలకు సుప్రీంకోర్ట్ మెట్లెక్కక తప్పలేదు. ఇప్పుడు అక్కడ కూడా కొరటాలకు చుక్కెదురైంది. కొరటాల శివ దాఖలు చేసిన పిటీషన్‌పై జస్టిస్ హృషికేశ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ధర్మాసనం విచారణ చేపట్టింది. సినిమా విడుదలైన 8 నెలల తర్వాత శరత్‌చంద్ర కోర్టును ఆశ్రయించారని, హైకోర్టు, స్థానిక కోర్టు తమ వాదనలను ఎక్కడా పరిగణనలోకి తీసుకోలేదని కొరటాల తరఫున న్యాయవాదైన వైఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ నిరంజన్‌రెడ్డి వాదనలను వినిపించగా, సుప్రీం ధర్మాసనం ఆ వాదనలను తోసిపుచ్చింది. రచయితల సంఘం నివేదిక ఆధారంగానే హైకోర్ట్ నిర్ణయం తీసుకుందని, పిటీషనర్ కొరటాల పిటీషన్‌ని పరిగణనలోకి తీసుకొని తదుపరి విచారణ జరిపేందుకు కూడా ఏమీ లేదని సుప్రీం స్పష్టం చేసింది. 'పిటీషన్‌ను వెనక్కి తీసుకుంటారా? మమ్మల్నే డిస్మిస్ చేయమంటారా?' అని ధర్మాసనం కొరటాల తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డిని ప్రశ్నించింది. తామే పిటీషన్‌ను వెనక్కి తీసుకుంటాం అని నిరంజన్‌రెడ్డి చెప్పడంతో సుప్రీం కోర్టు అనుమతి మంజూరు చేసింది.




వినోదానికి భావోద్వేగాల మేళవింపు

అభినవ్ గోమఠం, వైశాలి రాజ్ జంటగా నటించిన 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' చిత్రం వచ్చే నెల 23న విడుదల కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌తో పాటు విడుదల తేదీని సోమవారం నిర్మాతలు ప్రకటించారు. తిరుపతిరావు ఇండ్ల దర్శకత్వంలో భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ నిర్మించారు. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'హాస్య నటుడిగా, సహాయ నటుడిగా అందరి ప్రశంసలు అందుకున్న అభినవ్ లోని కొత్త కోణాన్ని ఈ చిత్రంలో చూస్తారు. భావోద్వేగాల మేళవింపుతో లవ్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా చిత్రాన్ని రూపొందించాం. ప్రతి పాత్ర చాలా సహజంగా ఉంటుంది. త్వరలోనే టీజర్ విడుదల చేస్తాం' అని చెప్పారు. తరుణ్ భాస్కర్, అలీ రజా, మొయిన్, చక్రపాణి ఆనంద్, నిళల్‌గళ్ రవి తదితరులు ఈ చిత్రంలో నటించారు. కథ: అన్వర్ సాధిక్, మాటలు: రాధామోహన్ గంటి, ఫొటోగ్రఫీ: సిద్ధార్థ స్వయంభూ.

ఉత్తమ నటుడు రణబీర్, ఉత్తమ నటి అలియా

- 12thఫెయిల్ చిత్రానికి ఆరు అవార్డులు
- కలర్‌ఫుల్‌గా జరిగిన ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక








బాలీవుడ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక ఆదివారం సాయంత్రం గుజరాత్‌లో కలర్‌ఫుల్‌గా జరిగింది. 2023లో విడుదలైన చిత్రాలకు సంబంధించి విజేతలకు అవార్డులు అందించారు. గత ఏడాది 'పఠాన్', 'జవాన్', 'దంకీ' చిత్రాల వరుస విజయాలతో ముందంజలో ఉన్న షారుఖ్‌ఖాన్ పేరు ఉత్తమ నటుడిగా నామినేషన్స్ లిస్ట్‌లో ఉన్నా, ఫైనల్‌గా మాత్రం 'యానిమల్' లో అద్భుతంగా నటించిన రణబీర్ కపూర్‌కు అవార్డ్ దక్కింది. ఈ సినిమా మీద ఎంత కాంట్రవర్సీ వచ్చినా ఘన విజయం సాధించడం గమనార్హం. ఉత్తమ నటుడు అవార్డ్‌తో పాటు మరో మూడు అవార్డులు ఈ చిత్రానికి దక్కాయి. షారుఖ్ ఖాన్ 'జవాన్' చిత్రం యాక్షన్, వీఎఫ్ఎక్స్‌లకు మాత్రం రెండు అవార్డులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బెస్ట్ యాక్టర్‌గా నామినేట్ అయిన మరో హీరో విక్కీ కౌశల్ 'దంకీ' చిత్రంతో ఉత్తమ సహాయ నటుడి అవార్డ్ పొందారు. ఇక 'రాఖీ ఔర్ రాణీకి ప్రేమ్ కహానీ' సినిమాలో అత్యుత్తమ నటన ప్రదర్శించిన అలియా భట్ ఉత్తమ నటి పురస్కారం పొందారు. ఈ సినిమాలోనే నటించిన షబానా అజ్మీ ఉత్తమ సహాయ నటి అవార్డ్ సాధించారు. ఇటీవల విడుదలైన విజయం సాధించిన '12thఫెయిల్' ఉత్తమ చిత్రంగా ఎన్నిక కావడమే కాకుండా మరో ఐదు అవార్డులు పొందింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన విధు వినోద్ చోప్రా ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. మనోజ్ వాజ్‌పేయి నటించిన 'జోరామ్' క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్ అవార్డ్ పొందింది.. డేవిడ్ ధావన్‌ను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. తారల తళుకు బెళుకులు, నృత్యాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ వేడుక సాగింది.

డాక్టర్

కీళ్ల నొప్పులకు, కీళ్ల మార్పిడి చిట్టచివరి పరిష్కారం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే పరిస్థితి అక్కడి వరకూ వెళ్లకుండా అరికట్టే ఆధునిక చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. వాటిలో ప్రధానమైనది రీజెనరేటివ్ మెడిసిన్. మూల కణాలతో కీళ్లలోని మృదులాస్థినీ, కణజాలాన్నీ సహజసిద్ధంగా వృద్ధి చేసే ఈ చికిత్సతో కీళ్ల సమస్యలను తొలగించుకోవచ్చు అంటున్నారు రీజెనరేటివ్ మెడిసిన్ స్పెషలిస్ట్, డాక్టర్ వెంకటేష్ మొవ్వ.




కీళ్ల సమస్యలకు చెక్

కీళ్ల నొప్పులు అనగానే మనకు మోకాళ్లే గుర్తొస్తాయి. మోకీళ్లు అరిగిపోయి, ఎముకలు రెండూ ఒకదానికొకటి రాసుకుంటున్న దృశ్యం మన కళ్ల ముందు మెదులుతుంది. కానీ మన శరీరంలోని కీళ్లన్నీ అరుగుదలకు వీలున్నవే! అలాగే కీళ్ల నొప్పులకు కేవలం మృదులాస్థి అరుగుదల ఒక్కటే కారణం కాదు. టెండాన్లు, లిగమెంట్లలో సమస్యలు కూడా నొప్పులకు దారి తీస్తాయి. క్రీడలు, ప్రమాదాలు, జీవనశైలి అలవాట్లు... ఇలా కీళ్ల సమస్యలకు కారణాలు అనేకం. అయితే సాధారణంగా కీళ్ల ఇబ్బందులను ప్రారంభంలో నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. అవగాహన లేమితో ప్రత్యామ్నాయ వైద్య విధానాలను అనుసరించడం, తోచిన చిట్కాలు పాటించడం లాంటివి చేస్తూ, సమస్యను తీవ్రం చేసుకుంటూ ఉంటాం. ఈ పరిస్థితి అంతిమంగా కీళ్ల మార్పిడికి దారి తీయవచ్చు. కాబట్టి కీళ్లలో తలెత్తిన సమస్యను కచ్చితంగా కనిపెట్టి, సమర్థమైన చికిత్సతో తగ్గించుకోవాలి.

సమస్యను బట్టి చికిత్స

మూల కణాలతో సమస్యను చక్కదిద్దే చికిత్సలు మెరుగైన ఫలితాలను అందిస్తాయి. కాబట్టి వాటితో కీళ్ల మధ్య డ్యామేజీని సరిదిద్దే చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. కొన్ని సందర్భాల్లో ప్లేట్‌లెట్లతో, మరి కొన్ని సందర్భాల్లో మూల కణాలు, ప్లేట్‌లెట్లు.. రెండింటితో సమస్యను సరిదిద్దుకోవలసి ఉంటుంది. కీలు అరిగిపోయినప్పుడు, లిగమెంట్లు, మృదులాస్థి తెగిపోయినప్పుడు కేవలం ప్లేట్‌లెట్లతో చికిత్స చేస్తే సరిపోదు. అక్కడ కణజాలాన్ని వృద్ధి చేసి, మరమ్మతు చేయడం కోసం మూల కణాలు అవసరమవుతాయి. అయితే ఈ మూలకణాలు తమ బాధ్యతను తెలుసుకుని ప్రవర్తించడం కోసం, వాటిని ప్రేరేపించే, గ్రోత్ ఫ్యాక్టర్లు అయిన ప్లేట్‌లెట్లను కూడా జోడించవలసి ఉంటుంది. ఇలా కీళ్లలో కణజాలాన్ని సహజసిద్ధంగా వృద్ధి చేసే రీజనరేటివ్ మెడిసిన్‌తో చికిత్స తీసుకోగలిగితే, సమస్య అక్కడితో సమసిపోవడమే కాకుండా, ముమ్ముందు కీళ్లు అరిగిపోకుండా వాటిని కాపాడుకోవచ్చు. అయితే మనలో చాలా మంది కీళ్లలో సమస్య ఏదైనా, విపరీతంగా ఇబ్బంది పెట్టి నడవలేని స్థితికి చేరుకునే వరకూ వైద్యులను కలవరు. ఈ ధోరణి వల్ల సమస్య తీవ్రం కావడంతో పాటు, కీళ్ల మార్పిడి తప్పని పరిస్థితి తలెత్తవచ్చు.

> **పిఆర్‌పికి శాస్త్రీయ ఆధారాలు లేవు**
>
> శాస్త్రీయంగా నిరూపణ అయిన చికిత్సలనే వైద్యులు అనుసరించాలి. కానీ ఎలాంటి శాస్త్రీయ ఆధారాలూ లేని కొన్ని చికిత్సలు ప్రస్తుతం ఎంతో ఆదరణ పొందుతున్నాయి. ప్లాస్మా రిచ్ ప్లేట్‌లెట్ చికిత్సతో కీళ్లలోని మృదులాస్థి పెరిగినట్టు ప్రపంచంలో ఎక్కడా మనుషుల మీద అధ్యయనాలు జరిగిన ఆధారాలు లేవు. ఇప్పటివరకూ ప్రచురితమైన అధ్యయనాల్లో కూడా ఎక్కడా ఇది కనిపించదు. కానీ చికిత్స ముందూ తర్వాతా చేపట్టిన ఎమ్మారై పరీక్షల్లో, కేస్ స్టడీస్‌లో మూల కణాలతో మృదులాస్థి పెరుగుతున్నట్టు నిరూపణ అయింది. కాబట్టి ఒకవేళ ఎవరైనా పిఆర్‌పి చికిత్సతో మృదులాస్థి పెంచగలుగుతామని పేర్కొంటున్నప్పుడు, ఈ విషయాన్ని నిర్ధారించే అధ్యయనాలు ఇప్పటివరకూ ఎన్ని ప్రచురితమయ్యాయో చూపించమని అడగాలి. పిఆర్‌పిలో గ్రోత్ ఫ్యాక్టర్లే తప్ప సజీవ మూల కణాలు ఉండవు కాబట్టి, ఈ చికిత్స కేవలం ప్రారంభ ఆర్థ్రయిటిస్, టెండనైటిస్, టెండనోసిస్ లాంటి వాటికే ఉపయోగపడుతుంది.



రీజెనరేటివ్ మెడిసిన్ ఎవరికి?

కీళ్లకు సంబంధించిన అన్ని సమస్యల్లో మూలకణాల చికిత్స అవసరమవుతుంది. ఎర్లీ, మోడరేట్, సివియర్.. ఈ మూడు సందర్భాల్లో మూలకణాలతో కూడిన రీజెనరేటివ్ మెడిసిన్ తీసుకోవచ్చు. ప్రారంభ దశలో నొప్పి మొదలైన వెంటనే లేదా కొన్నేళ్లుగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వాళ్లు ఈ చికిత్సకు అర్హులు. కీళ్లు పూర్తిగా అరిగిపోయి, కీళ్ల మార్పిడి దశకు చేరుకుని, వేర్వేరు ఆరోగ్య కారణాల మూలంగా కీళ్ల మార్పిడి చేసుకోలేని వాళ్లు కూడా రీజెనరేటివ్ మెడిసిన్‌ను ఎంచుకోవచ్చు. అయితే ఈ కోవకు చెందిన వాళ్లకు నూటికి నూరు శాతం ఫలితం కనిపించకపోయినా, 80% మెరుగుదల ఉంటుంది. రీజెనరేటివ్ చికిత్స తీసుకుని ఫలితం సంతృప్తికరంగా లేనప్పుడు కీళ్ల మార్పిడి సర్జరీ చేయించుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ సర్జరీ వరకూ వెళ్లి అది విఫలమైన తర్వాత రీజనరేటివ్ సర్జరీ చేయించుకున్నా ఉపయోగం ఉండదు. కాబట్టి కీళ్ల మార్పిడి విషయంలో ఆచితూచి అడుగులేయాలి. కీళ్లకు జరిగిన నష్టం, నష్టం తీవ్రత, జీవనశైలి... ఈ మూడు అంశాల ఆధారంగా చికిత్సను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ అథ్లెట్స్ లాంటి క్రీడాకారులైతే నూటికి నూరు శాతం ఫలితం కోసం కీళ్ల మార్పిడి చికిత్సనే ఎంచుకోవచ్చు.

ఈ కీళ్ల సమస్యల్లో...

మోకీళ్లతో పాటు, తుంటి కీళ్లు, మోచేతులు, మణికట్టు, వేళ్ల కీళ్లు, కాలి గిలకలు, వెన్నులోని డిస్క్ సమస్యలు, సయాటికా, డిస్క్ బల్జ్, భుజాల్లోని రొటేటర్ కఫ్ సమస్యలు, ఆర్థ్రయిటిస్... ఇలా మస్క్యులోస్కెలటల్ సమస్యలన్నింటికీ మూలకణ చికిత్స సత్ఫలితాలనిస్తుంది. అవసరానికి మించి ఒకే కీలును ఉపయోగించడం, ఒకే కీలు మీద పదే పదే ఒత్తిడి పడుతూ ఉండడం వల్ల కీళ్లలో సమస్యలు మొదలు కావచ్చు. ఎక్కువ సమయాల పాటు కూర్చుని పనులు చేసుకునే ఉద్యోగుల్లో వెన్నులోని డిస్క్‌లో ప్రెషర్ పెరిగి, సమస్య మొదలు కావచ్చు. టెన్నిస్, క్రికెట్, పరుగు.. ఇలా వేర్వేరు క్రీడలను ఆడే క్రీడాకారుల్లో కూడా కీళ్ల సమస్య తలెత్తవచ్చు. చేతులను, చేతి వేళ్లనూ ఉపయోగించవలసిన అవసరం ఎక్కువగా ఉండే గృహిణుల్లో ఆయా కీళ్ల సమస్యలు మొదలు కావచ్చు. అలాగే ఎలాంటి వ్యాయామాలు చేయకుండా విశ్రాంతిగా గడిపేవాళ్లలో కూడా కీళ్ల డీకండిషనింగ్ సమస్యలు తలెత్తుతాయి. జారి పడడం, రోడ్డు ప్రమాదాల వల్ల కూడా కీళ్లు దెబ్బతింటాయి. ఇలా యవ్వనుల్లో క్రీడలు, ప్రమాదాల వల్ల, పెద్దల్లో జీవనశైలి అలవాట్ల వల్ల కీళ్ల సమస్యలు మొదలవుతాయి. మన భారతీయుల్లో శరీరానికి సహజసిద్ధ వ్యాయామం అందే అవకాశాలు తక్కువ. దైనందిన జీవితంలో పరిగెత్తవలసిన అవసరం ఉండదు. అలాగే జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేయగలిగే తీరికా ఉండదు. కాబట్టే మనలో మోకీళ్ల అరుగుదల ఎక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువ.

> కీళ్లకు కండరాలే దన్ను
>
> ముఖ్యంగా మోకీళ్లే అరిగిపోతూ ఉండడానికీ, ఎముకలు తేలికగా విరిగిపోవడానికీ కారణం వాటికి కండరాలు దన్నుగా మారకపోవడమే! కండరాల క్షీణత కచ్చితంగా ఎముకల అరుగుదలకు దారి తీస్తుంది. చీరలు కట్టుకునే గృహిణులు దూరంగా అడుగులు వేస్తూ నడవలేరు. దాంతో కాళ్ల కండరాలు కీళ్లకు ఆసరానివ్వవు. వ్యాయామాలు చేయని వాళ్లలో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి జీవనశైలిని కొనసాగించేవాళ్ల కీళ్లు త్వరగా అరిగిపోకుండా ఉండాలంటే వ్యాయామానికి దైనందిన జీవితంలో చోటు కల్పించాలి. నడకతో కాలి కండరాలు బలపడి, కీళ్ల మీద ఒత్తిడి తగ్గుతుంది. అలాగే ఎముకలు, కీళ్లు దృఢంగా మారడానికి బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి. గుండె వేగాన్ని పెంచే కార్డియాక్ వ్యాయామాలతో పాటు కొంత వెయిట్ ట్రైనింగ్ చేయాలి. బరువును అదుపులో పెట్టుకోగలిగే ఆహార నియమాలు పాటించాలి.



ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

సమస్యను వెంటనే కనిపెట్టి సరిదిద్దుకునేవాళ్లు క్రీడాకారులు, అథ్లెట్స్ మాత్రమే! మిగతా వాళ్లందరూ కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ ప్రారంభంలోనే సరిదిద్దుకోగలిగే చికిత్సలు అందుబాటులో ఉన్నాయి కాబట్టి ఈ లక్షణాలను గమనించుకుంటూ ఉండాలి.

- ఒకే కీలులో పదే పదే నొప్పి తలెత్తుతున్నప్పుడు
- వ్యాయామం చేసే సమయంలో ఒక కోణంలో కాళ్లూ లేదా చేతులను లేపలేకపోతున్నప్పుడు...
- దైనందిన జీవితంలో రోజువారీ పనుల్లో ఏదో ఒక పని చేస్తున్నప్పుడు మాత్రమే కీలు సహకరించనప్పుడు... ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను కలవాలి. అలా కాకుండా నొప్పి నుంచి తప్పించుకోవడం కోసం ఆ పనులను మానేస్తే, కాలక్రమేణా సమస్య తీవ్రమై కీళ్లు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంటుంది.

చికిత్స ఇలా...

రోగి కండరాల సామర్థ్యం, కీళ్ల పరిస్థితులను అంచనా వేసిన తర్వాత, పరిస్థితిని మెరుగు పరిచే వ్యాయామాలు, ఆహార నియమాలను సూచించడం జరుగుతుంది. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోయినా, సమస్యను వెంటనే సరిదిద్దవలసిన అవసరం ఉన్న సందర్భాల్లో చికిత్సను మొదలు పెట్టవలసి ఉంటుంది. రీజనరేటివ్ చికిత్స మూడు రోజుల చికిత్స. మొదటి రోజు కీలును పరీక్షించి, లిగమెంట్ ఇంజెక్షన్ ఇచ్చి పంపించేస్తారు. రెండవ రోజు మూల కణాల కోసం తుంటి ఎముక నుంచి ఎముక మజ్జను సేకరించి, ప్రాసెస్ చేసి మూల కణాలను వేరు చేస్తారు. తర్వాత అల్ట్రాసౌండ్ ఇమేజ్ గైడెన్స్ సహాయంతో కీలులో సమస్య ఉన్న చోట మూల కణాలను ఇంజెక్ట్ చేయడం జరుగుతుంది. ఇదంతా లోకల్ ఎనస్థీషియాతో పూర్తయిపోతుంది. రోగి ఇంటికి వెళ్లిపోవచ్చు. మూడవ రోజు మూలకణాలను ప్రేరేపించడం కోసం గ్రోత్ ఫ్యాక్టర్లయిన ప్లేట్‌లెట్లను ఇంజెక్ట్ చేయవలసి ఉంటుంది. నెల తర్వాత కొందరికి మళ్లీ ప్లేట్‌లెట్లను రెండోసారి ఇంజెక్ట్ చేయవలసి ఉంటుంది. అయితే డిస్క్ సమస్యల్లో, వేలి కీళ్లలాంటి చిన్నపాటి కీళ్లకూ ప్లేట్‌లెట్ల అవసరం ఉండదు. ఈ చికిత్సలో ఎలాంటి కోతలూ ఉండవు కాబట్టి రోగి త్వరగా కోలుకునే అవకాశాలుంటాయి. ప్రొసిజర్ తర్వాత, మూడు నుంచి నాలుగు రోజుల పాటు కదలికలను తగ్గించుకోవాలి. వారం తర్వాత వైద్యులు సూచించిన ఫిజియోథెరపీ చేయవలసి ఉంటుంది. జీవనశైలి మార్పులను అనుసరించవలసి ఉంటుంది.

డాక్టర్ వెంకటేష్ మొవ్వ
మేనేజింగ్ డైరెక్టర్ అండ్ రీజనరేటివ్ మెడిసిన్ స్పెషలిస్ట్,
రీజెన్ ఆర్థో స్పోర్ట్,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్.



గుడ్ ఫుడ్

లవంగాలు తింటే?

ఉదయాన్నే లవంగం తినడం వల్ల నోట్లో లాలాజలం పెరిగి జీర్ణశక్తి మెరుగవుతుంది. అలాగే లవంగాలు తలతిరుగుడు, కడుపులో మంటలను కూడా తగ్గిస్తాయి. లవంగాలు తినడం వల్ల వయసు పైబడే వేగం కూడా తగ్గుతుంది. లవంగాన్ని నమలినప్పుడు వెలువడే సుగంధం, దాన్లోని యాంటీమైక్రోబియల్ గుణాలు నోటి ఆరోగ్యానికి దోహదపడతాయి. లవంగం నమలడం వల్ల కలిగే ఇతర ప్రయోజనాలు....



- నోటి దుర్వాసన తొలగిపోతుంది. నోరు తాజాగా ఉంటుంది.
- దీన్లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి.
- జీర్ణశక్తిని పెంచడంతో పాటు, వ్యాధినిరోధకశక్తి సామర్థ్యాన్ని పెంచుతాయి.
- లవంగాలతో మలబద్ధకం తొలగడంతో పాటు, వీటిలోని అనాల్జెసిక్ గుణాల వల్ల ఇది సహజసిద్ధ నొప్పి నివారిణిగా కూడా పని చేస్తుంది.
- లవంగాల్లోని హెపటో ప్రొటెక్టివ్ ప్రభావాలు కాలేయ ఆరోగ్యాన్ని పెంచుతాయి. కాలేయంలో కొత్త కణాల ఉత్పత్తిని పెంచడంతో పాటు, థైమాల్, యూజినాల్ మొదలైన చురుకైన కాంపౌండ్స్‌తో కాలేయంలోని విషాలను తొలగిస్తాయి.

ఫిట్‌నెస్

బరువు ఇలా తగ్గాలి



సన్నగా మారాలనే ఉద్దేశంతో ఉపవాసాలు ఉంటారు. వ్యాయామాలు చేస్తారు. అయినా బరువు తగ్గకపోగా, నీరసం, నిస్సత్తువ ఆవరిస్తోందంటే బరువు తగ్గడం కోసం ఎంచుకున్న మార్గాలను మరోసారి విశ్లేషించాలి. మరీ ముఖ్యంగా మహిళలు ఈ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి.

కడుపు మాడ్చుకుంటూ...

మహిళల్లో క్యాలరీల కోత హార్మోన్ల హెచ్చుతగ్గులకు దారి తీస్తుంది. నెలసరి క్రమం తప్పేలా చేస్తుంది. పోషకాలు తగ్గడం వల్ల పునరుత్పత్తికి తోడ్పడే హార్మోన్ల ఉత్పత్తి తగ్గి గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఎదురు కావచ్చు. టోన్‌డ్ బాడీ కావాలనుకునే మహిళలు, తీసుకునే, ఖర్చుపెట్టే క్యాలరీల మధ్య సమతూకం పాటించాలి. మరీముఖ్యంగా హార్మోన్లు హెచ్చుతగ్గులు గురి కాని ఆహార నియమాలు పాటించాలి.

కార్డియోతో...

ఎక్కువ మంది కేవలం కార్డియోతోనే బరువు తగ్గవచ్చనే అపోహలో ఉంటారు. శరీరం మీద బరువు పడేలా చేసే వెయిట్ ట్రైనింగ్ వ్యాయామాలు కూడా చేస్తూ ఉండాలి. ఈ వ్యాయామాలతో ఎముకలు దృఢపడతాయి. అలాగే మజిల్ మాస్ పెంచే వ్యాయామాలు చేయాలి. ఈ వ్యాయామాల వల్ల శరీరం క్యాలరీలను శక్తి చేసే వేగం పెరుగుతుంది. ఫలితంగా శరీరంలో పేరుకుని ఉండే అదనపు కొవ్వు కరుగుతుంది.

చేతులెత్తేస్తే...

కొంత మంది మహిళలు కొద్ది వారాల్లోనే ఊహించలేనంత ఫలితాలను ఆశిస్తూ ఉంటారు. వాటిని అందుకోలేనప్పుడు చేస్తున్న ప్రయత్నాలను ఆపేస్తూ ఉంటారు. అలాగే హఠాత్తుగా ఉపవాసాలనూ, తీవ్రమైన వ్యాయామాలనూ మొదలు పెట్టేస్తూ ఉంటారు. ఈ రెండూ శరీర ఆరోగ్యానికి హాని కలిగించేవే! ఏ వ్యాయామమైనా, ఉపవాసమైనా శరీరానికి నెమ్మదిగా అలవాటు చేయాలి. ఒక క్రమపద్ధతిని అనుసరించాలి.

హార్ట్ కేర్)

గుండె పదిలంగా...

గుండెకు రక్తసరఫరాలో ఆటంకం ఏర్పడితే గుండెపోటు వస్తుందనే విషయం అందరికీ తెలిసిందే! గుండె రక్తనాళాల్లో కొవ్వు, కొలెస్ట్రాల్‌తో కూడిన ప్లేక్స్ పేరుకోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతుంది. ఇలా ప్లేక్ పేరుకుపోవడాన్ని వైద్య పరిభాషలో 'అథెరోస్క్లెరోసిస్' అంటారు. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే కొన్ని అలవాట్లను అలవరుచుకోవాలి.

మాదకద్రవ్యాలు: మాదకద్రవ్యాల వాడకంతో గుండెకు రక్తసరఫరా తగ్గుతుంది. రక్తపోటు పెరగడం, రక్తనాళాలు గట్టిపడడం, గుండె గోడలు మందంగా మారడం లాంటి మార్పులు చోటు చేసుకుంటాయి.

ధూమపానం: గుండెకు ధూమపానం ప్రధమ శత్రువు. ఈ అలవాటును మానుకుంటే గుండెపోటు వచ్చే అవకాశాలు 65% తగ్గుతాయి. కాబట్టి గుండెపోటుకు గురి కాకుండా ఉండాలంటే ధూమపానం మానేయాలి.

ఒత్తిడి: ఒత్తిడి ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో పాటు గుండెపోటుకు కూడా దారి తీస్తుంది. కాబట్టి యోగా, ధ్యానం, సరిపడా నిద్ర, నడక లాంటి అలవాట్లతో ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలి.



వ్యాయామం: వారానికి కనీసం 150 నిమిషాల వ్యాయామంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. జిమ్‌లో వ్యాయామాలు చేయలేని వాళ్లు నడక, ఈత, సైకిల్ తొక్కడం లాంటి వ్యాయామాలతో కూడా గుండె ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు.

ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్: ఈ రకమైన ఉపవాసంతో వ్యాయామం చేయడంతో సమానమైన ప్రయోజనాలను పొందవచ్చు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ కోసం ఎనిమిది గంటల విండో పీరియడ్ పెట్టుకుని, ఆ వ్యవధిలోగా ఆహారాన్ని తింటూ, 16 గంటల పాటు ఉపవాసం చేయాలి.

ఒమేగా3: ప్రాసెస్ చేసిన ఆహారపదార్థాలు ఇన్సులిన్ రెసిస్టెన్స్, ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఇన్‌ఫ్లమేషన్‌లకు దారి తీసేలా చేస్తాయి. కాబట్టి చేపలు, షియా విత్తనాలు, అవిసె గింజలు, వాల్‌నట్స్ లాంటి ఒమేగా3 సమృద్ధిగా దొరికే పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.

విటమిన్లు, మినరల్స్: ఈ పోషకాలు ఎక్కువగా దొరికే పదార్థాలను తినాలి. ఇందుకోసం తాజా పండ్లు, కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు తీసుకోవాలి.

పీచు ఎక్కువగా: ఆహారంలో పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా మనం రోజుకు 10 నుంచి 15 గ్రాముల పీచును ఆహారంలో భాగంగా తీసుకుంటూ ఉంటాం. కానీ ఈ మోతాదును 25 నుంచి 30 గ్రాములకు పెంచుకుంటే గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

చక్కెర, పిండిపదార్థాలు: ప్రాసెస్ చేసిన పదార్థాల్లో చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. వీటితో గుండెకు కలిగే చేటు ఎక్కువ. కాబట్టి రోజులో మనం తీసుకునే చక్కెర 25 గ్రాములకు మించకుండా చూసుకోవాలి.

హెల్త్ వెల్త్

అయొడిన్ లోపిస్తే?

థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి అయొడిన్ కీలకం. కాబట్టి ఈ పోషకం లోపిస్తే, మెటబాలిజం సమస్యలు వేధిస్తాయి. మన శరీరం స్వతఃసిద్ధంగా అయొడిన్‌ను తయారు చేసుకోలేదు కాబట్టి మనం ఆహారం ద్వారా సరిపడా అయొడిన్ శరీరానికి అందేలా చూసుకోవాలి. ఈ పోషకం లోపాన్ని ఈ లక్షణాల ద్వారా కనిపెట్టి వెంటనే సరిదిద్దుకోవాలి.

- **మలబద్ధకం:** జీర్ణవ్యవస్థ పనితీరుకు థైరాయిడ్ గ్రంథి తగినంత హార్మోన్‌ను విడుదల చేయాలి. అయొడిన్ లోపంతో హార్మోన్ ఉత్పత్తి తగ్గడం మూలంగా మలబద్ధకం మొదలవుతుంది.
- **గుండె ఆరోగ్యం:** అయొడిన్ తగ్గడం వల్ల గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది. దాంతో తల తిరగడం, నిస్సత్తువలు వేధిస్తాయి.



- **గర్భధారణ:** అయొడిన్ లోపంతో థైరాయిడ్ హార్మోన్ స్రావం తగ్గడం వల్ల గర్భధారణ సాధ్యపడదు. అలాగే గర్భంలోని బిడ్డ నాడీసంబంధ ఎదుగుదలకు కూడా అయొడిన్ అవసరం. కాబట్టి గర్భం దాల్చాలనుకునే మహిళలు, గర్భిణులు థైరాయిడ్ హార్మోన్ సరిపడా ఉత్పత్తయ్యేలా ఆహారంలో అయొడిన్ ఉండేలా చూసుకోవాలి.
- **మెడ వాపు:** అయొడిన్ లోపం ప్రధాన లక్షణం మెడ వాపు. థైరాయిడ్ గ్రంథి వాపు ద్వారా ఈ లోపం బయల్పడుతుంది.
- **డిప్రెషన్:** మానసిక కుంగుబాటు, యాంగ్జయిటీలు కూడా అయొడిన్ లోపం లక్షణాలే!
- **ఆహారంతో:** అయొడిన్ లోపాన్ని అయొడిన్ కలిగి ఉండే ఉప్పుతో సరిదిద్దుకోవచ్చు. హైపోథైరాయిడ్ జీవనశైలి సమస్య కాబట్టి వైద్యుల పర్యవేక్షణలో థైరాయిడ్ హార్మోన్‌ను మాత్రల రూపంలో తీసుకుంటూ ఉండాలి.

మోరింగ మహత్తు

అత్యంత పోషకభరిత మొక్కల్లో మునగ ఒకటి. అమీనో యాసిడ్లు, పీచు, విటమిన్లు, బయోయాక్టివ్ కాంపౌండ్లను కలిగి ఉన్న మునగను ఆరోగ్య ప్రయోజనాల కోసం వాడుకోవచ్చు. వీటి ఆకులతో పొడిని తయారు చేసుకుంటే, వాడుకోగలిగే వెసులుబాటు ఎక్కువగా ఉంటుంది. మోరింగ పొడితో ఒరిగే ప్రయోజనాలు, దాన్ని వాడుకునే విధానాల గురించి తెలుసుకుందాం!

ఆకుల్లో పోషకాలు

మునగ ఆకుల్లో ప్రొటీన్‌తో పాటు క్యాల్షియం, బి విటమిన్స్, పొటాషియం, మెగ్నీషియంలతో పాటు 27 రకాల విటమిన్లు, 46 రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అలాగే క్యాల్షియం, అలాగే శరీర జీవక్రియలు సక్రమంగా సాగడానికి తోడ్పడే సూక్ష్మ పోషకాలు, బయోయాక్టివ్ కాంపౌండ్లు మునగాకుల్లో ఉంటాయి.

ఇన్‌ఫ్లమేషన్‌కు విరుగుడు

ఇన్‌ఫెక్షన్‌కు వ్యతిరేకంగా శరీరానికి రక్షణ కల్పించే క్రమంలో తలెత్తే ఇన్‌ఫ్లమేషన్ వల్ల శరీర కణజాలం దెబ్బతింటుంది. అయితే మోరింగాలో ఇన్‌ఫ్లమేషన్‌తో పోరాడే పోషకాలతో పాటు, ఫైటో న్యూట్రియెంట్స్, యాంటియాక్సిడెంట్లు, యాంటీబ్యాక్టీరియల్ కాంపౌండ్లు ఉంటాయి. ఈ శక్తివంతమైన పోషకాలన్నీ ఫ్రీ ర్యాడికల్స్‌ను లక్ష్యం చేసుకుని శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌తో పోరాడతాయి. ఫలితంగా శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గుతుంది.

లైంగిక శక్తి పెరుగుతుంది

ఒత్తిడితో ఫీల్ గుడ్ హార్మోన్, డోపమైన్ మోతాదు తగ్గి లైంగిక కోరికలు సన్నగిల్లుతాయి. మెదడు, హార్మోన్లు, భావోద్వేగాలు, నాడులు, కండరాలు.. ఇలా భిన్నమైన అంశాల సమ్మేళనంతో కూడిన క్లిష్టమైన ప్రక్రియ లైంగిక క్రియ. ఎంతో కాలంగా ఎన్నో రకాల మూలికలు కామోద్దీపనలుగా ఉపయోగపడుతున్నాయి. వాటిలో మోరింగ ఒకటి. మోరింగతో టెస్టోస్టెరాన్ హార్మోన్ ఉత్పత్తి పెరిగి, కార్టిసాల్ తగ్గి, లిబిడో పెరుగుతుందని అధ్యయనాల్లో తేలింది. మరీ ముఖ్యంగా పురుషుల్లో ఒత్తిడి మూలంగా క్షీణించే లైంగికాసక్తి మోరింగతో పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

శక్తి పుంజుకుని

మీకు తెలుసా?



కెఫీన్ లేని ఎనర్జీ బూస్టర్‌గా మోరింగ ఉపయోగపడుతుంది. విటమిన్స్, మినరల్స్‌తో పాటు ఐరన్‌ను కూడా కలిగి ఉండే మోరింగ శక్తిని కూడా పెంచుతుంది. మోరింగలోని బి విటమిన్లు, దీర్ఘకాలపు శక్తికి తోడ్పడతాయి. అలాగే కెఫీన్ కలిగి ఉండే డ్రింక్స్ తాగడం మూలంగా తలెత్తే ఆందోళన, చికాకు లాంటివి మోరింగ డ్రింక్‌తో కలగవు.

కాగ్నిషన్, మూడ్

మోరింగలోని ట్రిప్టోఫాన్ అనే పోషకం మెదడులో సెరటోనిన్ స్రావాన్ని పెంచుతుంది. ఈ ఫీల్ గుడ్ హార్మోన్ మోటార్ ఫంక్షన్‌ను పెంచడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుదలకు కూడా తోడ్పడుతుంది. మోరింగలోని సి, ఇ విటమిన్లు మెదడుకు ఆక్సిడేటివ్ డ్యామేజీ నుంచి రక్షణ కల్పిస్తాయి.

చక్కెర అదుపులో...

దీన్లోని క్లోరోజెనిక్ యాసిడ్, ఐసోథయాసయనేట్స్ రక్తంలోని చక్కెరను అదుపులో ఉంచుతాయి. క్లోరోజెనిక్ యాసిడ్, భోజనం తిన్న వెంటనే కణాల్లోని చక్కెర విడుదల కాకుండా అడ్డుపడి, రక్తంలో చక్కెర మోతాదు పెరగకుండా నియంత్రిస్తాయి. మోరింగ.. ఫాస్టింగ్ బ్లడ్ షుగర్స్, ఇన్సులిన్ మోతాదుల మీద సానుకూల ప్రభావాన్ని చూపిస్తున్నట్టు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

వృద్ధాప్య ఛాయలు దూరం

మోరింగలోని ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్ ముఖం మీద ముడతలు లాంటి వృద్ధాప్య ఛాయలను దూరం చేసి, చర్మాన్ని యవ్వనంగా మారుస్తాయి. మోరింగలోని శక్తివంతమైన కాంపౌండ్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రభావాలను అందించి, యాంటీ ఏజింగ్ ప్రయోజనాలను కల్పిస్తాయి.

ఇలా తినాలి

- **మార్నింగ్ టీ:** గోరువెచ్చని నీళ్లలో ఒక టీస్పూను మోరింగ పొడిని కలుపుకుని, అవసరమనుకుంటే తేనె, నిమ్మరసం కలుపుకుని తాగాలి. వేడి చేయడం వల్ల మోరింగలోని యాంటీఆక్సిడెంట్లను నష్టపోయే అవకాశాలు ఉంటాయి.
- **స్మూదీల్లో:** యాపిల్, అరటి, పీనట్ బటర్, స్ట్రాబెర్రీ.. వీటితో స్మూదీ తయారుచేసుకున్నప్పుడు, దాన్లో ఒక టీస్పూను మోరింగ పొడిని కలుపుకోవచ్చు.
- **కూరల్లో:** కూరలు, పప్పు వండుకునేటప్పుడు మోరింగను కలపకుండా, వంట పూర్తయిన తర్వాత, మోరింగ్ పొడిని చిలకరించుకోవచ్చు.
- **బ్రేక్‌ఫాస్ట్:** పూరీ, భాజీ, పరాఠా, సలాడ్, ఉడకబెట్టిన గుడ్లు వీటిలో కలుపుకుని తినొచ్చు.
- **స్నాక్స్:** మోరింగ్‌ను దేన్లోనైనా కలుపుకోవచ్చు. కాబట్టి బిస్కెట్లు తయారుచేసే పిండిలో, దోసెల పిండిలో, గోధుమ పిండిలో కలుపుకుని వాడుకోవచ్చు. చట్నీలు, పకోడీల్లో కలుపుకోవచ్చు.

అండర్-19 ప్రపంచ కప్ సూపర్ సిక్స్ పోరు నేడు

భారత్ X న్యూజిలాండ్

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ...

హాకీలో క్వార్టర్స్‌కు

ఎఫ్ఐహెచ్ ఫైవ్స్ వరల్డ్‌కప్

మస్కట్: ఎఫ్ఐహెచ్ హాకీ ఫైవ్స్ పురుషుల వరల్డ్ కప్‌లో భారత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన తమ గ్రూప్-బిలోని ఆఖరి, మూడో మ్యాచ్‌లో భారత్ 13-0 గోల్స్ తేడాతో జమైకాపై భారీ విజయాన్ని సాధించింది. మణిందర్ సింగ్ 4 గోల్స్‌తో చెలరేగగా, మన్‌జీత్, రహీల్ మన్‌దీప్ మోర్ తలా రెండు గోల్స్‌తో అదరగొట్టారు.



సోనమ్ సిల్వర్ షూట్

కైరో (ఈజిప్టు): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ల హవా సాగుతోంది. సోమవారం జరిగిన పోటీల్లో యువ షూటర్ సోనమ్ మస్కార్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో రజతం సాధించింది. తొలిసారి వరల్డ్ కప్‌లో పోటీపడ్డ సోనమ్ ఫైనల్స్‌లో 252.1 స్కోరు చేసి రెండోస్థానంలో నిలిచింది. జర్మనీ షూటర్ యానా జాన్సెన్‌కు స్వర్ణం, పోలెండ్‌కు చెందిన అనెటాకు కాంస్యం దక్కాయి.



'స్వర్ణ' వంశీ

ఖేలో లిఫ్టింగ్‌లో ఏపీ కుర్రోడికి పతకం

చెన్నై: ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వంశీ స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. సోమవారం జరిగిన బాలుర 102 కిలోల విభాగంలో మొత్తం 280 (126+154కి.) కేజీల బరువెత్తిన వంశీ అగ్రస్థానంలో నిలిచాడు. బాలుర 96 కి. కేటగిరీలో అరుణేష్ బాబు (117+141కి.) మొత్తం 258 కిలోలు లిఫ్ట్‌చేసి రజత పతకం సాధించాడు. బాలికల 71 కి. విభాగంలో దేవిశ్రీ (76+98 =174కి.) కాంస్య పతకం సొంతం చేసుకుంది.

ఇలాగైతే కష్టమే!



హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ అందరి అంచనాలను తలకిందులు చేసింది. స్పిన్నర్లకు స్వర్గధామంలా ఉండే ఉపఖండ పిచ్‌లపై బజ్‌బాల్ గేమ్ పనికిరాదన్న అభిప్రాయాలను తోసిరాజన్న రీతిలో వారి ఆట తీరు సాగింది. చివరకు తమ వ్యూహాన్నే నమ్ముకుని 28 పరుగుల తేడాతో గెలిచి చూపించారు. వాస్తవానికి 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించి కూడా భారత ఆటగాళ్ల మ్యాచ్‌ని సమర్పించుకోవడం అభిమానులకు మింగుడుపడలేదు. భారత ప్రధాన ఆయుధమైన స్పిన్‌ను ఒల్లీ పోప్ స్వీప్ షాట్లతో చెడుగుడు ఆడాడు. స్లో టర్నింగ్ పిచ్‌పైనా అశ్విన్, జడేజా, అక్షర్ ప్రభావం చూపలేకపోయారు. ఇంగ్లండ్ 400కు పైగా పరుగులు చేయడంతో భారత్ తీవ్ర ఒత్తిడికి లోనుకావాల్సి వచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో గతంలో ఎన్నడూ ఓ జట్టు ఇక్కడ ఇన్ని రన్స్ కొట్టలేదు. ఇక టెస్టులో 200+ ఛేదన అంటే ఏమాత్రం సులువు కాదు. కానీ ఐదు సెషన్లున్న వేళ భారత బ్యాటర్లు కాస్త సహనంతో ఆడాల్సిందన్న అభిప్రాయం అంతటా వ్యక్తమైంది. ఓ అరంగేట్ర స్పిన్నర్‌కు ఏడు వికెట్లు సమర్పించుకుని తెల్లమొహం వేయాల్సి వచ్చింది. యువ ఆటగాళ్లు స్పిన్‌పై ఎదురుదాడికి దిగేందుకు భారీ షాట్లను నమ్ముకుని మూల్యం చెల్లించుకున్నారు. కానీ ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే.. రిస్క్ తీసుకోకుండా సింగిల్స్, డబుల్స్‌తోనూ వారిపై ఒత్తిడి పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. గతంలో ద్రవిడ్, లక్ష్మణ్ ఇలాగే ఆడుతూ ఆడుకునేవారు. ప్రస్తుత జట్టులో కోహ్లీ మాత్రమే అలాంటి ఆటతీరును ప్రదర్శిస్తాడని చెప్పవచ్చు. లెఫ్టామ్ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తన బలహీనతకు కూడా ఈ తరహా ఆటతీరుతోనే అధిగమిస్తాడు. స్పిన్‌ను ఆడేటప్పుడు మణికట్టు, పాదాల కదలిక ఎక్కువ ప్రభావం చూపుతుందనే విషయాన్ని యువ ఆటగాళ్లు మరిచిపోరాదని మాజీలు సూచిస్తున్నారు.

గతంలా కాదు..

2021లోనూ ఇంగ్లండ్ జట్టు భారత్‌లో పర్యటించినప్పుడు తొలి టెస్టును గెలిచి.. ఆ తర్వాత మూడింటిని ఓడింది. అయితే ఆ సమయంలో కోహ్లీ, రహానె, పంత్ మిడిలార్డర్‌లో స్పిన్‌ను అద్భుతంగా ఎదుర్కోగలిగారు. కానీ ఈసారి రెండో టెస్టులో ఆ త్రయం లేదు. ఇటు చూస్తే శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్.. స్పిన్ బౌలింగ్‌లో ఇబ్బందిపడుతుంటారు. వాస్తవానికి ఈ ఇద్దరూ గత పది ఇన్నింగ్స్‌లో ఎలాంటి ప్రభావమూ చూపలేదు. ఇక, విశాఖ టెస్టుకు జడేజా, రాహుల్ దూరమవడం మరో దెబ్బ. అటు విజయం రుచి చూసిన ఇంగ్లండ్‌ను నిలువరించడం మనోళ్లకు పెద్ద సవాలే. ఈ మ్యాచ్ కోసం ఎలాంటి పిచ్‌ను రూపొందించినా సమష్టి ఆటతీరును ప్రదర్శిస్తేనే ఫలితం కనిపిస్తుంది. అప్పటి రూట్ సేనలా కాకుండా ప్రస్తుతం మెకల్లమ్ శిక్షణలో ఉన్న ఇంగ్లండ్ జట్టు పూర్తి విభిన్నంగా ముందుకెళ్తోంది. అందుకే 2-0తో వారికి ఆధిక్యం అప్పగిస్తే తిరిగి కోలుకోవడం కష్టమే. ఏదిఏమైనా తమ మైండ్‌సెట్‌తో పాటు బ్యాటింగ్‌లో లోపాలను కూడా రోహిత్ సేన వెంటనే సరిచేసుకుని దాడి ఆరంభించాల్సి ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఐదో స్థానానికి టీమిండియా

దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో భారత జట్టు రెండు నుంచి ఐదో స్థానానికి పడిపోయింది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఓటమే ఇందుకు కారణం. ఆసీస్ టాప్‌లో ఉండగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ తర్వాత స్థానంలో టీమిండియా కొనసాగుతోంది. ప్రస్తుత సీజన్‌లో భారత్ ఆడిన ఐదు టెస్టుల్లో రెండు విజయాలు, రెండు ఓటములు, ఓ డ్రాతో ఉంది. అటు ఆసీస్‌పై అద్భుత విజయం సాధించిన విండీస్ జట్టు ఇంగ్లండ్‌ను వెనక్కినెట్టి ఏడో స్థానానికి వెళ్లింది.

బుమ్రాకు మందలింపు

హైదరాబాద్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో బుమ్రా తన ప్రవర్తనతో ఐసీసీ మందలింపునకు గురయ్యాడు. ప్రత్యర్థి రెండో ఇన్నింగ్స్ 81వ ఓవర్‌లో పోప్ వికెట్ల మధ్య పరుగు తీస్తున్నప్పుడు బుమ్రా ఉద్దేశపూర్వకంగానే అతడికి అడ్డుగా వెళ్లి ఢీకొన్నాడు. ఇది నిబంధనలకు విరుద్ధం కావడంతో మందలింపుతో పాటు అతడి ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది.

రెండో టెస్టుకు జడేజా, రాహుల్ దూరం


సర్ఫరాజ్‌కు పిలుపు
సౌరభ్, సుందర్‌లకు కూడా..



సర్ఫరాజ్



సౌరభ్



సుందర్

హైదరాబాద్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో అనూహ్య పరాజయం పాలైన మర్నాడే భారత క్రికెట్ జట్టుకు మరో షాక్ తగిలింది. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో పాటు విడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ గాయాలతో విశాఖలో జరిగే రెండో టెస్టుకు దూరమయ్యారు. దీంతో దేశవాళీ క్రికెట్‌లో టన్నులకొద్దీ పరుగులు సాధిస్తున్నా జాతీయ జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న సర్ఫరాజ్ ఖాన్‌కు ఎట్టకేలకు పిలుపొచ్చింది. అలాగే యూపీ లెఫ్టామ్ స్పిన్నర్ సౌరభ్ కుమార్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌లకు కూడా సెలెక్టర్లు టెస్టు జట్టులో చోటు కల్పించారు. ఇప్పటికే విరాట్ వ్యక్తిగత కారణాలతో తొలి రెండు టెస్టులకు దూరమయ్యాడు. తాజాగా జడ్డూ తొడ కండరాల గాయం, రాహుల్ కుడి కాలి కండరాల నొప్పితో అందుబాటులో లేకపోవడం జట్టుకు ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. రంజీల్లో నిలకడగా పరుగులు సాధిస్తున్న సర్ఫరాజ్ ఇటీవల భారత్ 'ఎ' తరఫున ఇంగ్లండ్ లయన్స్‌పై శతకంతో ఆకట్టుకున్నాడు.

రెండో టెస్టుకు భారత జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, జైస్వాల్, శ్రేయాస్, భరత్, ధ్రువ్ జురెల్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, సిరాజ్, ముకేశ్, బుమ్రా, అవేశ్, రజత్, సర్ఫరాజ్, వాషింగ్టన్ సుందర్, సౌరభ్ కుమార్.

రింకూ సింగ్ తండ్రి సిలిండర్ల డెలివరీ పనిలోనే..



నెట్‌లో వీడియో వైరల్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో సంచలన బ్యాటింగ్‌తో పరుగుల వరద పారించిన రింకూ సింగ్.. గతేడాది భారత జట్టులో చోటు దక్కించుకొన్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో అద్భుత ఫినిషర్‌గా రాణిస్తున్న రింకూ పేరు అంతటా మార్మోగి పోతోంది. అయితే, తాజాగా అతడి తండ్రి ఖాన్‌చంద్ సింగ్ వీడియో ఒకటి నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఖాన్‌చంద్ గ్యాస్ సిలెండర్లు డెలివరీ చేస్తుంటాడు. కొడుకు అంతర్జాతీయ క్రికెటర్ అయినా.. చంద్ మాత్రం తన వృత్తిని వీడలేదు. దీంతో 'చేసే పనిని దైవంగా భావిస్తున్నారు, మూలాలు మరువలేదు, మీ ఫ్యామిలీ సూపర్' అంటూ పలువురు ప్రశంసలు కురిపించారు. 'నాన్నను విశ్రాంతి తీసుకోవాలని కోరా. కానీ, ఆయన కష్టపడడాన్నే ఇష్టపడతారని రింకూ ఇటీవలే మీడియాతో చెప్పాడు.

కోహ్లీ నామీద ఉమ్మాడు

దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఎల్గర్



కేప్‌టౌన్: ఓ టెస్ట్ మ్యాచ్ సందర్భంగా టీమిండియా బ్యాటర్ విరాట్ కోహ్లీ తనపై ఉమ్మాడని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ వెల్లడించాడు. అయితే అతడి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు సహచరుడు ఏబీ డివిల్లీర్స్ జోక్యంతో ఆ సంఘటనపై విరాట్ తనకు క్షమాపణ చెప్పాడని తెలిపాడు. భారత్‌తో ఇటీవల ముగిసిన రెండు టెస్టుల సిరీస్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఎల్గర్ వైదొలగిన సంగతి తెలిసిందే. ఏ టెస్ట్ సిరీస్ సందర్భంగా ఆ ఘటన చోటు చేసుకున్నదో ఎల్గర్ వెల్లడించలేదు. కానీ అది 2015లో భారత్‌లో సౌతాఫ్రికా జట్టు పర్యటన అని భావిస్తున్నారు. 'అశ్విన్ బౌలింగ్‌ను నేను ఎదుర్కొనే క్రమంలో నాకు, విరాట్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సందర్భంగాలో అతడు నాపై ఉమ్మాడు' అని 'బాంటర్ విత్ ద బాయ్స్' అనే పాడ్‌కాస్ట్‌లో ఎల్గర్ తెలిపాడు. 'ఆ ఉదంతం గురించి తర్వాత తెలుసుకున్న డివిల్లీర్స్..నా సహచరుడిపై ఉమ్మడం సరికాదని కోహ్లీతో అన్నాడు' అని వివరించాడు. 'రెండు సంవత్సరాల తర్వాత సౌతాఫ్రికాలో టూర్ సమయంలో విరాట్ నాకు క్షమాపణ చెప్పాడు. సిరీస్ ముగిసిన తర్వాత మనిద్దరం కలిసి డ్రింక్ చేసేందుకు వెళ్దామని కూడా ప్రతిపాదించాడు. అలా మేం ఇద్దరం తెల్లవారుజామున మూడింటి వరకూ తాగాం' అని ఎల్గర్ వెల్లడించాడు.

60 ఏళ్ల తర్వాత ..

● పాక్‌లో భారత డేవిస్ కప్ జట్టు
● అధ్యక్ష తరహా భద్రత



ఇస్లామాబాద్: అరవై ఏళ్ల తర్వాత భారత డేవిస్‌కప్ జట్టు తొలిసారి పాకిస్థాన్‌లో అడుగుపెట్టింది. డేవిస్ కప్ గ్రూప్-1 ప్లేఆఫ్స్‌లో భాగంగా వచ్చేనెల 3, 4 తేదీల్లో పాక్‌తో భారత్ తలపడనుంది. ఆదివారం రాత్రి ఇక్కడకు చేరుకొన్న ఐదుగురు సభ్యుల భారత జట్టుకు అధ్యక్ష తరహా భద్రతను కల్పించారు. ప్లేయర్ల భద్రతపై ఆందోళన వ్యక్తమవడంతో.. ఎక్కడా రాజీపడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు పాకిస్థాన్ టెన్నిస్ సమాఖ్య తెలిపింది. భారత బృందం చుట్టూ నాలుగు లేదా ఐదంచెల భద్రతా వలయం ఉంటుందని చెప్పింది. 1964లో చివరిసారి భారత డేవిస్‌కప్ జట్టు పాక్‌లో పర్యటించింది. 1973, 2019లో తటస్థ వేదికలపై పాక్‌తో తలపడింది. అయితే, ఈసారి వేదికను మార్చాలని అఖిల భారత టెన్నిస్ సమాఖ్య తీవ్రంగా ప్రయత్నించినా సాధ్యపడలేదు.

ఆంధ్ర ఘన విజయం

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌తో జరిగిన గ్రూప్ 'బి' రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర 126 పరుగులతో ఘన విజయం సాధించింది. 320 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 20/0తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన చత్తీస్‌గఢ్ 193 పరుగులకు ఆలౌటైంది. ప్రశాంత్, నితీశ్ చెరో మూడేసి, పృథ్వీరాజ్ రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో ఏపీకి ఆరు పాయింట్లు లభించాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 431, రెండో ఇన్నింగ్స్‌లో 150/2 డిక్లేర్డ్ స్కోరు చేసింది. ఇక..చత్తీస్‌గఢ్ మొదటి ఇన్నింగ్స్‌లో 262 పరుగులు సాధించింది.

హరియాణా గెలుపు

పట్నా: ప్రొ.కబడ్డీ లీగ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో హరియాణా జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను మెరుగుపరచుకుంది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 32-20తో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది.

బుల్ చెలరేగెన్..



సెన్సెక్స్ 1,241 పాయింట్లు అప్

21,700 ఎగువకు నిఫ్టీ

రిలయన్స్, బ్యాంకింగ్ షేర్ల ర్యాలీతో భారీగా లాభపడిన సూచీలు

ఒక్కరోజులో రూ.6 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం ట్రేడింగ్‌లో భారీగా లాభపడ్డాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు బ్యాంకింగ్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. ఇంట్రాడేలో 1,309 పాయింట్లు ఎగిసి 72,000 స్థాయిని దాటిన సెన్సెక్స్.. చివరికి 1,240.90 పాయింట్ల (1.76 శాతం) లాభంతో 71,941.57 వద్ద ముగిసింది. నిఫ్టీ 385 పాయింట్ల (1.80 శాతం) వృద్ధితో 21,737.60 వద్దకు చేరుకుంది. గత ఏడాది డిసెంబరు 4 తర్వాత సూచీలకిది అతిపెద్ద లాభం. కొనుగోళ్ల హోరుతో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.6.09 లక్షల కోట్ల మేర పెరిగి రూ.377.20 లక్షల కోట్లుగా (4.53 లక్షల కోట్ల డాలర్లు) నమోదైంది.

రిలయన్స్.. రూ.19.60 లక్షల కోట్లు

రూ.2,900 స్థాయికి కంపెనీ షేరు

రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు రివ్వున ఎగిసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ధర ఒకదశలో 7.18 శాతం వృద్ధితో రూ.2,905 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి షేరు 6.86 శాతం లాభంతో రూ.2,896.15 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.1.26 లక్షల కోట్ల మేర పెరిగి మొత్తం రూ.19.59 లక్షల కోట్లకు చేరుకుంది. రిలయన్స్ మార్కెట్ క్యాప్ రూ.19 లక్షల కోట్ల మైలురాయిని దాటం ఇదే తొలిసారి. సోమవారం సెన్సెక్స్, నిఫ్టీ లాభంలో 37 శాతం వాటా రిలయన్స్‌దే. గత మూడు సెషన్లుగా రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు లాభాల్లో పయనిస్తోంది. ఈ మూడ్రోజుల్లో 9 శాతం పెరిగాయి. ఈ నెలలో ఇప్పటివరకు 12 శాతం వృద్ధి కనబర్చింది.

క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్ ఇండెక్స్‌లు రెండు శాతానికి పైగా ఎగబాకాయి. బ్యాంకెక్స్ 1.42 శాతం బలపడింది.

● ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసలు క్షీణించి 83.16 వద్ద ముగిసింది. ముడి చమురు ధరల పెరుగుదల, ఇంధన దిగుమతిదారులు డాలర్ కొనుగోళ్లకు పాల్పడటం మన కరెన్సీని బలహీనపరిచింది.

● అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో 8305 డాలర్ల వద్ద ట్రేడైంది. ఇరాన్ మిలిటెంట్లకు చెందిన డ్రోన్ అమెరికా సాయుధ దళాలపై దాడి జరిపిన నేపథ్యంలో బైడెన్ సర్కారు ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించింది. ఈ పరిణామంతో ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడవచ్చన్న ఆందోళనలు ధరల పెరుగుదలకు కారణమయ్యాయి.

30లో 25 లాభాల్లో..

సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 లాభాల్లో పయనించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు దాదాపు 7 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్, ఎల్ అండ్ టీ, కోటక్ బ్యాంక్, ఎన్‌టీపీసీ షేర్లు మూడు శాతానికి పైగా పుంజుకోగా.. అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్ 2 శాతానికి పైగా పెరిగాయి. త్రైమాసిక ఫలితాల విడుదల నేపథ్యంలో ఐటీసీ షేరు 1.20 శాతం క్షీణించి సెన్సెక్స్ టాప్ లూజర్‌గా మిగిలింది. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అర శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.68 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.03 శాతం పెరిగాయి. రంగాలవారీ సూచీల్లోనూ ఎఫ్ఎంసీజీ, ఐటీ, టెక్ తప్ప మిగతావన్నీ లాభపడ్డాయి. ఎనర్జీ రంగ సూచీ ఏకంగా 5.29 శాతం వృద్ధి చెందగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 4.94 శాతం, పవర్ 3.03 శాతం పెరిగాయి. సర్వీసెస్,

కలిసివచ్చిన అంశాలు..

- ఆసియా స్టాక్ మార్కెట్లలో ర్యాలీ
- మధ్యంతర బడ్జెట్‌పై సానుకూల అంచనాలు
- ఈ మధ్య భారీగా నష్టపోయిన బ్యాంకింగ్, ఇతర షేర్లలో తిరిగి కొనుగోళ్లకు పాల్పడిన ఇన్వెస్టర్లు
- తాజాగా విడుదలైన త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలకు అనుగుణంగా ఉండటం


'వి హబ్'తో ఆస్ట్రేలియా ఒప్పందం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోని 'వి హబ్'తో ఆస్ట్రేలియా ప్రభుత్వం ఒక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. భారత్‌లో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఓమ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ విషయం ప్రకటించారు. ఈ భాగస్వామ్య ఒప్పందం ద్వారా మహిళలు, అణగారిన వర్గాలు, ఎల్‌జీబీటీ వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వి హబ్‌లో వ్యాపార నైపుణ్యాల్లో 'స్టార్ట్ ఎక్స్' పేరుతో 13 వారాల ప్రీ ఇంక్యుబేషన్ కోర్సు అందిస్తారు. వి హబ్‌తో ఒక విదేశీ ప్రభుత్వం ఈ తరహా భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే మొదటిసారని ఆస్ట్రేలియా హై కమిషనర్ తెలిపారు.

పవర్‌మెక్‌కు రూ.645 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్: రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్), నైవేలి ఉత్తరప్రదేశ్ పవర్ లిమిటెడ్ (ఎన్‌యూపీపీఎల్) నుంచి రూ.644.91 కోట్ల విలువ గల ఆర్డర్లు అందుకున్నట్టు పవర్ మెక్ ప్రాజెక్ట్స్ సోమవారం ప్రకటించింది. సెంట్రల్ రైల్వేకు చెందిన మహారాష్ట్రలోని యావత్మాల్-నాందేడ్ కొత్త బ్రాడ్ గేజ్ మార్గం నిర్మాణ ప్రాజెక్టు (రూ.381.34 కోట్లు) ఒకటి కాగా ఘట్టంపూర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు సమగ్ర నిర్వహణ, మెయింటెనెన్స్ ప్రాజెక్టు (రూ.263.57 కోట్లు) మరొకటని తెలిపింది.


● జమ్ము అండ్ కశ్మీర్ బ్యాంక్‌తో మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా డీలర్లకు ఇన్వెంటరీపై నిధులను అందించనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 4,000 మారుతి సుజుకీ సేల్స్ ఔట్‌లెట్స్‌కు లబ్ధి చేకూరనుంది. డీలర్లకు అవసరమైన మూలధన అవసరాల కోసం బ్యాంక్ తోడ్పాటునందించనుంది. ఎంఎస్ఐ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాత్సవ, సమక్షంలో మారుతి సుజుకీ జనరల్ మేనేజర్ విశాల్ శర్మ, బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధీర్ గుప్తా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,050 ▲	57,800 ▲	77,700 ▲
ముంబై	62,515 ▲	57,264 ▲	71,371 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ	
హైదరాబాద్	520
30 జనవరి	
చిత్తూరు	573
గోదావరి	530
విజయవాడ	530
విశాఖపట్నం	565
వరంగల్	522
డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109
వరంగల్	109
కరీంనగర్	109
మహబూబ్‌నగర్	109
కర్నూలు	109
విశాఖపట్నం	110
గోదావరి	113
విజయవాడ	113
గుంటూరు	114
ఒంగోలు	114
చిత్తూరు	123

హెరిటేజ్ ఫుడ్స్ లాభంలో 96% వృద్ధి

హైదరాబాద్: హెరిటేజ్ ఫుడ్స్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ రూ.941.10 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.26.9 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 19.7 శాతం వృద్ధి చెందగా లాభం ఏకంగా 96.4 శాతం వృద్ధి చెందిందని హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. త్రైమాసిక సమీక్షా కాలంలో వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల నుంచి వచ్చిన ఆదాయం 23.19 శాతం పెరిగిందని పేర్కొంది. అలాగే పాల విక్రయాల్లో 2.32 శాతం వృద్ధి నమోదైందని తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో మంచి పనితీరును కనబరిచామని, వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల విభాగం పటిష్ఠమైన వృద్ధి సాధించటం ఎంతగానో కలిసివచ్చిందని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా తెలిపారు. అంతేకాకుండా డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ విస్తరణ, కొత్త ఉత్పత్తుల విడుదల కూడా ఇందుకు దోహదపడిందన్నారు. కాగా రానున్న రోజుల్లో ఇదే జోరును కనబరచవచ్చని విశ్వసిస్తున్నట్లు బ్రహ్మణి చెప్పారు. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను కంపెనీ రూ.2,843.30 కోట్ల

అజాద్ ఇంజనీరింగ్‌తో రోల్స్ రాయిస్ ఒప్పందం

హైదరాబాద్: రక్షణ రంగానికి అవసరమైన ఏరో ఇంజన్ విడిభాగాలు తయారు చేయడంలో సహకారానికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన అజాద్ ఇంజనీరింగ్‌తో రోల్స్-రాయిస్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ దీర్ఘకాలిక ఒప్పందం కింద అజాద్ ఇంజనీరింగ్ కంపెనీ రక్షణ విమానాల ఇంజన్ల విడిభాగాలు తయారు చేసి సరఫరా చేస్తుంది. ఆ రకంగా రోల్స్ రాయిస్‌కు చెందిన సాంకేతికంగా ఆధునికమైన ఏరో ఇంజన్ల ప్రపంచ సరఫరా విభాగంలో ఒక భాగస్వామిగా మారుతుంది. అజాద్ ఇంజనీరింగ్ భాగస్వామ్యంలో తాము భారతదేశంలో సరఫరా వ్యవస్థను విస్తరించాలనుకుంటున్నామని రోల్స్-రాయిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అలెక్స్ జినో అన్నారు. దేశంలో తయారీ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలన్న తమ లక్ష్యం సైతం దీనితో తీరుతుందని ఆయన తెలిపారు. అత్యంత సంక్లిష్టమైన ఈ విడిభాగాల తయారీని భారత్‌కు తీసుకురావడం తమ సామర్థ్యాలకు నిదర్శనమే కాదు... భారత ఏరోస్పేస్, రక్షణ పరిశ్రమకు అత్యంత కీలకం అని అజాద్ ఇంజనీరింగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాకేశ్ చోప్దార్ అన్నారు. అత్యాధునిక తయారీ విభాగాల్లో నానాటికీ పెరుగుతున్న భారతదేశ శక్తిని ఇది నిరూపిస్తున్నదని ఆయన చెప్పారు.

'కార్వీ' కేసులో ఒత్తిడి చేయొద్దు

ఒత్తిడి చేస్తే దుకాణం మూతే : ఎన్ఎస్‌డీఎల్

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో తమపై దయ చూపాలని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్).. సుప్రీంకోర్టును కోరింది. గత ఏడాది డిసెంబరు 13న సెక్యూరిటీస్ అప్పిలేట్ అథారిటీ ట్రైబ్యునల్ (శాట్) ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని ఒత్తిడి చేయవద్దని కోరింది. శాట్ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాల్సి వస్తే, సంస్థను మూసివేయడం తప్ప తమ క్లయింట్‌కు మరో మార్గం లేదని ఎన్ఎస్‌డీఎల్ తరఫు న్యాయవాది ఆర్యమ సుందరం సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపారు. సెబీ ఆదేశాల ప్రకారం ఎన్ఎస్‌డీఎల్ కార్వీ స్టాక్ బ్రోకింగ్ డీమ్యాట్ ఖాతాలను స్తంభింపచేయడం 'బహిరంగ దారిదోపిడీ' అని శాట్ గత ఏడాది ఇచ్చిన తీర్పులో పేర్కొంది. అంతేకాకుండా ఇందుకు సెబీ, ఎన్ఎస్‌డీఎల్, ఎన్ఎస్ఈ సంస్థలు షేర్లు తాకట్టు పెట్టుకుని కార్వీకి అప్పులిచ్చిన బ్యాంకులకు రూ.1,433 కోట్ల మొత్తాన్ని ఏటా 10 శాతం వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఎన్ఎస్‌డీఎల్ దీన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

● **తగ్గిన వొడాఫోన్ ఐడియా నష్టాలు**

న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా (వీఐఎల్).. డిసెంబరు త్రైమాసికంలో రూ.6,986 కోట్ల నికర నష్టాలను మూటగట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.7,990 కోట్లు)తో పోల్చితే నష్టం తగ్గింది. త్రైమాసిక సమీక్షా కాలంలో రూ.755.5 కోట్ల వన్‌టైమ్ ఆదాయం రావటంతో నష్టం తగ్గిందని పేర్కొంది. కాగా ఈ కాలంలో కంపెనీ కార్యకలాపాల ఆదాయం రూ.10,620.6 కోట్ల నుంచి రూ.10,673.10 కోట్లకు పెరిగింది. సమీక్షా కాలంలో ఒక్కో వినియోగదారుడు నుంచి వచ్చిన సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 7.7 శాతం వృద్ధి చెంది రూ.145కు పెరిగింది. ఎంట్రీ లెవల్ ప్లాన్‌లో మార్పులు, సబ్‌స్క్రైబర్ అప్‌డేట్స్‌తో ఇది పెరిగిందని పేర్కొంది.

● **ఎన్‌టీపీసీ లాభం రూ.5,209 కోట్లు**

న్యూఢిల్లీ: ఎన్‌టీపీసీ.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.5,208.87 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.4,854.36 కోట్లు)తో పోల్చితే లాభం 7 శాతం వృద్ధి చెందింది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం రూ.44,989.21 కోట్ల నుంచి రూ.43,574.65 కోట్లకు తగ్గింది. ఇదే కాలంలో మొత్తం వ్యయాలు కూడా రూ.37,007.51 కోట్ల నుంచి రూ.38,782.22 కోట్లకు పెరిగింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.2.25 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

24 గంటల ట్రేడింగ్‌పై జర జాగ్రత్త

సెబీ చీఫ్ మాధవి



న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లో 24 గంటలు ట్రేడింగ్‌ను అనుమతించాలన్న సూచనపై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెబీ అయితే ఇప్పటి వరకు దీనిపై ఒక అభిప్రాయానికి రాలేదన్నారు. అలాగే ఏ ఒక్కరి నుంచీ తమకు దీనికి సంబంధించిన ప్రతిపాదనా రాలేదన్నారు. స్టాక్ బ్రోకర్లు నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ విషయం స్పష్టం చేశారు. బ్రోకర్లు మాత్రం మదుపరుల అభిప్రాయాలు సేకరించి వచ్చే నెలాఖరులోగా తమ అభిప్రాయం తెలియజేస్తామన్నారు. 24 గంటల ట్రేడింగ్‌ను అనుమతించడం వల్ల కొన్ని అనర్థాలు కూడా ఉంటాయని సెబీ చీఫ్ హెచ్చరించారు. ప్రస్తుత మౌలిక సదుపాయాలతో 24 గంటల ట్రేడింగ్ సాధ్యం కాదని ఆమె తేల్చి పారేశారు. ఈ విషయంలో ఈక్విటీ మార్కెట్లకు, కమోడిటీస్ మార్కెట్‌కు అసలు పోలికే లేదన్నారు. ప్రస్తుతం ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు మాత్రమే రెగ్యులర్ క్యాష్ సెగ్మెంట్‌తో పాటు డెరివేటివ్స్ ట్రేడింగ్‌ను అనుమతిస్తున్నారు.

ఇంకా తేలని వైసీపీ మలి జాబితా

- సీఎంవోకు ఎమ్మెల్యేలు క్యూ... గేటు దాకా వచ్చి వెనుదిరిగిన బాలినేని

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీలో అభ్యర్థుల ఎంపిక కసరత్తు ఇంకా సాగుతోంది. వాస్తవానికి ఈ నెల 27వ తేదీలోగా అభ్యర్థుల జాబితా ప్రకటించాకే.. 'సిద్ధం' పేరిట ఎన్నికల ప్రచారానికి వెళ్తానని సీఎం జగన్ అన్నారు. కానీ కసరత్తు జరుగుతూనే ఉంది. టికెట్లపై స్పష్టత రాని ఎమ్మెల్యేలు, ఎంపీలు తాడేపల్లి సీఎం కార్యాలయానికి క్యూ కడుతున్నారు. సీఎంవో పిలుపుతో సోమవారం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి వచ్చారు. కురసాల కన్నబాబు (కాకినాడ రూరల్), పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (మాచర్ల), మద్దిశెట్టి వేణుగోపాల్(దర్శి), సింహాద్రి రమేశ్(అవనిగడ్డ), విజయవాడ ఎంపీ కేశినేని నాని కూడా వచ్చారు. సాయంత్రం మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సీఎం కార్యాలయానికి అకస్మాత్తుగా వచ్చారు. ఆయన కారు ఎంత వేగంగా వచ్చిందో అంతే వేగంగా వెనుదిరిగింది. బాలినేని గన్‌మెన్ సీఎంవో గేటు వద్దకు వెళ్లి భద్రతా సిబ్బందితో మాట్లాడి వెనక్కి వచ్చారు. కారులో ఉన్న బాలినేనికి ఏదో సమాచారం అందించారు. దీంతో ఆయన వాహనం దిగకుండానే వెనుదిరగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

పవన్ సమక్షంలో 4న జనసేనలోకి బాలశౌరి

గుంటూరు, జనవరి 29: మచిలీపట్నం వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి ఫిబ్రవరి 4న జనసేన తీర్థం పుచ్చుకోనున్నారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పవన్ కల్యాణ్ సమక్షంలో ఆయన కండువా కప్పుకోనున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను వేరే నియోజకవర్గానికి బదిలీ చేసేందుకు వైసీపీ ప్రయత్నించిన నేపథ్యంలో ఈ నెల 13న పార్టీని వీడి బయటకు వచ్చారు. అనంతరం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిసి చర్చలు జరిపారు. కాగా, వచ్చే ఎన్నికల్లో బాలశౌరి.. జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థిగా మరోసారి మచిలీపట్నం పార్లమెంటు స్థానం నుంచే పోటీ చేసే అవకాశం ఉందని సమాచారం.

టీడీపీ, జనసేనకు అధికారం ఖాయం: కొణతాల

అనకాపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలన... బ్రిటీష్ పాలనను మరిపించేలా ఉందని జనసేన నాయకుడు కొణతాల రామకృష్ణ విమర్శించారు. అనకాపల్లిలో సోమవారం జరిగిన జనసేన నేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ రాష్ట్రంలో ఇంత దారుణమైన పాలన ఎప్పుడూ చూడలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును నిరాధారమైన ఆరోపణలతో జైల్లో పెట్టడం అన్యాయమన్నారు. వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా టీడీపీ, జనసేన పార్టీలు అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమన్నారు.

అనంతలో ముగ్గురు బీఎల్వోల సస్పెన్షన్

- అనంతపురం అర్బన్, రాప్తాడు అక్రమాలపై విచారణ: కలెక్టర్

అనంతపురం టౌన్/యాడికి, జనవరి 29: ఓటర్ల తుది జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు బీఎల్వోలను అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి సస్పెండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఓటర్ల తుది జాబితాలో మృతుల పేర్లు, డబుల్, ట్రిపుల్ ఎంట్రీలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురిస్తోంది. దీంతో కలెక్టర్ సీరియస్‌గా స్పందించారు. తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి 83వ పోలింగ్ కేంద్రం బీఎల్వో ఆదిలక్ష్మి(వీఆర్‌పీ), 84వ కేంద్రం బీఎల్వో క్రిష్ణాంజలి(మహిళా పోలీస్), ఓబుళాపురం 91వ కేంద్రం, కోన ఉప్పలపాడు 92వ పోలింగ్ కేంద్రం బీఎల్వో గౌతమ బుద్ధుడు (వీఆర్‌ఓ)ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. అనంతపురం అర్బన్, రాప్తాడు నియోజకవర్గాలలో అక్రమాలపైనా కలెక్టర్ స్పందించారు. పత్రికలలో వచ్చిన కథనాలపై పూర్తిస్థాయిలో విచారించి నివేదికలు పంపాలని ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారులను ఆదేశించారు.

ఓట్లువేయకపోతే టిడ్కో ఇళ్లు లాగేసుకుంటాం

- డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

వెంకటగిరి టౌన్, జనవరి 29: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయకపోతే లబ్ధిదారులకు ఇచ్చిన టిడ్కో ఇళ్లు లాగేసుకుంటామని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి హెచ్చరించారు. వెంకటగిరిలోని తిరుపతి రోడ్డులో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రెండు ఇళ్లకు సంబంధించిన తాళాలను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని, లేకుంటే ఇచ్చిన టిడ్కో ఇళ్లు లాగేసుకుంటామని లబ్ధిదారులతోనే చెప్పడం చర్చనీయాంశమైంది.

91వేల కోట్లు ఏంచేశావ్ జగన్?

- 'రివర్స్ బారోయింగ్' లెక్కలు చెప్పేందుకు సిద్ధమా? మేం సిద్ధం!
- సంస్కారంలేని నేతగా సీఎం మిగిలిపోతారు
- సీఎంపై జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల ఫైర్
- అభ్యర్థులను బాబు, పవన్ ప్రకటిస్తారని వెల్లడి

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): "నాలుగు సంవత్సరాల్లో రూ.1.72 లక్షల కోట్లు అప్పు చేసినట్టు చెబుతున్నావ్.. కానీ, 'రివర్స్ బారోయింగ్' రూ.91,253 కోట్లు అదనంగా తెచ్చి ఏం చేశావ్. లెక్క చెప్పేందుకు సిద్ధమా.. గుట్టు బయట పెట్టేందుకు జనసేన సిద్ధం!" అని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్(పీఏసీ) నాదేండ్ల మనోహర్ సీఎం జగన్‌కు సవాల్ విసిరారు. విజయవాడలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "రైతుల పట్టాదారు పాసు పుస్తకాలపై నీ ఫొటో వేయించుకోవడానికి సిద్ధమా? రాష్ట్ర ప్రభుత్వ ఆస్తి, భవనాలు తాకట్టు పెట్టేందుకు సిద్ధమా? ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలను గాలికి వదిలేసేందుకు సిద్ధమా? పోలవరాన్ని ముంచేందుకు సిద్ధమా? రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసేందుకు సిద్ధమా?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రపంచంలో ఏ ప్రభుత్వంలోనూ లేని రివర్స్ బారోయింగ్ విధానంలో అప్పులు తెచ్చిన జగన్ రాష్ట్రాన్ని ముంచేశారని ఆరోపించారు. రహస్య అప్పులకు లెక్కలు చెప్పలేక అధికారులు వణికి పోతున్నారని, 'సిద్ధం' అంటున్న వైసీపీ అధ్యక్షుడు వివరాలు వెల్లడించేందుకు సిద్ధమా? అని ప్రశ్నించారు. 2019-20 నుంచి ఈ పద్ధతిలో చేసిన అప్పుల వివరాలు మనోహర్ వెల్లడించారు. మీడియా సమక్షంలో తుమ్మలపల్లి కళాక్షేత్రం(విజయవాడ)లో చర్చకు జనసేన సిద్ధంగా ఉందని, పారదర్శకత గురించి మాట్లాడే ముఖ్యమంత్రిని గౌరవంగా ఆహ్వానిస్తున్నామని అన్నారు. తాము చెబుతున్న లెక్కలు కాగ్ నివేదికలో ఉన్నవేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చెప్పకపోతే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కనీసం మీడియా సమావేశం పెట్టలేని ఈయన సిద్ధం అంటూ పోస్టర్లు వేసుకుంటుంటే జనం మాత్రం ఆయనను ఇంటికి పంపించేందుకు 'సిద్ధం' అంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్ ప్రచారం చేసుకుంటున్న విషయాల్లో నిజముంటే తాము ఆహ్వానిస్తున్న చర్చలో పాల్గొని తన పాలనలో రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని సూచించారు. అదే చర్చలో జగన్ హయాంలో రాష్ట్రం ఎలా నాశనమైందో, కరోనా సమయంలో ప్రపంచమంతా ప్రజలకు సాయం చేస్తే వైసీపీ సర్కారు రూ.21 వేల కోట్లు ఏ విధంగా పన్నులు బాదిందో తాము చెబుతామన్నారు.

పొత్తులో పొరపొచ్చాలు ఆశించి భంగపడ్డారు

రాష్ట్రంలో టీడీపీ-జనసేన పొత్తులో పొరపొచ్చాలు ఆశించిన వ్యక్తులు.. తీవ్ర నిరాశకు గురై భంగపడ్డారని నాదేండ్ల మనోహర్ అన్నారు. ఎవరి పార్టీ కార్యకర్తలు, నాయకుల గురించి వారి అధినాయకత్వానికి బాధ్యత ఉంటుందన్నారు. దీనిలో భాగంగానే చంద్రబాబు, పవన్ చెరో రెండు సీట్లు ప్రకటించారని తెలిపారు. అంతమాత్రాన ఏదో అయిపోయినట్టు ప్రచారం చేసే వారికి భంగపాటు తప్పదన్నారు. రాష్ట్రం బాగు పడాలంటే కేంద్రం సహకారం ఉండాలి కాబట్టి పవన్ కల్యాణ్ బీజేపీని కూడా పొత్తులోకి తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. త్వరలోనే చంద్రబాబు, పవన్ ఉమ్మడి మేనిఫెస్టోతో పాటు అభ్యర్థుల్ని ప్రకటిస్తారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పవన్ పర్యటనలు త్వరలో ప్రారంభం అవుతాయని తెలిపారు.



జనసేన ప్రెస్‌మీట్లో జగన్

ప్రతిపక్ష నాయకుల ఫొటోలు భీమిలి వైసీపీ సభ 'సిద్ధం'లో పెట్టి అవమానించి, ఆయా పార్టీల కేడర్‌ను రెచ్చగొట్టేలా వ్యవహరించిన జగన్‌కు జనసేన దీనికి భిన్నంగా కౌంటర్ ఇచ్చింది. తాము పిలుస్తున్న చర్చకు ఆయన ఎలాగూ రాబోరనే ఉద్దేశంతో మనోహర్ తన పక్కన కుర్చీలో జగన్ ఫొటో పెట్టి "మేం సంస్కారంగా ఆహ్వానిస్తున్నాం చర్చకు రండి" అని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో 'రాజ్యసభ' వేడి

- 3 స్థానాలకు వచ్చే నెల 27న పోలింగ్
- అన్నీ గెలుచుకోగల బలం ఉన్నా.. వైసీపీ పెద్దల్లో భయం
- పలువురు ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించడమే కారణం
- వారు పార్టీ అభ్యర్థులకు ఓటేయరేమోనని ఆందోళన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాజ్యసభ ఎన్నికలు రాష్ట్రంలో వేడి పుట్టిస్తున్నాయి. సాధారణంగా ఏకగ్రీవంగా జరిగే ఈ ఎన్నికల్లో ఈసారి పోటీ తప్పదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. వైసీపీలో అంతర్గత సంక్షోభాన్ని ఆసరా చేసుకొని ఒక సీటు కైవసం చేసుకోవడానికి కోసం టీడీపీ పావులు కదుపుతోంది. తమ ఎమ్మెల్యేలు చేజారకుండా చూసుకోవడానికి అధికార పక్షం తిప్పలు పడుతోంది. ఈసారి రాష్ట్రం నుంచి ముగ్గురు రాజ్యసభ ఎంపీలు రిటైరయ్యారు. వారి స్థానాలకు ఎన్నికల నిర్వహణకు సోమవారం షెడ్యూల్ వెలువడింది. ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుంది. అసెంబ్లీలో సంఖ్యాబలం దృష్ట్యా ఈ మూడు సీట్లను వైసీపీ సునాయాసంగా గెలుచుకునే అవకాశం ఉంది. కానీ కొందరు సిటింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు నిరాకరించడం, కొందరు ఎమ్మెల్యేలను వేరే చోటకు మార్చడం వంటి కారణాలతో ఆ పార్టీలో అసమ్మతి తీవ్రరూపం దాల్చింది. కనీసం 40-50 మంది ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో కొందరికి ఇప్పటికే ఈ విషయం చెప్పేశారు. వీరిలో కొందరు వేరే పార్టీల్లో చేరడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ రాజ్యసభ అభ్యర్థులకు ఈ ఎమ్మెల్యేలు ఎంత మంది ఓట్లు వేస్తారన్నది ఉత్కంఠగా మారింది. వైసీపీ అధినాయకత్వం తమ అభ్యర్థులకు పడాల్సిన ఓట్లు చేజారకుండా చూసుకుని మూడు సీట్లనూ గెలిపించే బాధ్యతను టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అప్పగించింది. ఆయన కూడా ఒక అభ్యర్థిగా ఉండబోతున్నారు. ఆయన కొద్ది రోజులుగా అసమ్మతి ఎమ్మెల్యేలను దువ్వుతున్నారు.

ఆళ్ల ఓటు కోసం..

వైసీపీ వర్గాల సమాచారం ప్రకారం.. సుబ్బారెడ్డి ఇటీవల తమ పార్టీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డితో ఫోన్లో మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయన సోదరుడు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వైసీపీకి ఓటేసేలా చూడాలని కోరారు. ఆయన తన మాట వినే పరిస్థితి లేదని, షర్మిలతో మాట్లాడితే రావచ్చని ఎంపీ బదులిచ్చినట్లు తెలిసింది. షర్మిలతో మాట్లాడతానని సుబ్బారెడ్డి ఆయనతో అన్నట్లు వినవస్తోంది. అలాగే.. రాయలసీమలో టికెట్ ఇవ్వని ఒక ఎమ్మెల్యేకు సుబ్బారెడ్డి ఫోన్ చేయగా.. ఆయన జగన్ వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌తో టికెట్ హామీ ఇప్పిస్తేనే తాను పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తానని, లేకపోతే లేదని మరో ఎమ్మెల్యే తేల్చిచెప్పారు. ఈ పరిణామాలను టీడీపీ తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నంలో ఉంది. ఒక స్థానానికి పోటీ పెట్టి వైసీపీ అసమ్మతుల మద్దతుతో గెలుచుకోవడం సాధ్యమేనా అన్న కోణంలో కసరత్తు చేస్తోంది. 'వైసీపీ 50 మంది ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించింది. వారిలో సగం మంది మాకు వేసినా ఒక రాజ్యసభ సీటు మాకు వస్తుంది. వచ్చే ప్రభుత్వం మాదే నని ఎమ్మెల్యేలకు అర్థమైపోయింది. అందుకే మేం మాట్లాడుతుంటే సానుకూల స్పందన కనిపిస్తోంది' అని టీడీపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. టీడీపీ ప్రయత్నాలను గమనించిన వైసీపీ నాయకత్వం.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానంలో ఓడిన విషయాన్ని గమనంలో ఉంచుకుని.. అసెంబ్లీలో టీడీపీ బలాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తోంది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై మూడేళ్ల కిందట ఎమ్మెల్యే పదవికి ఆ పార్టీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామా చేశారు. స్పీకర్ ఫార్మాట్‌లో ఆయన రాసిన లేఖను ఆకస్మికంగా ఇప్పుడు బయటకు లాగి.. ఆయనకు సమాచారం ఇవ్వకుండానే ఆమోదించేశారు. వైసీపీ నుంచి టీడీపీ వైపు మారిన నలుగురు ఎమ్మెల్యేలపై ఆగమేఘాలపై అనర్హత వేటు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో వాళ్లు హైకోర్టును ఆశ్రయించారు. టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో మాత్రం ఇంత వేగం కనిపించడం లేదు. వారు తమ వాదన వినిపించుకోవడానికి సమయం ఇస్తున్నామనే పేరుతో వాయిదాలు వేస్తున్నారు.

హెల్ప్.. ప్లీజ్!

అమిత్‌షాను కోరేందుకు రేపు ఢిల్లీకి సీఎం!?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇంటా బయటా 'ఉక్కపోత'తో సతమతమవుతున్న వైసీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరోసారి బీజేపీ శరణు వేడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. బుధవారం ఆయన ఢిల్లీకి వెళ్తున్నట్లు సమాచారం. కుదిరితే అదే రోజు... లేదా ఆ మరుసటి రోజు, అంటే 1వ తేదీన ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యే అవకాశముంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... ఇది రాష్ట్రం కోసం చేస్తున్న యాత్ర కాదు! ఫక్తు 'రాజకీయ' సమావేశం! ఏపీలో తీవ్రమైన ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న జగన్‌కు... తాజాగా చెల్లెలు షర్మిల రూపంలో మరో సమస్య వచ్చి పడింది. చెల్లెలికి తల్లితో చెక్ చెప్పాలనే ప్రయత్నం మొదలుపెట్టారు. అయినప్పటికీ... కేంద్రం సహకారం లేకుంటే ఎన్నికల్లో గట్టెక్కలేననే ఆందోళన చుట్టుముడుతోంది. ఈ నేపథ్యంలో... ఆయన ఢిల్లీకి వెళ్తుండటం గమనార్హం. 'మీరు ఎన్నికల్లో నాకు సహకరించండి. మీకు ఏం కావాలో చెప్పండి'... ఇదీ బీజేపీ పెద్దలతో జగన్ 'బేరం!'. తనకు ఎన్నికల్లో సహకరించాలని కోరుతూ... దీనికి బదులుగా ఇప్పటికిప్పుడు ఒక రాజ్యసభ స్థానాన్ని బీజేపీ కోరుకున్న వారికి కట్టబెట్టేందుకు జగన్ సిద్ధమైనట్లు సమాచారం. తాజాగా ఏపీ నుంచి 3 రాజ్యసభ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఆ మూడు స్థానాలకు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, ఆరణి శ్రీనివాసులను అభ్యర్థులుగా ప్రకటించారు. ఇప్పుడు వీరిలో ఒకరిని 'బకరా' చేయనున్నారు. బాబాయ్ వైవీ సుబ్బారెడ్డి మాత్రం సేఫ్‌గా ఉంటారని... మిగిలిన ఇద్దరిలో ఒకరు బలి కావడం ఖాయమని తెలుస్తోంది. వీరిలో ఒకరిని పక్కనపెట్టి అమిత్‌షా సూచించిన పారిశ్రామికవేత్తకు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. దీనికి బదులుగా అసెంబ్లీ ఎన్నికల్లో తనకు కేంద్రం సహకరించాలనేది ఒప్పందం!

'ప్యాలెస్'లో మంతనాలు

ఢిల్లీ పర్యటనలో అమిత్‌షాను ఏం అడగాలి, ఎలా అడగాలి... తనవైపు నుంచి ఏం ఆఫర్ చేయాలనే అంశంపై జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో సోమవారం విస్తృతంగా కసరత్తు చేసినట్లు సమాచారం. ఆయన సాధారణంగా మధ్యాహ్నం తర్వాత పొలిటికల్ మీటింగ్‌లు పెట్టుకుంటారు. ఎన్నికల నేపథ్యంలో కొన్నాళ్లుగా ఉదయం నుంచి సాయంత్రం దాకా రాజకీయాలపైనే దృష్టి సారించారు. కానీ... సోమవారం మధ్యాహ్నం భోజనం తర్వాత బయటికే రాలేదని తెలిసింది. తనకు అత్యంత ఇష్టుడైన అధికారి ధనుంజయ్‌రెడ్డితో మాత్రమే భేటీ అయినట్లు సమాచారం. అమిత్‌షాతో జరపాల్సిన చర్చలపైనే దృష్టి సారించినట్లు తెలిసింది.

కూలోడి మాటలు విని మాపై వేటా?

- దుస్సంప్రదాయానికి తెరతీసినట్లే!
- స్పీకర్‌కు ఆనం రామనారాయణరెడ్డి స్పష్టీకరణ
- నేను తప్పుచేశాననేందుకు ఆధారాలేవీ?
- పత్రికలు, మీడియా క్లిప్పింగులు సాక్ష్యాలు కావని సుప్రీంకోర్టే చెప్పింది
- ఉత్తరాంధ్రకో న్యాయం.. మాకో న్యాయమా?
- గంటాకు మూడేళ్లు టైమిచ్చారు
- మాకు మూడు నెలలైనా ఇవ్వరా?
- తమ్మినేనికి మాజీ మంత్రి ప్రశ్నలు
- మీకు సీటు ఖాయమైందా అని ఆరా
- స్పీకర్ చాంబర్లో ఆసక్తికర చర్చ

అమరావతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): 'ఉదయమూ, సాయంత్రమూ ఆ కూలోడి (ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి) మాటలు విని మాపై అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకుంటే అది దుస్సంప్రదాయమవుతుంది. భవిష్యత్‌లో మాయని మచ్చగా నిలిచిపోతుంది' అని వెంకటగిరి వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంతో అన్నారు. తమపై వేటు వేయాలంటే.. తాము పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లుగా సాక్ష్యాధారాలు కావాలని.. పత్రికల్లో, మీడియాలో ప్రసారమైన అంశాలు సాక్ష్యాలుగా పనికిరావని సుప్రీంకోర్టు తేల్చిచెప్పిందని గుర్తుచేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదు కాపీపై స్పీకర్ కార్యాలయ మార్గదర్శకాల మేరకు అధీకృతంగా సీల్ వేసి తమకివ్వాలని కోరారు. తామిచ్చిన సమాధానం ముట్టిందని కూడా రశీదు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున అనర్హత వేటు వేయాలంటూ ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన ముందు హాజరై సంజాయిషీ ఇవ్వాలని ఆనంకు స్పీకర్ షోకాజ్ నోటీసిచ్చిన సంగతి తెలిసిందే. అది అందుకున్న ఆయన.. సోమవారం అక్కడ వెలగపూడి అసెంబ్లీ కార్యాలయంలో సభాపతి తమ్మినేని ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాడీవేడిగా, ఆసక్తికరంగా చర్చ జరిగింది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. వారి మధ్య సంభాషణ ఇలా..

ఆనం: నమస్కారమండీ స్పీకర్‌గారూ!

తమ్మినేని: నమస్కారం.. రండి

ఆనం: ఏమిటీ.. మాపై వేటు వేయాలన్న నిర్ణయానికే వచ్చినట్లున్నారు?

తమ్మినేని: మూడు వాయిదాల తర్వాత నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నా.

ఆనం: అంటే ఇదే ఆఖరి వాయిదా అన్నమాట.

తమ్మినేని: (అవునని తలూపారు)

ఆనం: ఉత్తరాంధ్రకు ఒక న్యాయం.. నెల్లూరుకో న్యాయం చేస్తే ఎలా? విశాఖ నార్త్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు మూడేళ్ల సమయం ఇచ్చి.. మా విషయంలో మాత్రం మూడు నెలలనైనా గడువు ఇవ్వకుంటే ఎలా?



తమ్మినేని: గంటా రిజైన్ చేశారు.. మీరు తప్పు చేశారు.

ఆనం: మేమేమీ తప్పుచేయలేదు. తప్పుచేసినట్లు రుజువులూ, సాక్ష్యాలూ ఉన్నాయా?

తమ్మినేని: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా చీఫ్ విప్ ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదు ఉంది. ప్రసార మాధ్యమాలు ప్రసారం చేసిన క్లిప్పింగులూ ఉన్నాయి.

ఆనం: ప్రసార మాధ్యమాల్లో ప్రసారమైన వాటిని ఆధారాలుగా తీసుకోలేమని సుప్రీం కోర్టు ఆదేశించింది కదా! పత్రికల్లో, మీడియాలో ప్రచురించిన, ప్రసారంచేసిన అంశాలకు.. సంబంధిత మీడియా సంస్థల యాజమాన్యాలు ఆథరైజేషన్ ఇచ్చాయా? ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదు కాపీని మాకు అధికారికంగా ఇవ్వలేదు. పైగా మేమిచ్చిన సమాధానాలు స్పీకర్ కార్యాలయానికి ముట్టినట్లుగా రశీదులూ ఇవ్వలేదు.. ఎందుకు?

తమ్మినేని: ప్రసాదరాజు ఫిర్యాదు ప్రతిని, మీడియాల్లో ప్రసారమైన క్లిప్పింగులనూ అందజేశాం.

ఆనం: వాటిపై స్పీకర్ కార్యాలయం సీల్ లేదు.

తమ్మినేని: అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌తో సంప్రదింపులు జరిపాక.. అధీకృతంగా రశీదులు ఇస్తాం.

ఆనం: మరోసారి చెబుతున్నా.. రోజు కూలీ వోడు ఇచ్చిన సలహాను ఆలకించి.. శాసన సభా సంప్రదాయాలకు విరుద్ధమైన నిర్ణయాలు తీసుకుని.. దుస్సంప్రదాయానికి తెర తీయొద్దు.

తమ్మినేని: సరే సరే.

ఆనం: సరే సరే అంటే.. వెళ్లిపొమ్మనా?

తమ్మినేని: మిమ్మల్ని వెళ్లిపోమంటానా?

ఆనం: వచ్చే ఎన్నికల్లో మా సీట్లు ఖాయమయ్యాయి. మరి మీ సంగతేంటి?

తమ్మినేని: నాకేం.. ఆమదాలవలస నుంచే పోటీ చేస్తాను. ఐదేళ్లు స్పీకర్‌గా పనిచేశాను. అంతా బాగుంది. వచ్చే అసెంబ్లీలో కలుసుకుందాం.

సహజ న్యాయానికి పాతర!

(మొదటి పేజీ తరువాయి)

అనుసరిస్తున్న విధానం చట్టపరిధిలో జరగడం లేదని తెలిపారు. తామే ఒక అడుగు వెనక్కి వేసి.. సంజాయిషీని రాతపూర్వకంగా ఇచ్చి రశీదు అడిగితే ఇవ్వలేదన్నారు. వైసీపీ నుంచి సస్పెండైన ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిలపై అనర్హత వేటు వేయాలని చీఫ్ విప్ ఎం.ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదుపై.. మూడో దఫా విచారణకు రావాలని స్పీకర్ ఆదేశించారు. దీంతో వారంతా ఆయన ఎదుట హాజరయ్యారు. అనంతరం కోటంరెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలకు లిఖితపూర్వకంగా ఏదైనా ఇస్తే దానికి ఎకనాలెడ్జ్‌మెంట్ ఇస్తారని.. స్పీకర్ కార్యాలయం మాత్రం ఇవ్వనంటోందని ఆక్షేపించారు. 'అనర్హత వేటు ప్రక్రియ రాజ్యాంగ నిబంధనలకు లోబడి జరగడం లేదు. రాజ్యసభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే అసెంబ్లీ సహజ న్యాయసూత్రాలకు భిన్నంగా కొంతమందిపై అనర్హత వేటు వేసేందుకు డ్రామా నడుస్తోంది. అనర్హత వేటు ఎందుకు వేయకూడదో సమాధానం చెప్పాలని స్పీకర్ కార్యాలయం నుంచి లేఖలు వచ్చాయి. సోమవారం రావాలని మళ్లీ లేఖలు ఇచ్చారు. నిబంధనల మేరకు సమయం కోరాం. సమయం లేదని.. నేరుగా స్పీకర్ కార్యాలయానికి రావాలని సభాపతి ఆదేశించారు. మాకు నోటీసులు పంపామని చెబుతున్నా.. అన్నింటినీ భౌతికంగా పంపలేదు. అయితే చట్టాలు చేసే శాసనసభపై ఉన్న గౌరవంతో వచ్చాం. స్పీకర్ మీద ఉన్న గౌరవం తో వివరణ ఇచ్చాం. మాకు 4 వారాల సమయం కావాలని కోరాం. మాపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలన్నాం. ఇది విధానమని స్పష్టంగా చెప్పాం. అయితే రశీదు ఇవ్వనని స్పీకర్ తేల్చిచెప్పారు. దీంతో అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌ను కొన్ని ప్రశ్నలు వేశాను. రాజ్యసభలో చాలా పెద్దఎత్తున సేవలు చేశారంట.. ఆ సేవలను మెచ్చుకుని రాష్ట్ర అసెంబ్లీకి పిలిచారంట కదా..! అక్కడ కూడా సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించారా అని అడిగాను. లెటర్ ఇచ్చి రశీదు అడుగుతుంటే ఎందుకివ్వరని నిలదీశాను. మా ప్రశ్నలకు ఆయన, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ స్పందించలేదు. సీఎం జగన్ ఆదేశాల మేరకు స్పీకర్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని అర్థమైంది. ఇక మా ముందున్నవి రెండే రెండు దారులు. ఒకటి కోర్టులూ.. రెండో ది ప్రజాకోర్టు' అని తేల్చిచెప్పారు. ఇప్పటికే తాము మూడు వాయిదాలు ఇచ్చామన్న స్పీకర్ కార్యాలయం వాదనపై స్పందిస్తూ.. గడువు అంటే.. ప్రభుత్వ చీఫ్‌విప్, సీఎం ఇచ్చేవి కాదన్నారు. స్పీకర్, సెక్రటరీ జనరల్ వ్యవహార శైలి చూశాక.. తమపై అనర్హత వేటు వేస్తారని తేలిపోయిందని చెప్పారు. 'రాజ్యాధికారం చేతుల్లో ఉందని విర్రవీగితే కుదరదు. రాబోయే రోజుల్లో 57 శాతం ఓట్లతో 169 సీట్లు తెలుగుదేశం, జనసేనకు వస్తాయి' అని స్పష్టం చేశారు. తాము దాదాపు 14 నెలలపాటు వైసీపీకి దూరంగా ఉన్నామని.. ఈరోజు హఠాత్తుగా నోటీసులు ఎందుకొచ్చాయంటే రాజ్యసభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయం పట్టుకున్నందునే అని వ్యాఖ్యానించారు. దీనిద్వారా మరికొందరు ఎమ్మెల్యేలను భయపట్టే ప్రయత్నమే తప్ప మరేమీ కాదన్నారు. వైసీపీ తనను సస్పెండ్ చేశాక.. తాను ఏ పార్టీతో తిరిగినా ప్రశ్నించే హక్కు ఎక్కడుందని నిలదీశారు. తమను ప్రశ్నించే అర్హత ఎవరికీ లేదని.. సస్పెండయ్యాక తమకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందన్నారు.



శాసనసభ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి

రూల్‌బుక్ మారిపోయింది..

తమకు నోటీసిచ్చిన వెంటనే నెల రోజుల సమయం కోరామని.. సహజ న్యాయసూత్రాలకు భిన్నంగా జరుగుతున్నందునే.. న్యాయస్థానాన్ని ఆశ్రయించామని కోటంరెడ్డి చెప్పారు. నాలుగేళ్లముందు కొందరు ఎమ్మెల్యేలు వైసీపీలోకి పోయారని.. వారిపై సహజ న్యాయసూత్రాల మేరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదని ప్రశ్నించారు. అధికార పక్షంతో అంటకాగే టీడీపీ ఎమ్మెల్యేలపై చర్యలుండవని.. అసెంబ్లీ రూల్ బుక్ మారిపోయిందన్నారు. స్పీకర్ తమ్మినేనికి కూడా టికెట్ లేదంటున్నారని.. వ్యక్తిగతంగా తాను ఆయనకు టికెట్ రావాలనే కోరుకుంటున్నానని అన్నారు.

జగన్‌ను అందరూ విమర్శించేవాళ్లే: మేకపాటి

పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్యేలు, పార్టీలో కొనసాగుతున్న వారూ అందరూ సీఎం జగన్‌ను విమర్శిస్తున్నారని మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తనపై అనర్హత వేటు ఎందుకు వేయకూడదో సంజాయిషీ ఇవ్వాలని స్పీకర్ కోరారని.. తనకు మూడు స్టంట్లు వేశారని.. ఐదు రోజులు అపోలో ఆస్పత్రిలో ఉన్నానని.. డాక్టర్ సర్టిఫికెట్ కూడా తన సంజాయిషీతో జత చేశానని.. అనారోగ్యం కారణంగా సమయం ఇవ్వాలని కోరానని తెలిపారు. తమపై ఆట ఆడాలనుకుని ఆడారని.. ఆ ఆటలో తాము పావులమయ్యామని వ్యాఖ్యానించారు.

కరోనా ఉన్నా వచ్చా: ఉండవల్లి శ్రీదేవి

తనకు కరోనా సోకిందని, వైద్య సేవలు తీసుకుంటూనే స్పీకర్‌ను కలిశానని ఉండవల్లి శ్రీదేవి చెప్పారు. సెలైన్ ఎక్కించుకుంటున్నానని.. ఆరోగ్యం బాగాలేకపోయినా స్పీకర్‌ని కలిసి.. వివరణ ఇచ్చానని, సమయం కావాలని కోరానని.. తనపై ఆరోపణలకు సాక్ష్యాధారాలు కోరానని వెల్లడించారు.

అనర్హతపై ఆదేశాలిస్తా: తమ్మినేని

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన నలుగురు శాసనసభ్యుల అనర్హతపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద తక్షణమే తుది నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ తమ్మినేని స్పష్టం చేశారు. వారికి ఇప్పటికే రెండు వాయిదాలు ఇచ్చామని.. సోమవారం మూడో వాయిదా అని.. ఎమ్మెల్యేల అనర్హతపై ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. భవిష్యత్‌లో పార్టీ ఫిరాయింపులంటేనే భయపడేలా నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు.

నోటీసులకు స్పందించని ఆ ముగ్గురు

పార్టీ ఫిరాయించిన తమ ఎమ్మెల్యేలపై వేటు వేయాలని టీడీఎల్పీ తరఫున విప్ డోలా బాలవీరాంజనేయస్వామి ఇచ్చిన ఫిర్యాదుపై.. వైసీపీ పంచన చేరిన నలుగురు ఎమ్మెల్యేలు కరణం బలరాం, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేశ్, మద్దాలి గిరిలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులిచ్చింది. గిరి తప్ప మిగతావారు స్పందించలేదు. తాను అందుబాటులో లేనని.. ఫిబ్రవరి 3న హాజరవుతానని ఆయనకు స్పీకర్‌కు వర్తమానం పంపారు. అయితే స్పీకర్ కార్యాలయం 4న రావాలని సమాధానం పంపింది. కాగా.. విశాఖకు చెందిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ సోమవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును కలిశారు. పార్టీ మారడంపై వివరణ ఇచ్చారు.

గంటా రాజీనామా లేఖను కోర్టు ముందు ఉంచండి

- అసెంబ్లీ స్టాండింగ్ కౌన్సిల్‌కు హైకోర్టు ఆదేశం
- కౌంటర్ దాఖలుపై ప్రతివాదులకు నోటీసులు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సమర్పించిన రాజీనామా లేఖను కోర్టు ముందు ఉంచాలని అసెంబ్లీ తరఫు స్టాండింగ్ కౌన్సిల్‌ను హైకోర్టు ఆదేశించింది. 2021 ఫిబ్రవరిలో ఎమ్మెల్యే పదవికి తాను చేసిన రాజీనామాను.. రాజ్యసభ ఎన్నికల్లో పాల్గొనకుండా చేయాలనే దురుద్దేశంతోనే స్పీకర్ ఈనెల 23న ఆమోదించారంటూ గంటా శ్రీనివాసరావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. రాజీనామాను ఆమోదిస్తూ స్పీకర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌తో పాటు, న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి ఈనెల 23న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటిస్తూ రద్దు చేయాలని పిటిషనర్ అభ్యర్థించారు. న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్, కేంద్ర ఎన్నికల కమిషనర్, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిలను ప్రతివాదులుగా చేర్చారు. వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. అసెంబ్లీ కార్యదర్శిని వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్‌కు స్పష్టం చేశారు. విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేశారు. అంతకుముందు గంటా తరఫున న్యాయవాది ఎస్.అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పిటిషనర్ 2021 ఫిబ్రవరి 12న రాజీనామా లేఖ రాశారని, వ్యక్తిగతంగా స్పీకర్‌కు అందజేయలేదని, అప్పటి నుంచి ఆ లేఖపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోకుండా, పిటిషనర్ వివరణ కోరకుండా అకస్మాత్తుగా ఇప్పుడు రాజీనామాను ఆమోదించారని వివరించారు. శాసనసభ బిజినెస్ రూల్ 186 ప్రకారం తప్పనిసరిగా విచారణ జరపాలన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో పిటిషనర్‌ను ఓటుహక్కు వినియోగించుకోకుండా చేయాలనే దురుద్దేశంతోనే ఇప్పుడు ఆమోదించారని, స్పీకర్ నిర్ణయం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయన్నారు. గెజిట్ నోటిఫికేషన్‌ను సస్పెండ్‌చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ స్టాండింగ్ కౌన్సిల్ మెట్టా చంద్రశేఖర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... అసెంబ్లీ కార్యదర్శిని ప్రతివాదిగా చేర్చకపోవడంపై అభ్యంతరం తెలిపారు. రాజీనామాను ఉపసంహరించుకొనేందుకు బిజినెస్ రూల్స్‌లో వెసులుబాటు ఉందని, అయితే, ఏ దశలోనూ పిటిషనర్ రాజీనామాను ఉపసంహరించుకోలేదని చెప్పారు.

స్పీకర్ చర్య సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం!

- హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు
- ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న ధర్మాసనం

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణతో అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ చీఫ్ విప్ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు స్పీకర్ తమకు సమయం ఇవ్వకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, ఆనం రాంనారాయణరెడ్డి ఆక్షేపించారు. స్పీకర్ అవకాశం ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై సోమవారం హైకోర్టు అత్యవసర విచారణ జరిపింది. కౌంటర్ వేయాలని లెజిస్లేటివ్ అసెంబ్లీ, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, అసెంబ్లీ చీఫ్‌విప్ ప్రసాదరాజులకు నోటీసులు జారీచేసింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేమంది. విచారణను ఫిబ్రవరి 24కి వాయిదా వేసింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ సోమవారం ఆదేశాలిచ్చారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. పిటిషన్‌తో చీఫ్ విప్ జత చేసిన పత్రికా కథనాలను, యూట్యూబ్ లింక్‌ల వివరాలు అందజేయాలని, కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని పిటిషనర్లు స్పీకర్‌ను కోరగా నిరాకరించారని తెలిపారు. దస్త్రాలు ఇవ్వకుండా కౌంటర్ వేయడం సాధ్యపడదన్నారు. చీఫ్‌విప్ జత చేసిన అన్ని దస్త్రాలను పిటిషనర్లకు అందజేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరారు. అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి తరఫున న్యాయవాది మెట్టా చంద్రశేఖర్ వాదనలు వినిపిస్తూ... స్పీకర్‌కు క్వాసీ జ్యుడీషియల్ అధికారాలు ఉన్నాయన్నారు. అనర్హత పిటిషన్‌పై స్పీకర్ తుది నిర్ణయం వెల్లడించిన తరువాతే పిటిషనర్లు కోర్టును ఆశ్రయించాలని, ప్రాథమిక దశలో కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని తెలిపారు. దీంతో వివరాలను కోర్టు ముందు ఉంచాలని ఆదేశించారు. మరోవైపు తాను వాదనలు చెప్పుకొనేందుకు అవకాశం ఇవ్వకుండా అనర్హత పిటిషన్‌పై శాసనమండలి చైర్మన్ విచారణ జరపడాన్ని సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపైనా విచారణ జరిపిన జస్టిస్ బి.కృష్ణమోహన్ నోటీసులు జారీ చేశారు.



రామకృష్ణ భార్య ఉమతో మాట్లాడుతున్న సీఐ; రామకృష్ణ (ఫైల్)

అధికారుల ఒత్తిడికి ఇంజనీర్ బలి

» రేగిడి పీఆర్ ఏఈఈ రాజాం ఆఫీసులో ఆత్మహత్య

రాజాం రూరల్, జనవరి 29: అధికారులు, కొందరు గ్రామస్థాయి వైసీపీ నేతల ఒత్తిడికి విజయనగరం జిల్లా రేగిడి మండల పంచాయతీరాజ్ ఏఈఈ వల్లూరి రామకృష్ణ (48) బలైపోయారు. సోమవారం ఉదయం ఆయన రాజాంలోని పంచాయతీరాజ్ సబ్-డివిజనల్ కార్యాలయంలోనే పురుగు మందు తాగి, ఆపై ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, పోలీసులు కథనం మేరకు.. రామకృష్ణది రేగిడి మండలం సోమరాజు పేట. ఆయనకు భార్య ఉమ, ఇద్దరు కుమార్తెలు మౌనిక, హర్షిత ఉన్నారు. రేగిడి పంచాయతీరాజ్ ఏఈఈగా బాధ్యతలు చూస్తూ రాజాం పంచాయతీరాజ్ సబ్-డివిజనల్ కార్యాలయంలో పనిచేస్తూ, ఇక్కడే నివాసముంటున్నారు. సోమవారం ఉదయం కుమార్తెను కళాశాలలో దింపి వస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరిన రామకృష్ణ, పది గంటల సమయంలో కార్యాలయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ జయప్రకాశ్ ఒత్తిడే ఆయన మృతికి కారణమని, రెండు నెలలుగా జీతం కూడా ఇవ్వలేదని భార్య ఉమ ఆరోపించారు. ఆపై, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. కార్యాలయానికి వచ్చిన డీఈ జయప్రకాశ్‌పై దాడి చేసి గదిలో బంధించారు. ఆయన షర్టు చింపేశారు. ఆయన్ను సాయంత్రం ఐదు గంటల సమయంలో రాజాం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వైసీపీ కౌన్సిలర్ వేధింపులు..

» ధర్మవరం మున్సిపల్ కార్యాలయ అటెండర్ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, జనవరి 29: కుటుంబ సమస్యలకు తోడు అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ వేధింపులు తాళలేక శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీ ఉద్యోగి కృష్ణ సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో కృష్ణ అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి భవనాన్ని నిర్మిస్తున్న ఓ వ్యక్తికి కమిషనర్ మల్లికార్జున ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చానని, దీంతో నాలుగో వార్డు కౌన్సిలర్ జేసీబీ రమణ తనపై దాడి చేశాడని తెలిపారు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైందని తెలిపాడు. అప్పటి నుంచి కౌన్సిలర్ తనను టార్గెట్ చేస్తున్నారని, తనను సస్పెండ్ చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించాడు. ఓవైపు కౌన్సిలర్ వేధింపులు, మరోవైపు ఇటీవల తన మొదటి భార్య కుమారుడితో గొడవలు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని వీడియోలో పేర్కొన్నాడు. కార్యాలయ భవనంపై అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణను సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. .

ఫిషరీస్ అసిస్టెంట్‌పై వైసీపీ నేత దౌర్జన్యం

కాకినాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఓ వైసీపీ నాయకుడు ఫిషరీస్ అధికారిపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. రొయ్యల చెరువులకు ప్రభుత్వం మంజూరు చేసే విద్యుత్ సబ్సిడీ మంజూరు కాకపోవడంపై కోపోద్రిక్తుడైన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావుతోపాటు మరో 10మంది అనుచరులు ఉప్పాడ ఫిషరీష్ అసిస్టెంట్ చాగంటి రాముడుపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఫిషరీష్ అధికారులు సోమవారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తమ రొయ్యల చెరువులకు కరెంటు రాయితీ ఎందుకు మంజూరు కాలేదని చిన్నారావు వారిని ప్రశ్నించారు. పదెకరాల్లోపు ఉన్న చెరువులకే రాయితీ వస్తుందని మత్స్యశాఖ అధికారులు చెప్పగా.. రాయితీ రాకపోవడానికి ఫిషరీస్ అసిస్టెంట్ కారణమని భావించిన చిన్నారావు అతడిని దుర్భాషలాడుతూ కాలర్ పట్టుకుని దౌర్జన్యంగా లాక్కెళ్లాడు. వైసీపీ నాయకుడి అనుచరులు అసిస్టెంట్‌పై పిడిగుద్దులు కురిపించి, దౌర్జన్యానికి పాల్పడ్డారు. వారిపై పరశురాముడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నియోజకవర్గం పరిధిలో ఎక్స్‌ప్రెస్ రహదారుల నిర్మాణం రూ.21 వేల కోట్లతో జరుగుతోంది. వీటికి గ్రావెల్, కంకర అవసరం ఉంది. సొంత కన్‌స్ట్రక్షన్ కంపెనీ కలిగిన ఎమ్మెల్యే.. 22.10 ఎకరాల భూమిలో క్రషర్ ఏర్పాటు చేసుకుంటానని అనడం, అధికారులు అంగీకరించడం జరిగిపోయాయి. పేదలకు సెంటు స్థలం ఇవ్వడానికే వెనుకాడే అధికారులు, ఇప్పటికే వంద ఎకరాలకుపైగా ఎమ్మెల్యేకు రాసిచ్చారు.



సులభ్ కాంప్లెక్స్ కాంట్రాక్టరు మామూళ్లు ఇవ్వలేదని మరుగుదొడ్లను మూయించారు. ప్రజలకు తాగునీటి సరఫరా చేయకుండానే రూ.34 లక్షలకు బిల్లులు పెట్టారు. ఇదంతా ఎందుకుంటే.. "గతంలో రెండుసార్లు ఓడిపోయి రూ.కోట్లు నష్టపోయాను. ఈసారి నష్టాన్ని పూడ్చుకోవడానికి ఉన్న ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకోవాలి" అని సన్నిహితులకు ఆయన సెలవిస్తున్నారట!

ఆరని అక్రమాగ్ని

(మొదటి పేజీ తరువాయి)

'ఆరని' దాహం ఆయనకు. ఆ సామాజికవర్గంలో రాయలసీమలోనే ఏకైక ఎమ్మెల్యే. దీంతో తన వెంట నడిచే అనుచరుల నుంచి, చెప్పి పనులు చేసి పెట్టే అధికారుల బృందం దాకా.. తన సామాజికవర్గం వారే ఉండేలా చూసుకుంటారని చెబుతారు. ఆయనకు ఓ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఉంది. నియోజకవర్గంలో పుల్ల అటు తీసి ఇటు పెట్టినా ఆయనకు తెలిసిపోతుంది. ఇక.. కాంట్రాక్టు పనుల సంగతి ప్రత్యేకంగా చెప్పాలా? అయితే.. పనులు తనకు అప్పగించాలి.. లేదంటే శ్రీనివాసులుకు కట్టినట్టు ఈయనకూ ముడుపులు కట్టాలి.

భూములపై దండయాత్ర..

ఎమ్మెల్యేగా గెలిచీ గెలవగానే భూములపై దండయాత్ర మొదలుపెట్టారు. ఎక్కడెక్కడ భూములున్నాయో తెలుసుకోవడానికి నలుగురు విశ్రాంత రెవెన్యూ అధికారులను నియమించుకున్నారు. ఈ నలుగురూ గతంలో ఆ నియోజకవర్గంలో పనిచేసినవారే. వారి సూచనల మేరక నాలుగున్నరేళ్లల్లోనే సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే కబ్జా చేసినట్లు సమాచారం. తాజాగా నగర శివారులో కంకర క్రషింగ్ పేరుతో రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.44 కోట్లకే కొట్టేయాలని ఫైళ్లను వేగవంతం చేశారు. ప్రస్తుతం ఆ ఫైల్ జిల్లా స్థాయిలో ఉంది.

వంద ఎకరాలు చాప చుట్టేశారు..

ఎమ్మెల్యేకు ఉన్న కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి 2022 జూన్‌లో 83 ఎకరాల గుట్ట, ప్రభుత్వ భూములను ఇస్తున్నట్లు మున్సిపల్ కౌన్సిల్‌లో పెట్టి తీర్మానం చేశారు. 2023 మార్చిలో జరిగిన కౌన్సిల్‌లోనూ 22.10 ఎకరాల భూమిని లీజు పేరిట ఎమ్మెల్యేకు చెందిన కంపెనీకు కట్టబెట్టేశారు. మొత్తంగా వంద ఎకరాలకుపైగా ప్రభుత్వ భూముల్ని ఎమ్మెల్యే తన కంపెనీ పేరిట తీసుకోవడంతో అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఎమ్మెల్యే తన సొంత క్రషింగ్ యూనిట్ ఏర్పాటుకు 44.20 ఎకరాల ప్రభుత్వ భూమిని కారుచౌకగా పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. రెవెన్యూలోని కొందరు అధికారులు ఆయన సేవలో తనిస్తున్నారు. "ఎమ్మెల్యే తన కంపెనీ కోసం దరఖాస్తు చేశారు. ఆయన కోరుతున్న భూములు సాగుయోగ్యం, నివాస యోగ్యం అయినవి కావు" అని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఇక్కడ ఎకరా రూ.2 కోట్లు పలుకుతోంది. అయితే.. రూ.4.76 లక్షలు చెల్లిస్తే చాలని ఉదారంగా వ్యవహరించింది. 44.20 ఎకరాల భూమి విలువ రెండు ప్రాంతాల్లో కలిపి రూ.120 కోట్లు ఉండగా, రూ.3.70 కోట్లకే ఎమ్మెల్యేకు కట్టబెట్టేలా రెవెన్యూ అధికారుల ప్రతిపాదనలున్నాయి.

నియోజకవర్గంలోని ఓ మండలంలో 200 ఎకరాల పశువుల మేత భూమిని ఈ ఎమ్మెల్యే, అతడి అనుచరులు ఆక్రమించుకున్నారు. ఆ భూమిలో కొంతమేర ఎకరా రూ.10 లక్షలకు బెంగళూరు వారికి అమ్మేసుకున్నారు. 2021 జూన్‌లో జరిగిన ఈ ఆక్రమణల గురించి మీడియాలో కథనాలు రావడంతో ఉన్నతాధికారులు ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించారు. ఆ ఆర్డీవో ఒత్తిళ్లకు గురయి.. నేటికీ నివేదిక ఇవ్వలేదు.

కార్పొరేటర్ల నిధుల్నీ లాగేసుకుని..

మున్సిపల్ కార్పొరేషన్‌లోని డివిజన్లలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క పనీ చేయలేదు. సీఎం జగన్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు డివిజన్‌కో రూ.50లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో డివిజన్లను బాగు చేసుకుందామని కార్పొరేటర్లు అనుకున్నారు. ఈ మొత్తంలో రూ.ఏడు కోట్లను ఎమ్మెల్యే తన కంపెనీ ద్వారా నగరంలో చేపడుతున్న రహదారుల నిర్మాణానికి మళ్లించారు. ఈ మేరకు గతేడాది అక్టోబరులో మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రతిపాదన పెట్టగా కొందరు కార్పొరేటర్లు అడ్డుకున్నారు. రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు తెచ్చుకోవాలని, తమకు వచ్చిన నిధుల్ని తీసేసుకుంటే డివిజన్లను ఎలా అభివృద్ధి చేసుకోవాలని నిలదీశారు. దీంతో ఆయన ఆ కార్పొరేటర్లకు నోటీసులు ఇప్పించారు. మరోసారి కౌన్సిల్ సమావేశం పెట్టి నిధులు తన కంపెనీకి వచ్చేలా ఆమోదింపజేసుకున్నారు.

హైవే సంస్థ నుంచి రూ.5 కోట్లు వసూలు

ఓ హైవే నిర్మాణ సంస్థ కొండ నుంచి గ్రావెల్‌ను తీసుకుంటుండగా ఎమ్మెల్యే కల్పించుకున్నారు. ఓ కార్పొరేటరు, సర్పంచిని అక్కడికి పంపించి పనులను నిలిపి వేయించారు. పనులు చేసుకోవాలంటే తనకు రూ.10 కోట్లు ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. రెండు వారాల పాటు నాన్చిన తర్వాత ఆ నిర్మాణ సంస్థ చివరికి రూ.5 కోట్లకు ఎమ్మెల్యేతో బేరం కుదుర్చుకుంది. మున్సిపాలిటీ పరిధిలో వాణిజ్య సముదాయాలు, ఇళ్ల నిర్మాణాల కోసం సదరు ఎమ్మెల్యే వద్ద రేటు మాట్లాడుకుంటేనే ఫైలు మున్సిపల్ కార్యాలయంలో కదులుతుంది. తన పరిధిలోని ఏ శాఖ కార్యాలయంలో పని కావాలన్నా సొంత పార్టీ వాళ్లు కూడా ముడుపులు ఇవ్వాల్సిందే. అప్పుడే వారి పని జరుగుతుంది. మున్సిపాలిటీ నుంచి అతని కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఆయన చెప్పిందే టపాసులూ పేలవు..

దీపావళి సందర్భంగా నిర్వహించే టపాసుల దుకాణల వాళ్లు ముందుగా ఎమ్మెల్యేకు మామూళ్లు ఇవ్వాల్సిందే. ఆ తర్వాతే వాళ్లు కేటాయించిన చోట దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలి. సులభ్ కాంప్లెక్స్ కాంట్రాక్టరు మామూళ్లు ఇవ్వలేదని రెండేళ్ల కిందట మున్సిపాలిటీ పరిధిలోని మరుగుదొడ్లను మూయించారు. మున్సిపాలిటీలోని ప్రజలకు తాగునీటి సరఫరా చేయకుండానే రూ.34 లక్షలకు బిల్లులు పెట్టి మంజూరు చేయాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో చేసే పెద్ద పనుల్ని ఎమ్మెల్యే సంస్థ నేరుగా చేపడుతోంది. చిన్న పనుల్ని ఆయన సామాజికవర్గానికి చెందిన కాంట్రాక్టర్లకే టెండరు దక్కేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. బ్రిడ్జి పునరుద్ధరణ పనుల్లో కూడా అతని కాంట్రాక్టు సంస్థ ద్వారా రూ.లక్షలు వెనకేసుకున్నారు. వసూళ్లలో ఎమ్మెల్యే పీఏ కూడా ఏ మాత్రం తీసిపోకుండా రూ.లక్షలు దండుకుంటున్నారు. తిరుమల దర్శనానికి లెటర్లు ఇవ్వడం సహా చిన్న పనులకూ పీఏ వసూలు చేస్తున్నారు.

'కేవీ'కి లేని భూములు ఎమ్మెల్యేకు ఏల?

నియోజకవర్గానికి కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయను మంజూరుచేసింది. 5 ఎకరాల స్థలం కేటాయిస్తే కేవీని అందుబాటులో తెస్తామని రెండేళ్ల క్రితమే సూచించింది. 'అంత భూమి మా దగ్గర లేదు' అని రెవెన్యూ యంత్రాంగం సెలవిచ్చింది. ఆ తర్వాత ఓ హైస్కూల్ భూమిని ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే తీవ్ర జాప్యం జరగడంతో కేవీ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు వంద ఎకరాలకుపైగా ప్రభుత్వ భూముల్ని కంపెనీ పేరిట ఎమ్మెల్యేకు ధారాదత్తం చేసేయడం గమనార్హం. ఇప్పుడుమరో 44.20 ఎకరాలను ఆయన టెండరు పెట్టారు. ఈ ప్రాంతానికి స్కిల్ యూనివర్సిటీ తెస్తానని పలుమార్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ స్థాయిలో చర్యలు లేకపోవడంతో ఆ వర్సిటీ పొరుగు జిల్లాకు వెళ్లిపోయింది.

బాబు బెయిల్ రద్దుకు

సుప్రీం నో

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం సోమవారం కొట్టివేసింది. 2022 నవంబరు 7న రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన ఇలాంటి అప్పీళ్లను కోర్టు తిరస్కరించిన విషయాన్ని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గుర్తుచేసింది. అయితే హైకోర్టు తప్పుడు కారణాలతో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్, న్యాయవాది మహ్‌ఫూజ్ నజ్కీ వాదనలు వినిపించారు. చంద్రబాబుతో పాటు ఆయన సహచరులిద్దరు దర్యాప్తును తప్పించుకుని తిరుగుతున్నారని, మాజీ సీఎం దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారని రంజిత్ కుమార్ తెలిపారు. ఉదయం కేసు విచారణ ప్రారంభం కాగానే.. జస్టిస్ ఖన్నా రాష్ట్రప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. '17ఏ సెక్షన్ ఈ కేసుకు కూడా వర్తిస్తుందా? 2014లో వచ్చిన ఆరోపణలివి. కానీ 2018లో దర్యాప్తు ప్రారంభమైంది. ఒకవేళ 17ఏ వర్తింపజేస్తే సముచిత అనుమతి తీసుకోకుండా కేసు పెట్టినట్లు అవుతుంది' అని పేర్కొన్నారు. రంజిత్‌కుమార్ స్పందిస్తూ.. చంద్రబాబుపై సెక్షన్ 420 కింద మోసం సహా ఐపీసీ ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు. 'ఇక్కడ సెక్షన్ 420 ఎలా వర్తిస్తుంది? అలా కుదరదు. దానిని వర్తింపజేయడం మీకూ ఇబ్బందే' అని న్యాయమూర్తి స్పష్టం చేశారు. వేరే ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా ప్రస్తావించి.. వివరాలను సమర్పించాలని కోరారు. ఐఆర్ఆర్ కేసులో తొలుత చంద్రబాబుకు నోటీసు జారీచేయాలని ధర్మాసనం భావించింది. అయితే ఇదే కేసులో మాజీ మంత్రి పి.నారాయణ, ఇతర నిందితుల ముందస్తు బెయిల్ రద్దుచేయాలని రాష్ట్రప్రభుత్వం దాఖలుచేసిన స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ)ను 2022 నవంబరు 7న సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయాన్ని సీనియర్ న్యాయవాది సిదార్థ లూథ్రా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఒకే ఎఫ్ఐఆర్‌లో రాష్ట్రప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరించినప్పుడు అదే తీర్పును తామెందుకు అనుసరించకూడదని ధర్మాసనం అడుగగా.. ప్రభుత్వం తరపు న్యాయవాదులు సమాధానం చెప్పలేకపోయారు. 'అవే ఆదేశాలను ఈ కేసులో ఎందుకు అనుసరించకూడదు? అదే ఆరోపణ.. అదే ఎఫ్ఐఆర్.. అవే సత్యాలు.. ఇప్పటికే ఓ ఎస్ఎల్‌పీని రద్దుచేసినందున.. తాజా పిటిషన్‌ను అనుమతించలేం. నోటీసు జారీచేయం' అని తేల్చిచెప్పింది. జగన్ ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే తమ ఆదేశాలు దర్యాప్తును ఏ మాత్రం ప్రభావితం చేయవని.. హైకోర్టు వ్యాఖ్యలతో సంబంధం లేకుండా దర్యాప్తు సంస్థ విచారణను కొనసాగించుకోవచ్చని తెలిపింది. ప్రతివాది (చంద్రబాబు) దర్యాప్తునకు సహకరించకపోతే బెయిల్ రద్దుచేయాలని ప్రభుత్వం దిగువ కోర్టులను ఆశ్రయించవచ్చంది.

6న స్కిల్ కేసులో అప్రూవర్ వాంగ్మూలం నమోదు

విజయవాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నిందితుడిగా ఉంటూ అప్రూవర్‌గా మారిన శిరీష్ చంద్రకాంత్ షా వాంగ్మూలం నమోదును విజయవాడ ఏసీబీ కోర్టు వచ్చే నెల 6కి వాయిదా వేసింది. ఈ కేసులో సీఐడీ దాఖలు చేసిన డాక్యుమెంట్లను అందజేయాలని నిందితుడు, మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ దాఖలు చేసిన విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

ఎటుచూసినా ప్రభంజనమే..

పొన్నూరు నియోజకవర్గంలో 'రా కదలిరా!' సభ ప్రభంజనం సృష్టించింది. ఈ సభకు జనం భారీగా తరలివచ్చారు. ప్రభుత్వ సభలకు ఏర్పాటు చేసినట్లు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోయినా, రవాణా సదుపాయాలు సరిపోకపోయినా జనం మాత్రం గ్రామాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. చంద్రబాబు వస్తున్న హెలికాప్టర్‌ను చూస్తూ మహిళలు, యువకులు, కార్యకర్తలు పచ్చ కండువాలు, జెండాలు ఊపుతూ అధినేతకు ఘన స్వాగతం పలికారు. టీడీపీ సభకు ఈసారి పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు హాజరయ్యారు.



పొన్నూరులో చంద్రబాబు సభకు హాజరైన జనం

నాది విజన్ జగన్‌ది పాయిజన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలను గందరగోళంలో పడేసి గెలుద్దామని జగన్ చూస్తున్నారు. కానీ, ఆయన పప్పులు ఉడకవు. అన్నీ ప్రజలు గమనిస్తున్నారు. జగన్‌పై ప్రజల్లోనే కాదు..ఆయన సొంత పార్టీలోనే తిరుగుబాటు మొదలైంది. సత్యవేడు ఎమ్మెల్యేకు తిరుపతి ఎంపీ సీటు ఇస్తే తాను పోటీ చేయనన్నాడు. తన మీద మంత్రి పెద్దిరెడ్డి పెత్తనం ఏమిటి? గనులు దోచుకొని ఆ నిందలు తనపై మోపారని, రోజారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పెదిరెడ్డిలను మార్చే ధైర్యం ఉందా అని ప్రశ్నించాడు. స్కూటర్‌పై తిరిగిన పెద్దిరెడ్డి రూ.వేల కోట్లకు ఎలా పడగలెత్తాడని నిలదీశాడు. 68 మందిని ఇప్పటివరకు మారిస్తే వారిలో 49 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఉన్నారు. నలుగురు ఎంపీలు జగన్‌తో వేగలేమని రాజీనామాలు చేసి వైసీపీ నుంచి బయటకు వచ్చేశారు. ఇద్దరు మంత్రులకు వేరే సీట్లు ఇస్తే వద్దని చెప్పారు. మొత్తం 20మంది మంత్రుల్లో 10మంది ఓడిపోతారనే నిర్ణయానికి జగన్ వచ్చేశారు. ఇక జగన్... నువ్వు ఎలా గెలుస్తావు?. ఈ కలియుగ భస్మాసురుడిని అంతం చేయడానికి ఓటు అనే వజ్రాయుధం మీ చేతిలో ఉంది"

మేం గేట్లు తెరిస్తే వైసీపీ ఖాళీ

"ఒక ఊరిలో పనికి రాని చెత్త, మరో ఊరికి బంగారం ఎలా అవుతుంది? మొన్ననే కడప నుంచి ఒక ఎమ్మెల్యేని జగన్ తన ప్యాలెస్‌కు పిలిపించుకున్నారు. 'నీపై రిపోర్టులు బాగా లేవు' అని ఆ శాసనసభ్యుడు ఎదురు తిరిగాడు. 'ముందు నీ రిపోర్టు బావుందా? నేను ఏ తప్పూ చేయలేదు. ఎవరినీ చంపలేదు. చంపిన వాళ్లకు అండగా నిలవలేదు' అని జగన్ ముఖం మీదే అన్నాడు. దీంతో 'నన్నే ఎదిరిస్తావా' అని జగన్ దాడి చేయబోవడంతో, కొట్టుకొనే పరిస్థితి తలెత్తింది. నియంతపై తిరుగుబాటు ప్రారంభమైనట్లు స్పష్టమౌతున్నది. టీడీపీ ఏమాత్రం గేట్లు తెరిచినా వైసీపీ ఖాళీ కావడం ఖాయం"

ఇదేనా విశ్వసనీయత?

"జగన్ కొత్తగా విశ్వసనీయత అంటూ నాటకానికి తెరలేపారు. జగన్ విశ్వసనీయత ఎలాంటిదంటే రూ. 200 ఉండే కరెంటు బిల్లుని రూ. 1000కి పెంచారు. మద్యం సీసాని రూ.60 నుంచి రూ. 200 చేశారు. పెట్రోలు, డీజిల్ ధరలు దేశంలో ఇక్కడే ఎక్కువ. 24 శాతం నిరుద్యోగం తాండవిస్తున్నది. ఉచిత ఇసుకను కేజీల లెక్కన బొక్కేస్తున్నారు. ఎస్సీలను చంపి డోర్ డెలివరీ చేయించారు. పెట్రోలు పోసి బీసీ బిడ్డని చంపిన వాళ్లు బయట తిరుగుతున్నారు. పరదాల చాటున పర్యటనలు చేస్తూ, వాటి కోసం చెట్లు నరికిస్తున్నారు. రాజధాని లేకుండా చేశారు. గంజాయికి చిరునామాగా ఏపీని మార్చారు.."

మనం గెలుస్తున్నాం..

"నాది విజన్. జగన్‌ది పాయిజన్. 20 ఏళ్ల తర్వాత ఏమి జరుగుతుందో ముందే ఊహించి అందుకు కార్యాచరణ రచించి ఇప్పటినుంచే నేను అమలు చేస్తా. జగన్ మాత్రం విధ్వంసానికి మారు పేరు. నా విజన్‌కు నమూనా సైబరాబాద్. అమరావతి వచ్చి ఉంటే ఈ పాటికే అభివృద్ధి జరిగేది. చిన్న లిటిగేషన్ కూడా లేకపోయినా జగన్..కులం అంటగట్టారు. మూడు ముక్కలు అంటూ సర్వనాశనం చేశారు. నేను, జగన్ శాశ్వతం కాదు. సమాజమే శాశ్వతం. సమాజానికి ద్రోహం చేసిన జగన్‌ని వదిలిపెడతారా? అమరావతి రాజధాని 72 రోజుల తర్వాత పూర్వ వైభవం సంతరించుకోవడం ఖాయం. ఇది దేవతల రాజధాని. జగన్ లాంటి ఎంతమంది సైకోలు వచ్చినా ఏమీ చేయలేరు. అమరావతి రాజధాని 5 కోట్ల మంది ప్రజల నినాదం. ఇది తప్పకుండా సాధ్యమౌతుంది. అది జరగాలంటే మూడు రెక్కలున్న ఫ్యాన్‌ని విరిచి పారేయాలి. ఒక రెక్కని ఉత్తరాంధ్ర, రెండో రెక్కని ఫ్యాక్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నందుకు రాయలసీమ, మూడో రెక్కని కోస్తాంధ్ర ప్రజలు విరిచేస్తే రెక్కలు లేని ఫ్యాన్ తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుండిపోతుంది. యువత ఎటువైపు ఉంటే ఆ పార్టీ గెలుపు ఖాయం. టీడీపీ-జనసేన కూటమి వైపే యువత ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పక గెలుస్తున్నాం. అందువల్లే జగన్ దాడులు చేయిస్తున్నాడు. పార్టీ మారడానికి నిరాకరించాడని మాచర్లలో దుర్గారావు అనే మత్స్యకారుడిని పోలీసులు కొట్టాడు. తీవ్రంగా హెచ్చరించడంతో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు.



షర్మిలకు ఏం చెబుతాడు?

"స్థానిక సంస్థల్లో 8 శాతం రిజర్వేషన్లను ఎన్టీఆర్ తీసుకొచ్చారు. అప్పటి నుంచే సాధికారత ప్రారంభమైంది. ఆస్తిలో సమాన హక్కు ఉండాలని అప్పట్లోనే చట్టం తెచ్చారు. ఇప్పుడు వైఎస్ సంపాదించిన ఆస్తిలో వాటాని తన అన్నయ్య జగన్ ఇవ్వలేదని ఆయన కుమార్తె షర్మిల అడుగుతున్నారు. దీనికి సైకో జగన్ ఏమి సమాధానం చెబుతారు? నేను ఉద్యోగాలు, కాలేజీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో చాలామంది చదువుకొని ఉద్యోగాలు సంపాదించుకొన్నారు. దాంతో వరకట్నం, అమ్మాయిలకు పెళ్లి కావడం లేదన్న సమస్యలు తీరిపోయాయి. నేడు పురుషులకే పెళ్లిళ్లు కాని పరిస్థితి ఉంది"

హామీలు....

ప్రతీ ఆడబిడ్డకు (19 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్యన వయస్సు) నెలకు రూ. 1500 సాయం.

తల్లికి వందనం కింద రూ. 15 వేలు.

సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్ల పంపిణీ

ఆర్‌టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం..

రద్దీతో వేదికపై తూలిన చంద్రబాబు

రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో చంద్రబాబు రా... కదలిరా... సభ ముగించుకుని వెళుతున్న క్రమంలో నేతల రద్దీతో సభా వేదిక కిక్కిరిసింది. ఈ క్రమంలో ఒకరిద్దరు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చే క్రమంలో కొంతమీదకు రావడంతో ఆయన తూలారు. వెంటనే అప్రమత్తమైన ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది వెనుక నుంచి చెయ్యి అడ్డం పెట్టి బేలన్స్ తప్పకుండా నిలువదల చేశారు. వెంటనే సిబ్బంది చెయ్యి అడ్డుపెట్టి చంద్రబాబును కాన్వాయ్ వద్దకు తీసుకెళ్లారు.

పది రోజుల తర్వాత జన ఉధృతి...

'నేను, పవన్ కల్యాణ్ స్వార్థం కోసం ప్రజల వద్దకు రావడం లేదు. రాష్ట్రం, తెలుగుజాతి, బిడ్డల భవిష్యత్తు బాగుండాలని వస్తున్నాం. 72 రోజుల పాటు ప్రజలు రోడ్ల మీదే ఉండాలి. సైకిల్ ఎక్కాలి. గ్లాసు చేతబట్టాలి. రెండు చేతులతో రెండు జెండాలు పట్టుకొని ప్రచారం చేయాలి. ఈ పని మీరు చేయండి. మీ భవిష్యత్తుని బంగారం చేసి రుణం తీర్చుకొంటాను. ఉద్యోగులు కూడా జగన్‌ను నమ్మి మోసపోయారు. కనీసం సమయానికి జీతం ఇవ్వమని ధైర్యంగా అడగలేకపోతున్నారు. వారికి జగన్ రూ.20 వేల కోట్ల బకాయిలు పెట్టారు. కాంట్రాక్టర్లకు రూ.90 వేల కోట్లు చెల్లించాలి. ఉపాధ్యాయులను బ్రాందీ షాపులకు కాపలా పెడుతున్నారు. పోలీసులు కూడా వైసీపీ నాయకుల ఇళ్లల్లో ఊడిగం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లిపోయే గడువు దగ్గర పడింది. దానిని నమ్ముకొంటే పోలీసులు ఇంటికి పోవాల్సి ఉంటుంది. రా... కదలి రా సభలు మరో 10 రోజుల్లో అయిపోతాయి, అప్పుడు జన ఉధృతి చూస్తారు.. వైసీపీ ఎమ్మెల్యేల్లో కొందరి తీరు మరీ దారుణం.. పొన్నూరులో కిలారి రోశయ్య, పక్కా కిలాడీ..రాజమహేంద్రవరం ఎంపీ ఓ రీల్స్ మాస్టరు"

అనుకూల ఐపీ..'ఎస్'లు!

- **కీలక జిల్లాలకు వీర విధేయులు**
- **చిత్తూరు ఎస్పీగా నమ్మిన బంటు జాషువా**
- **విపక్ష నేత జిల్లాలో సహకరించిన రిశాంత్‌ని బదిలీ చేస్తూ.. అక్కడే మరిన్ని బాధ్యతలు**
- **అండగా ఉన్న విజయారావుకు కర్నూలు**
- **కడపలోనూ ఓ 'రేంజ్' పెత్తనం ఆయనదే**
- **విశాఖ డీఐజీగా విశాల్ గున్నీ.. హరికృష్ణకు పర్సనల్..**
- **దళిత ఐపీఎస్ అధికారుల్ని పావులుగా మార్చిన వైసీపీ**
- **ఎన్నికలకు ముందు 30 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ**

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం 30 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. తాము చెప్పినట్లు ఎవరు వింటారో అలాంటి వారిని ఎంపిక చేసి మరీ కీలక స్థానాల్లో నియమించింది. ముఖ్యంగా దళిత అధికారుల్ని ఎన్నికల్లో పావులుగా వాడుకునే తెలివి ప్రదర్శించింది. ప్రతిపక్ష నేత చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో ఏకపక్షంగా వ్యవహరించే ఎస్పీ రిశాంత్ రెడ్డిని కౌంటర్ ఇంటెలిజెన్స్(ఉగ్రవాదుల ఏరివేత)కు బదిలీ చేసిన ప్రభుత్వం.. ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగం ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అంటే తమకు పూర్తిగా అనుకూలమైన ఐపీఎస్ అధికారి ఎట్టిపరిస్థితుల్లోనూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వదిలి పోకుండా కాపాడుకుంది. మరోవైపు చిత్తూరు ఎస్పీగా కృష్ణా జిల్లా ఎస్పీ పి. జాషువాను నియమించింది. వైసీపీ నేతలకు వంగి దండాలు పెడుతూ తనకు ప్రభుత్వం కేటాయించిన వాహనంలో అధికార పార్టీ నేతల్ని బహిరంగంగా తిప్పే అధికారిగా ఈయనకు 'మంచి' పేరుంది. గతంలో అదే జిల్లాలో డీఎస్పీగా పనిచేసిన జాషువా వైసీపీ నేతలకు వీరవిధేయుడిగా పేరుగడించారు.

సెంథిల్‌కు రెండు బాధ్యతలు

కర్నూలు డీఐజీ సెంథిల్ కుమార్‌ను ఆక్టోపస్ సహా శాంతి భద్రతలకు బదిలీ చేసింది. ఇక, నెల్లూరు ఎస్పీగా ఉంటూ.. వైసీపీకి పూర్తిగా సహకరిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొన్న విజయారావును కర్నూలు డీఐజీగా ప్రభుత్వం నియమించింది. చిత్రం ఏంటంటే.. సీఎం సొంత జగన్ జిల్లా కడప కూడా విజయారావు పరిధిలోకే వస్తున్నందున అధికార పార్టీకి ఎన్నికల్లో అడ్డూ అదుపు ఉండబోదనే అంటున్నారు. అనంతపురం జిల్లా ఎస్పీగా ఉన్న పక్కీరప్పను కీలకమైన విశాఖ సిటీలో రెండో స్థాయి ఐపీఎస్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. పక్కీరప్ప.. సీఎం జగన్ చిన్నాన్న వివేకానందరెడ్డి దారుణ హత్య కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులపైనే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇక, విజయవాడ నుంచి ఇద్దరు దళిత ఐపీఎస్ అధికారుల్ని విశాఖపట్నం రేంజ్‌కు పంపారు. ప్రస్తుతం విజయవాడలో విధులు నిర్వహిస్తున్న విశాల్ గున్నీని విశాఖ డీఐజీగా బదిలీ చేశారు.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కుమార్ విశ్వజిత్	ఏడీజీ విజిలెన్స్	ఏడీజీ, రైల్వేస్
అతుల్ సింగ్	చైర్మన్, ఎస్ఎల్ పీఆర్‌బీ	ఏడీజీ, ఏపీఎస్పీ
సీహెచ్ శ్రీకాంత్	ఐజీ, సీఐడీ	ఐజీ, ఆక్టోపస్.(అదనంగా రోడ్ సేఫ్టీ)
కొల్లి రఘురామి రెడ్డి	ఐజీ, ఇంటెలిజెన్స్	ఐజీ, విజిలెన్స్(డ్రగ్ కంట్రోల్ అదనం)
రాజశేఖర్ బాబు	ఐజీ, ఆక్టోపస్	చైర్మన్, ఎస్ఎల్‌పీఆర్‌బీ(హోంగార్డ్స్ అదనం)
ఎస్ ఎస్ త్రిపాఠి	ఐజీ, అడ్మిన్(చీఫ్ ఆఫీస్)	ఐజీ, సీఐడీ
ఎస్. హరికృష్ణ	డీఐజీ, విశాఖపట్నం రేంజ్	ఐజీ, పర్సనల్(చీఫ్ ఆఫీస్)(టెక్నికల్ అదనం)
కె.వి. మోహన్ రావు	డీఐజీ, డీజీపీ ఆఫీస్	ఐజీ, స్పోర్ట్స్
సెంథిల్ కుమార్	డీఐజీ, కర్నూల్ రేంజ్	డీఐజీ, ఆక్టోపస్(శాంతిభద్రతలు అదనం)
రాహుల్ దేవ్ శర్మ	ఏపీఎస్పీ, విజయనగరం	డీఐజీ, ట్రైనింగ్
విశాల్ గున్నీ	డీసీపీ, విజయవాడ(శాంతిభద్రతలు అదనం)	డీఐజీ, విశాఖపట్నం రేంజ్
సీహెచ్. విజయారావు	ఏపీఎస్పీ, కాకినాడ	డీఐజీ, కర్నూలు రేంజ్
ఫక్కీరప్ప కాగినెల్లి	ఎస్పీ, సీఐడీ	జాయింట్ సీపీ, విశాఖ సిటీ
అద్నాన్ నయీమ్ అస్మి	ఎస్పీ, ఏసీబీ	ఎస్పీ, కృష్ణా జిల్లా
అమిత్ బర్దార్	ఎస్పీ, సీఐడీ	కమాండెంట్, ఏపీఎస్పీ, మంగళగిరి
ఆరిఫ్ హాఫీజ్	ఎస్పీ, గుంటూరు	ఎస్పీ, ఐఎస్‌డబ్ల్యూ
అజితా వాజేంద్ల	డీసీపీ, జగ్గయ్యపేట	ఎస్పీ, పశ్చిమ గోదావరి
కేఎస్ఎస్‌వీ సుబ్బా రెడ్డి	ఏపీఎస్పీ, మంగళగిరి	ఆర్‌వీఈవో, రాజమండ్రి
రిశాంత్ రెడ్డి	ఎస్పీ, చిత్తూరు	ఎస్పీ, సీఐ సెల్(రెడ్ శాండర్స్ అదనం)
పి. జాషువా	ఎస్పీ, కృష్ణా జిల్లా	ఎస్పీ, చిత్తూరు
యు. రవిప్రకాశ్	ఎస్పీ, పశ్చిమ గోదావరి	ఎస్పీ, ఏసీబీ
సీహెచ్. మణికంఠ	అడిషనల్ ఎస్పీ, సెబ్, శ్రీకాకుళం	డీసీపీ, శాంతిభద్రతలు, విశాఖ సిటీ
అధిరాజ్ సింగ్ రాణా	ఏఎస్పీ, నర్సీపట్నం	ఏపీఎస్పీ, విజయనగరం
క్రిష్ణ కాంత్ పటేల్	అడిషనల్ ఎస్పీ, సెబ్, కర్నూలు	ఏపీఎస్పీ, కాకినాడ
తుషార్ డూడీ	అడిషనల్ ఎస్పీ, కడప(అడ్మిన్)	ఎస్పీ, గుంటూరు
కె. శ్రీనివాస రావు	డీసీపీ, విశాఖ సిటీ	డీసీపీ, జగ్గయ్య పేట
ధీరజ్ కనుబిల్లి	ఏఎస్పీ, పాడేరు	ఏఎస్పీ, రంపచోడవరం
జగదీష్ అడహల్లి	ఏఎస్పీ, రంపచోడవరం	ఏఎస్పీ, పాడేరు
ఆనంద్ రెడ్డి	డీసీపీ, విశాఖ(శాంతిభద్రతలు)	డీసీపీ, విజయవాడ(శాంతిభద్రతలు)
మోకా సత్యనారాయణ	డీసీపీ, విజయవాడ,	డీసీపీ, విశాఖపట్నం

నేడు మరిన్ని?

రాష్ట్రంలోని మరింత మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం మంగళవారం బదిలీ చేసే అవకాశం ఉంది. తిరుపతి, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు అర్బన్, విజయనగరం జిల్లాల ఎస్పీలను బదిలీ చేయనున్నట్టు సమాచారం. గత పది రోజులుగా పోలీసు శాఖ ఎదురు చూస్తున్న ఈ బదిలీల్లో అధికార పార్టీ తనకు అనుకూలమైన అధికారులను కీలక స్థానాల్లో నియమించడం పట్ల పోలీసు వర్గాల్లోనే విస్మయం వ్యక్తమైంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

విద్యార్థులకు మలబార్ ఉపకార వేతనాల పంపిణీ

లబ్బీపేట: వ్యాపార దృక్పథమే కాకుండా సామాజిక బాధ్యతలోనూ పాలుపంచుకోవడం హర్షణీయమని మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అన్నారు. సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరిగింది. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా 353 మందికి రూ.8వేలు, రూ.10వేలు చొప్పున రూ.31,38,000 మొత్తాన్ని పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ త్వరలోనే 5,500 మందికి స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్నారు. కృష్ణాజిల్లా డీఐఈవో బి.ఎస్.ఆర్.వి.ప్రసాద్. జిల్లా ఆర్ఐవో పి.రవికుమార్, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జోనల్ హెడ్ నిఖిల్ చంద్రన్, స్టోర్ హెడ్ అర్జున్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీ

● గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ

గన్నవరం: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో భారీ మెజారిటీతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాబోతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. మరో 3 నెలల్లో వైసీపీ ఇంటికి పోవటం ఖాయమని అధికార పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై తీవ్రమైన దాడులు చేస్తూ నేతలపై నిర్బంధం అమలు చేసిందన్నారు. కనీసం బ్యానర్లు కూడా కట్టనీయకుండా అడ్డుకుందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోవటంతో, అభివృద్ధి ఎక్కడ కనిపించటం లేదన్నారు. టీడీపీ హయాంలో ఇసుకను ఉచితంగా అందిస్తే వైసీపీ వ్యాపారం చేస్తూ అందరి నడ్డి విరుస్తోందన్నారు. దోచుకోవటం తప్ప ప్రజల బాధలు తెలియటం లేదన్నారు.

మానసిక రోగులకు మనోబంధు

గవర్నర్‌పేట: మానసికంగా అనారోగ్యంతో ఉన్నవారి కోసం మనోబంధు సంస్థ పనిచేస్తోందని సంస్థ మేనేజింగ్ ట్రస్టీ భూపతిరాజు రామకృష్ణంరాజు అన్నారు. సంస్థ ఆవిర్భవించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు 120 మందిని ఎంపిక చేసి వారి బాగోగులు చూస్తున్నట్టు వెల్లడించారు. శ్రద్ధా ఫౌండేషన్ (ముంబై) సహకారంతో దేశవ్యాప్తంగా కోలుకున్న 75మంది రోగులను వారి కుటుంబాలతో కలిసేలా చేశామన్నారు. టీటీడీ మద్దతుతో తిరుపతిలో 100 పడకల పునరావాస కేంద్రం ఏర్పాటు పనిలో ఉన్నట్లు వెల్లడించారు. మెగసేసే అవార్డు గ్రహీత సందీప్ పాండే, మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఈ-లాటరీ 6కు వాయిదా

కృష్ణలంక: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్‌డీఏ వారికి అప్పగించిన రైతులకు కేటాయించబడిన నివేశన, వాణిజ్య స్థలాలు భూ సేకరణలో ఉన్నందున, భూ సేకరణ పూర్తికానందున రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు జనవరి 29న జరగాల్సిన మూడో విడత ఈ లాటరీని ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేసినట్టు సీఆర్‌డీఏ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పర్యాయాలు నోటీసులిచ్చినా రైతులు హాజరుకానందున వారికి మరో అవకాశం కల్పించుటకు ఫిబ్రవరి 6న మంగళవారం ఉదయం 11 గంటలకు లాటరీ నిర్వహించబడుతుందన్నారు.

విద్యుత్ షాక్‌తో డ్రైవర్ మృతి

చిట్టినగర్: టిప్పర్ పంచర్ వేసేందుకు జాకీ పైకి లేపటంతో టిప్పర్‌పై ఉన్న విద్యుత్ తీగలకు తగిలి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఉంగటూరు పొట్టిపాడుకు చెందిన వీ.శ్రీను లారీ డ్రైవర్‌గా పని చేస్తాడు. ఉదయం 9గంటలకు షాబాద్ నుంచి మట్టిలోడు తీసుకొని అంబాపురం వచ్చింది. మట్టిలోడ్ దించి వస్తుండగా పాముల కాలువవద్ద టిప్పర్ పంచరయ్యింది. పంచర్ వేయించేందుకు టిప్పర్‌ను సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న షాపు తీసుకెళ్లగా అక్కడ పంచర్ వేస్తుండగా టిప్పర్ జాకీ పైకి లేపటంతో టిప్పర్ పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో డ్రైవర్ శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఒకరిపై దాడి

● నలుగురిపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్: ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన ఘటనలో నలుగురిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ బసవతారక్‌నగర్ ప్రాంతానికి చెందిన దిబ్బ చిన్నబాబు రైల్వేలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. చిన్నబాబుకు హనుమాన్‌జంక్షన్ ప్రాంతానికి చెందిన జ్యోతితో 2016వ ఏడాది వివాహమైంది. మనస్పర్థలతో భార్యభర్తలు విడిగా ఉంటున్నారు. ఇటీవల జ్యోతి సోదరుడు చిన్నబాబుకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఆదివారం రాత్రి చిన్నబాబు ఇంటికి వచ్చిన భార్య జ్యోతి, బావమరది జగదీష్, అత్త దుర్గ, హరిబాబలు చిన్నబాబుపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో చిన్నబాబు తలకు తీవ్రగాయాలయ్యాయి. దాడి వద్దని వారించిన చిన్నబాబు తల్లిపైనా దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసిన అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ జోన్‌ చైర్మన్ మహేష్‌కు అభినందనలు

బస్‌స్టేషన్: ఆర్టీసీ జోన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్నింటి మహేష్‌ను సోమవారం ప్రజారవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ నేతలు కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్చం, దుశ్శాలువాతో సత్కరించారు. సంస్థలో 20 వేల మందికి పైగా ఉన్న బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. తన దృష్టికి వచ్చిన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మహేష్ అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు, నేతలు టీ సూరిబాబు, కే శంకర్, ఏవీఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎమ్‌లో కిండర్ గార్డెన్ స్వర్ణోత్సవం

పటమట: పాఠశాలలు ఎల్లప్పుడు విద్యతో పాటుగా విద్యార్థి అభిరుచికి అనుగుణంగా, ఏ అంశాన్ని ఎక్కువగా ఇష్టపడుతున్నాడో గమనించి దానికి తగ్గట్టుగా విద్యా బోధన చేసినట్లయితే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని ఎన్ఎస్ఎమ్ పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ మౌంట్ ఫోర్ట్ అన్నారు. సోమవారం ఎన్ఎస్ఎమ్ పబ్లిక్ స్కూల్ కిండర్ గార్డెన్ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ జి.శరత్‌చంద్ర పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలేవీ..?

● కలెక్టర్‌కు కొత్తూరు తాడేపల్లి రైతుల ఫిర్యాదు ● పరిశీలనకు వస్తానని ఢిల్లీరావు హామీ ● ఈలోపే తవ్వకాలు పూర్తవుతాయని ఆందోళన



కలెక్టర్ ఢిల్లీరావుకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: కొత్తూరు తాడేపల్లి రెవెన్యూ పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలను వ్యవస్థలు అరికట్టలేకపోతున్నాయని కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగాలని రూరల్ మండలం రైతులు కలెక్టర్ ఢిల్లీరావుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్పందనలో కొత్తూరు తాడేపల్లికి చెందిన రైతులు వచ్చారు. స్థానిక టీడీపీ నేత మెండెం జమలయ్య నేతృత్వంలోని రైతులు ఈ మైనింగ్ దందాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే! దీనిపై జాతీయ స్థాయిలో గ్రీన్ ట్రిబ్యునల్ కూడా రంగంలోకి దిగి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అక్రమ క్వారీయింగ్‌పై జిల్లా వ్యవస్థలేవీ పనిచేయకపోవటం వల్ల తవ్వకాలు పెచ్చుమీరిపోతున్నాయని వాపోయారు. కొత్తూరు తాడేపల్లి రెవెన్యూ పరిధిలో 135 సర్వే నెంబర్‌లోని వసంతరాయుల తిప్ప (కొండ), సర్వే నెంబర్ 248లో చెరువు (ప్రభుత్వ భూమి) కొండ వాగు (ప్రభుత్వ భూమి)లో తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తూరు, తాడేపల్లి, నైనవరం, పాతపాడు గ్రామాలు, జీ కొండూరు మండలంలోని వెలగలేరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా పేదల అసైన్డ్ భూములలో మట్టితవ్వకాలు జరిగాయన్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. గతంలో సబ్ కలెక్టర్ ఆదితిసింగ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయించినా ఇప్పుడు అక్కడ ఎవరూ విధులు నిర్వహించటం లేదన్నారు. మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు మొక్కుబడి తనిఖీలు చేస్తున్నారని, ఇలాంటపుడు ముందుగానే వారికి సమాచారం వెళ్లిపోతోందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వేములకొండ నాగరాజు, బొర్రా పున్నారావు, ఉప్పలపాటి వెంకటరావు, గొడ్డలి రామారావు, టీ సుబ్బారావు ఉన్నారు.

ఆత్మస్థైర్యంతో లక్ష్యాలు సాధించండి: కలెక్టర్



ట్రై సైకిళ్లు అందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 29: దివ్యాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆత్మస్థైర్యం, విశ్వాసంతో ముందుకెళ్లి అనుకున్న లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విభిన్నప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయసంస్థ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అర్హులైన 11 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.1,57,000 విలువైన ట్రై సైకిళ్లు, లాప్‌టాప్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక వైకల్యం అనేది జీవనానికి అడ్డంకి కాకూడదని వారికి మరింత తోడ్పాటు అందిస్తుందన్నారు. ఒక్కొక్కటి రూ.6,500 విలువైన 3చక్రాల ట్రై సైకిళ్లను 8 మందికి, ఒక్కొక్కటి రూ.35 వేల విలువైన లాప్‌టాప్‌లను ముగ్గురికి కలెక్టర్ పంపిణీ చేశారు. ఏడుగురు హిజ్రాలకు గుర్తింపు కార్డులను అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ వి.కామరాజు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి అపరిష్కృత సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంఘం నేతలు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 11వ పీఆర్‌సీలో 1 జనవరి 2022 నుంచి తగ్గించిన అదనపు క్వాంటమ్‌ను యథావిధిగా అంతకు ముందు ఇస్తున్నట్టు 70ఏళ్లు నిండిన వారికి 10 శాతం, 75ఏళ్లు నిండినవారికి 15 శాతానికి పునరుద్ధరించాల్సిందిగా కోరారు. పెండింగ్ డీఆర్ బకాయిలు, 11వ పీఆర్‌సీ ఎరియర్స్ చెల్లించాలని, హెల్త్‌కార్డు ద్వారా వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ పరిధి రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. పెన్షనర్ల సంఘం జిల్లా నేతలు దాలి నాయుడు, జి.నారాయణ, విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం

● టీడీపీ కార్పొరేటర్ల ధ్వజం

విద్యాధరపురం, జనవరి 29: నగరంలోని ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేల మాటలు కోటలు దాటుతున్నాయని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడని వారు ప్రభుత్వం నుంచి నగరాభివృద్ధికి రూపాయి కూడా తేలేని అసమర్థులని టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, కార్పొరేటర్లు ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి శాంతిశ్రీ విమర్శించారు. సోమవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధానంగా వైసీపీ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు దోచుకున్నది దాచుకోవడానికి తప్ప నగరాభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకునే ప్రదేశంలో రూ.50 లక్షలతో యుద్ధప్రాతిపదికన ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రోడ్డు వేశారన్నారు. దీనికి కార్పొరేషన్ జనరల్ ఫండ్ నిధులు మళ్లించారని ఆరోపించారు. బడ్జెట్ సమావేశాలను నిర్వహించే స్థితిలో కార్పొరేషన్ లేదని, తాజాగా జరగనున్న కౌన్సిల్ సమావేశం ఆఖరుదన్నారు. బడ్జెట్ సమావేశాలు పెట్టకుండా నిధులెలా వ్యయం చేస్తారని నిలదీశారు.

శ్వేత రాజీనామాను ఎందుకు ఆమోదించలేదు

ఇటీవల టీడీపీ నుంచి వైసీపీలో చేరిన కేశినేని శ్వేత టీడీపీ కార్పొరేటర్‌గా తన పదవికి రాజీనామా చేశారని, ఆమె రాజీనామాను ఎందుకు ఆమోదించలేదో తెలపాలని, ఒకవేళ ఆమోదిస్తే స్పష్టంగా పత్రికలకు చెప్పాలన్నారు. ఇంకా రెండున్నరేళ్ల పదవీకాలం ఉండగా శ్వేత రాజీనామా చేశారన్నారు. శ్వేత తండ్రి ఎంపీ కేశినేని నాని చేస్తున్న అహంకార పూరిత వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు.

వేటూరికి ఘన నివాళి

వన్‌టౌన్: ప్రముఖ సినీ పాటల రచయిత, దివంగత వేటూరి సుందరరామూర్తి జయంతి సందర్భంగా కళాక్షేత్రంలోని ఆయన విగ్రహానికి సోమవారం ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు ఆధ్వర్యంలో పలువురు నేతలు నివాళులర్పించారు.

నైవేద్య సమయంలో వీఐపీలు రావొద్దు!

● త్వరలో గిరిప్రదక్షణ బస్సు ఏర్పాటు ● రైల్వే, బస్టేషన్లలో ప్రసాదాల కౌంటర్లు ● దుర్గగుడి ఈవో రామారావు, చైర్మన్ రాంబాబు



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, ఈవో

వన్‌టౌన్, జనవరి 29: వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని దుర్గగుడికి చెందిన జమ్మిదొడ్డి ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో సోమవారం జరిగిన దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా ప్రసాదాల కౌంటర్లు, దర్శన కౌంటర్ల విస్తరణ, ఘాట్‌రోడ్డులో చిన్నచిన్న మరమ్మతులు, మల్లేశ్వరాలయ ప్రారంభం, ఎలివేటెడ్ క్యూ నిర్మాణం వేగవంతం వంటి అంశాలపై సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఆయా వివరాలను ఈవో రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు విలేకరులకు వెల్లడించారు. ముఖ్యంగా అమ్మవారి నైవేద్య సమయం (ఉదయం 11.30 నుంచి 12.15 గంటల వరకు)లో వీవీఐపీలు, వీఐపీలు, వృద్ధులు, వికలాంగులు దర్శనానికి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మధ్యాహ్నం 2 గంటల తరువాత వారు రావాలని తీర్మానించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ప్రసాదాల కౌంటర్లను 2 షిఫ్టుల్లో పని చేయించనున్నారు. అలాగే బస్టేషన్ ఎరైవల్ బ్లాక్ వద్ద ఒక ప్రసాదాల కౌంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కొండపైన మైకు ప్రసారం కేంద్రం వద్ద ఒక దర్శనం కౌంటర్, ఘాట్‌రోడ్డులోని టోల్‌గేట్ వద్ద ఒక ప్రసాదాల కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దుర్గాఘాట్‌లో భక్తులకు వాష్ రూమ్‌లు, దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఫిబ్రవరి 18న మల్లేశ్వరాలయాన్ని పునఃప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకంగా ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో రోజుకు లక్షమంది భక్తులు వస్తారన్న అంచనాతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. వచ్చే దసరాకు పనులు పూర్తవుతాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షణకు భక్తుల నుంచి స్పందన బాగుందని అందుకోసం గిరి ప్రదక్షణ బస్సును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సరుకులు కొనుగోలు టెండర్లను పిలువలేదన్నారు. దేవదాయ మంత్రి సూచనల మేరకు టెండర్లు పిలుస్తామన్నారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, దేవిశెట్టి బాలకృష్ణ, బచ్చు మాధవీకృష్ణ, తొత్తడి వేదకుమారి, అనుమోలు ఉదయలక్ష్మి, కొలకలూరి రామసీత, ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర రెడ్డి, చెన్నా జనార్ధనరావు, కొసురు వెంకటరాజు, మర్రెడ్డి రాగిణి, ఆలయ కార్యనిర్వాహక ఇంజనీర్లు కేవీఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాల్సిందే: ఈవో

దుర్గగుడిలో షాపుల నిర్వాహకులు దేవస్థానానికి బకాయిలు చెల్లించిన తరువాతే మరే ఇతర అంశాలనైనా ప్రస్తావించడం జరుగుతుందని ఈవో రామారావు తెలిపారు. కనకదుర్గ నగర్‌లోని షాపుల నిర్వాహకులు సోమవారం ఉదయం ఈవోను కలిసి కనకదుర్గనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా తమను ఖాళీ చేయాలని దేవస్థానం ఇచ్చిన నోటీసులను ప్రస్తావించారు. తమకు ప్రత్యామ్నాయంగా మరోచోట షాపులు ఏర్పాటు చేసుకునేలా వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈవో స్పందిస్తూ సోమవారం ఆంధ్రజ్యోతిలో కోట్లలో దుర్గగుడి షాపుల అద్దె బకాయిల శీర్షికన వచ్చిన కథనాన్ని ప్రస్తావించారు. దేవస్థానానికి నిర్వాహకులు రూ.1.80 కోట్లు బకాయి ఉందని, ఈమొత్తం చెల్లించాకే మిగతా అంశాలు మాట్లాడతానని స్పష్టం చేశారు.

టెక్నికల్ టెక్స్‌టైల్ ప్రోత్సాహానికి సిద్ధం

● మంత్రి గుడివాడ అమర్‌నాథ్

భవానీపురం, జనవరి 29: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతమైన పరిధిని కలిగిన టెక్నికల్ టెక్స్‌టైల్ ప్రోత్సాహానికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. భారత ప్రభుత్వం నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర చేనేత, జౌళిశాఖ సోమవారం జాతీయ స్థాయిలో సాంకేతిక వస్త్రాల అభివృద్ధికి విధాన మార్గాల రూపకల్పన ప్రధాన అంశంగా నగరం వేదికగా ఒకరోజు సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌నాథ్ మాట్లాడుతూ దేశంలోని మరే రాష్ట్రానికి లేని విధంగా రాష్ట్రంలో మూడు పారిశ్రామిక కారిడార్లు, సరిపడ సహజ వనరులు త్వరగా పరిశ్రమల ఏర్పాటుకు క్లియరెన్స్ కోసం సింగిల్ విండో పోర్టల్ ఉన్నాయన్నారు. కేంద్ర జౌళిశాఖ సంయుక్త కార్యదర్శి రాజీవ్ సక్సేనా, రాష్ట్ర చేనేత జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి సునీత,ఇండియన్ టెక్స్‌టైల్ అసోసియేషన్ అధ్యక్షుడు అవినాష్ మైసర్ పాల్గొని మాట్లాడారు. వివిధ సంస్థల సీఈవోలు, వస్త్ర తయారీదారులు, ఇంజనీర్లు డిజైనర్లు విధాన రూపకర్తలు, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. వినూత్న ప్రదర్శనలో అరటి, ఫైబర్, జూట్, ఉన్ని, ఇతర వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసిన ఉపయోగకర ఉత్పత్తులను ప్రదర్శించారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

● ఏపీ ఎన్జీవో నేత విద్యాసాగర్

ధర్నాచౌక్, విజయవాడ 29: నాలుగున్నరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని జిల్లా జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ విమర్శించారు. తక్షణమే పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారానికి పెన్షనర్లు స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపిన విద్యాసాగర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో పెన్షనర్లకున్న 10 శాతం ఎడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను ఈ ప్రభుత్వం 7 శాతానికి కుదించిందని దాన్ని తిరిగి 10 శాతానికి పునరుద్ధరించాలని మాత్రమే పెన్షనర్లు అడుగుతున్నారన్నారు. పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.దాలినాయుడు మాట్లాడుతూ 5న నగరంలో జరిగే రాష్ట్రవ్యాప్త ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపినిచ్చారు. ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ ఇక్బాల్, పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.నారాయణరావు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం అందజేశారు.

పాదరస పూజ పేరుతో బాబా మోసం

విద్యాధరపురం, జనవరి 29: ప్రేమించిన మహిళ వెంటపడకుండా ఉండేందుకు పాదరస పూజ చేస్తానని చెప్పి ఓ కుటుంబం నుంచి రూ.2లక్షలు వసూలు చేసిన హనుమాన్ జంక్షన్‌కు చెందిన అక్బర్ షరీఫ్ బాబాపై భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలు ఎం.అరుణకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గొల్లపూడి హైస్కూల్ రోడ్డులో నివాసముంటున్న అరుణకుమారి అక్క కుమారుడు నెల్లూరుకు చెందిన సాయి వెంకటరెడ్డిని శిల్ప అనే మహిళ ప్రేమించింది. అతడి వెంట శిల్ప పడకుండా పూజలు చేయాలని అరుణకుమారి బాబాను సంప్రదించింది.పాదరసంతో పూజ చేయాలని రూ.2లక్షలు తీసుకుని నెలరోజుల్లో పని పూర్తవుతుందని నమ్మబలికాడు. 3 నెలల తరువాత శిల్పను పెళ్లి చేసుకుంటానంటూ వెంకటరెడ్డి చెప్పడంతో అరుణకుమారి అవాక్కయింది. వెంటనే జంక్షన్‌కు వెళ్లి బాబాను కలిసి మీ పూజ ఫలించలేదు. డబ్బులు తిరిగిచ్చేయాలని కోరింది.ఖర్చయిపోయాయనడంతో భవానీపురం పోలీసులను ఆశ్రయించింది. బాబాకు డబ్బులిచ్చినప్పుడు ఇద్దరు వ్యక్తులు సాక్ష్యం ఉన్నారని ఫిర్యాదులో పేర్కొంది.

దుర్గమ్మకు కానుకగా బంగారు గాజులు


వన్‌టౌన్,జనవరి 29: ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు తాడేపల్లిగూడెంకు చెందిన నాగ రాకేష్ కుటుంబసభ్యులు సోమవారం ఆలయానికి విచ్చేసి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ద్వారా దేవస్థానానికి విరాళంగా అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి దుర్గమ్మ దర్శనం కల్పించగా వేద పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు. కాగా సోమవారం సంకటహర చతుర్థి సందర్భంగా అర్చకబృందం గణపతికి విశేషపూజలు చేశారు. పంచామృత అభిషేకాలు, అర్చనాదులు నిర్వహించారు. భక్తుల సర్వసంకటాలను హరించేందుకు గణపతికి అర్చనలు సమర్పించి హారతులిచ్చారు. మంత్రపుష్పం, శాంతిమంత్ర పఠనం చేశారు.

రేపు చుండూరి వెంకటరెడ్డి వర్ధంతి

దుర్గగుడి ఉపసంస్థగా ఉన్న సీవీరెడ్డి చారిటీస్ వ్యవస్థాపకుడు దివంగత చుండూరి వెంకటరెడ్డి 43వ వర్ధంతి ఈ నెల 31న వన్‌టౌన్ పాడివీధిలోని సీవీ రెడ్డి చారిటీస్ ప్రాంగణంలో జరుగుతుందని ఈవో రామారావు తెలిపారు. వేద, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, పేద మహిళలకు వస్త్ర బహుకరణ, అన్నవితరణ జరుగుతాయన్నారు.

వేటూరికి ఘనంగా నివాళి

విజయవాడ కల్చరల్: వేటూరి అన్ని రకాల పాటల్ని అన్ని రసాల మాటల్ని సమాన చాతుర్యంతో నడిపించారని ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ అన్నారు. వేటూరి సుందర రామ్మూర్తి శిష్యుడు జయంతి చక్రవర్తి నిర్వహణలో గీతాంజలి మ్యూజికల్స్, దామోదర జానపద, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంస్థల సంయుక్త అధ్వర్యంలో వేటూరి 89వ జయంతి సోమవారం సాయంత్రం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్‌కు, ప్రముఖ న్యాయవాది, సినిమా నటుడు డాక్టర్ జీవీఎన్ఆర్ఎస్ఎస్ వరప్రసాద్‌లకు నిర్వాహకులు వేటూరి ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. వ్యాఖ్యానం దామోదర్ గణపతి వ్యవహరించారు.



సదస్సులో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

హత్యల కంటే సైబర్ నేరాలే ప్రమాదం

● సీఐడీ ఎస్పీ సరిత

విజయవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు హత్యల కంటే అత్యంత ప్రమాదకరమని సీఐడీ ఎస్పీ జీవీజీ సరిత వ్యాఖ్యానించారు. సైబర్ నేరాలను అరికట్టడంతోపాటు వాటి బారిన పడకుండా ఉండేందుకు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు స్థానిక బెంజ్‌సర్కిల్‌లోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు సైబర్ క్యాంపెయినర్లగా మారాలని పిలుపునిచ్చారు. వాట్సాప్, టెలిగ్రాం గ్రూపుల్లో గుర్తుతెలియని కాల్స్‌ను ఆన్సర్ చేయొద్దన్నారు. సిమ్‌కార్డుల్లో కాల్స్‌ను ట్రాక్ చేయవచ్చని, వాట్సాప్, టెలిగ్రాం గ్రూపుల్లో కాల్స్‌ను ట్రాక్ చేయటడం అసాధ్యమన్నారు. ప్రతి విద్యార్థి సైబర్ నేరాలపై అవగాహన ఏర్పరుచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నిపుణుడు శ్రీనివాస్, కేఎల్ వర్సిటీ సీఎస్ఈ విభాగ అధిపతి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జాతీయ కనోయింగ్‌కు తన్విత్



విజయవాడ స్పోర్ట్స్, జనవరి 29: మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ లో ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు జరగనున్న జాతీయ సబ్ జూనియర్, జూనియర్ కనోయింగ్, కయాకింగ్ పోటీలకు నిర్మల హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.తన్విత్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గి బి ఆంథోని సోమవారం తెలిపారు. ఈ నెల 26న జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో జూనియర్ 200 మీటర్ల కయాకింగ్, జూనియర్ 500 మీటర్ల కయాకింగ్ సింగిల్స్, డబుల్స్ ఈవెంట్స్‌లో తన్విత్ తన ప్రతిభను కనపర్చి జాతీయపోటీలకు అర్హత సాధించాడన్నారు. ఇందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

జాతీయ కరాటేలో అక్షిత సత్తా



విజయవాడ స్పోర్ట్స్: గోవాలో ఈ నెల 24 నుంచి 28 వరకు జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 41వ జాతీయ క్యాంపు, 16వ జాతీయ స్థాయి కరాటేలో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించిన పలువురు క్రీడాకారులు సత్తా చాటారు. ఎయిమ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని సూరసాని అక్షిత అండర్-12 బాలికల కుమితే (ఫైట్)లో రజతం సాధించింది. మరో ముగ్గురు విద్యార్థినులు చాగంటి స్నేహిత, చాగంటి స్నిగ్ధ, చాగంటి గోవర్ధన్‌రెడ్డి ప్రతిభను చాటారు. 17 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు బరిలో దిగారని కోచ్ కె.సాగరిక తెలిపారు. అక్షితను, రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, ఎయిర్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ ఓంకార దంతు, జపాన్ కరాటే అసోసియేషన్ సౌత్ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్ అభినందించారు.

చెస్‌లో నగర క్రీడాకారులకు పతకాలు



కడపలోని మాంటిస్సోరి జగతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి చెస్‌లో నగరంలోని ఎస్ఆర్ఆర్ చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పతకాలతో మెరిశారు. అండర్-14లో కె.సందీప్ 5 పాయింట్లతో స్వర్ణం, అండర్-15లో లాస్య 4 పాయింట్లతో స్వర్ణం, రిషితా శాస్త్రి 3 పాయింట్లతో రజతం, అండర్-30లో టి.జీవితేష్ 4పాయింట్లతో కాంస్యం వశం చేసుకున్నారు. అకాడమీలో సోమవారం జరిగిన సభలో ప్రెసిడెంట్ సౌజన్య క్రీడాకారులను అభినందించారు.

త్రోబాల్‌లో ఉమ్మడి కృష్ణా జట్లకు రజతాలు



అనంతపురం జిల్లాలో జరిగిన 8వ రాష్ట్రస్థాయి త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా బాలబాలికల జట్లు రజత పతకాలతో సత్తా చాటాయి. బాలురు జట్టు కడపతో జరిగిన ఫైనల్స్‌లోను, బాలికలు అనంతపురం జిల్లాతో జరిగిన ఫైనల్స్‌లో హోరాహోరీగా పోరాడి రజతాలను ఖాతాలను వేసుకున్నారు. ఎమ్మెల్యే కేపీరెడ్డి విజేతలకు ట్రోఫీల ప్రదానం నగదు బహుమతులతో అభినందించారని రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఇ.సులోచన తెలిపారు.

ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరు



పటమట, జనవరి 29: విశాఖపట్నం డీపీటీవో నియంతృత్వ, అప్రజాస్వామిక పోకడలకు, కక్షసాధింపు చర్యలకు వ్యతిరేకంగా ఎన్ఎమ్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, ఎన్ఎమ్‌యూఏ విజయవాడ, ఆటోనగర్ డిపో ఉద్యోగులు నిరసనల్లో భాగంగా మొదటి రోజు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.



ధర్నాలో పాల్గొన్న మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులు

మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగుల ధర్నా

ధర్నాచౌక్, జనవరి 29: తమ పిల్లలకు ఉద్యోగాలు కల్పించి తమ కుటుంబాలని ఆదుకోవాలని ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తూ తీవ్ర అనారోగ్య సమస్యలతో మెడికల్ అన్‌ఫిట్ ఆయిన ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ మేరకు స్థానిక ధర్నాచౌక్‌లో 3 రోజుల పాటు నిర్వహించే ధర్నాను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని 2015లో సంస్థ జీవో జారీ చేసిందన్నారు. సంస్థ కోసం ఏళ్లుగా కృష్టపడ్డామని దురదృష్టశాత్తు అనారోగ్యం బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొందరు అధికారుల తప్పిదంతో 150 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. దాదాపు 40 మంది మృతి చెందారన్నారు. ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి తమ పిల్లలకు ఆర్టీసీ ఉద్యోగాలు ఇవ్వాలని సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు.

సురేష్‌కు యువ ప్రజ్ఞ అవార్డు

విజయవాడ కల్చరల్, జనవరి 29: డాక్టర్ రామన్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మకంగా అందజేసే యువ ప్రజ్ఞ అవార్డును ఈ ఏడాది ప్రముఖ విద్యావేత్త శ్రీరామ్ పాఠశాల ప్రిన్సిపల్ బోనీ సురేష్‌కుమార్‌కు అందజేశారు. వన్‌టౌన్ కేబీఎన్ కళాశాలలో డాక్టర్ రామన్ ఫౌండేషన్ నిర్వహించిన నంది నాటక విజయోత్సవ సభలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు జి.శ్రీకాంత్, పొట్టి శ్రీరాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్ చలువాది మల్లికార్జునరావు, శ్రీరామ్ పాఠశాల ప్రిన్సిపల్ బోనీ సురేష్ కుమార్, ప్రజ్ఞా పురస్కార అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బోనీ సురేష్ కుమార్ మాట్లాడుతూ నంది నాటకోత్సవాల్లో తమ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన 'మంచి గుణపాఠం' నాటికకు నంది అవార్డు లభించడం ఎంతో సంతోషంగా వుందన్నారు. దర్శకత్వం వహించిన డాక్టర్ పీవీఎన్ కృష్ణకు అభినందనలు తెలిపారు. అలాగే సుమధుర కళానికేతన్ పసుమర్తి విజయభాస్కర శర్మకు కూడా ప్రజ్ఞ అవార్డు పురస్కారం లభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజ్ఞ పురస్కారాన్ని అందజేసిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ నిర్వాహకులను ఆయన కొనియాడారు. ఇదే స్ఫూర్తితో సంస్కృతి సంప్రదాయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి చరమగీతమే

» న్యాయం బతికే ఉందని సుప్రీం తీర్పుతో స్పష్టమైంది: రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతుండటం.. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడబోతున్నట్లు సంకేతమని వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ కృష్ణంరాజు స్పష్టం చేశారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ సభలకు తండోపతండాలుగా జనం తరలివస్తున్నారంటే ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుపై ఉన్న ప్రేమతో పాటు, జగన్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న ఆక్రోశమే కారణమన్నారు. భీమిలి నియోజకవర్గం సంగీవలసలో వైసీపీ సభకు హాజరైన జనం కంటే రెండింతలు ఎక్కువగానే రాజమండ్రిలో టీడీపీ సభకు హాజరయ్యారని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబుకు హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టి వేయడంతో న్యాయం బతికే ఉందని మరోసారి స్పష్టమైందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతపై మరో పనికిమాలిన పిటిషన్ దాఖలు చేసిందని ఈ తీర్పు ద్వారా ప్రజలకు అర్థమైందని చెప్పారు. గతంలో నా వెంట్రుక కూడా పీకలేరని ప్రేలాపనలు పేలిన జగన్.. ఇటీవల ఇండియా టుడే కాంక్లేవ్‌లో పీకితే పోతాం అన్నట్టుగా మాట్లాడటం రానున్న ఎన్నికల్లో ప్రజా తీర్పు ఎలా ఉండబోతోందో సంకేతమన్నారు.

వ్యూహం సెన్సార్ సర్టిఫికెట్ రద్దుపై రాంగోపాల్ వర్మ అప్పీల్.. నేడు విచారణ

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ జారీచేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను హైకోర్టు సింగిల్ జడ్జి కొట్టేయడంపై ఆ సినిమా దర్శకుడు రాంగోపాల్ వర్మ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌ను సోమవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం పరిశీలించింది. ఇప్పటికే నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ ఓ అప్పీల్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ మంగళవారం రోజు విచారణకు రానున్న నేపథ్యంలో రెండింటినీ కలిపి విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది.

ప్రతి తెలుగువాడికి దక్కిన గౌరవం

» వెంకయ్యనాయుడికి కంభంపాటి అభినందనలు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ కంభంపాటి రామమోహన రావు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.. వెంకయ్యనాయుడికి దక్కిన ఈ అరుదైన గౌరవం ప్రతి తెలుగువాడికి దక్కిన గౌరవంగా కంభంపాటి పేర్కొన్నారు. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో రాష్ట్రపతి మినహా అనేక హోదాల్లో పనిచేసిన వెంకయ్యనాయుడు సమకాలీన రాజకీయ నేతలకు స్ఫూర్తి అని ఆయన కొనియాడారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల ఏకవచనం

» క్షమాపణలు చెప్పిన కర్ణాటక సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఏకవచనంతో సంబోధించిన కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఆమెకు బహిరంగ క్షమాపణలు చెప్పారు. చిత్రదుర్గలో అణగారినవర్గాల చైతన్య సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం ప్రసంగిస్తూ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అణగారినవర్గాలకు చెందినందుకే కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవం, అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలకు బీజేపీ ఆహ్వానించలేదని మండిపడ్డారు. ఈ సందర్భంలోనే రాష్ట్రపతి పేరును ప్రస్తావిస్తూ ఏకవచనంతో మాట్లాడారు. ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి పట్ల వికృతంగా, హీనంగా వ్యాఖ్యలు చేసిన సిద్దరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించాలని మాజీ సీఎం కుమారస్వామి డిమాండ్ చేశారు. వివాదం రాజుకోవడంతో సీఎం సిద్దరామయ్య సోమవారం 'ఎక్స్' ద్వారా క్షమాపణలు చెప్పారు.

శ్రీకృష్ణ జన్మభూమి సర్వేపై స్టే కొనసాగింపు

న్యూఢిల్లీ, జనవరి 29: మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా మసీదు ఆవరణ వివాదం విషయమై గతంలో ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులు కొనసాగుతాయని సోమవారం సుప్రీంకోర్టు ప్రకటించింది. కోర్టు కమిషనర్ పర్యవేక్షణలో ఆ ఆవరణలో శాస్త్రీయ సర్వే జరపాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఈ నెల 16న సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఆ స్టే ఉత్తర్వులు కొనసాగుతాయని ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ ప్రథమ పక్షానికి వాయిదా వేసింది. ఈ విషయానికి సంబంధించిన మిగిలిన పిటిషన్లను కూడా అదే రోజు చేపడుతామని తెలిపింది. ఆ లోగా లిఖితపూర్వక వాదనలను పూర్తి చేయాలని అన్ని పక్షాలను ఆదేశించింది.

అభిషేక్ బోయిన్‌పల్లి బెయిల్ పిటిషన్ వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయిన అభిషేక్ బోయినపల్లి బెయిల్ పిటిషన్ విచారణను సోమవారం సుప్రీంకోర్టు వాయిదా వేసింది. తదుపరి విచారణను మార్చి 11తో ప్రారంభమయ్యే వారంలో చేపడతామని పేర్కొంది. తన బెయిల్ పిటిషన్లను కింది కోర్టులు తిరస్కరించడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అభిషేక్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆయన దాదాపు 16 నెలలుగా జైలులో ఉన్నారని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఈ వ్యవహారానికి సంబంధించిన ఇతర కేసులు తాము విన్నామని, వాస్తవాలు తెలుసునని వ్యాఖ్యానించింది. వాటితో పాటు దీనినీ మార్చిలో విచారిస్తామని తెలిపింది.

జాడ లేని ఝార్ఖండ్ సీఎం సోరెన్!

న్యూఢిల్లీ, జనవరి 29: ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అదృశ్యమయ్యారు! ఆయన ఎక్కడికి వెళ్లారో తెలియడం లేదు! అవును.. ఈ విషయాన్ని ఈడీ అధికార వర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్ కేసులో సోరెన్‌ను విచారించేందుకు సోమవారం ఈడీ అధికారులు ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసానికి వెళ్లారు. అయితే ఆయన ఇంట్లో లేరని, అందుబాటులోకి కూడా రాలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. ఆయన ఇంటి నుంచి బీఎండబ్ల్యూ కారు, కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాయి. ఇదే కేసులో ఈ నెల 20న రాంచీలో సీఎం సోరెన్‌ను ఈడీ అధికారులు దాదాపు ఏడు గంటల పాటు ప్రశ్నించారు. కాగా, సీఎం సోరెన్.. తాను ఈ నెల 31న రాంచీలో విచారణకు అందుబాటులో ఉంటానంటూ ఈడీ అధికారులకు మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా, భూములు రాసిస్తే ఉద్యోగాలు కుంభకోణంలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ సోమవారం ఈడీ ఎదుట హాజరయ్యారు.

'నీట్' సాధనకు 'కోటా' డిజిటల్ బుక్‌లెట్స్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, జనవరి29 (ఆంధ్రజ్యోతి): నీట్-2024కు సన్నద్ధమవుతున్న విద్యార్థుల కోసం 'కోటా' ఎన్‌సీఈఆర్టీ ప్రీవియస్ ఇయర్స్ ప్రశ్నాపత్రాలు, టెస్ట్ సిరీస్, గ్రాండ్ టెస్ట్స్ అండ్ సొల్యూషన్స్, చాప్టర్ల వారీగా ప్రాక్టీస్(డిజిటల్) బుక్‌లెట్స్‌ను సిద్ధం చేసినట్లు 'కోటా పేజెస్' ఓ ప్రకటనలో తెలిపింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్‌లను మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చని, సమాచారం కోసం "NEET 2024' అని టైపు చేసి 98490 16661 నెంబర్‌కు వాట్సప్ మెసేజ్ చేయాలని 'కోటా పేజెస్' సూచించింది.

14 లక్షల మంది భారతీయులకు అమెరికా వీసాలు

» గతేడాది రికార్డు స్థాయిలో జారీ..

న్యూఢిల్లీ, జనవరి 29: అమెరికా గతేడాది (2023) భారతీయులకు రికార్డు స్థాయిలో వీసాలను జారీ చేసింది. దేశంలోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్‌లు అన్ని కేటగిరీలు కలిపి ఏకంగా 14 లక్షల వీసాలను జారీ చేశాయి. ఇందులో 1.40 లక్షల విద్యార్థి వీసాలు ఉన్నాయి. ఇది ప్రపంచలోని ఏ దేశంలోనూ లేనంత ఎక్కువని.. వరుసగా మూడో ఏడాది కూడా ప్రపంచ రికార్డు నెలకొల్పామని యూఎస్ ఎంబసీ పేర్కొంది. 2022తో పోల్చితే వీసా దరఖాస్తుదారుల్లో 60 శాతం పెరుగుదల నమోదైందని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి 10 మంది అమెరికా వీసా దరఖాస్తుదారుల్లో ఒకరు భారత్ నుంచే ఉన్నారని వివరించింది. ఏడాదికి 10 లక్షల వీసాలను జారీ చేయాలనే లక్ష్యాన్ని సునాయాసంగా అధిగమించామని.. డిమాండ్‌కు తగ్గట్లుగా రాయబార కార్యాలయాల్లో సిబ్బందిని పెంచుకున్నామని పేర్కొంది. విజిటర్ వీసా కోసం నిరీక్షించే సమయం సగటున 1000 రోజుల నుంచి 250 రోజులకు తగ్గిందని.. అన్ని రకాల వీసాల నిరీక్షణ సమయం కూడా చాలా తక్కువగానే ఉందని యూఎస్ ఎంబసీ తెలిపింది. ముంబై, న్యూఢిల్లీ, హైదరాబాద్, చెన్నై నగరాలు ఇప్పుడు ప్రపంచంలోని మొదటి నాలుగు విద్యార్థి వీసా ప్రాసెసింగ్ పోస్టులుగా నిలిచాయని వెల్లడించింది. అమెరికాలో 10 లక్షల మంది విదేశీ విద్యార్థుల్లో నాలుగింట ఒకవంతు కంటే ఎక్కువ మంది భారతీయులే ఉన్నారని పేర్కొంది. ఇక ఉద్యోగ వీసాలకు కూడా అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని.. భారతీయులు, వారి కుటుంబీకుల కోసం 3.80 లక్షల ఉద్యోగ వీసాలు మంజూరు చేసినట్లు వివరించింది.

శంకుస్థాపనలే... పనుల్లేవ్!



బియ్యపు తిప్ప వద్ద హార్బర్ ప్రతిపాదిత ప్రాంతం

- **» పశ్చిమలో రూ.3,200కోట్లతో ప్రాజెక్టులంటూ హడావుడి**
- **» 2022 నవంబరులో శంకుస్థాపన చేసిన సీఎం జగన్**
- **» 14 నెలలు అవుతున్నా అడుగు కూడా కదలని పనులు**
- **» బియ్యపు తిప్ప వద్ద అతీగతీ లేని హార్బర్ నిర్మాణం**
- **» నల్లీ క్రాక్ కాలువలో పూడికతీత పనుల ఊసే లేదు**
- **» రెగ్యులేటర్ల నిర్మాణానికి అనుమతులివ్వని సర్కారు**

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమగోదావరి జిల్లాలో ప్రాజెక్టులు పడకేశాయి. సాక్షాత్తూ సీఎం జగన్ శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. 2022 నవంబరులో మత్స్యకార దినోత్సవం రోజున నరసాపురం వచ్చిన ముఖ్యమంత్రి దాదాపు రూ.3,200కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటి వరకూ అందులో ఒక్క పనీ ప్రారంభించలేదు. సదరు ప్రాజెక్టులకు టెండర్లు పిలవడం మాట అటుంచి... అసలు ప్రభుత్వమే వాటికి ఇప్పటికీ అనుమతులు మంజూరు చేయలేదు. నరసాపురం మండలం బియ్యపు తిప్ప వద్ద రూ.429.00 కోట్లతో హార్బర్ నిర్మాణం చేపడుతున్నట్టు నాటి సభలో సీఎం ప్రకటించారు. సభా వేదిక పైనుంచే పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఏజన్సీని ఖరారు చేశామని, హార్బర్ పూర్తయితే తీరప్రాంత రూపురేఖలు మారిపోతాయని, మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు చూస్తామంటూ గొప్పగా చెప్పారు. ఇది జరిగి దాదాపు 14నెలలు పూర్తయ్యాయి. ఇప్పటికీ బియ్యపు తిప్ప వద్ద ఒక్క పునాది రాయి కూడా పడలేదు. పనులు జరుగుతాయన్న ఆశాలేదు. మరోవైపు తీరప్రాంతంలో నల్లీ క్రీక్ కాలువ పూడుకుపోయింది. సముద్రం నుంచి నీరు ఎగదన్నే అదే కాలువలో మత్స్యకారులు చేపల వేట సాగించి జీవనోపాధి పొందేవారు. సదరు నల్లీ క్రీక్ పనులను టీడీపీ హయాంలో ప్రారంభించారు. 25శాతం పనులు పూర్తి కాలేదంటూ వైసీపీ ప్రభుత్వం వాటిని నిలిపివేసింది. ప్రస్తుతం నల్లీ క్రీక్ ఊసే లేదు.

రెగ్యులేటర్లంటూ జనం చెవిలో పూలు

కొల్లేరు మంచినీటి సరస్సు జలాలు సముద్రంలో కలిసే ఉప్పుటేరుపై మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి నీటి పారుదల శాఖ ప్రతిపాదనలు చేసింది. తొలుత రూ.360కోట్లతో రెగ్యులేటర్లు నిర్మించేందుకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు స్పందించలేదు. ఆ తర్వాత అంచనాలను సవరించారు. కొత్త ధరలో 3 రెగ్యులేటర్ల విలువ రూ.420 కోట్లకు పెరిగింది. వీటిలో ఒకటైన పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండల పరిధిలోని మోళ్లపర్రు వద్ద రెగ్యులేటర్‌కు జగన్ శంకుస్థాపన చేశారు. రెగ్యులేటర్ ఆవశ్యకతను నరసాపురం సభలోనే ఆయన వివరించారు. రెగ్యులేటర్లు నిర్మిస్తే సముద్రపు నీరు కొల్లేటి సరస్సులోకి రాకుండా ఉంటుంది. పశ్చిమ డెల్టా ప్రాంతంలో లవణీయత తగ్గుముఖం పడుతుంది. రెగ్యులేటర్ల నిర్మాణం ఖాయంగా జరిగిపోతుందంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఆశలు రేకెత్తించారు. అయితే వాటి నిర్మాణం కోసం నీటి పారుదల శాఖ పంపిన సవరణ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఇప్పటికీ పరిపాలన అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు వచ్చిన తర్వాతే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాల్సి ఉంది. కానీ సీఎం మాత్రం ముందుగానే శంకుస్థాపన చేసేశారు. ఇక ఉభయగోదావరి జిల్లాలను నరసాపురం మీదుగా కలిపే వశిష్ట వారధి నిర్మాణానికి జగన్ హామీ ఇచ్చారు. రూ.490 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. అయితే ఇప్పటికీ టెండర్లు తెరవకుండా వాయిదా వేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే లోపు టెండర్లు ఖరారు కాకపోతే ఇక ఇప్పట్లో పనులు ప్రారంభించే అవకాశమే ఉండదు.

ఈ పనులకు మోక్షమెప్పుడు?

1. మొగల్తూరు మండలం రుస్తుంబాదలో రూ.133 కోట్లతో 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు.
1. నరసాపురం పట్టణంలో రూ.149.00 కోట్లతో వాటర్ ప్రాజెక్ట్, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మిస్తామంటూ హడావుడిగా జీవో విడుదల చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. టెండర్లు పిలవలేదు. వీటికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం విశేషం.
1. నరసాపురంలో ఆక్వా విశ్వవిద్యాలయాన్ని రూ.332 కోట్లతో చేపట్టాల్సి ఉంది. సుమారు రూ.100 కోట్లతో తరగతి గదుల భవనాలు ప్రారంభించారు. పునాదులు వేశారు. నిధులు లేకపోవడంతో ఇప్పుడు ఈ పనులకు అతీగతీ లేకుండా పోయింది.
1. కోతకు గురైన ఏటిగట్టును రూ.35కోట్లతో పూర్తి చేసేందుకు సీఎం శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభించారు. ఇప్పటికి రూ.15కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అదే ఏటి గట్టు ఇటీవల మళ్లీ కోతకు గురైంది. పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడమే కారణమని విమర్శలున్నాయి.

సర్వేతో సరిపెట్టుకున్న వాటర్ గ్రిడ్

పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలకు విజ్జేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి జలాలను శుద్ధి చేసి పైప్‌లైన్ ద్వారా అందించేందుకు రూ.1,400 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలు చేస్తున్నారు. టీడీపీ హయాంలో రూ.3,600 కోట్లతో పూర్వ పశ్చిమగోదావరి జిల్లాకు గోదావరి జలాలను నేరుగా అందించే ప్రాజెక్టును సిద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో దాన్ని రూ.1,400 కోట్లకు కుదించారు. కొత్త పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రాజెక్టును పరిమితం చేశారు. దీనినుంచి పట్టణాలను మినహాయించారు. వాటర్ గ్రిడ్ పనులు కూడా ప్రారంభిస్తున్నట్టు నరసాపురం సభ నుంచే ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటికీ సర్వే పనులే పూర్తి కాలేదు. ప్రభుత్వానికి నివేదిక అందలేదు.



మోళ్ళపర్రు వద్ద ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మించతలపెట్టిన ప్రాంతం

కరోనా తర్వాత పెరిగిన విద్యుత్ వినియోగం

- **» అధిక ధరకు కొనాల్సిన పరిస్థితులున్నాయి**
- **» కాగితాలపైనే డిస్కమ్‌ల ఒప్పంద సామర్థ్యం**
- **» ఆమేరకు సమీకరించుకోలేకపోతున్నాయి**
- **» ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ వి.నాగార్జునరెడ్డి**
- **» చార్జీల కంటే ఇతర భారాలే ఎక్కువ: వినియోగదారులు**



ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో మాట్లాడుతున్న ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి. పక్కన సభ్యులు

విశాఖపట్నం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) చేసుకుంటున్న ఒప్పందాలు కాగితాలపై బాగానే కనిపిస్తున్నప్పటికీ వాస్తవ రూపంలో అవసరమైన మేర సమీకరించుకోలేకపోతున్నాయని, దాంతో మార్కెట్‌లో రోజువారీగా విద్యుత్ కొనాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ వి.నాగార్జునరెడ్డి అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి డిస్కమ్‌లు సమర్పించిన ఆదాయ అంచనా అవసరాలు, విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై విశాఖపట్నం ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఏపీఈఆర్‌సీ సోమవారం ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ సందర్భంగా చైర్మన్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లను ఏ రోజుకారోజు రియల్‌టైమ్ ద్వారా పరిశీలిస్తున్నామన్నారు. స్వల్పకాలిక విద్యుత్ సేకరణ కోసం ప్రతిపాదనలు సమర్పించేందుకు డిస్కమ్‌లకు టైమ్ లైన్ కూడా జారీ చేశామన్నారు. కొన్ని సందర్భాల్లో యూనిట్ సీలింగ్ రేటు రూ.10 ఉన్నా మార్కెట్‌లో విద్యుత్ లభించలేదన్నారు. గత ఏడాదైతే యూనిట్‌కు సీలింగ్ రేటు రూ.16 వరకు వెళ్లిందన్నారు. కొవిడ్ 19 (కరోనా) తరువాత విద్యుత్ డిమాండ్ అంచనాలకు మించి పెరిగిపోయిందన్నారు. దీనివల్ల ప్రతిరోజూ విద్యుత్ కొరత ఏర్పడుతోందన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఇబ్బందుల వల్ల డిస్కమ్‌ల డిమాండ్, అవసరాలను తీర్చలేకపోతున్నాయన్నారు. వినియోగదారుల సేవా లోపానికి పరిహారం ఇవ్వాలనే నిబంధన పెట్టడంతో 25,944 మందికి డిస్కమ్‌లు పరిహారం చెల్లించాయన్నారు. వినియోగదారులకు అందుతున్న సేవలను పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను కూడా నియమించామన్నారు. విద్యుదాఘాతాలు జరిగినప్పుడు డిస్కమ్‌ల నిర్లక్ష్యం లేనప్పటికీ బాధితులకు పరిహారం ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌సీ సభ్యులు ఠాకూర్ రామసింగ్, పీవీఆర్ రెడ్డి పాల్గొనగా, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ చక్రధరబాబు, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ కె.సంతోష్‌రావు ఆయా సంస్థలు సాధించిన ప్రగతిని వివరించి, టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించారు. సోమవారం 17 మంది అభిప్రాయాలు వెల్లడించారు. విద్యుత్‌రంగ నిపుణులు ఎం.వేణుగోపాలరావు మాట్లాడుతూ వినియోగదారులపై విద్యుత్ చార్జీల కంటే ఇతర వ్యయాల భారం అధికంగా ఉందన్నారు. మార్కెట్‌లో అధిక ధరలకు విద్యుత్ కొని, ఆ భారం వినియోగదారులపై వేస్తున్నారని ఆరోపించారు.

పరీక్షల వేళ పిల్లలపై ఒత్తిడి వద్దు

- **» వాళ్లను ఇతరులతో పోల్చడం మానుకోవాలి**
- **» 'పరీక్షా పే చర్చ'లో ప్రధాని నరేంద్ర మోదీ**



న్యూఢిల్లీ, జనవరి 29: పరీక్షల సమయంలో ఒత్తిళ్లను తట్టుకునేలా పిల్లల్లో ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రోగ్రెస్ రిపోర్ట్‌లను తమ సొంత విజిటింగ్ కార్డులుగా భావించవద్దని కోరారు. పరీక్షలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థుల్లో ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రధాని మోదీ సోమవారం 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. వారు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా ఎదుర్కోవాలని సూచించారు. పిల్లల్లో ఒత్తిడిని దూరం చేసి ధైర్యం చెప్పాలన్నారు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతరులతో పోలుస్తూ ఉంటారని.. ఇలాంటివి మానుకోవాలని ప్రధాని మోదీ కోరారు. ఇది వారిపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందన్నారు. "తల్లిదండ్రులు తమ పిల్లల రిపోర్ట్ కార్డులను వారి విజిటింగ్ కార్డులుగా భావిస్తున్నారు. ఎవరినైనా కలిసినప్పుడు, ఎక్కడికైనా వెళ్లినప్పుడు వారి పిల్లల గురించి గొప్పగా చెబుతున్నారు. అది సరైనది కాదు" అని మోదీ అన్నారు. ప్రిపరేషన్ సమయంలో చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమంగా మెరుగవ్వాలని, తద్వారా పరీక్షలకు ముందే పూర్తిస్థాయిలో సన్నద్ధం కావొచ్చని విద్యార్థులకు సూచించారు.

సవాల్‌నే చాలెంజ్ చేసే స్వభావం నాది

జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును చాలెంజ్ చేయడం తన నైజమని మోదీ చెప్పారు. సంక్షోభాలు తొలగిపోవడానికి, పరిస్థితులు మెరుగవడానికి వేచి చూడాలని చాలామంది నమ్ముతారని, అలాంటి వారు జీవితంలో ఏమీ సాధించలేరని అన్నారు. "పరిస్థితులు వాటంతట అవే చక్కబడతాయిలే అని ఎదురుచూస్తూ కూర్చోలేను. నేను ప్రతి సవాల్‌నూ సవాల్ చేస్తా. కొత్త విషయాలు నేర్చుకుంటా. సరికొత్త వ్యూహాలు రూపొందిస్తా. ఇది నా అభివృద్ధికి దోహదపడుతుంది" అని మోదీ చెప్పారు..

మొబైల్ వాడకం తగ్గించండి

మొబైల్ ఫోన్ చూస్తూ సమయాన్ని మర్చిపోకూడదని మోదీ విద్యార్థులకు సూచించారు. అవసరం ఉన్నంత వరకే ఫోన్ వినియోగించాలని, స్క్రీన్ టైమ్ ఎక్కువగా ఉండొద్దని చెప్పారు. తాను నిద్రకు ఉపక్రమించిన 30 సెకన్లలోనే గాఢనిద్రలోకి జారుకుంటానని, అలాగే విద్యార్థులు కూడా తమ నిద్రకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

'జేఈఈ' నా వల్ల కాదు

» లేఖ రాసి 'కోటా'లో విద్యార్థిని ఆత్మహత్య

రాజస్థాన్‌లోని కోటాలో ఒత్తిడితో మరో విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. 'జేఈఈ' నావల్ల కాదు.. చదవలేకపోతున్నానంటూ లేఖ రాసి ఉరేసుకుంది. ఝులావర్ జిల్లాకు చెందిన నిహారిక(18) కుటుంబం మూడేళ్లుగా కోటాలో నివాసం ఉంటోంది. నిహారిక మంగళవారం జేఈఈ పరీక్ష రాయాల్సి ఉంది. ఈ క్రమంలో ఒత్తిడిని తట్టుకోలేకపోయింది. "అమ్మా, నాన్న నన్ను క్షమించండి.. నేను ఓడిపోయాను.. నేను మంచి కూతురిని కాదు.. జేఈఈ నావల్ల కాదు.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా.. నాకున్న చివరి ఆప్షన్ ఇదే" అంటూ లేఖ రాసి ఇంట్లోనే ఉరేసుకుంది.

సంఘ్, బీజేపీ సిద్ధాంతాలతో హింస, విద్వేషాల వ్యాప్తి

- **» ఎన్‌డీఏ పాలనలో కులమతాల పోరు: రాహుల్**
- **» బిహార్‌లో ప్రవేశించిన న్యాయ్ యాత్ర**



కిషన్‌గంజ్ (బిహార్), జనవరి 29: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), బీజేపీల సిద్ధాంతాలు దేశంలో హింస, విద్వేషాలను వ్యాప్తి చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఎన్‌డీఏ పాలనలో వివిధ మతాలు, కులాలకు చెందిన ప్రజలు కొట్టుకుంటున్నారని ఆరోపించారు. 'ఇండియా కూటమి' ఆవిర్భావంలో కీలక భూమిక పోషించిన జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్.. ప్రతిపక్షాలతో తెగతెంపులు చేసుకుని ఎన్‌డీఏలో చేరి ఆదివారం మళ్లీ ముఖ్యమంత్రి పగ్గాలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాహుల్ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' బెంగాల్ నుంచి సోమవారం బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో ప్రవేశించింది. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 'విద్వేష బజారులో కాంగ్రెస్ ప్రేమ దుకాణం (మొహబ్బత్ కీ దుకాణ్) ప్రారంభించాలనుకుంటోంది' అని చెప్పారు. కిషన్‌గంజ్ సీమాంచల్ ప్రాంతంలో ఉంది. ఇక్కడ ముస్లిం జనాభా అధికం. కాంగ్రెస్ కూడా ఇక్కడ బలీయంగానే ఉంది. రాహుల్‌కు పీసీసీ అధ్యక్షుడు అఖిలేశ్ ప్రసాద్ సింగ్, ఇతర సీనియర్ నేతలు స్వాగతం పలికారు. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేశాక ఆయన ఇక్కడకు రావడం ఇదే ప్రథమం. మంగళవారం పూర్ణియాలో, బుధవారం కతిహార్‌లో జరిగే భారీ ర్యాలీల్లో ఆయన పాల్గొంటారు. గురువారం అరారియా జిల్లా గుండా మళ్లీ బెంగాల్ వెళ్తారు. ఆ తర్వాత జార్ఖండ్ మీదుగా మళ్లీ బిహార్‌లో ప్రవేశిస్తారు. పూర్ణియా సభకు మిత్రపక్షం ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్, సీపీఐ-ఎంఎల్ లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్యలను కాంగ్రెస్ ఇదివరకే ఆహ్వానించింది.

60 కేజీలకు గంజాయి పట్టివేత

» ముగ్గురు బెంగుళూరువాసుల అరెస్టు: ఎస్పీ వెంకటేశ్వరరావు



గంజాయి వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఈబీ అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు

గుంటూరు (కార్పొరేషన్), జనవరి 29: గుంటూరుకు సమీపంలోని పొత్తూరు వద్ద జాతీయ రహదారిపై అధికారుల తనిఖీలు చేసి 60 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, బెంగళూరుకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఎస్ఈబీ టూటౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బెంగళూరులో చెత్త కాంట్రాక్ట్ పనులు చేస్తూ గంజాయి మత్తుకు అలవాటు పడ్డ కిషోర్ పాలక్షరెడ్డి సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో తనతోపాటు గంజాయి సేవించే తన స్నేహితులైన అభినయ్ సుద్దగుంట పాల్య వెంకటేష్, సుమంత్ కుమార్‌లతో కలసి ఒడిసాలోని కోరాపుట్ జిల్లా అరగొండ గ్రామం నుంచి 60 కేజీల గంజాయి తీసుకొచ్చి అధిక రేటుకు అమ్ముకోవాలని భావించారు. ఈ క్రమంలో ఒడిసా నుంచి గంజాయిని కొనుగోలు చేసి రెండు కార్లలో బెంగళూరు బయలుదేరారు. గుంటూరు శివారులో హైవేపై అధికారులు తనిఖీలు చేస్తుండగా వీరు పట్టుపడ్డారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద 60 కేజీల గంజాయి, ఏడు మొబైల్ ఫోన్స్, రెండు కార్లను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు.

బిహార్ స్పీకర్‌పై బీజేపీ అవిశ్వాసం



పాట్నా, జనవరి 29: బిహార్ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు బీజేపీ ప్రకటించింది. ఆదివారం ఎన్‌డీఏలో చేరి బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నితీశ్ కుమార్ సోమవారం తొలి మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో నితీశ్‌తో పాటు ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన ఎనిమిది మంది మంత్రులూ పాల్గొన్నారు. వీరికి శాఖల కేటాయింపు కూడా అతి త్వరలోనే పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇక ప్రస్తుత స్పీకర్, ఆర్జేడీ నేత అవధి బిహారీ చౌదరీపై బీజేపీ సభ్యులు అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసులు ఇచ్చారు. ప్రస్తుత స్పీకర్‌ను తొలగించి ఆ పదవికి బీజేపీ సభ్యుడిని ఎన్నుకోనున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీ నేతలు నంద్ కిశోర్ యాదవ్, అమరేంద్ర ప్రతాప్ సింగ్‌ల పేర్లు స్పీకర్ రేసులో వినిపిస్తున్నాయి.

అమెరికాలో భారతీయ విద్యార్థి దారుణ హత్య

న్యూయార్క్, జనవరి 29: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థి ఓ దుండగుడి చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. నిరాశ్రయుడని జాలి చూపి.. తిండి పెట్టడమే విద్యార్థి చేసిన పాపమైంది. హరియాణాకు చెందిన వివేక్ సైనీ(25) అమెరికాలో ఇటీవల ఎంబీఏ పూర్తి చేశాడు. జార్జియా రాష్ట్రం లిథోనియాలోని చెవ్రాన్ ఫుడ్ మార్ట్‌లో పార్ట్ టైం క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం ఆ స్టోర్‌కు నిరాశ్రయుడు, డ్రగ్స్‌కు బానిసైన జులియన్ ఫాల్క్‌నర్(53) వచ్చాడు. అప్పటి నుంచి అతడు రోజూ రాత్రి స్టోర్‌లోనే కూర్చుని ఉండేవాడు. బయట చలిగా ఉండటంతో సైనీ, ఇతర స్టోర్ సిబ్బంది కూడా వెళ్లిపోమని చెప్పలేదు. అయితే, ఈ నెల 16న అర్ధరాత్రి దాటాక జులియన్‌ను బయటికి వెళ్లిపోవాలని సైనీ చెప్పాడు. దీంతో కోపోద్రిక్తుడైన జులియన్.. వెనక నుంచి సైనీ తలపై సుత్తితో దాడి చేశాడు. దాదాపు 50సార్లు తల, ముఖంపై కొట్టాడు. దీంతో సైనీ అక్కడికక్కడే చనిపోయాడు.



భారత నేవీ కాపాడిన ఇరాన్ మత్స్యకారుల పడవ

ఐఎన్ఎస్ సుమిత్ర సాహసం

సముద్రపు దొంగల నుంచి 17 మందిని కాపాడిన నేవీ

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళం మరోసారి సత్తా చాటింది. సోమాలియా సముద్ర దొంగల చెర నుంచి ఇరాన్‌కు చెందిన 17 మంది మత్స్యకారులను రక్షించింది. ఈ విషయాన్ని నేవీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. తూర్పు తీరంలోని సోమాలియా, గల్ఫ్ ఆఫ్ ఈడెన్‌లో పహారా కాస్తున్న ఐఎన్ఎస్ సుమిత్ర యుద్ధ నౌకకు ఇరాన్ మత్స్యకారుల పడవ (ఐమ్యాన్) నుంచి రక్షించాలి అనే సమాచారం అందింది. సముద్రపు దొంగలు తమ పడవను స్వాధీనం చేసుకుని తమను బందీలుగా మార్చేశారని, కాపాడాలని కోరడంతో సుమిత్ర వెంటనే అక్కడికి చేరుకుంది. బోటుతో పాటు బందీలుగా చిక్కుకున్న 17 మంది మత్స్యకారులను విడిపించింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 30 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

ఏపీ అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డా.బీ.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విద్యార్థులు సొంత జిల్లా గురుకులంలో ప్రవేశానికి మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. అభ్యర్థి కోరుకున్న గ్రూప్ అక్కడ లేని పక్షంలో సంబంధిత జోన్ పరిధిలోని మరో జిల్లా గురుకులానికి అప్లయ్ చేసుకోవచ్చు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు అవకాశం లేదు. ఎంపికైన అభ్యర్థులకు విద్య, వసతి ఉచితం. క్రీడలకు ప్రాధాన్యమిస్తారు.

సీట్లు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 164 గురుకులాల్లో ఎంపీసీ 5400, బైపీసీ 5400, ఎంఈసీ 800, సీఈసీ 1600, హెచ్ఈసీ 360 సీట్లు ఉన్నాయి.

- ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో మొత్తం 600 సీట్లు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు సమానంగా ఒక్కోదానిలో 300 సీట్లు కేటాయించారు. కృష్ణా జిల్లా-ఈడ్పుగల్లులోని బాలికల అకాడమీలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు ఒక్కోదానిలో 160 సీట్లు ఉన్నాయి. కర్నూలు-చిన్నటేకూర్‌లోని బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 60 సీట్లు, గుంటూరు-అడవితక్కెళ్లపాడు బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు. ఇప్పటికే ఈ గురుకులాలల్లో చదువుతున్నవారికి ఒక ఏడాది సడలింపు వర్తిస్తుంది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,00,000 లోపు ఉండాలి.

ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి.



మేథమెటిక్స్ నుంచి 25; ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్(కాంప్రహెన్షన్ అండ్ గ్రామర్), లాజికల్ రీజనింగ్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటాయి.

- ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024లో సాధించిన మెరిట్ ఆధారంగా ఐఐటీ - మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి మాత్రమే మరో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్ సబ్జెక్టుల నుంచి ఇంగ్లీష్ మాధ్యమంలో ప్రశ్నలు అడుగుతారు. ఇవి కూడా పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి.

ముఖ్య సమాచారం

- ఐఐటీ/మెడికల్ అకాడమీల్లో చేరాలనుకొనే అభ్యర్థులు ముందుగానే దరఖాస్తులో తెలపాలి.
- దరఖాస్తు ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మార్చి 2 నుంచి
- **ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 తేదీ:** మార్చి 10
- **ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 21
- **వెబ్‌సైట్:** https://apbragcet.apcfss.in

ఇందిరాగాంధీ ట్రైబల్ వర్సిటీలో హిందీ సర్టిఫికెట్ కోర్సు

అమర్‌కంటక్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ(ఐజీఎన్‌టీయూ)- 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ కమ్యూనికేటివ్ హిందీ'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. వర్సిటీ నిర్వహించే ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 45 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. హిందీపై ఆసక్తి ఉన్నవారు, రీసెర్చ్ స్కాలర్స్, ఫ్యాకల్టీ మెంబర్లు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. జనరల్ నాలెడ్జ్ నుంచి 50, హిందీ లాంగ్వేజ్‌నుంచి 30 మార్కులకు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. రైటింగ్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అర్హత సాధించాలంటే జనరల్, ఓబీసీ అభ్యర్థులకు కనీసం 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 30 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 19
- **ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఫిబ్రవరి 24
- **ఫలితాలు విడుదల:** మార్చి 4
- **వెరిఫికేషన్:** మార్చి 12
- **తరగతులు ప్రారంభం:** మార్చి 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.igntu.ac.in

జాబ్ కార్నర్

ఎన్‌టీపీసీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్‌లు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ లిమిటెడ్..ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్(ఆపరేషన్)
ఖాళీలు: బీఈ, బీటెక్(ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు ఏడాది పని అనుభవం ఉండాలి.
జీతభత్యాలు: నెలకు రూ.55,000
వయోపరిమితి: 35 సంవత్సరాలు మించకూడదు
ఎంపిక ప్రక్రియ: అప్లికేషన్ స్క్రీనింగ్, షార్ట్‌లిస్టింగ్, సెలెక్షన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 8
వెబ్‌సైట్: https://www.ntpc.co.in/jobsntpc

ఇర్కాన్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్..రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్ **ఖాళీలు:** 28
విద్యార్హతలు: కనీసం 75 శాతం మార్కులతో గ్రాడ్యుయేట్ డిగ్రీ(సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000
వయోపరిమితి: 30 సంవత్సరాలు
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు ఫీజు: యూఆర్/ఓబీసీ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్/ఈఎస్ఎం అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 9
వెబ్‌సైట్: https://www.ircon.org/

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

అసమానతలకు అద్దం పట్టిన ఆక్స్‌ఫామ్ నివేదిక

(నిన్నటి తరువాయి)

పన్నుల నుంచి తప్పించుకొనుట

- ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేటివ్ అండ్ డెవలప్‌మెంట్(ఓఈసీడీ) వంటి వాటిలో ఉన్న అనేక దేశాలు 80వ దశకం నుంచి కార్పొరేట్ ట్యాక్స్‌లను సగానికి పైగా తగ్గిస్తూ వచ్చాయి. ప్రపంచీకరణ యుగంలో పెట్టుబడుల ఆకర్షణ కోసం కొన్ని దేశాలు అతి తక్కువ కార్పొరేట్ పన్నులు విధిస్తున్నాయి. మరి కొన్ని దేశాలు ట్యాక్స్ హెవెన్స్‌గా మారాయి. దీని వల్ల పలు దేశాలకు పన్ను రాబడి తగ్గింది. అంతేకాదు, పన్నులు విధిస్తున్న దేశాల్లోని సంపన్నులు పన్నుల ఎగవేతకు పాల్పడడానికి డొల్ల కంపెనీల స్థాపనకు కారణమవుతున్నాయి.
- 1980లో ఓఈసీడీ దేశాల్లో కార్పొరేట్ ఆదాయ పన్ను 48 శాతం ఉండగా 2022 నాటికి అది 23 శాతానికి తగ్గింది. 2020-23 మధ్య కాలంలో 141 దేశాల్లో సర్వే చేయగా 111 దేశాల్లో ఇదే ధోరణి కనిపించింది. ఇదే సమయంలో కార్పొరేట్ల ఆదాయం కొన్ని రెట్లు పెరిగింది. ఈవిధంగా సంపన్నులపై పడని పన్నుల భారం ప్రభుత్వ సంక్షేమ వ్యయాల కోసం సామాన్యులు, పేదలపై పడుతూ ప్రపంచ వ్యాప్తంగా వారి వాస్తవ ఆదాయాలను మరింత తగ్గిస్తోంది.

ప్రభుత్వ రంగ వ్యవస్థల ప్రైవేటీకరణ

- అసమానతలను తగ్గించేందుకు ప్రభుత్వ రంగంలో ఉండాల్సిన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల్లోకి ప్రైవేట్ రంగాన్ని అనుమతించడంతో వాటిని సైతం కార్పొరేట్స్ లాభార్జన కోసం వినియోగించుకుంటున్నాయి. ప్రపంచ బ్యాంక్ వంటి నిధి వితరణ సంస్థలు కూడా ప్రైవేట్ భాగస్వామ్య పథకాలకు రుణాలు మంజూరు చేస్తూండడంతో పెద్ద ఎత్తున ప్రజాధనం కార్పొరేట్ సంస్థల పెట్టుబడిగా పరిణమిస్తోంది.
- విద్య వంటి ప్రజాశ్రేయస్సు రంగంలో కూడా కార్పొరేట్ ప్రవేశంతో ఆ సేవలు పొందలేని పేదలకు, వాటిని పొందే ధనికులకు మధ్య నైపుణ్యాలు, విద్యాప్రమాణ పరమైన అంతరాలు మరింత పెరిగి ఆర్థిక అసమానతలను సుస్థిరం చేస్తున్నాయి.

వాతావరణ విఘాతం

- ప్రపంచ కుబేరుల అధీనంలోని అనేక సంస్థలు శిలాజ ఇంధనాలు, ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వాడడం వల్ల కర్బన ఉద్గారాలు ఎత్తున విడుదలై పర్యావరణ హననానికి కారణమవుతున్నాయి.
- ప్రపంచ జనాభాలో 2/3 వ వంతు పేదలు విడుదల చేస్తున్న కాలుష్యానికి సమానమైనదాన్ని కేవలం ఒక శాతం ఉన్న సంపన్నులు విడిచి పెడుతున్నారు

సూచించిన పరిష్కారాలు

- ప్రపంచ దేశాల మధ్య ఆదాయ అసమానతల నివారణకు ఐక్యరాజ్యసమితి, జీ 20 వంటి వేదికల ద్వారా గ్లోబల్ రూల్స్-విధానాల రూపకల్పనకు కృషి జరగాలి.
- కార్పొరేట్ శక్తులకు దీటుగా ప్రభుత్వ రంగం విద్య, వైద్యం, మౌలిక సేవల రంగాల్లో పునరుత్తేజం తేవాలి.
- ప్రజా రవాణా, పునరుత్పాదక శక్తి వనరులు, రుణ వితరణ రంగాల్లో కార్పొరేట్ నియంత్రణ శక్తులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం అందుబాటులో ఉండాలి. మార్కెట్ నియంత్రణ, ధరల నియంత్రణకు ప్రభుత్వ వ్యవస్థల పాత్ర, పరిధి పెరగాలి.
- ప్రభుత్వ రంగ సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలి.
- పేటెంట్ రూల్స్‌ను సరళీకరించి గుత్తాధిపత్య ధోరణుల స్థానంలో ప్రజాస్వామ్యయుత ఉద్యమతత్వం, వాణిజ్యం పాదుకొల్పాలి.
- కార్మికుల, మహిళల, అణగారిన వర్గాల సాధికారతకు; పర్యావరణ పరిరక్షణకు; అసమానతల నిర్మూలనకు కార్పొరేట్ సెక్టార్ దోహదపడేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి.



- ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, పర్యావరణ డ్యూ డెలిజెన్స్, మానవ హక్కుల అమలు దిశగా ప్రభుత్వాలు చట్టాలను, విధానాలను రూపొందించాలి.
- సీఈఓ, యాజమాన్య లాభాలు, ప్రతిఫలాలపై క్యాపింగ్ విధించడం; కార్పొరేట్ ఆదాయ పన్ను పెంచడం, పర్మనెంట్ యాక్సెస్ ప్రాఫిట్ ట్యాక్స్, పర్మనెంట్ వెల్త్ ట్యాక్స్ విధించడం వంటి చర్యలు చేపట్టాలి.
- ప్రజలలో ఉద్యమతత్వం పెంచడం, సహకార సంఘాల ఏర్పాటు, చిన్న సంస్థలకు రుణ వితరణ పెంచడం, లాభాల్లో ఉద్యోగులకు వాటాలనిచ్చే న్యూ జనరేటివ్ కంపెనీల ప్రోత్సాహం, కనీసం జీవన వేతనాలను ఇచ్చే సంస్థలకే ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు ఇవ్వ డం, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నిధులు వెచ్చించే ప్రాజెక్టుల్లో బహుళ జాతి కంపెనీలు చొరబడకుండా చూడడం, పన్నులు సక్రమంగా చెల్లించే సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం వంటి చర్యల ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు దోహదపడవచ్చు.

> భారతదేశంలోని బిలియనీర్ల మొత్తం సంపదపై ఒకసారి రెండు శాతం పన్ను విధించినట్లయితే వచ్చే 40,423 కోట్లతో దేశంలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న బాలలకు మూడేళ్లు పోషకాహారాన్ని అందించవచ్చు.

ఆక్స్‌ఫామ్ ఇండియా రిపోర్ట్: సర్వైవల్ ఆఫ్ ద రిచెస్ట్-ద ఇండియా స్టోరీ'

భారతీయ ఆర్థిక అసమానతలపై ఆక్స్‌ఫామ్ ఇండియా విడుదల చేసిన నివేదిక- లింగ, వర్గ, ప్రాంతాలపరంగా పేద-ధనిక వ్యత్యాసాలను విశ్లేషించింది. అసమానతల్లో ఇటీవలి ధోరణులు, వాటికి కారణాలు, నివారణ చర్యలు కూడా పేర్కొంది.

భారత్‌లో ఆర్థిక అసమానతల తీరు

- దేశ సంపదలో 60 శాతం వరకు కేవలం అయిదు శాతం మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతం కాగా ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో 3 శాతం సంపద మాత్రమే ఉంది.
- 2020-22 మధ్య రెండేళ్లలో భారత బిలియనీర్ల సంఖ్య 102 నుంచి 166కు పెరిగింది. ఇదే సమయంలో ప్రపంచంలోనే అత్యధికమంది(228.9 మిలియన్లు) పేదలు భారతదేశంలో ఉన్నారు.
- 2012 నుంచి 2023 మధ్య కాలంలో భారతదేశంలో సృష్టించిన సంపదలో 40 శాతం దేశంలోని ఒక శాతం సంపన్నుల చేతుల్లోకి చేరగా కేవలం 3 శాతం సంపద ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది జనాభా చేతుల్లోకి చేరింది.
- దేశంలోని వందమంది అత్యంత సంపన్నుల సంపద విస్తృతంగా 660 బిలియన్ డాలర్లు/54.12 లక్షల కోట్లుగా ఉంది. ఇది ఏడాది కాలానికి సరిపోయే దేశ బడ్జెట్ నిధులకు సమానం.
- భారతదేశంలో 2018 నుంచి 2022 మధ్య పేదల సంఖ్య మాత్రం 190 మిలియన్ల నుంచి 350 మిలియన్లకు పెరిగింది. 2022లో అయిదేళ్లలోపు బాలల మరణాల్లో 65 శాతం కేవలం పేదరికం, పోషకాహార లోపం వల్ల సంభవించాయి.
- కరోనా విజృంభించిన సమయంలో దిగువ 50 శాతం మంది జనాభా తమ సంపదలో క్షీణతను చవిచూశారు. 2020 జాతీయాదాయంలో వారికి దక్కింది కేవలం 13 శాతం మాత్రమే. ఇది వారిపై రుణభారం పెరగడానికి, పోషకాహార లోపానికి, అనారోగ్య మరణాలకు దారితీసింది. ఇదే సమయంలో ఎగువ 30 శాతం మంది సంపన్నులు 90 శాతం సంపదను చేజిక్కించుకున్నారు. మరీ ముఖ్యంగా ఎగువ 10 శాతం మంది సంపన్నుల చేతిలో 80 శాతం సంపద కేంద్రీకృతం కాగా ఎగువ 5 శాతం మంది సంపన్నుల చేతిలో అయితే దేశ సంపదలో సగానికిపైగా అంటే 62 శాతం వరకు వచ్చి చేరింది. ఇక టాప్ ఒక శాతం మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతమైన సంపదను దిగువ 50 శాతం మంది ప్రజల మొత్తం సంపదతో పోలిస్తే 13 రెట్లు ఎక్కువగా ఉంది. అంటే మొత్తం దేశ సంపదలో 40.6 శాతం వరకు కేవలం ఒక శాతం టాప్ సంపన్నుల చేతిలో ఉంది.
- ఈ ఆర్థిక అసమానతల ధోరణులు కరోనా సమయంలో మరింత పెరిగాయి. కరోనా విజృంభణ నుంచి 2022 నవంబరు వరకు బిలియనీర్ల సంపద 121 శాతం పెరిగింది. అంటే రోజుకు 3,608 కోట్ల రూపాయాల సంపద జమ అయింది.

లింగ, సామాజిక అసమానతలు

- భారతీయ పురుష కార్మికులు సంపాదించే ప్రతి రూపాయి వేతనానికి మహిళ కార్మికులు కేవలం 60 పైసలు మాత్రమే సంపాదిస్తున్నారు. ఈ వ్యత్యాసాలు గ్రామీణ, షెడ్యూల్డ్ క్యాస్ట్ వర్గాల్లో అధికంగా ఉన్నాయి. పట్టణ, ఉన్నత వర్గాలు పొందుతున్న ఆదాయాల్లో గ్రామీణులు 55 శాతం, షెడ్యూల్డ్ క్యాస్ట్‌ల వారు సగం కన్నా తక్కువే పొందుతున్నారు.

ఆర్థిక అసమానతలు పెరగడానికి కారణాలు

- భారతదేశంలో 2019లో కార్పొరేట్ పన్ను శ్లాబ్‌ను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. కొత్త పరిశ్రమలపై మరింత తక్కువగా 15 శాతం పన్ను విధించారు. ఈ కొత్త పన్ను విధానాల వల్ల దేశం 1.84 లక్షల కోట్ల రూపాయలు కోల్పోయింది. అయితే ఆదాయం పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని; పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీలను పెంచడం వల్ల ఈ పరోక్ష పన్నులు సామాన్యులపై ఆర్థిక భారాన్ని మోపాయి.
- ఆదాయంలో శాతంగా చూసుకుంటే భారతదేశంలో దిగువ 50 శాతం మంది ప్రజలు, టాప్ 10 శాతం మంది సంపన్నులతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువ పన్ను చెల్లిస్తున్నారు.
- ఆహార, ఆహారేతర పదార్థాలపై విధించే పన్నుల్లో 64 శాతం వరకు దిగువ 50 శాతం జనాభా నుంచే సమకూరుతోంది.
- ప్రభుత్వానికి జీఎస్టీ ఆదాయాలపరంగా చూస్తే 2/3 వంతుకు కొద్దిగా తక్కువ భాగం దిగువ 50 శాతం మంది నుంచి; 1/3 శాతం వరకు మధ్య 40 శాతం జనాభా నుంచి సమకూరుతుండగా టాప్ 10 శాతం మంది నుంచి కేవలం మూడు శాతం నుంచి నాలుగు శాతం వరకు లభిస్తోంది.
- ఈ విధంగా సంపన్నుల సంపదపై కన్నా సామాన్య పేద వర్గాల ఆదాయాలపై పన్నులు అధికంగా ఉండి వారి తలసరి వ్యయార్హ ఆదాయం తగ్గి ఆదాయ అంతరాలు మరింత పెరుగుతున్నాయి.
- భారతదేశంలోని బిలియనీర్ల మొత్తం సంపదపై ఒకసారి రెండు శాతం పన్ను విధించినట్లయితే వచ్చే 40,423 కోట్లతో దేశంలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న బాలలకు మూడేళ్లు పోషకాహారాన్ని అందించవచ్చు.
- అదేవిధంగా దేశంలో అత్యంత సంపన్న వ్యక్తి గౌతమ్ అదానీపై 2017-21 మధ్య అన్ రియలైజ్డ్ గెయిన్స్‌పై ఒకసారి పన్ను విధించడం ద్వారా వచ్చే 1.79 లక్షల కోట్లతో దేశంలోని 50 లక్షల ప్రైమరీ స్కూల్ టీచర్లకు ఏడాదిపాటు ఉపాధి, వేతనాలు ఇవ్వొచ్చు.
- టాప్ 10 బిలియనీర్లపై 5 శాతం చొప్పున పన్ను విధిస్తే షెడ్యూల్డ్ ట్రైబ్‌ల ఆరోగ్య సంరక్షణపై అయిదేళ్లకు ఖర్చయ్యే మొత్తం లభిస్తుంది.

భారత్‌లో అసమానతల నిర్మూలనకు ఇచ్చిన సూచనలు

- దేశంలోని సంపన్నుల నికర సంపదపై శాశ్వత ప్రాతిపదికన పన్నులు విధించాలి. విధాన రూపకర్తలను ప్రభావితం చేయగల సంపన్న వర్గాలు మరింత సంపన్నులుగా మారే విషవలయాన్ని ఛేదించాలి.
- సామాన్యులు వినియోగించే కనీసావసర వస్తువులపై జీఎస్టీ పన్ను స్లాబ్‌లను తగ్గించడం, విలాస వస్తువులపై భారీగా పన్నులు విధించడం ద్వారా పేదలపై పన్ను భారం తగ్గి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.
- వైద్య రంగంపై 2025 నాటికి జీడీపీలో 2.5 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయాలి. అదేవిధంగా విద్యపై 6 శాతం కేటాయించాలి. విద్యావైద్య సౌకర్యాలు విస్తరింపజేయాలి. పేద, అణగారిన వర్గాలు, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలి.
- దేశంలోని అవ్యవస్థీకృత ఆర్థిక రంగంలో ఉన్న 90 శాతం శ్రామిక శక్తి ఆకస్మిక ఆర్థిక ఒడుదొడుకులను, ద్రవ్యోల్బణాలను తట్టుకొనే స్థితిలో లేనందున వారికి సాంఘిక భద్రత కల్పించడం సహా పర్యవేక్షణ, ట్రి కింగ్, పరిరక్షణ విధానాల ద్వారా వారిని ఆదుకోవాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లిటిల్ఫ్



గాడిద గర్వభంగం

అనగనగా ఓ వ్యాపారి. ఆ వ్యాపారి ఇంట్లో ఓ గాడిద, ఓ కుక్క ఉండేది. కుక్కను ప్రేమగా చూడటంతో గాడిదకు అసూయపుట్టేది. అన్నీ తనకే కష్టాలని బాధపడేది. ఆ కష్టాలను ఇతరులకు చెబుతూ ఉపశమనం అయ్యేది. గాడిద కష్టాలని అందుకు అంటారన్నమాట.

ఆ వ్యాపారి మంచి కళాకారుడు కూడా. బొమ్మలు తయారు చేసి రంగులు పూసి మంచి ధరకు అమ్మేవాడు. ఒక రోజు ఓ మంచి బొమ్మను తయారు చేశాడు. పండుగ రోజు ఓ ధనికుడు ఇంటికి తీసుకెళ్లి ఆ బొమ్మను ఇద్దామనుకున్నాడు. ఆ పెద్ద బొమ్మను యథావిధిగా గాడిద మీద తీసుకెళ్లాలనుకున్నాడు. పండగ రోజు ఉదయాన్నే గాడిద మీద బొమ్మను తీసుకుని వ్యాపారి వెళ్తున్నాడు. అరే.. బొమ్మ ఎంత బావుందో నని ఊర్లోని పిల్లా, పెద్దలు చూస్తున్నారు. ఒకటే గుంపు. మెచ్చుకోలు. ఆహా.. ఈ గుంపు ఇలా చప్పట్లు కొడుతుందంటే.. నా గొప్పతనం వల్లనే అనుకుంది. వాస్తవానికి ఆ బొమ్మకు కానీ తన పనికి మెచ్చుకోలని ఆ గాడిదకు తెలీదు.


ఆ ఊరిలోని కొందరు కళాకారులు ఆ బొమ్మచూసి ఆశ్చర్యపోయారు. డ్యాన్సులేశారు. ఆ కళాకారుడు, వ్యాపారి అయిన వ్యక్తికి బహుమతి ఇచ్చారు కొందరు ఆసాములు. ఆ ఆనందం తట్టుకోలేక గాడిద గట్టిగా ఆనందంతో అరవసాగింది. వాస్తవానికి గాడిద అరుపు విని అందరూ బెంబేలెత్తారు. గాడిద మాత్రం తన కంఠ స్వరం గొప్పదన్నట్లు ఒకటే అరుపు. దాన్ని మచ్చికచేసుకుని.. గాండ్రింపు తగ్గించటానికి నానా యాతన పడ్డాడు ఆ వ్యాపారి. చేసేదేమిలేక చివరకి ఒక పెద్ద కర్రను తీసుకుని కాళ్లకు గట్టిగా బాదాడు. కాళ్లకు మంటలు ఒకవైపు.. మరో వైపు గాడిద మెడ తాడును మరో మనిషి పట్టుకున్నాడు. పరిగెత్తితే కొడతారని భయపడి.. మెల్లగా నడిచింది గాడిద. తన గర్వభంగం అలా అణగిపోయింది.



చుక్కలు కలిపి రంగులు వేయండి




10 తేడాలను గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 216

6			3		1			
							2	1
4	2			5		9		
5	6							
	7		6	3	9		4	
							7	2
		7		9			6	8
8	3							
			8		6			4

సుడోకు - 215 సమాధానం

9	6	3	7	1	4	5	8	2
7	5	8	3	9	2	1	6	4
1	2	4	8	6	5	3	9	7
6	9	5	4	2	7	8	3	1
8	7	1	5	3	6	2	4	9
4	3	2	1	8	9	6	7	5
3	4	7	2	5	8	9	1	6
2	8	9	6	4	1	7	5	3
5	1	6	9	7	3	4	2	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.